


సంపు. ౧౦ శ్రీముఖ సంవత్సరము, కార్తికమాసము (నవంబరు ౧౯౩౩) సంఖ్య ౧౧

పద్మావతీ చరణచారణ చక్రవర్తి

శ్రీ శివశంకరశాస్త్రి
[మాహేశ్వరాశ్రమము]

తృతీయరంగము

జయదేవుని భవనమున మేడపైభాగము

[రాజమార్గమునుండి కోలాహలము]

జయము జయమ్ము శ్రీ జయదేవకవికి!
విజయమ్ము గీతగోవిందకారునకు!
జయము పద్మావతీచరణ నీరేజ
చారణమృదుకలాసార్వభౌమునకు!
జయ గౌడనృపసభాజలజాతహేళి!
జయ గాయకోత్తంస జయము జయమ్ము!
జయము భక్తాగ్రణి జయము జయమ్ము!
జయము పరాశరసఖ విజయమ్ము!
విజయమ్ము రాధికావిభునకు జయము!
విజయమ్ము విజయమ్ము విష్ణుభక్తులకు!
సత్కవిత్వమునకు జయము జయమ్ము!
జయము జయమ్ము శ్రీజయదేవకవికి!

పరాశరుడు

[పేటికతో పద్మావతిని సమీపించి]

మన కిది చెల్లెలా, మహితవాసరము.
జయదేవు డీనాడు చంద్రుడువోలె
షోడశకళలతో శోభిల్లినాడు
గౌడాధిపతిసభాగగనాంగణమున.

పద్మావతి
బావగారును నీవు నిచ్చట
బయలుదేరినదాది నడచిన
ఘటన లన్నియు దెలుపు మన్నా,
కర్ణపేయముగన్ !

పరాశరుడు
[పేటికను జాలమార్గమున నుంచి]
ప్రజలు బారులు దీర్చి పార్శ్వంబులందు
జయ జయ ధ్వానముల్ సల్పుచుండంగ
భక్తి నంజలి ఘటింపగ రాజపురుషు
డెక్కినా మిర్వుర మిభరాజుమీద.
మాటి మాటికి రాజమార్గమ్మునందు
కల్యాణశకునముల్ కాన్పించుచుండ
గజరాజు సత్వరగమనమ్ముతోడ
కొల్వుకూటమునకు గొంపోయె మమ్ము.
కవివరుల్ పండితుల్ గాయకోత్తములు
ఉన్నతరాజకీయోద్యోగిజనులు
పౌరాగ్రణుల్ రెండు పార్శ్వంబులందు
కూర్చుండి యుండిరి కొల్వుకూటమున.
ఇంతలోన నృపాలు డెదురుగా వచ్చి
జయదేవు మృదుపరిష్వంగంబు చేసి
కనుగొని నను శిరఃకంపంబుతోడ
వెడలె లోనికి మేము వెనువెంట జనగ.
జయ్తు మహాగౌడ లక్ష్మణసేన భూప
యనుచు సభాసదు లైకకంఠ్యముగ
బల్కుచు లేచిరి. ప్రభుసమీపమున
గూర్చుంటి మాయనకోరికమీద.
ఆచార్యగోవర్ధనార్యుండు పిదప
తనకు నాగంతుకదాక్షిణాత్యులకు
పరిచితి చేయ సంభావించినాడు
కోవిదులను బావ కుశలమ్ము లడిగి.
అవల లక్ష్మణసేను డానతి యిచ్చె:
"ఆర్యులారా, యింక నాలకింపుండు
జయదేవకవిరాజు స్వప్రబంధంబు
కర్ణపేయమ్ముగా గానంబు చేయు."
ఉద్యానవనసీమనుండి యవ్వేళ
పరిమళ శీతల పవమాన వీచి
కావళి మృదువుగా నలముచు నుండ
సభ్యుల వదనముల్ సంఫుల్ల మయ్యె.
అవల గ్రంథము దీసి యధిపతి గాంచి
జయదేవకవి సభాస్తారుల జూచి
అంజలి ఘటియించి యల్లన ననియె:
"వినిపింతు గీతగోవిందకావ్యంబు."
అని మనోహరముగా నాదిపద్యంబు
పాడినయంతనే పరమహర్షమున
శ్రోతల నయనముల్ సుస్మేర మగుట
జలజాకరముపోలె సభ విరాజిల్లె.
అంతట వాగ్దేవతాదికం బగుచు*
పద్మావతీత్యాదిపంక్తి గలట్టి
పద్య మ్మలౌకికభావపూర్ణముగ
పాడినా డమ్మ నీప్రాణవల్లభుడు

పద్మావతి
అయ్యొ సిగ్గగుచున్న దయ్యెడ
ఆమహావిబుధాగ్రగణ్యులు

* వాగ్దేవతాచరితచిత్రితచిత్తసద్మా పద్మావతీ చరణ చారణ చక్రవర్తీ.

గాని లక్ష్మణసేన నరపతి
గాని యే మనిరో!

పరాశరుడు

నరసుండు లక్ష్మణసార్వభౌముండు
ప్రార్థించె తత్పునఃపఠనమ్ముకొఱకు.
దిశ లెల్ల నిజనేత్ర దీధితుల్ పర్వ
పాడెను కవి లతల్ పల్లవింపంగ.

అంతలోపల ప్రతీహారిణి వచ్చి
జయము మహాప్రభూ జయ మని పల్కి-
శిల్పశోభిత మైన చిరుత పేటికను
ధరణినాథుని సన్నిధానమం దుంచి—

"పద్య మాకర్ణించి పట్టపుదేవి
పారితోషికముగా పంపి యున్నారు"
అని నిష్క్రమింపగా, నవనీశ్వరుండు
తత్పేటికాంతర్గతం బై వెలుంగు
నూతనమణిమయనూపురద్వయము
దీసి కవీంద్రునిదెస విలోకించి
మందహాసమ్ముతో మరల నం దుంచ
మేలు మేలని బుధుల్ మెచ్చుకొన్నారు.

పద్మావతి

రసనిధానం బైన కావ్యము
రచనచేసిన కవికి గాని
భార్య కేటి కొసంగవలయును
పారితోషికమున్?

పరాశరుడు

భార్య కొసంగుచో పారితోషికము
భర్తనుగూడ సంభావించినట్లె.
బహుమానములనెల్ల పరికించు నెడల
నిజముగా నీనాడు నీకె జయమ్ము!

[పేటికనుండి పత్రము దీసి]

"గానము సేయుచో కవివల్లభుండు
పద్మావతీదేవి పాదయుగ్మమున
అలరుగావృత నాట్య మాడెడువేళ
మధురశింజితముతో మణినూపురములు."

ప్రభువరేణ్యుని పార్శ్వభాగమం దున్న
కక్ష్యలో గూర్చుండి కావ్యంబు వినుచు
రసపిపాసాయత్త రాజ్ఞి యుద్రిక్త
హృదయమ్ముతో వ్రాసె నీ చతుష్పాది.

పద్మావతి

తెలియు దేవి రసజ్ఞురా లని
దేవభాషాభిజ్ఞురా లని
నేడు విశదం బయ్యె కవితా
నిపుణురా లనియున్.

పరాశరుడు

వీక్షించినా వమ్మ, వెలలేని రత్న
తాటంకయుగళి పద్మావతీరమణ *
జయదేవకవి యను సందర్భమందు
పంపె రాజకుమారి పారితోషికము.

ఈ కంకణమ్ములు నీ కాంచిదామ
మీ మణిహారమ్ము నీ బాహుపురులు

---

* జయతి పద్మావతీరమణ, జయదేవకవి,భారతీ భణిత మతిశాతమ్.

విభు డొసంగెను నీకు విహితపద్మావ
తీసుఖేత్యాది* ప్రదేశగానమున.

ప ద్మా వ తి

ఏటి కన్నె బ్రాహ్మణాంగన
కీ యమూల్యానేకభూషలు!
అర్హమా జగదంబ పద్మకు
నర్పణము సేయన్.

పరాశరుడు

కవిభార్య వని నీకు గౌరవంబునను
బహుమాన మొసగిన ప్రభుకుటుంబంబు
నిల్పుకొన్నది గాని నిజగౌరవంబు
ఆభరణంబు లీ వర్థించినావె!

* * * *

ఆపగాతీరాన ననతిదూరమున
రమణీయ మైన యారామమ్ము కలదు
అందలి కాసార మలరారుచుండు
నబ్జాతములతోడ నంచలతోడ.
మాధవీమంటపమధ్యభాగముల
లాస్యముల్ సేయు కలాపముల్ విప్పి
క్రేంకారములతోడ కేకిసంఘంబు.
సహకార భూమిజ శాఖలలోన
పాడును కోకిలల్ పంచమశ్రుతిని.
శుకగణ తీక్ష్ణచంచూవినిర్దళిత
ఫలరసంబులు నేల బ్రవహించుచుండు.
మకరందరసపానమత్తద్విరేఫ
ఝుంకారముఖరితశాద్వలస్థలుల
హరిణముల్ లీలావిహారముల్ సేయు.

వీనుల విందుగా వేణుకుంజముల
మురళీరవము ముహుర్ముహు రుల్లసిల్లు.
కనులపండువు సేయు క్రముకమార్గములు
వకుళావనీజముల్ వాసించుచుండు
తాపమ్ము పున్నాగతరువులు పాపు.

ప్రభువతంసుడు కావ్యపఠనాంతమందు
కానుకగా నొసగెను కవిచంద్రమునకు
అతిమనోహర మైన యారామవాటి
"బిందుబిల్వం" బను ప్రియనామ ముంచి.

కావ్యప్రతిని నమస్కారపూర్వకము
గా స్వీకరించుచు కనుల కద్దుకొని
ఉత్తమాంగమ్ముపై నొక్కింత నిలిపి
ఆనతి యిచ్చె ముఖ్యామాత్యు జూచి:
"మణిహారమును పుష్పమాలిక జుట్టి
గ్రంధరాజము భద్రగజము పై నుంచి
వివిధవాద్యములతో వీథులవెంట
వైభవమ్మున నుత్సవము సేయవలయు.
"శిల్పిచే జెక్కించి శ్రీ జయదేవ
కవిరాజనామమ్ము గారుత్మతాశ్మ
ఫలకభాగమ్మున భర్మాక్షరముల
జాలమార్గముమీద సంధింపవలయు."

కవితాప్రియుండును కవివిధేయుండు
కవివత్సలుండు లక్ష్మణసేననృపతి
నామమ్ము జయదేవనామమ్ముతోడ
నాచంద్రతారార్క మలరునుగాక!

* విహిత పద్మావతీ సుఖసమాజే, భణతి జయదేవకవిరాజరాజే.

అన్నివిశేషమ్ము లవల దెల్పెదను,
ప్రొద్దు పోయిన దింక బోయెద నమ్మ.
ద్వారదేశమున పెద్దల వీడుకొల్పి
చనుదెంచు లోనికి జయదేవు డదిగో.

[నిష్క్రమించును]

జయదేవుడు [ప్రవేశించి]

కలుగలేదాయె నా కవకాశ మింత
దనుక ప్రియతమ, నీ సన్నిధానమునకు
మరలి వచ్చుటకై క్షమామండలేంద్రు
నతిథినై యుండుకతన బ్రాహ్మణులతోడ.

అందియుండును నీకు నే నంపినట్టి
వార్త; లవకాశమున నిటు వత్తు నన్న
కూర్మిమీద సారస్వతగోష్ఠిలోన
నేడు నన్ను విద్వత్కవుల్ వీడరైరి.

భోజనానంతరమ్ము సంపూర్ణచంద్రి
కామనోహరకాంతిలో గజముమీద
గ్రంథమును నిల్పి నగరమార్గముల వెంట
నుత్సవము చేయ బంచె నృపోత్తముండు.

నను గజారోహణము ధరానాయకుండు
చేయు మని కోర, పండితశ్రేణితోడ
నగరమున పాదచారినై నడతునంటి—
ఎట్టకేలకు గౌడేశు డియ్యకొనియె.

ద్వారదేశమువరకు నుత్సవము లోన
వెంట నరుదెంచు పెద్దల వీడుకొలిపి
ఏగుదెంచితి లోనికి నెపుడు నిన్ను
చూడగల్గుదు నను మహోత్సుకతతోడ!

పద్మావతి

వత్తురని నే వేచియుండగ
వార్త లందెను సక్రమమ్ముగ.
ఉత్సవమ్మును జాలమార్గము
నుండి కన్గొంటిన్.

లేదు చందనపేటియందును
లేదు మీహస్తమ్మునందును
ఉత్సవమ్మున విస్మరించితి
రొక్కొ కావ్యంబున్ ?

జయదేవుడు

అధిపున కొసంగితిని. పఠనాంతమందు ;
కంఠగత మైనపిదప నా గ్రంథ ముంచు
ధరణిపతి హేమపేటికాభ్యంతరమున
సుందరాత్మీయ దేవతామందిరాన.

పద్మావతి

నేడు గానం బవిరతంబుగ
నిండుసభలో జేయుచుండగ
కంఠమున స్వరభంగ మేమియు
కలుగలేదుగదా ?

జయదేవుడు

కంఠమున క్లాంతి యేమియు కలుగలేదు:
ఒక్కయామముమాత్రమే యుదయవేళ
సార్ధయామముపైన సాయాహ్నమందు
పాడితిని, పొందె కావ్యము పరిసమాప్తి.

పగలు సౌమ్యము మందాతపమ్మువలన
చలువరాకట్టడము సభాసౌధరాజ
ముపవనము పుష్పగుచ్ఛ నేత్రోత్సవంబు
ప్రసవసారవాసితము తద్భవనసీమ.

శ్రద్ధధానులు కూడినసభ్యు లెల్ల
గానవిద్యావిశారదుల్ కలరు మెండు
సంస్కృతాభిజ్ఞు లున్నారు చాలమంది
కలరు కవిపుంగవులు నలంకారవిదులు.

రాగములకు విపంచి పరాశరుండు
మేళవింప, ఉమాపతిమిశ్రసుకవి
తాళములు వేయగా, ప్రమోదమ్ముతోడ
పండితోత్తము లాలింప పాడినాను.

దాక్షిణాత్యులు సకలవిద్యాప్రవీణు
లధికమేధానిధులు పద్మ! అవల వారి
కావ్యమీమాంస వివరింతు. గానమునకు
పరవశత జెంది మెచ్చిరి బహువిధాల.

అచ్చెరువు గొల్పె నాకు: సేనాధిపతియె
వినుట సంగీతమును రెండువేళలందు ;
చామరగ్రాహి వివశహస్తములనుండి
సారెకును తాళవృంతముల్ జారుచుంట.

స్త్రీజనోచిత మగులజ్జ చెందినావు
కాని, నీమంజులాభిధ కావ్యమందు
కర్ణగోచర మైన యూఘుట్టములనె
సరసరాజకుటుంబమ్ము సత్కరించె.

రాజ్ఞి యొసగెను మణినూపురద్వయంబు
రత్నతాటంకము లొసంగె రాజపుత్రి
ఒసగినాడు నృపుండు కేయూరయుగళి
కాంచిదామమ్ము హారమ్ము కంకణములు.

ఆపగాతీర మంజులోద్యానవాటి
నధిపు డొసగెను బిందుబిల్వాహ్వయమున
అందు శ్రీరాధికావల్లభాలయంబు
శీఘ్రకాలమునం బ్రతిష్ఠింతు పద్మ!

పద్మావతి

అభిజనం బగు బిందుబిల్వము
నందు నిర్మించితిరి పద్మకు
అచటి జనములు హర్ష మొందగ
ఆలయము మున్నే.

ప్రభుసమర్పితబిందుబిల్వో
పవనవాటికయందు రాధా
వల్లభాలయ వినిర్మాణము
వైళమే యవుతన్!

ప్రత్యహంబును బిందుబిల్వము
పావనంబగుగాక నాథా,
పరమభాగవతాగ్రగణ్యుల
పాదసంస్పర్శన్!

జయదేవుడు

గాయకుల్ హరివంశ భాగవత విష్ణు
బ్రహ్మవైవర్తముల్ గర్గభాగవతము
గీతగోవిందకావ్యంబు ప్రీతితోడ
పాడుచుందురు మందిరప్రాంగణమున.

గౌడవాసుల మైత్రి ముత్కలములోని
బిందుబిల్వము విడిచి. ఆ పేరె దయను
ఉపవనికి లక్ష్మణప్రభు వుంచె మనల
నభిజనవియోగఖిన్నత యలమకుండ.

పద్యపాదంబె లక్ష్మణప్రభువరుండు
నాకు బిరుదమ్ముగా నుంచినాడు నేడు.
త్రిభువనమ్ముల పద్మావతీ, త్వదీయ
చరణచారణు డనియే ప్రశస్తి నాకు!

పద్మావతి

కష్ట మొకరిది, ఫలిత మిం కొ
క్కరిది, చిత్రము లోకపద్ధతి:
తలప భట్టమురారి పల్కులు
తథ్య మౌను గదా!

శ్రవణమునకే నిశితవేధ
శ్రమము నుద్వహానక్లమంబును
భూషణ మ్మగు కుండలంబు క
పోలపాళికకే.

జయదేవుడు

నీవు చెప్పిన వాక్కులు నిక్కవములె;
రత్నభూషణధారణశ్రమము నీకు
నాకుమాత్రము లోచనానందదాయి:
ప్రియతమా, భూష లొకసారి పెట్టుకొమ్మ!

పద్మావతి

ఏటి కాభరణములు నాథా?
ఇంట వెలసిన వంశదేవత
త్రిజగతీజనయిత్రి పద్మా
దేవి కర్పింతున్.

జయదేవుడు

అర్పణముచేసినాను సర్వాంగభూష
ణాళి పూర్వ మా పద్మకు నధికభక్తి.
మండనము చేయగావలె నిందురక్తి
నన్ని భూషలు నీపద్మ కభినవముగ.

నీ వలంకారముల్ దాల్చి దేవిమ్రోల
భక్తితో నాట్యమాడెడు పట్టులందు
నేను గానమ్ము సేయుచో, నిందుకృపను
ప్రేయసీ, చూచు దేవి సుప్రీత యగుచు.

పద్మావతి

అంతకన్నను వాంఛితం బేది?
అటులె యగుచో వల్లభా, మీ
శిల్పిహస్తముతో నలంకృతి
చేయ బ్రార్థింతున్.

జయదేవుడు

[పేటిక తెరచి పత్రము దీసి పఠించి]

మధురగీతిక లిఖియించు మహిషికోర్కి
పద్మ, మన కిర్వురకును సంభావ్య మగుట,
పాదయుగళికి నుంతు ప్రప్రథమమందు
రమ్యశింజానమణినూపురద్వయంబు.

పద్మావతి

చాలు నాథా, చాలు నే నప
చార మింకను జేయజాలను
తొలుత వేడుట మి మ్మలంకృతి
దోషమే యయ్యెన్.

జయదేవుడు

వల్లభునియెడనే కదా వాంఛితంబు?
చరణసంస్పర్శవలన దోషమ్ము రాదు.
ఆననాబ్జ కరాబ్జ పాదాబ్జములకు
తారతమ్యము లేదు నాతలపునందు.

ప్రథమమా నాకు నీపదగ్రహణసుఖము!
పెద్దవారల యానతి పెండ్లినాడె
ప్రమదమున నీపదాబ్జము పట్టినాను:
ఎరుకయున్నదె యావల నెన్నిసార్లో?

మందమందాక్షి మత్యంతమంజులంబె.
పద్మ, యొకదాని కబ్బురపాటు కలుగు:
*మమ శిరసి మండన మ్మని మధురఫణితి
దేహి పదపల్లవ మ్మని దేవుచేత

అష్టపదిలోన రాధిక ననునయింప
జేసితివి పద్మ, యిపుడు నిషేధ మేల ?
ప్రణయినీ, ఉంతు నీపదపల్లవముల
క్రమమణినూపురమ్ము, లోంకార మిమ్ము !

పద్మావతి

కావ్యలోకమునందు రాధా
కాంతుచే ననిపించు పల్కులు
ఈ ప్రపంచమునందు నాథా,
యెట్లు వర్తించున్ ?

జయదేవుడు

తెలిసినది ! కృష్ణు డనవచ్చు దేవు డగుట,
నేనో ప్రియతమ, అనరాదు మానవుండ.

పద్మావతి

ప్రత్యవాయం బౌదవె నయ్యో
ప్రాణనాథా, ప్రమాదంబున !
పాదదాసికి మీరు సాక్షా
త్పరమదైవతమే !

* * * *

అవధరింపుడు విన్నపము : పా
దాదికేశాంత మ్మలంకృతి
వలదు చేయఁగ దేవతరువలె—
వల్లభా ! వినరా !

జయదేవుడు

నిన్ను ప్రాణేశ్వరీ, నేను నిఖిలదేవ
తాస్వరూపిణిగా నెంతు తలపులోన
సత్యముగ, నీయసారసంసారయాత్ర
భార్య యనుభాషణము విడంబనము సుమ్ము !

* * * *

లలితమణిమయభూషణాలంకృత మయి
తావకీనతనూలత తనరు మిగుల
పల్లవిత మైన వాసంతవల్లివోలె
శాణితం బైన పుష్పేషుశరమువోలె !

చంద్రికా ప్లావిత ప్రదేశమ్మునందు
చేయు మొక్కింత నృత్యమ్ము చిత్త మలర.

పద్మావతి [నృత్యము చేయుచు]

హరి చరణ శరణ జయ
దేవ కవి భారతీ
వసతు హృది యువతి రివ
కోమలకలావతీ...

శ్రీమద్రాధావల్లభో విజయతే !

---

* స్మరగరళ ఖండనం మమ శిరసి మండనం, దేహి పదపల్లవ ముదారం ప్రియే...

పిరదౌసి

చిరుమామిళ్ల శివరామకృష్ణప్రసాదు, బి. ఏ.,

వాఙ్మయాభివృద్ధి:

ఆంధ్రభోజుడగు కృష్ణరాయనికాలమున సక్రమ దోహదముల నంది, కొనలుసాగి, మొగ్గదొడగి, పుష్పించి, ఫలించి, సర్వసౌభాగ్యములతో నలరారిన యాంధ్రవాఙ్మయారామవాటి, దురదృష్టవశమున కొన్ని వత్సరము లే భూనాథునియందయు లేక, ఆంగ్లభాష యందలి వ్యామోహమున పెడమొగముద్రిప్పిన పుత్రులను గాంచి కృశింప దొడగెను. కాని పరాత్పరుని యనుగ్రహమున, దేశోద్ధారకుని కటాక్షమున నెలకొల్పబడిన ఆంధ్రపత్రిక, భారతి, ఆంధ్రగ్రంథమాల మొదలగువానివలన పుష్టిజెంది, ఆంధ్రవిశ్వవిద్యాలయమువంటి సంస్థల సంస్థాపనమువలన వికసించి మరల నేటికా వాఙ్మయారామము ఆధునికాంధ్ర కవికోకిలములచే కళకళలాడుచున్నది. ఏభూనాథుడును సాహసింపనిసమయమున వాఙ్మయలక్ష్మిని చేరదీరి సకలాభరణములతో నలంకరించిన దేశోద్ధారకున కాంధ్రాక్షరాస్యు లెల్లరు సువర్ణపళ్లెరములతో నివాళి యొసగెదరుగాక! దేశోద్ధారకా, ఆంధ్రవిజ్ఞానసర్వమును పునరుద్ధరించి కొనవరకు సాగింపదలచిన నీకార్యదీక్ష యనుపమితము. విశ్వదాతా, నీవు చిరంజీవివి.

ఆధునికాంధ్రకృతు లన్నియు నూతనాభిప్రాయముల విరియజిమ్ముచున్నవి. సర్వతోముఖమగు వాఙ్మయాభివృద్ధి కిది ప్రబల నిదర్శనము. ఉదయించుచున్న విజ్ఞానభాస్కరుని యరుణకిరణము లపుడె యాంధ్రావని నీరీతి నాక్రమించుట ముదావహము. కాలమున కనుకూలముగ వాఙ్మయము మార్పుచెంద నిచ్చగింపనివారి కీకృతులు రుచింపవు......ఆగొడవ నిపుడు తడవనేల?........ఆధునికకవికుమారుడు స్వాతంత్ర్యమును సర్వదా ఆకాంక్షించుచున్నాడు.

> “నవ్వుకొందురుగాక నా కేటిసిగ్గు
> నాయిచ్ఛయేగాక నా కేటివెఱపు”

అని గళమెత్తి తన్మయత్వమున పాడుకొనుచున్నాడు. తనహృదయమునం దుద్భవించిన భావసంచయమును తన కనువగురీతి రచనములందు ప్రదర్శించుచున్నాడు. లోకమునకు వెఱచి హృదయమునందలి యభిప్రాయముల నణచివైచి, పిరికితలంపులను రచనములందు వెలువరించిన లాభమేమి? కవి నిరంకుశుడు; ఆతనికలమున కేదియు అడ్డుగానేరదు. ఆతనికృతు లన్నివేళల నూతనాభిప్రాయములతో, కళాకాంతులతో, తేటతేనె లొలుకు నూతన పదములతో వెలుగొందవలసినవే. అప్పుడేకదా తెనుగుబాసయొక్క తియ్యదనము కడవరకు నిలిచియుండునది!

ఆధునికాంధ్రకృతులలో గణనీయమైనవానిలో ‘పిరదౌసి’ యొకటి. జి. జాషువకవిగారు దీనికి కర్తలు. ‘భారతి’ మూలమున వీ రాంధ్రులకు చిరపరిచితులు. వీరిపద్యములను గాంచి సంతసించినవా రెందఱో వీరిని గూర్చి ప్రశ్నించుచున్నారు. మారుమూలలను వినుకొండయందున్న కవిచంద్రునిగూర్చి యాంధ్రలోకమున కేమియు తెలియకుండుట వింతగాదు. ఈవిషయమును పురస్కరించుకొని, గ్రంథవిమర్శనమునకు గడంగకపూర్వ మొకింత వీరిజీవిత చరిత్ర నిచ్చుట వ్రాయ దొరకొంటిని.

కవిజీవితచరిత్ర:

జాషువకవిగారు ౧౮౯౫-వ సంవత్సరమున జన్మించిరి. వీరు ప్రథమమున యాదవకులజులగు హిందువులు. కాని, వీరితండ్రి చిరకాలముక్రిందనే క్రైస్తవమతమును స్వీకరించెను. వీరు మూడవఫారము వరకు చదివి తరువాత బాపట్లలో ట్రైనింగ్ ప్యాసయిరి. ౧౯౧౨-౧౩ సంవత్సరములలో శతావధాన, అష్టావధాన సభలు తెలుగుదేశమున జిత్తుబిత్తుగా జరుగుచున్నకాలమున వీరికి కవితయం దభిరుచి కలిగెను. ఇట్టి శుభసమయమున శ్రీ దువ్వూరి హనుమచ్ఛాస్త్రిగారు వీరి పద్యములను విని సంతసించి కొంతకాలము కాళిదాసత్రయము పాఠము చెప్పి వీరిని ప్రోత్సహించిరి. తదుపరి యుద్యో

గములేక తిరుగుచు వీరొకానొక బయస్కోపు కంపెనీలో ట్రాన్సులేటరుగా కుదిరి, అయ్యెగ్రామముల సంచరించుచు, రాజమహేంద్రవరము చేరి అచ్చట చింతామణీనాటకసంఘమువారికడ నాటకములు వ్రాయు కవిగా చేరిరి. నాటకమండలి విచ్ఛిన్నము కాగా, వీరు గుంటూరు మిషన్ ట్రైనింగు స్కూలున నాంధ్రోపాధ్యాయులుగా నియమింపబడిరి. తరువాత కొంత కాలము బాపట్ల హైస్కూలులో నుపాధ్యాయు లయి ప్రస్తుతము స్వగ్రామ మగు వినుకొండయందలి పాఠశాలలో నున్నారు. ధ్రువవిజయము, చిదానందప్రభాతము, కుశలవోపాఖ్యానము, రుక్మిణీకల్యాణము అను నవి వీరు వ్రాసినగ్రంథములలో ముద్రింపబడినవి. 'శివాజి' యను పద్యకావ్య మింకను ముద్రితము కాలేదు. వీరి 'ఖండకావ్యతరంగిణి' అనుగ్రంథము శ్రీ వెంకటగిరికుమారరాజావారి కంకితముచేయబడినది. నే డది యచ్చులో నున్నది. ఈ పిరదౌసి గ్రంథము సింగరాజు లక్ష్మీనారాయణ పంతులుగారి కంకితము చేయబడెను. కవిగారికి శ్రీశ్రీ విక్రమదేవవర్మమహారాజుగారు గడచిన వేసవిలో విశాఖపట్టణమున జరిగిన ఆంధ్ర రీసర్చి యూనివర్సిటీ వసంతోత్సవసమయమున 'కవితావిశారద' అనుబిరుద మొసగి గౌరవించిరి. ఇది కవిజీవితము.

వసుధ శాసింపగల సార్వభౌము డగును
ధీరు డగు, భిక్షుకుం డగు, దీను డగును,
దుఃఖితుం డగు, నిత్యసంతోషి యగును
సత్కవి ధరింపరాని వేషములు గలవె ?

('పిరదౌసి' పుట ౬)

ఇది యీ కవివర్యుని పద్యము. ఇందలి యౌచిత్యమును పాఠకులే నిర్ణయింతురు గాక!

కథావస్తువునకు మూలము :

"నే నీతనిచరిత్రము నయిదేండ్లక్రిందట నొక మాసపత్రికయందు చదివి స్తంభించిపోయితిని. నాట నుండియూ నే నిక్కథ నొక చిన్ని ప్రబంధరూపమున వెలువరింప దలచియుంటిని" అని గ్రంథకర్త నుడివి యున్నాడు. గ్రంథమునం దెచ్చటను మానవాతీతము లగుకార్యములు వర్ణింపబడియుండెనందున, పాఠకున కెచ్చటను సంశయముగాని, "ఇట్లు జరిగియుండునా" అను ఆలోచనగాని కలుగవు. "ఘాని కరాసికి నృమనుజభుక్తి యొసంగెడు జాతిసుండెసుల్తానులు" ఒక కవిని నిరసించి పరిమార్ప నుంకించుట మొదలగు విషయములు మనకు క్రొత్తి కానేరవు. "జాతిమతభేదములను పరిగణింపక విశ్వమానవసోదరత నెఱపు దివ్యపురుషులిక్కవిజీవితము ననాదరింపరని విశ్వసించి నే నీ చరిత్రమును పద్యకావ్యముగా రచించితిని" అను గ్రంథకర్తవాక్యములు వారి విశాలహృదయమును వెలువరించుచు, కాలమున కనుగుణముగ నున్నవి.

నే నీ గ్రంథమును విమర్శింప దలచి, ఈ పిరదౌసి కవికి చెందిన కొన్నివిషయములను సేకరింపగడగితిని. ఆంగ్లకవిపుంగవు డగు వాలస్ గాన్‌డి (Wallace Gandy) చే వ్రాయబడిన 'పారసీకవీరుడు' (A Persian Hero) అను గ్రంథమునందున్న యుపోద్ఘాతమున పిరదౌసికవికి చెందిన కొన్నియుపయుక్తము లగు విషయములు ప్రస్తరింపబడెను. వాని నిచ్చట క్లుప్తముగ వివరించుచున్నాను: పిరదౌసియొక్క నామము అబ్దుల్ కాసీమ్ మానుసూర్. ఇతడు రచించిన గ్రంథము లత్యంతమధురములై పాఠకులకు స్వర్గసుఖమును కలిగించుచుండెను. పారసీకభాషయందు పిరదౌస్ అనగా స్వర్గమని యర్థము. స్వర్గసుఖమును గల్పించుచున్న గ్రంథములకు కర్తయగు మానుసూర్‌నకు పిరదౌసి (స్వర్గసుఖమును గల్గించువాడు) అనుబిరుదము రాజుగారిచే నొసంగబడెను. ఈ బిరుదమే నామముగా వాడుకకు వచ్చెను. ఇతడు క్రీ. శ. ౯౪౧ లో జన్మించెను. తన ముప్పదియారవ వత్సరమున షానామాగ్రంథమును వ్రాయగడంగెను. షానామాగ్రంథ మంతయు రాజులచరిత్రతో నిండియున్నది. ఈ యుపోద్ఘాతమునందలి కొంత కథకును, పిరదౌసి గ్రంథమునందలి కథకును చాలభేదములు గలవు. అందుచేతనే 'రెండుమూడుచోట్ల నా కీతని చరిత్ర చూడ తటస్థించినది. కాని మొదట నేను

మాచినకథరును తరువాత చూచినదానికి విశేష భేదము గోచరించినది' అని గ్రంథకర్త నుడివియున్నాడు. అచ్చటచ్చట గ్రంథకర్త కథను పొడుగించియున్నాడు.

కథావస్తువు-కవితాశిల్పము :

భరతఖండమును పదునెనిమిదిమారులు పరితపింపజేసిన మేటివీరుడు గజనీమహమ్మదు. సోమనాథుని పెకలించి తొమ్మిదివన్నెల రత్నరాసులను గొనిపోయిన స్వార్థపరుడు. 'బంగారునాణెముల్ బస్తాలకెత్తించి', 'మొలకవజ్రముల జాలెలబోసిగూర్పించి', 'లేతపచ్చల నేరిగోతాల సుట్టించి', 'సర్వము హరించి', 'గజనీ మామూదు గజనీకి కదలిపోయె'ను. ఈ పలుకులు వీనుల బడినంతనే, ఆశ్చర్యముతో క్రుంగిపోవుచున్న పాఠకునకు ఆతురతతో కవి,

"భారతక్షోణిగల్గు దేవస్థలములు
చెదరి గజనీపురాన మసీదులయ్యె,
నిప్పటిమసీదు లేరూప మెత్తగలవొ
కాల మెఱుగును, ధారుణీగర్భ మెఱుగు."

అని వచించి వింతభావములతో ఆతని హృదయమును పరీక్షించుచున్నాడు. విశ్వమయుని మ్రోల మానవుని యల్పత్వమును విశదపఱచి పాఠకునకు సిగ్గుతో గూడిన చిఱునవ్వును గల్పించుచున్నాడు, కవిశేఖరుడు. "పదియు నెన్మిదిమారులు చిక్కనిరుధిరంబులో భరతఖండము నార్ద్రి" మొనరించిన మహమ్మదు, ఈ పలుకులను విని తలయూపి మిన్నకుండవలసినవాడే కదా!

పరుల నీరీతి పరితపింపజేసిన మహమ్మదునకు సుప్రతిష్ఠ నార్జింపవలయుననెడి యాశ లేకపోలేదు. అందువలననే పారసీకదేశమున వీనులమిగిలిన పిరదౌసి కవిని రావించి 'యుద్గ్రంథము నేత కై యొసగె గర్పూరంపుదాంబూలమున్.' రసికుడగు మహమ్మదు కవులనిన గొప్ప యభిప్రాయముతో వారి కీశ్వరత్వము గలదని నమ్మియుండెను. రక్తపాతముచే ద్రవ్యము నార్జించినవాని కిట్టిమంగళప్రదములగు నభిప్రాయము లుండుట ప్రశంసార్హము. పిరదౌసిని గాంచి మహమ్మదు :

"తమ్మిచూలికేలుదమ్మిని గల నేర్పు
కవికలంబునందు గలదు గాన
నీశ్వరత్వ మతనికే చెలామణి యయ్యె
నిక్కముగ బూజనీయు డతడు.

క్షణము గడచిన దాని వెన్కకు మఱల్ప
సాధ్యమే మానవున కిలాచక్రమందు?
దాటిపోయిన యుగములనాటి చరిత
మరల బుట్టింపఁ గవియ సమర్థుడగును."

అని ప్రశంసించియున్నాడు. ఈపద్యములవలన గ్రంథకర్తగారి ఆదర్శములును, తురకభూధవుని రసజ్ఞతయు విశద మగుచున్నవి.

పిరదౌసికవికి ఒక్కొకపద్యమున కొక్కొక బంగారునాణెము బహూకరించెద నని మహాసభామధ్యమున భూనాయకుడు వాగ్దాన మొనరించెను. కవి పరమసంతోషమున షానామా అను గ్రంథమును వ్రాయదొరకొనెను. అట్టి శుభసమయమున :

"వాని డెందంబు సోకిపోవనితలఁపులు
వాని కనుసన్న దలలు వంపనియుపమలు
వానికలమున గులుకు జూపని పదములు
మందునకు లేవు నాటివాఙ్మయమునందు."

ఇట్లు భావోన్మాదమున గ్రంథరచన కుపక్రమించిన కవి కొకరేయి స్వప్నమునం దొకస్త్రీ యరుదెంచి వానిని వివాహమాడదలచెను. ప్రియమార పిరదౌసి యామెను కౌగిలించినంతనే వాని కొకబాణము హృదయమున గ్రుచ్చుకొనినట్లు తోచెను. ఆత డులికిపడి లేచెను. మఱునాడు, కుమారుడు చనిపోయినట్లు భార్యకడనుండి జాబు వచ్చెను.

'కథ చిన్నదగుటచే.........ఉత్తరకథాసూచకముగ నొకదివ్యస్త్రీదర్శనమును......గల్పించితిని' అని గ్రంథకర్త పీఠికయందు నుడివియుండెను. మరియు 'నరుని సుఖదుఃఖములముందు నడచివచ్చు నీడలే స్వప్నములుసుమ్మ నిశ్చయముగ' అని వచించి పిరదౌసికి రానున్న విపత్తును పాఠకున కొకింత తెలియజేయుచున్నారు.

తెలుసుదేశమున కొందరు, స్వప్నములు రానున్న సంగతులను తెలియజేయునని నమ్మకమున్నవారు గలరు. కాని కొందరట్టివిషయమును త్రోసివేయుదురు. మొత్తముమీద తెలుసునాటియందు 'కలలో జరిగినది ఇలలో జరుగదు'? అనుసామెత మిగుల వాడుకలో నున్నది. మనగ్రంథకర్తగారు పైవరుసలోనివారు.

పిరదౌసి "రెండేడు ల్ననినంత జక్కనిసుమా ర్తైన్ గాంచి సానందుడై గంషూషించె మనోవిచార" మును. మరల కావ్యమును వ్రాయగడంగెను. 'ముదురు కోయిల...కొసరింపుగూతలపట్టు దెలిసి' 'పిల్లగాడ్పుల జన్మవృత్త మరసి' 'మెఱపుబోగముసానిమోసగింపుల యర్థమును గ్రహించి' 'ముప్పదేడులు సర్వాంగపుష్టి మెఱయ' 'షష్టిసహస్రపద్యసందానితమైన' 'గబ్బము రచించె పిర్దౌసికవివరుండు.'

ఇట్లు కృతిని ముగించి నవాబుగారి ఆస్థానమున కేగి గ్రంథమును మాడుమాసములు పఠించి, దాని నచ్చట సమర్పించి పిరదౌసి నిజాలయంబున కేగెను. సుల్తాను అరువదివేల పద్యములకు అరువదివేల బంగారు నాణెములకు బదులు వెండినాణెములు బంపెను.

ముప్పదివత్సరములు, దేహమునందలి రక్తము నంతయు ధారవోసి తననేర్పుకొలది గ్రంథమును రచించి, భూనాయకుని యొడ్డోలగంబున పండితుల సమక్షమున కనకాభిషేకము చేయించుకొన నుత్కంఠతో నున్నసమయమున, వెండినాణెములను చూచినంతనే.........

"ఎన్నోకొండలు గుండెలో గరగిపో
యెన్ వార్ధిసంతానముల్
గన్నీరయ్యె సమస్తలోకము నిరా
కారస్థితిం బోల్చె ను
త్పన్నంబయ్యె విషాదమేఘపటల
ధ్వాంతౌఘ మాశాలత
ల్సన్నాలయ్యె నగాధకూపజలరా
సుల్ దోచె పిర్దౌసికిన్."

చేయునది లేక పిర్దౌసి ధనము మఱలించి, ఒకయుత్తరము వ్రాసి మానవేంద్రునకు బంపెను.

ఈ గ్రంథమున రసము చిప్పిలు స్థలములలో నిది యొకటి. పిరదౌసిచే నిందాసహోక్తికముగ గ్రంథకర్త వ్రాయించిన యుత్తరమునందలి పద్యములు హృద్యములుగ నున్నవి. కొలదినిముసములు జాషువాకవి పిరదౌసికవిగా మారిపోవుచున్నాడు. భావోన్మాదమున పద్యములు పాలమున్నీటితరగలవలె నటునిటు కదలియాడుచున్నవి. సమయానుకూలముగ భావముల నీరీతి ప్రదర్శించి, పాఠకునిహృదయమును తాండవింప జేయుటకన్న మహాకవి కింకేమి కావలయును? పిరదౌసికి గలిగిన యాశాభంగ మెంత రమణీయముగ తన కూర్పునేర్పువలన,కవి పాఠకునకు విశదపరచుచున్నాడో చూడుడు:

"....................అ
భాగ్యుఁడ నైతివయఃపటుత్వమున్
గ్రుంకె శరీరమం దలము
కొన్నది వార్ధకభూత మీ నిరా
శాంకితబాష్పము ల్ఫలము
లైనవి ముప్పదియేండ్లసేవకున్."

"ఒక్కొక పద్దియంబునకు
నొక్కొక నెత్తురుబొట్టు మేనిలో
దక్కవగా రచించితి వృ
థాశ్రమ యయ్యె............"

అనియు,

'.........పట్టిచేతులన్,
బోయెద నంధకారమున
మున్గి సుఖంబుల బ్రోద్దుగుంకె రా
జా యికదాండవించెదభ
యంకరఖేదతమాలవాటికన్.'

'నా, శిరమున బోసుకొంటెని న
శింపని దుఃఖపుటగ్గి ఖండముల్.'

అని వాపోయెను. ఈవాక్యములు రాతిగుండెనైనను కరగించునవిగా నున్నవి. మఱియు,

"అల్లాతో డనిపల్కు నాపసిడికా
వ్యద్రవ్యము న్వెండితో
జెల్లింపం దొరకొన్నటక్కరివి; నీ
చే బూజితుం డైనచో
నల్లాకు న్సుఖమే ?"

" ....తాలిగుండె సు
ల్తానుల కస్మదీయకవి
తాసుధ జిందినపాతకంబు నా
పై నటనంబొనర్చినది......"

"చిరముగ బానిసీని నభి
షేక మొనర్చితి మల్లెపూవు ట
త్తరు లాలికించి మాయజల
తారున రాదుగదా పసిండి, యో
కటకటురుష్కభూపతి, య
ఖండమహీవలయంబునందు !"

అనువాక్యములు మాత్రమే యొకింతకటువుగ నున్నవి. జీవితమునంతయు ధారవోసి తుద కీరీతి వంచింపబడి, కడుపుమంటచే గనలి, ఇట్లు పలికినందులకు సుల్తాను కవిని బట్టి చంప్రడని సేనాపతి కాజ్ఞాపించెను.

ఈపైకథ నంతయు నొకచిన్నిగీతమునం దిమిడ్చి, లోకప్రవృత్తి నెరిగిన గ్రంథకర్త, ఏమనుచున్నాడో ఆలింపుడు:

"రాజుతలమీద కవి కప్పురంబు చల్లె;
సుకవితలమీద రాజు నిప్పుకలు విసరె.
కొంద రేపుణ్యమో చేరుకొనియె ననిరి;
కొంద రేపాపమో పట్టెపడిపె ననిరి."

సుల్తాను తన్ను జంపనున్నాడని వినినంతనే పిరదౌసి చేయునది లేక:

"ముత్యముల కిక్కయైన సముద్రమునను
బెకుకుమాటలు మున్కలు వేసినాడ;
భాగ్యహీనుడ ముత్యమ్ము వడయనయితి
వనధి నను మ్రింగ నోరు విచ్చినది తుదకు."

అనుభావయుక్తమగు పద్యమును మసీదుగోడపై వ్రాసి, అర్ధరాత్రమున సకుటుంబముగ స్వగ్రామమైన తూసు పట్టణమునకు బయనమయ్యెను.

అరణ్యము; అర్ధరాత్రము; ఆకసమునందు మేఘము లావరించియున్నవి; అబలలతో ప్రయాణము; పిరదౌసికవి కేమియు తోచలేదు; "దిక్కు లేనివారికి దేవుడే దిక్కు." అతడొకచో నాగి పరాత్పరుని గూర్చి ధ్యానించెను.

ఈగ్రంథమున రసవంతమైన పద్యములలో కొన్ని ఇచ్చట గానవచ్చుచున్నవి. ఈ ప్రార్థనము నందు వెలువరింపబడిన భావము లాంధ్రవాఙ్మయమున కొకింత నూతనము లనుట సాహసము కానేరదు. "సంజకెంజాయలలో జలకంబుసవరించి పరతెంచు సూర్యబింబంబులోన", "చంద్రుని ధవళహాసముల లోన", "చెంగలాడు మొలకతెమ్మెరలలోన", "హాయిగా బవ్వళించి బ్రహ్మాండములను బల్కరించు చున్న దివ్యస్వరూపుని" పిరదౌసి పూజ లర్పింప నాహ్వానించుచున్నాడు. అర్థమునం దంతులేని ప్రశ్నలను సామాన్యమానవున కన్వయముగాని పల్కులను గ్రంథకర్త పిరదౌసిచే బల్కించుచున్నాడు. సత్కవి యందు మానవాతీత మగు లక్షణము లుండుననుటలో నాశ్చర్యమేమి ? నిర్వికల్పుడును, నిర్గుణుడును, నిత్యతృప్తుడును అగు పరాత్పరుని మానవమాత్రుడా ప్రశ్నింపగల్గునది ! భావనాప్రపంచమునకు సృష్టికర్త యగు కవిబ్రహ్మయే అట్టిదాని కర్హుడు.

ఆర్తరక్షణపరాయణుడగు ఆదినారాయణుని మ్రోల, వినయము వెల్లివిరియ నంజలి ఘటించి ప్రశ్నించుచున్నాడు పిరదౌసి :

"ఆ నిదురించుపెద్దపులి
యాస్యబిలంబున కెన్నిజంతువుల్
బోనములై యదృశ్యమయి
పోయెనో - రేపటిభుక్తికిన్ దయా
రైనమృగంబు లేపొదల
యం దవుగాము లెఱుంగ కింపుమై

మేనులు వాల్చెనో—యెఱిగి
　　మిన్నక చూచుచు నంగలార్తువా?"

*　　*　　*　　*

"నన్ను బోలు కోటినరులమృత్తికనుండి
నెలువరింప శక్తి గలిగియుండి
నన్ను విడువలేక కన్నుమూయ వదేల?"

*　　*　　*　　*

"......................ఫేనపం
క్తుల నటనావిలాసముల
　　కుం దలయూచుచు నేను మ్రొక్కినన్
గిలకిల నవ్వి నన్ను దిల
　　కింపని కారణ మేమి దైవమా?

*　　*　　*　　*

"వేసరుజుక్కతో నిలిపి
　　వేసిన నీరచియించు లేఖకుం
గానెత మైన యాకసము
　　నన్ జిరునవ్వుల గ్రుమ్మరించుచున్
డాగదివేల యర్థపద
　　నంబున? ఏమని వ్రాసికొంటివో
నాగతు లందులోన?....."

*　　*　　*　　*

"పిట్టల బీచుపీచు మని
　　పించుచు వేసబడంతిదోసిటన్
బట్టె గులాబిసుత్తుల, న
　　భంబున పుష్పాడిదుమ్మురేగ, నీ
విట్టి నిసర్గపూజలకు
　　దృష్టి వహింతువో? నా స్తవంబులో
బట్టము గట్టుకొందువో?"

*　　*　　*　　*

"సరదాగా భుజశక్తి మీఱ నెపుడో
　　క్ష్మానామకంబైన బొం
గరమున్ ద్రిప్పితి, వీపరిభ్రమణవే
　　గం బింత చల్లాఱినన్
　　జరుగ స్వేర్చునె లోకవృత్తము మహే
　　　శా, యప్పు డేదిక్కుగా
　　నోఅగుం? బర్యవసాన మెట్లగునో...!"

అర్థవంతములగు నిట్టిప్రశ్నలవలన ఆలోచనాసాగరమున మునిగిన పాఠకు డొకింత తేరుకొనుటకు, అర్థవంతమయ్యును, మిగుల లలితమగు భావముతో నీక్రిందిపద్య మెంతరమణీయముగ నున్నదో తిలకింపుడు:

　　"ఆగడపుమబ్బుశయ్యల నపరశిఖరి
　　　　బుడుతచంద్రుడు నిద్దురవోవుచుండె
　　ఈచెలువునీట నతని కుయ్యేలలు గట్టి
　　　　జోలవాడుచు నావంక జూడవేమి?"

ఇట్టిపద్యములు పాఠకులహృదయముల జూరగొనుచున్న వనుటలో నతిశయోక్తి గలదా! ఇది మహాశిల్పమునకు నిదర్శనముకాదా!

ప్రార్థన ముగించి పిరదౌసి కారడవిని బడిపోవుచున్నప్పు డొకనిషాదుడు వారికి సాయ మొనరింప వచ్చి కొంతదవ్వు వారితో నడచి దారి చూపించి పోయెను.

　　"ఆకనుపించుపర్వతపు
　　　　టంచున నున్నది పెద్దచెర్వు......"

　　"కొంచెము సాగినన్ జెలువు
　　　　కొమ్మున మీకు డిచేతివాలుగా......"

　　"అవలన్ బచ్చికపట్టులం జిలుకనీ
　　　　హారంబు భక్షించి..............."

పైపద్యములన్నియు, నిషాదుడు కవికుటుంబమునకు దారిదెల్పునవిగా నున్నవి. ఈసందర్భమున పాఠకునకు మేఘసందేశమునందలి యక్షునిపలుకులు జ్ఞప్తికివచ్చును. మరియు, "ఈగ్రచ్చపొదలయందే నిర్భయము మీఱ, బెబ్బులుల్ పిల్లల బెట్టుచుండు......"అను అడవివర్ణనలను దెలుపుపద్యములు ఉత్తరరామచరిత్రమునందలి భవభూతిపోకడలవలె నున్నవి.

పిరదౌసి తుదకు తనగ్రామము సురక్షితముగ చేరెను.

ఇట్లుండ కవిహననోద్యుక్తుడయిన మహమ్మదు సామంతరాజులు సేయు హితోపదేశమున శాంతి వహించి, కవిఋణము దీర్చుకొనదలచి, ధనమును వీరభటుల కొసగి కవికి పంపెను. కాని ప్రయోజనమేమి? ధనము తూసుపట్టణముతూర్పుగవిని ప్రవేశించెను; కవిశవము పడమటిగవిని ప్రేతభూమికి గొంపోబడెను. పిరదౌసికూతు రాధనమును నిరాకరించెను.

ఈఘోరవార్త విని మహమ్మదు ఎంతయు జింతించి, యేతద్ధనముతో తూసుపట్టణమున పిరదౌసి పేర నొకసత్రశాల గట్టించెను. దానిచిహ్నములు నేడును గలవు. కాని యిం దొకరికి కీర్తియు, యొకరి కపకీర్తియు దక్కినవి. ఇద్దఱును గాలగర్భమున గలసి పోయిరి. తారతమ్యము లింతియ.

జాషువగారి గజనీమహమ్మదు:

ఈరీతి కథ ముగియుటకు గజనీమహమ్మదే కారకుడు. పాఠకుని క్రోధానలమునకు సుల్తాను గురియగుచున్నాడు. కాని గ్రంథకర్త భూభర్త కన్యాయ మొనరింపలేదు. సాధ్యమైనంతవరకు గ్రంథకర్త భూనాథుని కీర్తిచంద్రున కపకీర్తికీమూతము లద్దురాకుండునట్లు కాపాడెను. ఇది, కవిచంద్రుని విశాలహృదయమును పాఠకున కెఱిగించుచున్నది.

పిరదౌసికవిని రావించి ప్రథమమున గౌరవించినపుడు, సుల్తానుని నోటినెంట వెడలినవాక్యము లాతని విజ్ఞానమును విశదముచేయుచున్నవి. కవులయం దాతని కున్నగౌరవమును, వారిని పోషింపవలసినవిధమును ఆపలుకులు వ్యక్తపరుచుచున్నవి.

పిరదౌసికి, బంగారునాణెములబదులు వెండినాణెములు పంపినపుడు, "వెండినాణెముల్ బాస దొలంగి పంపె నరనాథుడు పండితు లేమి చెప్పిరో?" అని నుడివి గ్రంథకర్త నరనాథుని కాపాడుచున్నాడు. అప్రతిష్ఠలో సగభాగము పండితులతలపై మోపబడినది. ఈర్ష్యవలన, వారే నరనాథుని కీరీతి బోధించియుందురని పాఠకుడు నమ్ముచున్నాడు. దానితో మహమ్మదు కొంతవరకు నిరపరాధి యని తేలిపోయినది.

ధనమదాంధున కాగ్రహము వచ్చు టొకలెస్స గాదు; రక్తపాతముచే రాజ్యమును జయించి, దేశముల కొల్లగొనినరాజు, 'కనులన్ గెంపు నటింప మైమఱపు హుంకార ద్రావుసుల్తాను' ప్రథమమున నట్టియక్రమమునకు బాల్పడినను "ఒక్కకవి మీచే గోరుద్రవ్యంబు మీహుంకార ఖర్చుకు సాటిరాదుగద, రాజోత్తంస యోజింపుమా !". "గడియించితిరిగదా కనకరత్నచయంబు ధననాయకునకు దంతములు పులియ" మొదలగు సామంతుల ప్రశంసావాక్యములచేతను, "నిండుకొలువున కవులకన్నీరు తగదు" అనెడి హితోక్తుల చేతను ఆతని హృదయము నీటికన్న పలుచనయై పోయెను. ఇట్టి ప్రయత్నమునకు సామంతులు ప్రథమముననే కడంగియుండిన మహమ్మదున కీయపకీర్తి లభింపకుండెడి దని పాఠకున కాలోచన గలుగకపోదు.

పిరదౌసి మసీదుగోడపై వ్రాసిన పద్యమును గని మహమ్మదు పడినపరితాప మపారము. వెంటనే 'పారసీకునకు నిచ్చెద నన్నపసిండి నూరు బస్తాలకు బట్టి' పంపెను. పిరదౌసిమృతి విని శయనమందిరము జొచ్చి ఆత డనుభవించిన హృదయవేదన మాతని పూర్వపాపమును కడిగివేయుచున్నది. తిరిగివచ్చిన ధనమును ధనాగారమున నుంపక పిరదౌసిపేర సత్రశాలగట్టించుటయు కొనియాడదగిన విషయము. చేసిన నేరము నీరీతి నే కొలదియో సవరించుకొనుట ఎల్లర కలవడని విషయమేకదా !

ఈరీతి మహమ్మదుపాత్రను పోషించి, పాఠకుల కాతనియెడ సదభిప్రాయమును గల్పించిన గ్రంథకర్త ప్రశంసనీయుడు. కొలదియాశయములు గ్రంథకర్తకుండినచో సుల్తానుపాత్రను మిగులహేయముగ చిత్రించియుండెడివాడే.

ప్రకృతిపరిశీలనము:

ఆధునికాంధ్రకవికుమారులు ప్రకృతిమాత నారాధించుటయందు ముందడుగు వేయుచున్నారు. లలితములగుభావములతో ప్రకృతియొక్క రమణీయతను తమ

కావ్యములందు ప్రదర్శించి, వానికి మిగుల సౌందర్యమును గల్పించుచున్నారు.

ఈకవిగారు ప్రకృతిమాతయొక్క కళాకాంతుల నీగ్రంథమున కొన్నిస్థలములందు గన్పరచియున్నారు. ప్రకృతిని గాంచి యుప్పొంగి భావోన్మాదమున గానమొనరించువాడే సుకవి. ఎందరుమానవులు లోకమున లేరు? అందరును ప్రకృతిని గాంచి ముగ్ధులగుచున్నారా? ఎవని హృదయకమలము కవితాకన్యకాస్పదమై వెలయునో, అట్టివాడు ప్రకృతిసౌందర్యమును గాంచి తన్ను దాను మఱచిపోవుచున్నాడు. ఇట్టి తారతమ్యము లుండుటచేతనే కవి పూజనీయుడగుచున్నాడు.

సూర్యోదయవర్ణన మీగ్రంథమునం దెట్లు క్రొత్త భావముల కాలవాలమై యలరారుచున్నదో తిలకింపుడు:

"కుంకుమపంకముం బులుము
కొన్నవి తూరుపుకొండనెత్తముల్
పంకజబాంధవుం డరుణ
పాదముల న్నిగిడించె మింట నే
ణాంకుడు చిన్నవోయి చర
మాచలసానుతటంబు లెక్కి మై
జింకయు దాను గడ్డిగఱ
చెన్ పెనుచీకటు లార్చె గాకులై."

పైన, గీటుంచినపదములు భావగర్భితములై యూహించినకొలది యాలోచన నతిశయింపజేయుచున్నవి.

కొన్ని సమయములం దీకవి తనకు సాధ్యమగునంతవరకు చూపు నిగిడించి ప్రకృతిమాత గర్భమునందున్న రహస్యములను లోకమున వెలువరించుచున్నాడు. "నీలమేఘంబుల నెఱియలలో గుల్కి పరువెత్తు మెఱుపు గర్భములలోన" చూపున కందని మేఘములలోని కెగిరి, వాని నెఱియలలో పరుగిడుచున్న మెఱుపుయొక్క గర్భములయందు "హాయిగా జ్వలించి బ్రహ్మాండములను బల్కరించుచునున్న దివ్యస్వరూపు"ని గని ప్రణమిల్లుచున్నాడు కవిచంద్రుడు.

సామాన్యమానవున కవి మబ్బుగుట్టలు; మెఱుపు తీగెలు!

గాలికి దూగియాడు గిజిగానికులాయమునం దీకవి పరాత్పరుని పోలికలను గాంచి తన్మయుడగుచున్నాడు. "ఏమిటి కెక్కవట్టితివి ఇంద్రధనుస్సును మింటిచాయ" అని భావోద్రేకమున ప్రశ్నించుచున్నాడు. ప్రకృతియందలి ప్రతివిషయమున కిత డర్థమును దెలిసికొనవలయు నని ప్రయత్నించుచున్నాడు. తుదకు "కొసరి నివ్వరిధాన్యంబు గొఱికి నమలునెలుక మునిపంటి సవ్వడి"ని గూడ నీకవి వినగల్గుచున్నాడు.

ప్రకృతిరహస్యముల నీరీతి గ్రహించియు ఇంకను తృప్తిలేక;

'ప్రకృతిపదార్థజాలముల
పై నుదయాస్తమయంబులందు నీ
యకలుష పాణిపద్మము ర
హస్యముగా లిఖియించిపోవు టొ
క్కొకసమయాన నేను గను
గొందునుగాని గ్రహింపజాల నెం
దుకు సృజియించినాడవొ న
న్ను ఘనుడా, యసమగ్రబుద్ధిగన్.'

అని వాపోవుచున్నాడు.

ప్రకృతిపరిశీలనమువలన గల్గిన, అవ్యయానందము యిట్టిరచనాకౌశలమును గూర్చునంటలో సందియము లేదు.

పదసామగ్రి:

జాషువాకవిరచనములం దెక్కువ అచ్చతెనుగు శబ్దములు గన్పట్టుచున్నవి. అందులకే ఆకవనమున కంత రుచి కుదిరినది. వీరికూర్పునేర్పు కొనియాడదగినది. పదములపొందిక, కుజ్ఞపుకదనున కెనవచ్చు పద్యగమనము వీరికవనమున కపారమగు చక్కదనమును గల్పించుచున్నవి.

'జారిపోవని జవ్వనము' 'సాంప్రతడియారని పద్యములు' 'ఉక్కు పుష్పొడి రాలు యుద్ధభూమి', 'గర్భిణీమేఘములు', 'నీదుమనంబు లేతనవనీతము', 'పక్కణంబులన్ జల్లెడవట్టి', 'రత్నరక్తములు,' 'గండూషించె మనోవిచారము', 'మనశ్శయ్యాలు' మొదలగు తియ్యని వింతపదముల పొందికచే నీ గ్రంథమునకు వన్నె వెట్టుచున్నాడు. అచ్చటచ్చట నివి పతకమునందలి రత్నములవలె మెరయుచున్నవి.

"సిరి నిజంబుగ వట్టి టక్కరిదిసుమ్మి."

"గండుచేప డాకు కమలమయ్యె."

"కాలపురుషుండు దినదినాకారు డగుచు
భావకుని లీల నోదార్చిపోవుచుండె."

"చక్కని మల్లి కాసుమము
నన్ జరియించి మదద్విరేఫముల్
ఱెక్కలు రాచి యందు సవ
రింపగ జాలునె నీలివన్నెలన్."

"కవీంద్రుని వేడిరక్తధారాపతనం
బమంగళకరంబు."

"నిండుకొలువున కవులకన్నీరు తగదు."

"ప్రొద్దుగ్రుంకె......పంది కోఅకత్తి
పదునువెట్టె."

"పొదుపుగుబ్బలి తొలుదొల్త బూదివంటి
ధవళవర్ణంబు దాల్చి యంతట పసిండి
నిగ్గుమెదిపి నీచెంగల్వ మొగ్గదొడిగె
వేగుజామున నూసరవెల్లివోలె."

ఈపై నుదాహరించిన పద్యపాదములందు కొన్ని యర్థాలంకారసహితములు, మఱికొన్ని కవివరుని విపులమగు లోకజ్ఞానమును వెలువరించునవియు నై యున్నవి. అచ్చటచ్చట కొలదిగ శబ్దాలంకారములును గలవు.

'మహాకవి శబ్దాలంకారముల నెప్పుడో కాని ముట్టడు; ముట్టినచో నది సానతీరిన రాయి. అల్పమో అధికమో గుణాలంకారములను వలసినచోట సంగ్రహించనే సంగ్రహించును.'

"కావ్యము వెదకిచూచినను ప్రత్యక్షరము, ప్రతిశబ్దము, ప్రతివాక్యము, ప్రతిఅలంకారము, కావ్యరసోన్ముఖముగానే పరుగెత్తును. ఇది మహాశిల్పము; మిక్కిలిగా మాట్లాడినచో ఇంతకన్న మహాశిల్పము లేదు." అను మాగురువర్యులగు విశ్వనాథ సత్యనారాయణగారి వాక్యము లీ గ్రంథముపట్ల సరిగా సరిపోవుచున్నవి.

గ్రంథకర్త గ్రంథాదిని:

"అనుకూలుం డగు నీ మనోహరుని నా
మాంకంబు దిగ్దేశరా
డ్జనజిహ్వాంచలసీమలన్నిలుపు మా
చంద్రార్కమున్ జాఱిపో
వని నీజవ్వన మస్మదాంధ్రవిషయ
ప్రాగ్దేశదీపంబుగా
మని, భాషాలలితాంగి కూతయిడు మ
మ్మా, కావ్యకన్యామణీ!"

అని కోరుచున్నాడు. సర్వతోముఖమగు ప్రతిభ నార్జించిన కవికృత మగు గ్రంథముపట్ల నింక ననుమానమా!

శ్రీ రాజా రామమోహన స్మృతి

కవిరాజహంస, వోలేటి పార్వతీశము

నిర్మలానందచంద్రికల వెల్గునుజుమీ నీ దివ్యతేజంబు నేఁడు గూడ
శీతలామృతపయస్వినుల నింపునుజుమీ నీ కృపారసవృష్టి నేఁడుగూడ
వరవిహంగకలారవముల మ్రోగునుజుమీ నీ సుధామధురోక్తి నేఁడుగూడ
సచరాచరప్రపంచమునఁ దోఁచునుజుమీ నీ శాంతమయమూర్తి నేఁడుగూడ
నేఁడు నీనాఁడు మాకు నూతేఁడు లైన - నెదుటఁ గలయట్టులే తోఁచు నెల్లవేళ
నమరమైనది నీదు దివ్యప్రచార - మమరుఁడవు నీవు రామమోహన మహాత్మ!

నీవు నాఁటినమొక్క నిఖిలార్థసిద్ధమై యమృతకల్పకవల్లి ననుకరించె
నీవు పాడినపాట నిరుపమానందమై ప్రణవవీణాతంత్రిఁ బ్రతిరవించె
నీవుపట్టినజ్యోతి నిశ్చలాభోగమై పరమతేజంబునఁ బ్రస్ఫురించె
నీవు తీర్చినబాట నిష్కంటకంబయి యోగమాంతపథంబు నధిగమించె
నమరమైనది నీ పావనావతార - మమరమైనది నీప్రణయప్రవృత్తి
మమరమైనది నీ నిశ్చయాత్మబోధ - మమరుఁడవు నీవు రామమోహన మహాత్మ!

సరసఫలాభిశోభితరసాల మొకప్పటికైన నెండి కా
న్పఁబడు నవరత్నహేమఖను లంతట నిండు మహాద్రికాలగ
హ్వారమునఁ గూలుఁ గాని నిరవద్యభవద్విమలప్రబోధసా
గర మటుగాక తన్పుఁ గలకాలము లోకము రామమోహనా!

వేణీసంహారము - ద్రౌపది

సరసకవితాధురీణ, కపిస్థలం కృష్ణమాచార్యులు, బి.ఏ., యల్.టి.,

విపశ్చిల్లోకమునఁ బ్రఖ్యాతిగాంచిన నాటకములలో వేణీసంహార ముచితస్థానము నాక్రమించియున్నది. సామోపాయకుశలుఁడగు శ్రీకృష్ణుని సంధిసందేశము మొదలు దుర్యోధనుని యంతిమపరాజయమువఱకుఁ గల భారతకథావిషయ మీనాటకముయొక్క వస్తువు. కథాసంవిధానమంతయు భీముఁడు, దుర్యోధనుఁడు, ద్రౌపది-వీరిమీఁదనే యాధారపడి యుండుటవలన దీని యనేకపాత్రములలో వీరే ముఖ్యులు. ఇందు రౌద్ర మంగిరసము. వీర కరుణము లంగరసములయి దీనిని రాణింపఁజేయుచున్నవి. ఇందలి శైలి వస్తునిర్మాణౌన్నత్యమునకుఁ దగియున్నది. ఇఁక భట్టనారాయణ కవిప్రణీత వేణీసంహార నాటకము సర్వజన సమాదరణము వడసినదని నేఁడుగఁజెప్ప నేల? ఇట్టి ప్రశస్తనాటకమునకు నాయికయగు ద్రౌపదీ పాత్రమును, భట్టనారాయణుఁడు తెలిపినట్లు ఈవ్యాసమున విమర్శింప యత్నించెదను. కాని యీనాటకపు విలువను చదువరులు నిర్ణయించుకొందురుగాక!

పాండవు లజ్ఞాతవాసానంతరము మఱలి వచ్చియు, దుర్యోధనుఁడు తనమాట ననుసరించి ప్రవర్తించుట లేదు. పినతండ్రికుమారులతో తనరాజ్యము ననుభవింపవలయునా, వలదా యని సంశయించుచున్నాఁడు. యుధిష్ఠిరుఁడు రాజ్యమునకయి బహిరంగముగ సమర మొనర్చునట్లు లేదు. అతని యభిప్రాయము భీమునికంతగ రుచించుట లేదు; భీముఁ డిప్పటికే కోపోద్దీపితుఁ డయియున్నాఁడు. అతనియెడ సహదేవుని శాంతోక్తులు విఫలము లయినవి. తనసహోదరుల బుద్ధిమాంద్యమున కతఁ డెంతయుఁ జింతిల్లుచున్నాఁడు. వారు తత్క్షణమే యుద్ధసన్నద్ధులు కావలయు ననుచున్నాఁడు. నిరుత్సాహులగు తనసోదరులు యుద్ధమున కనుమతి నీయరని సంశయించుచున్నాఁడు. తన కార్యమును ద్రౌపది యామోదించు నను దృఢవిశ్వాస ముండుటవలన నామెతో యోచింప నెంచుచున్నాఁడు. ఈవిషయమున భీమునియభీష్టము ఫలించినది. సహదేవుఁ డూహించినట్లే

> యద్వైద్యుత మివజ్యోతి రార్యక్రోధేఽద్య సంభృతమ్,
> తత్ప్రావృడి కృష్ణేయం నూనం సంవర్ధయిష్యతి.

ద్రౌపదీసామీప్యము భీముని కోపానలానిలమయి పరిణమించి యతనిసంకల్పమును ప్రోత్సహించినది.

భీముఁ డంతఃపురమును జేరునప్పటికే తనయవమానకారణము నతనికి తెలుప ద్రౌపది యుత్కంఠితయయి యతని యాగమనమును నిరీక్షించుచున్నది. ద్రౌపది దేవీసహితుఁడగు ధృతరాష్ట్రుని సేవించి, మఱలి వచ్చుచుండ

దుర్యోధనుని భార్యయగు భానుమతి యామె నవమానపఱచెనఁట! ద్రౌపదిసంకల్పము నామె పరిహసించి, కలుషమందహాసముతో

అయి, యాజ్ఞసేని, పంచగ్రామా స్తవ పతిభిః ప్రార్థ్యన్త ఇతి శ్రూయతే త త్కస్మాత్త్వనః అద్యాపి తే కేశాః న సంయమ్యన్తే?

అని ప్రశ్నించెనఁట. తనచేటియగు బుద్ధిమతి యొక్క—

అయి, భానుమతి, యుష్మాక మముక్తేషు కేశేషు కథ మస్మాకం దేవ్యాః కేశాః సంయమ్యన్తే ?

అను సమయోచితప్రత్యుత్తరముసహిత మామెను తృప్తిపఱచుట లేదు. ద్రౌపది క్షత్త్రియాణి; ప్రతిక్రియయొక్కటే యామె నోదార్చఁగలదు. తన పంచప్రాణనాథులలో భీముఁడొక్కఁడే తన యవమతి కను తాపము నొంది ప్రతిక్రియ చేయ సమర్థుఁడని యామె బాగుగ నెఱుఁగును. ఆమె యందులకే భీముఁ డెప్పుడు వచ్చునా యని వేచియున్నది.

దుర్యోధనాదుల దుర్వర్తనముల తలఁచి తలఁచి తద్దర్పదళనవిధానము సహదేవునికి తెలుపుచు భీముఁడు ప్రమత్తుఁడయియున్నాఁడు. కావున తనమ్రోల నిలిచియున్నను ద్రౌపదిని జూడఁజాలకున్నాఁడు. భీముని ఔదాసీన్యము ద్రౌపదికి కోపోద్దీపకము కాలేదు. సరికదా, అతఁడు క్రోధముతో శత్రునాశముసేయ సంకల్పించుకొనుటయే యామెకు కర్ణామృతమగుచున్నది. తనరాక నెఱిఁగించి, యతనిఁ గలప నామె యభిలషించుట లేదు. అతనికి తెలియక నెమ్మదిగ నచటఁ గూర్చుండి యతని కౌరవవినాశప్రశంసాత్మకరౌద్రోక్తులనుసావధానముగ నాలకించుచున్నది. దుర్యోధనుఁడు పంచనగరములను పాండవవశ మొనర్చునెడ సంధి సలుపఁదలఁచిన యుధిష్ఠిరు నుద్దేశ్యమునకు తన యసమ్మతిని సహదేవునికి తెలుపుచు, నాయుపక్రమణమంతయు నసమంజసమని భీముఁ డిట్లు నిందించుచున్నాఁడు:

మథ్నామి కౌరవశతం సమరే న కోపాత్
దుశ్శాసనస్య రుధిరం నపిబా మ్యురస్తః,
సంచూర్ణయామి గదయా న సుయోధనోరూ
సంధిం కరోతు భగవాన్ నృపతిః పణేన.

ఆలకించి ద్రౌపది దీనిని మనఃపూర్వకముగ నామోదించుచు, అతనిని తనప్రతిజ్ఞను మాటిమాటికి చెప్పుమని ప్రోత్సహించుచున్నది.

నాథ, అశ్రుతపూర్వ మీదృశం వచనం. త త్పునః పున ర్భణ.

మఱియు, నాయైదునగరము లేవియో యనికూడ భీముఁడు తెలియఁగోరుట లేదు. ఆపట్టణములు తమ్ము ప్రకటించు కుట్రలో పాల్గొన్నవని సహదేవుఁడు తెలుపఁగా భీముని కావరమంతగ రుచించుట లేదు. యుధిష్ఠిరుని కోరికకు కౌరవు లియ్యకొను టసంభవమనియు, పాండవులు కయ్యమునకుఁ గాలుద్రవ్వి రను నింద లేకుండుటకే యానగరములను యుధిష్ఠిరుఁడు గోరనెంచె ననియు సహదేవుఁడు చెప్పుచున్నాఁడు భీమునికి కపటోపాయములు రుచించుట లేదు. నిజదర్పదర్శన కుతూహలియై,

యుష్మాన్ హ్రేపయతి క్రోధా ల్లోకే శత్రుకులక్షయః,
న లజ్జయతి దారాణాం సభాయాం కేశకర్షణమ్.

అని యఱచుచున్నాఁడు. స్వావజ్ఞాసూచకమగు నీమాటలు ద్రౌపది హృదయమును రసోద్రేక పూరితము సేయుచున్నవి.

నాథ నలజ్జస్తే నలజ్జస్తే ఏ తే. త్వ స్త్వావత్ మా విస్మార్షీః.

అనియామె తనదుఃఖమును వెలిబుచ్చుచున్నది.

ఈసమయమున భీముఁడు నిజకార్యమును జ్ఞప్తికిఁదెచ్చుకొని, పాంచాలికొఱకెంత కాలము వేచియుండవలయునని సహదేవు నడుగుచున్నాఁడు. ఆమె యచ్చట చాలకాలమునుండి యున్నదనియు, ప్రాయశః భీముఁ డామెను జూడలేదేమో అనుచున్నాఁడు సహదేవుఁడు. తోడనే భీముఁడు క్షమాపణ వేఁడుచున్నాఁడు. కాని యట్టిక్షమాపణకుఁ బ్రస_క్తియే ద్రౌపది కగపడుట లేదు. ఏలన,

ఉదాసీనేషు యుష్మాసు మమ మన్యుః నపునః కుపితేషు.

పరస్పరస్వాగతో_క్త్యనంతరము, భీముఁడు తన జన్మవిరోధి దుర్యోధనుని రాణియగు భానుమతి ద్రౌపది నవమానించినవిధము బుద్ధిమతివలన నెఱిఁగి,

చంచద్భుజ భ్రమితచండగదాభిఘాత
సంచూర్ణితోరుయుగళస్య సుయోధనస్య,
స్త్యానావనద్ధ ఘనశోణిత శోణపాణి
రు_త్తంభయిష్యతి కచాం_స్తవ దేవి భీమః.

అని తనదేవి నోదార్చ యత్నించుచున్నాఁడు. ద్రౌపది యపరిమితానందము నొందుచున్నది కాని, దానికతని సహోదరులు సమ్మతింపరేమో అనియే యామె భయము. సోదరులందఱును యుద్ధసన్నద్ధులయియున్నారనుచున్నాఁడు సహదేవుఁడు. రణభేరీనినాదము దానిని మఱింత రూఢిపఱచినది.

మఱియొకపర్యాయము తనోదార్పుఁడని బుద్ధిమతిమూలమున నాథుని ప్రార్థించి, ద్రౌపది యతనిని వీడ్కొనుచున్నది. భీముఁడును

భూయఃపరిభవక్లాన్తలజ్జావిధురితాననమ్,
అని శ్శేషితకౌరవ్యం నపశ్యసి వృకోదరమ్.

అని తా నామెకు వాగ్దాన మొనరించినదంతయు నెఱవేర్చుదనుక నామెను మఱల సందర్శింపననుచున్నాఁడు.

తుట్టతుదకు తనకయి సంగరమున ప్రమత్తులరయి సాహసకృత్యములకుఁ గడఁగకుఁడని ద్రౌపది నాథుని ప్రార్థించుచున్నది. అందులకు భీముఁడు పాండుకుమారు లప్రతిమాన యుద్ధకౌశలము గలవారనియు, నావిషయమున భయపడవలదనియు ననుచున్నాఁడు. విని ద్రౌపది సంతసించుచున్నది.

భీముఁడు తన్ను వీడ్కొనినదాదిగ ద్రౌపది కేమియు తోఁచుటలేదు; ఆమె మనశ్శాంతి నేదియో కలఁచుచున్నది. నాథుఁడు రణభూమినుండి రాఁడా యని యాత్రపడుచున్నది.

ఇంతలో సేవకుఁడొకఁడు యుద్ధభూమి నుండివచ్చి, కౌరవసైన్యము దాదాపు ధ్వంసమయ్యెననియు, భీమార్జునులు దుర్యోధనునితో మల్లయుద్ధముసేయ వానిని వెదకుచున్నా

రనియుఁ దెలుపుచున్నాఁడు. దీనిని వినుటతోడనే ద్రౌపది కపశకునశంక గలుగుచున్నది. ఆమెయస్వస్థచిత్తయయి కలఁతఁ జెందుచున్నది. ఇంతటికి నామె యబలయే కదా! జీవన్మృత్యుసందిగ్ధసమయములందుసహితము స్త్రీసహజమగు మనోవేదన యామెను పరితపింపఁ జేయకుండునా? ప్రతిక్రియ చేయవలయునని యామె యింక నేమాత్రమును కోరుటలేదు. తన ప్రియులుభీమార్జునులు మఱలివచ్చినఁజాలునను చున్నది. దుర్యోధనుని మిత్రుఁడగు చార్వాకుఁడను రాక్షసుఁడు మాయాబు వేషధారియయి యుధిష్ఠిరునితో యుద్ధమున భీమార్జునులు దుర్యోధనునిచేత నొకరివెనుక నొకరుగ మడిసిరని కల్లలాడుచున్నాఁడు. నిజనాథుల శౌర్యపరాక్రమముల చక్కఁగ నెఱిఁగిన దయ్యును ద్రౌపది యామాటలను నమ్ముచున్నది. నమ్మి, వగల మిగుల బొగులుచున్నది; ప్రాణత్యాగమునకయి తనకును, యుధిష్ఠిరునకును నొకచితిని పేర్చినది.

తత్క్షణమే భీముఁడు రక్తసిక్తాంగములతో ప్రవేశించుచున్నాఁడు. ప్రవేశించి ద్రౌపదీయుధిష్ఠిరులను వెదకుచున్నాఁడు. కాని, పాపము! జనులెల్లరును వానిని దుర్యోధనుఁడని భ్రమించి, సతీత్వము రక్షించుకొనుటకయి శీఘ్రము చితి నుఱుకవలయునని ద్రౌపదిని బలవంతపఱచుచున్నారు. పాపము, ద్రౌపది, చేయునదిలేక, మృతులగు భీమార్జునులకు తర్పణము లాచరించి, పాండువంశాంకురమగు ఉత్తరాగర్భస్థశిశువును రక్షించుకొమ్మని సుభద్రకు చెప్పి, ప్రాణత్యాగమునకు సంసిద్ధురాలగుచున్నది. ప్రజ లాందోళితమనస్కులగునట్లు, దుర్యోధనుఁ డని యెంచఁబడిన భీముఁడు సమయమునకు వచ్చి ద్రౌపది నట్లే నిలుపుచున్నాఁడు. దైవాధీనముగ నందఱును భీముని గుర్తుపట్టుచున్నారు. కృష్ణార్జునులు వారిని గలసికొని చార్వాకుని కపటోపాయములను విశదీకరించుచున్నారు.

భీముఁడు

చంచద్భుజభ్రమిత.........

అను తన ప్రతిజ్ఞ జ్ఞాపకమున్నదా యని ద్రౌపది నడుగుచున్నాఁడు. ఆమెయు నత్యాహ్లాదమున

స్మరా మ్యనుభవామిచ.

అని ప్రత్యుత్తర మొసఁగుచున్నది.

విరియఁబోసిన కేశపాశములను ముడుచుకొనుమని భీముఁడు ద్రౌపది నడుగుచున్నాఁడు. తాను 'భీముఁడు వేణీసంహార మొనరించు నానందము ననుభవింపఁగోరి, ద్రౌపది యుక్తియుక్తముగ,

విస్మృతాస్మి తం వ్యాపారం నాథస్య ప్రసాదేన పునరపి శిక్షయిష్యామి.

అనుచున్నది; అని సఫలీకృతమనోరథ యగుచున్నది

ద్రౌపది ప్రథమమున భీముని భయంకరసంకల్పమును ప్రోత్సహించి యతని కోపానలజ్వాలలను విజృంభింపఁజేయుచున్నది.

కాని, కార్యనిర్వహణసమయము వచ్చినపుడామెయే రానురాను అబలాజనసహజమగు భయమున మునుఁగుచున్నది. ధీరుఁడగు యుధిష్ఠిరుఁడే చార్వాకుని మాయాజాలముఁ జిక్కి బెగడొందుచుండ, నబలయగు పాంచాలి యెట్లన్యథా వర్తింపఁగలదు? నిజమగు ప్రేమ లేనిపోని యిక్కట్టులకు వెఱచుట సహజమే (అతిస్నేహః పాపశంకీ).

ఇంతకును, ద్రౌపది మానవ స్త్రీయే కదా! మన బలాబలములను మనతో పోల్గొననియెడల ద్రౌపది నిజప్రకృతికి విరోధముగ వర్తించిన ట్లగునుగదా!



చంపక దేవి జలపాతము, కుత్తాలము

—యస్. శంకరసుబ్రహ్మణ్యం.

మద్దుకత - ప్రశంసాలేశము

సాహిత్యవిద్యా-ఉభయభాషా-ప్రవీణ, బులుసు వేంకటరమణయ్య

"కులముతక్కువవారు కుమతులుకారు
కులముతక్కువవారు కులటలుకారు;

*　*　*　*

చదువున కర్థంబు జ్ఞానంబుగాని
చదువైన యక్షరజ్ఞానంబు కాదు;"

[మద్దుకత]

ధర్మాధర్మములను, మంచిచెడుగులను, జాతిమతాచారములనుబట్టి నిర్ణయింప వీలు లేదు. కొన్ని జాతిమతాచారము లుత్తమములు, మఱికొన్ని యధమములు నని తలంచుట పొరపాటు. గుణోత్కృష్టములగున వన్నియు నుత్తమము లగును; గుణములు లేనియపు డెట్టి కులములైనను నీచము లనియే చెప్పకతప్పదు. సత్యధర్మప్రియుఁడగు భగవంతుఁడు జాతిమతాచారములను ప్రేమింపఁడు. అట్లే చదువునకును, జ్ఞానమునకును పరస్పరము సంబంధము లేదు. చదివిన మూర్ఖుని కంటె చదువరికాని జ్ఞాని యెన్నియో మడుంగులు మేలు.

అనశ్వరములగు కీర్తిప్రతిష్ఠలు సత్యధర్మములపై నాధారపడియున్నవి. ఎట్టికుశాగ్రబుద్ధికిని సత్యాన్వేషణ మొనర్చుట చాల దుర్ఘటము. సూక్ష్మాతిసూక్ష్మములగు ధర్మాధర్మముల తత్త్వమును నిర్ణయింపఁ గోరి మన పెద్దలు కొందఱు ప్రాచీనకాలమునందే కొన్ని విషయములఁగూ పరీక్షలను నిర్ణయించినట్లు ధర్మశాస్త్రములు చెప్పుచున్నవి

ఇట్టిపరీక్షలు ఎపుడు ప్రారంభింపఁబడినవో చెప్పుట కష్టము. కౌటిలీయార్థశాస్త్రమున ముద్దాయి తాను నిర్దోషియని స్థిరపఱచుటకు సాక్ష్యమును, శపథమును నుపయోగింపవలెనని చెప్పఁబడియున్నది. స్మృతివాఙ్మయమున మీఁదిశపథమున కే కొంతబలము కూర్పఁబడినది. అపరాధి బ్రాహ్మణుఁడైనచో, "సత్యముతో నొట్టుపెట్టుకొనుచున్నా" నని చెప్పవలసినట్లును, క్షత్రియుఁడైనచో ఆయుధాశ్వములతో నొట్టుపెట్టుకొనవలసినట్లును, వైశ్యుఁడైనచోఁ బశువులను, ధాన్యములను, బంగారమును ముట్టి ప్రమాణము చేయువలసినట్లును, శూద్రుఁడైనచో నెనిమిదంగుళముల పొడవు కల్గి, ఎనిమిది పలములయెత్తు గల్గిన యినుపకణికను, ఎఱ్ఱగఁ గాల్చినదానిని చేత నుంచుకొనికాని, నీట మునిఁగికాని, వేశ్వేఱుగ భార్యాపుత్రాదుల శిరసులు ముట్టికాని ప్రమాణము చేయవలసియున్నట్లును మనుస్మృతియందఁ జెప్పఁబడియున్నది.

అగ్నివలన నతనిచేయి కాలి పొక్కక పోయినను, నీటమునింగినయతఁడు తేలకయున్నను, భార్యాదులతలలపై చేయి నుంచునపుడు స్వల్పకాలమున రోగము కలుగ

కున్నను శూద్రుఁడు నిర్దోషియగునఁట! అపరాధముయొక్క హెచ్చుతగ్గులం బట్టి యీ శపథములు మాఱుచుండును.

క్రమముగ నీశపథము పరీక్షగ మాఱి పోయినది. యాజ్ఞవల్క్యస్మృతియందు, మితాక్షరమునను ఈ పరీక్షలు దివ్యపదాంకితములయి యెనిమిదివిధములుగఁ జెప్పఁబడినవి:

౧. తులాదివ్యము: అపరాధి నొకసారి తూఁచి, పిదప మంత్రములను పఠించి మఱల తూఁచవలెను. అపు డతఁడు తక్కువతూఁగినచో నిరపరాధి యగునని నిశ్చయము.

౨. అగ్నిదివ్యము: ఇదివఱకుఁ జెప్పిన రీతిగ నపరాధి నగ్నిపరీక్ష చేయవలెను. అగ్ని వలన నతనికి హానికలుగనిచో అతఁడు నిర్దోషి యగును.

3. జలదివ్యము: జలశపథమురీతినే జలదివ్యమును గ్రహింపవలెను. అపరాధిని జలము తేల్చకపోయినచో నతఁడు నిరపరాధియగును.

౪. విషదివ్యము: అపరాధిచేఁ గొన్ని విషమాత్రలను దినిపింపవలెను. లేదా, యొక కుండలో నేదైనవస్తువును, పామును ఉంచి వస్తువును పైకి తీయవలెనని యతనిఁ గోరవలెను. తినినవిషము వాని కపాయముఁ గలిగింపకున్నను, పాము వానిని కఱవకున్నను అతఁడు నిర్దోషి యగును.

౫. కోశదివ్యము: సమంత్రముగ దేవాభిషిక్తమగు నుదకము మూఁడుదోసిళు లపరాధి త్రాగవలెను. పదునైదురోజులలో రాజకీయమునుగాని, దైవికమునుగాని విపత్తు నాతఁడు పొందకున్న నతఁడు నిర్దోషి యగును.

౬. తండులదివ్యము: శుచియగు పరీక్షకుఁడు తెల్లగఁ గడిగిన బియ్యమును సూర్యాభిముఖుఁడై యొకమట్టికుండలో స్నానోదకములతోఁగూడఁ బోయవలెను. పిదప అపరాధికి స్నానము చేయించి తలపై నొక ఆకు నుంచి, వానిచే బియ్యము నమలించి వేఱొక యాకుపై (పిప్పలపత్రముపైఁగాని, భూర్జపత్రముపైఁ గాని) ఉమియింపవలెను. అపరాధి మూతి ఎఱ్ఱగఁగాకున్నను, దౌడలు చీరుకొని పోకున్నను అతఁడు నిర్దోషి యగును. ఈ మీఁది దివ్యమును చౌర్య విషయముననే అవలంబింపవలెను.

౭. తప్తమాషకదివ్యము: ఒకమూకుడులోఁ జమురుపోసి సలసలఁ గ్రాఁగనిచ్చి యందు నాణెములనుగాని, బటువునుగాని పడవేయవలెను. అపరాధి తనచేతిని పూర్తిగ నాచమురులో ముంచి వస్తువును బయటికిఁ దీయవలెను. అపు డతనిచేయి కాలక పొక్కిపోకయున్నచో నతఁడు నిర్దోషి యగును.

౮. ధర్మాధర్మదివ్యము: ఒకవస్తువునకు ధర్మమనియు, వేఱొకదాని కధర్మమనియుఁ బేర్లు మనసున నునుకొని పరీక్షకుఁడు పరీక్షితుని, ఏదైన ఒకదానిని స్పృశింపఁగోరవలెను. అపరాధి ధర్మసంజ్ఞకమును ముట్టినచో నిర్దోషి యగును.

ఫాలదివ్యము మొదలగునవి మఱికొన్ని యిట్లే కలవు.

విషయముయొక్కయు, కాలముయొక్కయు భేదమును, తారతమ్యమును బట్టి యీ పరీక్షలు మాఱుచుండును. ఇయ్యవి స్త్రీపురుష సాధారణములే యైనను, సామాన్యముగ స్త్రీల విషయమునందే యుపయోగింపఁబడు చున్నట్లు తెలియుచున్నది. ఈ పరీక్ష లిప్పటికిని మన దేశమునఁ గొన్నికొన్ని స్థలములయందాచారమున నున్నవి.

ఖండాంతరముల సంగతి యెటులున్నను భరతఖండమునమాత్రము సత్యము, పాతివ్రత్యము మొదలగు నుత్తమధర్మములకుఁ దగినప్రాధాన్యము కలదు. భార్యకు భర్తయే దైవము. పతి యెంతకఠినహృదయుఁడైనను, తన్ను బాధించుచున్నను భారతరమణీమణి యతనియాజ్ఞ నుల్లంఘింపదు. సర్వదా అతనిని మెప్పించుటకే ప్రయత్నించును. అట్లే భర్తయుఁ దనభార్యను శరీరమునందలి సగపాలుగఁ దలంచును. "జంపతి - దంపతి" అను పదములందుఁగూడ ధ్వనితమగు మీఁది తత్త్వము గోచరించుచున్నది. పతివ్రతలగు వనితలు తమ పాతివ్రత్యమును నిర్ణయించుకొనుట కెట్టికఠినపరీక్షలకైనను వెనుదీయరు. వేయేల? పరమపతివ్రతామతల్లియగు సీతాదేవియే మండునిప్పులో నురికినదిగదా!

జాతిమతాచారములతో సంబంధములేని యిట్టియుత్తమధర్మము నొక యథార్థచరిత్రముతో మేళవించి శ్రీమంగిపూడి వేంకటశర్మ గారు "మద్దుకత" యను నీచిన్నిగ్రంథము నాంధ్రలోకమున కర్పించుచున్నారు. ఒకమెఱుకపడుచు తనసతీత్వమును బ్రకటింపఁదలఁచి యిదివఱకుఁ జెప్పఁబడిన విషమపరీక్షలలో నొకటియగు "తప్తమాషకదివ్యము" నకు గురియై కృతార్థయైనయంశ మిందు వర్ణితము

ఒకయెఱుకని కిరువురు భార్యలు. వానికిఁ జిన్నభార్యయెడ మక్కువ యెక్కువ. ఒకప్పుడామె యెఱుకచెప్పుటకు వాడవాడలఁ దిరుగు సమయమున పెద్దయామె సవతియగునామెపై లేనిపోని కొండెములు కల్పించి యామెసతీత్వమునకుఁ గళంకము కల్గించి మగనితోఁ జెప్పి యతనిని నమ్మించినది. అతఁడు వానిని నమ్మి చిన్నదానిని దిట్టరానితిట్లు తిట్టెను. ఏపాపము నెఱుంగని యాసతీమణి తనసతీత్వమును సమర్థించుకొనఁ దప్తమాషకపరీక్ష నిచ్చి జయము పొంది మగనిమన్ననకుఁ బాత్రమైనది. ఇదియే యిందలి కథాభాగము. కథ చిన్నది; కాని యిందువలన లోకము నేర్వఁదగిన నీతిమాత్రము మిక్కిలి పెద్దది.

కావ్యమునకు రసము ప్రధానము. కవిత యన్నివిధముల రసాభివ్యంజకమై యుండవలెను. ఇందలి సవతులపోరు, సంధ్యాకాలము, రాత్రి, చీఁకటి మొదలగువాని వర్ణనములు, నుడికారముసొంపు రసమున కత్యంతము ననుకూలములు.

ఇందు ఎఱుకసాని సత్యపరాక్రమమును వ్యక్తపఱచినందున నిది ధర్మవీరప్రధానక మగుచున్నది. వీరగాథలు సామాన్యముగ ద్విపదలు, వానితోడి దగ్గఱిబాంధవ్యముగల పదములు మొదలగు ఛందములలో రచింపఁబడిననే రసావహము లగును. "పల్నాటివీర చరిత్రము", "బొబ్బిలియుద్ధము" మొదలగు వీరగాథ లట్లే కూర్పఁబడియున్నవి. కావున నీకథారచనము మంజరీద్విపదయందుఁ జేయఁబడుట యెంతయు సమంజసము.

ఆంధ్రదేశమునకుఁ జిరపరిచితులగు శ్రీ శర్మగారి రచనాచాతురిని పేర్కొనుట చర్వితచర్వణము. లలితలలితమగురీతుల జాను తెలుఁగునఁ గబ్బములు వ్రాయువారిలో వీ రగ్రగణ్యులు.

"ఓసోసి వగలాడి! యో వాడవదినె"
"బయలెక్కెఁబో నీదు బాజారమెల్ల"
"మననేస్తమును జూచి ఘనమన్కి–చూచి
కన్నుగట్టిన చెడ్డకామిని యెవతో"
"ఏమనికూసితివే యోసిబసివి!"
"మగఁడును నీవు మమైకమ్ము చెంద"
"ఓసిగరాస! ఓసోసి పిసాళి!"
"ఈలాటి సూడు నీ కేలనే సవతి!"

ఇట్టి జాతీయ ప్రయోగములతో నీచిన్ని కావ్యము నిండియున్నది.


మఱియు వీ రేకావ్యమును రచించినను నీతిని ముఖ్యముగఁ బాటింతురు. ఇందలి సతీధర్మోపదేశ మమూల్యము. ఇట్టి నీతిజాతీయతలమేళవింపు మనకు వీరి "బాలవితంతువిలాపము", "నిరుద్ధభారతము" మొదలగు కావ్యములయందును గాననగును. ఈమడ్డుకతయందచ్చటచ్చట "ఓసోసి, ఎవతో, ఎంతున్న, గతేమానో, మున్నగు వ్యాకరణాసాధ్యములగు ప్రయోగములు కానవచ్చుచున్నను, రసతన్మయులగు కవి, సహృదయుల కవి నెఱసులని తోఁచదు. రసాభివ్యక్తి కడ్డంకులగు ప్రయోగములే దుష్టములని సహృదయుల యాశయము. రసతన్మయులగు కవు లచ్చటచ్చట వ్యాకరణశృంఖలలఁ ద్రెంచుకొని స్వేచ్ఛావిహార మొనర్చుట వాఙ్మయప్రపంచమున గలదు.

ఆంధ్రమున కన్నివిషయములందునుఁ బ్రత్యేకత కలుగవలెనను వాంఛ యిప్పుడిప్పుడే యాంధ్రులహృదయభూమి నంకురించుచున్నది. అనేకులగువిద్వాంసు లీవిషయమున నుపన్యాసము లిచ్చుచున్నారు; కాని యవి క్రియారూపముఁ దాల్చుట యరుదుగనున్నది. అట్టి ప్రత్యేకతాభిమానులు రచించుగ్రంథములుకూడ సంస్కృతపదభూయిష్ఠములై ప్రత్యయమాత్రప్రత్యేకతనే యాంధ్రమునకు గూర్చుచున్నవి. తెలుఁగుబాసకు సంపూర్ణముగఁ బ్రత్యేకత గలుగవలెనన్న "మడ్డుకత" వంటిగ్రంథములు–సర్వజనవేద్యములు, భావవిలసితములు, లలితాంధ్రపదగుంభితములు–ఎన్నియేని కావలసియున్నవి. సహృదయులు,

పండితులు నగునాంధ్రులిట్టి గ్రంథములను రచించి భాషకు వన్నెగూర్చుటకై సర్వవిధముల సత్వరముగఁ బ్రయత్నమొనరించుట ఆవశ్యకము.

ఈముద్దుకత సదుపదేశకము; నీతిదాయకము; ఉత్సాహాభివర్ధకము; భావవిలసితము; ముఖ్యముగ సులలితాంధ్రపదగ్రథితము. దీనిని పఠించినచోఁ బలువిధములగు మనోభావములు ప్రదీప్తములై కార్యసాధనమునఁ బట్టుదలను అంతకంతకు నెక్కువగ తేనియలొల్కు తెనుఁగునుడికారపు సొంపును గుర్తించుటలో మిగుల బీదపడియున్న నేటివిద్యార్థుల యాంధ్రభాషాజ్ఞానసంపదను వృద్ధిపఱుపఁగలవు. కావున నీగ్రంథము స్కూలుఫైనలుతరగతికి అవశ్యపఠనీయ గ్రంథముగ నిర్ణయింపఁబడవలసియున్నది.

శ్రీ శర్మగారిట్టిగ్రంథములను పెక్కింటిని రచించి పలువురకు మార్గదర్శకులై సంస్కృతవాఙ్మయభూయిష్ఠమై నామమాత్రముగ మిగిలియున్న ఆంధ్రవాఙ్మయమునకు జీవమును, జవమును సమకూర్చి ప్రత్యేకతను సంపాదింతురుగాక!



చంపకదేవి యాలయము, కుత్తాలము

—యస్. శంకరసుబ్రహ్మణ్యము.

ప్రేమపాశం

(అనువృత్తము)

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

మూడోరంగం

[నూతి పెరట్లో రాచవుసిరిచెట్టుకింద ప్రకాశం కూచునివుంటాడు. కాంతమ్మ నుంచునివుంటుంది.]

కాంతమ్మ—గడుసుదికనక రత్తమ్మవొదిన కదిపి వెళ్లిపోయింది. చాలాఆశగానేవుంది.

ప్రకాశం—ఆశ్చర్యమా అక్కయ్యగారూ? అయిదుయకరాలభూమి, పైగా యకరం నారింజతోట, యకరం కొబ్బరితోట, యకరం నిమ్మతోట, సందుకు పెట్టెలాంటి మేడ. పిల్ల చుక్కనిచుక్క. యేంలోటూ?

కాంతమ్మ — అన్నీ వున్నాయి. ఆమహారాజే గొంతుకోక్కేశారు. భూమ్మీద యేదీవుండిపోదండీ. అన్నీ అయిపోతాయి. బంగారం పెళ్లిఆగదు. ఆవేళకెవరో దానికి తగినవాడు—తగినా తగకపోయినా ఘటనవున్నవాడు—

ప్రకాశం—ఎవరఅదృష్టం బాగుందో చెప్పలేము. రత్తమ్మగారు సరేకదా? కోటమ్మగారు మొదటే బేరం మొదలుపెట్టిందాయె. ఆర్యాపురంలో వొక బట్టలవర్తకుడు ఆశచూపించాడు మొన్న.

కాంతమ్మ—యెవరికిచ్చినా చిట్టితల్లిని విడిచి వుండలేనండీ అన్నయ్యగారూ!

ప్రకాశం—ఎందుకువుండాలీ అసలూ. అల్లుణ్ణి యింటికే తెచ్చుకోవచ్చు.

కాంతమ్మ—అదే చూస్తున్నానండీ.

ప్రకాశం—మీవుద్దేశం యేమిటి అక్కయ్యగారూ?

కాంతమ్మ—యిప్పటికేమీ లేదు. నాకాధ్యానమే నిలవడం లేదూ. ప్రపంచకం యేమీ తెలవడంలేదండీ.

ప్రకాశం—ఆశ్చర్యమా అమ్మా? కాని బంగారానికి యీడువచ్చింది, ఇక ఆపడానికివల్లకాదు.

కాంతమ్మ—పెనిమిటిపోవడమూ, కూతురు పెళ్లీనీ. చూశారా అన్నయ్యగారూ? ఎలాగాభరించడం?

ప్రకాశం—గోరుచుట్టుమీద రోకలిపోటన్నట్లు-యేంచెయ్యగలమూ? అనుభవించడంతప్ప వేరేదారి లేదు.

(అప్పుడు బంగారమ్మవస్తుంది)

బంగారమ్మ—వెంకమ్మత్తగారు భోజనంచేసీదాకా విడిచిపెట్టారుకారు. ఈపూట యిక అక్కల్లేదే అమ్మా!

కాంతమ్మ—పోనీలేఅమ్మా! ఒదిన నువ్వంటే ప్రాణంయిస్తుంది. అన్నయ్యగారిసంగతి చెప్పనే అక్కర్లేదూ.

ప్రకాశం—ఇలారాకోడలా!

కాంతమ్మ— మామయ్యగారిదగ్గిర కూచో అమ్మా!

బంగారమ్మ—ఎందుకండీ మామయ్యగారూ? (అంటూ ప్రకాశందగ్గిర కూచుంటుంది.)

ప్రకాశం—మీరాయడుబావ తెచ్చిన మిఠాయి అంతా తినేశావా, కొంచెంవుంచావా?

బంగారమ్మ — బాగుందికాదండీ. బ్రాహ్మణదుకాణంలోది కాదుట. నిలవసరుకులా వుంది. చూస్తారా?

ప్రకాశం—అంటే?

బంగారమ్మ—పుచ్చుకుంటారా?

ప్రకాశం—బాగుంటే పెట్టకేపోదువు.

బంగారమ్మ — పెట్టకపోడానికి బాగుండడం యేదీ? చౌకరకం చూశాడు రాయడుబావ: కాక పోయినా బజారునుంచి తెచ్చింది తింటారు కామోసు మీరు.

ప్రకాశం — మిఠాయికేంగానీ; రాయడుబావ బాగున్నాడా కోడలా?

కాంతమ్మ — రాయడుబావ బాగున్నాడా, వెంకన్న బావ బాగున్నాడాతల్లీ?

బంగారమ్మ — వాళ్లిద్దర్నే అడిగావేం?

కాంతమ్మ — అదోజట్టూ. వెంకన్న పోకుండలు తెచ్చాడు. రాయడు మిఠాయి తెచ్చాడు.

ప్రకాశం — ఇంకాయెవరున్నారూ అడగడానికి?

బంగారమ్మ — యెవరేనా వుంటారు.

ప్రకాశం — అడిగినవాళ్ల సంగతి చెప్పమంటే యెవరో వున్నారంటావేం?

కాంతమ్మ — అడిగినదానికి జవాబుచెప్పుతల్లీ!

బంగారమ్మ — యిద్దరికీ తేడావుంది.

ప్రకాశం — ఏమిటది?

కాంతమ్మ — మాతల్లి చాలాదూరం ఆలోచిస్తుందండీ. సరిగ్గాచెప్పమ్మా.

బంగారమ్మ — మట్టిబెడ్డవొకటీ, గాజుపూస వొకటేనీ.

ప్రకాశం — అంటే?

బంగారమ్మ — కొండముచ్చువొకటీ, పండుకోతి వొకటేనీ.

ప్రకాశం — అసలే తెలవలేదూ.

బంగారమ్మ — గాడిదవొకటీ, గుఱ్ఱంవొకటేనీ.

కాంతమ్మ — అదేమిటితల్లీ? తెనిగించిచెప్పమ్మా.

బంగారమ్మ — ఏంవుందనిచెప్పమంటావే? పీనుగు వొకటీ, ఏనుగు వొకటేనీ.

ప్రకాశం — ఏనుగు మంచిదేకదూ?

బంగారమ్మ — సింహందగ్గిర యేనుగు తీసికట్టు కాదుటండీ మామయ్యగారూ?

ప్రకాశం — సింహంయెవరూ?

బంగారమ్మ — మీరిద్దర్నే అడిగారు మరి.

కాంతమ్మ — దొరకదు మా అమ్మ.

ప్రకాశం — ఇప్పు డడుగుతున్నాను. సింహం యెవరోచెప్పు

బంగారమ్మ — ఎందుకోసమోచెప్పండి.

కాంతమ్మ — రాయడుబావని పెళ్లాడతావా తల్లీ?

ప్రకాశం — పోనీ, వెంకన్న బావనో?

బంగారమ్మ — (చురచురచూస్తూ కళ్లల్లో నీళ్లు పెట్టుకుంటుంది.)

ప్రకాశం — అదేమిటె బంగారం? కోపం వచ్చిందా? యేం?

బంగారమ్మ — నాకర్మం (దుఃఖిస్తుంది.)

కాంతమ్మ — అడిగింది యిష్టమోకాదో చెప్పాలిగాని యేడుస్తారా తల్లీ? ఇలారా అమ్మా!

(తెరలో: 'బంగారం! తలుపు')

బంగారమ్మ — మా పేరుభట్టుబావతో చెబుతానుండండి., (కళ్లు నులుముకుంటూ వెళ్లిపోతుంది.)

కాంతమ్మ — చూశారా అన్నయ్యగారూ?

ప్రకాశం — నా దేవతప్పా. అందమూ చందమూ, కష్టమూ సుఖమూ, మంచీచెడ్డా తెలిసినపిల్ల. తారతమ్యం బాగాకనిపెట్టింది. వెంకన్న పీనుగూ, రాయడు యేనుగూనా? పైగా సింహంవుందా? అతగాడెవరూ? కనిపెట్టారా అక్కయ్యగారూ?

కాంతమ్మ — పేరుభట్టేనండీ.

ప్రకాశం — అవునవును. సందేహంలేదు. మనం చేసిన నేరం అతనితో చెబుతుందిట. యెంతతీవ్రమైన ఆఘాతమూ? అక్కయ్యగారూ! కోపలు చూపు మంచిచోటే పడింది. సుఖపడతంది.

కాంతమ్మ—ఏమంటారన్నయ్యగారూ ?

ప్రకాశం—ఆలోచించవద్దు.

కాంతమ్మ—మీరేదిక్కు—నాకూ నాబిడ్డకీనీ.

ప్రకాశం—అందరికీదిక్కు భగవంతుడున్నా డు. మరోసమ్మంధం మాడవద్దు.

కాంతమ్మ—మీయిష్టం.

ప్రకాశం—వాళ్లసంభాషణ వినాలి.

కాంతమ్మ—పదండి.

(ఇద్దరూ వెళతారు)

నాలుగోరంగం

[బంగారమ్మ తలుపుతీస్తుంది. పేరుభట్టు లోపలికి వస్తాడు.]

పేరుభట్టు—మొగం అలావుందేం ? ఏంబంగారం అలావున్నావేం ?

బంగారమ్మ—(మొగమువంచుకుని దుఃఖిస్తుంది)

పేరుభట్టు — అదేమిటిబంగారం ? (ఆమెని పొదివిపట్టుకొని అక్కడవున్న బల్లమీదకూచుని ఆమెని కాళ్లలో యిరికించుకొని ముంగుర్లు దువ్వుతూ) ఊరుకో. యెందుకేడుస్తావూ ?

బంగారమ్మ—(మరింత దుఃఖిస్తుంది.)

పేరుభట్టు—చూడూ ! ఇంతదుఃఖం యెందుకు వచ్చిందీ ? ఎవరేంచేశారూ ?

బంగారమ్మ—మాఅమ్మా, ప్రకాశంమామయ్యగారూ—

పేరుభట్టు—ఏంచేశారూ ?

బంగారమ్మ—మాఅమ్మ రాయణ్ణిపెళ్లాడతావా అంది. వెంకన్నని పెళ్లాడతావా అన్నారు మామయ్యగారు.

పేరుభట్టు—అయితే ?

బంగారమ్మ—ఏడుపువచ్చింది.

పేరుభట్టు—వారలాఅడిగితే ఆడతాననో, ఆడననో కచ్చితంగా చెప్పెయ్యాలిగాని యేడవడం యెందుకూ ?

బంగారమ్మ — నన్నువెంకణ్ణి పెళ్లాడమంటారా ?

పేరుభట్టు—అంటే ?

బంగారమ్మ—ఛా ! వెంకన్న చచ్చుపెద్దమ్మ. రాయడు—మొగంనిండా స్ఫోటకంమచ్చలూ వాడూ గంతేసిన తిరగటిరాయిలాగ యేంబాగున్నాడూ ?

పేరుభట్టు—నాకక్కర్లేదని చెప్పలేకపోయావా యిష్టం లేకపోతే ?

బంగారమ్మ—వాళ్లకి తెలవకూడదూ ?

పేరుభట్టు—వేళాకోళాని కన్నారేమో.

బంగారమ్మ-ఇలాంటిదా వేళాకోళం అంటేను ?

పేరుభట్టు—(స్వగతం) బంగారాని కిష్టంలేదు కనక మనకి వెంకన్నపోటీగాని, రాయడుపోటీగాని వుండకపోవచ్చు. అయితే వాళ్లపోటీ లేకపోతేమాత్రం నామీద యిష్టంకలగవద్దూ ?......ఇదంతా యిష్టం లోనే జమఅవుతుందా ?......ఒకబెంగ తీరింది. చివరికి అన్నిబెంగలూ ఇలాగే తీరిపోకూడదూ ?

బంగారమ్మ—బావోయి ! వోమాటు వెంకన్న నన్ను పెళ్లాడతానంటూ (నవ్వుతూ) పో-కుం-డ-

పేరుభట్టు—ఏంచేశాడూ ?

బంగారమ్మ—పోకుండలు (నవ్వి) నాకోసమే తెచ్చాట్ట. హిహిహీ. అవ్వేమిటిబావా ?

పేరుభట్టు—అది పూర్వకాలపు పిండివంట. ఇప్పుడది తీసికట్టు. అప్పుడు నువ్వేంచేశావూ ?

బంగారమ్మ—"పో అవతలికి. ఇంకానుంచుంటావేం" అన్నాను.

పేరుభట్టు—తప్పుగాదూ ?

బంగారమ్మ—లేకపోతే నన్ను పెళ్లాడతానంటాడేం ? చెయ్యి పట్టుకోపోయాడుకూడానూ.

కంయిమనేటప్పటికి అడిలి బేజారై పోయాడు. వాడికి కాళ్లుకడుక్కోడానికి నీళ్లుకూడా యివ్వాలిట నేను.

పేరుభట్టు—పాపం ఆశించివచ్చాడు కామోసు, యివ్వలేకపోయావా ?

బంగారమ్మ—వస్తాడు, వస్తాడు. సిగ్గులేకపోతే సరీ.

పేరుభట్టు—సిగ్గెందుకూ బంగారం ?

బంగారమ్మ—మాయింటో దాసీదాని కూతురేనా వాణ్ణి పెళ్లాడను.

పేరుభట్టు—రాయణ్ణో ?

బంగారమ్మ—వూరుకో బావా ! మళ్లీ అడిగావంటే నాకు కోపంవస్తుంది. మామయ్యగారితో యివాళ మాట్లాడను. ఇవాళరాత్రి మాఅమ్మదగ్గిర పడుకోను.

పేరుభట్టు—(ముక్కుమీద వేలు పెట్టుకొని) యెంతతప్పూ ? నువ్వలా చెయ్యవచ్చునా ?

బంగారమ్మ—నన్నలాఅనడమేం?

పేరుభట్టు—నారికి నీమీదకోపమా?

బంగారమ్మ—కోపంకాదు. నిజమే. వేళాకోళం అయితేమాత్రం అలాగాచెయ్యడం?

పేరుభట్టు—నువ్వలా పంతంపట్టుకుని కూచో కూడదు.

బంగారమ్మ—యివాళ అస్తమానూమానేసి, రేపు పొద్దున్న చీకటితోటేవెళ్లి దణ్ణంపెట్టి, యెప్పుడూ అలా అనవద్దని మాట్లాడతానులే.

పేరుభట్టు—నువ్వు నేనుచెప్పినమాట విన్నదేదీ యింతవఱ్ఱకి?

బంగారమ్మ—వూరుకుంటూ బావా నువ్వూ.

పేరుభట్టు—నాతో మాట్లాడ్డంకూడా మానేస్తావాయేమిటి?

బంగారమ్మ—అ-మ్మ-బాబో ! నిన్నుచూడకపోతే నేవుండలేనూ.

పేరుభట్టు—హాయిహాయి ! (గుచ్చికౌగిలించుకొని) దయవుందికనక. అయితే నామాటవినవూ ?

బంగారమ్మ—యింతపట్టు పడుతున్నావేమిటి బావా యివాళా?

పేరుభట్టు—తప్పుకాదూ?

బంగారమ్మ—(చిరునవ్వుతో) పట్టుపట్టడమేనా?

పేరుభట్టు—అవును. మాట్లాడనని.

బంగారమ్మ—అదాఅమ్మా? ఓహో!

పేరుభట్టు—యిలాచూడూ.

బంగారమ్మ—యేం? (చూస్తుంది)

పేరుభట్టు—మాబంగారం నామాటవింటుంది. తీసెయ్యదు. ఆవీథిని అలాచెప్పుకుంటున్నారు.

బంగారమ్మ—వాళ్లబంగారం వొక్కొక్కప్పుడు వాళ్ల పేరుభట్టుబావమాట వినకపోవడంకూడా వుందని ఆర్యాపురంలో చెప్పుకుంటున్నారు బావోయి!

పేరుభట్టు—మాశావా ? పోనీ.

బంగారమ్మ—ఆ. పోనీ. పోనీ. మాట్లాడతానులేబావా ! ఏం ?

పేరుభట్టు—నువ్వు నాకు నచ్చినదానవు. మీ అమ్మ నువ్వు మాట్లాడకపోతే అన్నంతింటుందా ? పచ్చిమంచినీళ్లేనా తాగుతుందా? ప్రకాశంగారు యెన్ని విధాల కనిపెడుతున్నారూ ? ఆయనతో మాట్లాడకపోతే కృతఘ్నతకాదూ ?

బంగారమ్మ—మాట్లాడతానన్నాను కాదూ ? ఊడంఢకంఅంతా యెందుకూ యింకా ?

పేరుభట్టు—అయితేసరే, నేను స్నానంచేసి వస్తా నింటోకిపద.

బంగారమ్మ—నూతిదగ్గిర చెయ్యిబావా ? నేను నీళ్లుతోడతానులే.

పేరుభట్టు—నువ్వు నీళ్లుతోడితే నీచేతులు లాగుతాయి బంగారం !

బంగారమ్మ — నీవుతోడితే యెంతో బాగుం టుందిబావా! ఎన్నినీళ్లైనా తోడెయ్యగలను యించక్క. మరిలే. సబ్బుతెస్తాను పద నూతివగ్గిరికి.

పేరుభట్టు—నువ్వువచ్చేదాకా నేను నీళ్లు తోడుతూవుంటాను. ఏం?

బంగారమ్మ— నేనొప్పుకోను, నేనే తోడతాను. నీళ్లుతోడాక సబ్బుతెస్తాను. రా. (చెయ్యి పట్టుకుం టుంది.)

పేరుభట్టు —తోడుకోనులే, సబ్బుపట్టుకురా.

బంగారమ్మ—(చెయ్యివిడిచిపెట్టి, రెండడుగులు వేసి) తోడుకున్నావంటే నేను వొప్పుకోనుసుమా, నన్ను చంపుకుతిన్నట్లే. వొట్టుపెట్టనా?

పేరుభట్టు—దీనిపేరేమిటో?

బంగారమ్మ—మరినువ్వు తోడుకుంటాననడ మేం? (వెళ్లిపోతుంది.)

పేరుభట్టు— (బొక్కావిప్పుతూ) బంగారం భావం యేమిటి? నేను భ్రాంతిపడుతున్నానా? నా దగ్గిర యేంవిశేషంవుందీ?.........చివరికేమయినా పెండ్లాడే అటోయిటో తేలిపోతే బాగుండును. (వెళ్లి పోతాడు.)

(అప్పుడు కాంతమ్మ, ప్రకాశమూ వస్తారు)

ప్రకాశం—యెంతకోపంవచ్చిందీ కోడలికి?

కాంతమ్మ—యేమీ యెరగనిపిల్ల. మరోలాగ అనుకోకండి అన్నయ్యగారూ!

ప్రకాశం—అనుకోడం యెందుకూ? నేనన్నది తప్పుమాటే.

కాంతమ్మ— (చేతులుజోడించి) తండ్రిలేని పిల్ల. తప్పుపట్టుకోకండన్నయ్యగారూ!

ప్రకాశం — అదేమిటక్కయ్యగారూ? ఇం దులోతప్పుకి యేంవుందీ? నేనే మాట్లాడిస్తాను ముందు.

(అప్పుడు సబ్బుపెట్టెపట్టుకొని బంగారమ్మ వడిగావస్తుంది)

బంగారమ్మ—పదబావా! (చూసి) మాబావ యేడండీ మామయ్యగారూ?

ప్రకాశం—నేను చూడలేదమ్మా.

బంగారమ్మ—యేమేఅమ్మా?

కాంతమ్మ—నూతికి వెళ్లాడుతల్లీ!

బంగారమ్మ—నీళ్లుతోడుకుంటున్నాడు కామో సు. అలాచేస్తే యెరగడూ? (వెళ్లిపోతుంది.)

కాంతమ్మ—బిడ్డ తప్పుదిద్దుకుంది. క్షమించాలి మీరు.

ప్రకాశం—అలాఅనకూడదు మీరు. బంగారం క్షణక్షణమూ నన్నోడించేస్తోంది. ఏమీ సమాధానం చెప్పలేకుండావున్నాను. నాకు చాలా ఆనందంగా వుంది.

కాంతమ్మ—ఆశీర్వదించండి.

ప్రకాశం—అవశ్యమూనూ. మరి బజారులో పనివుంది వెళ్లివస్తాను.

కాంతమ్మ—వెళ్లిరండన్నయ్యగారూ!

ప్రకాశం—భోజనంచేసి మళ్లీ కనపడతాను లెండి. (వెళ్లిపోతాడు.)

కాంతమ్మ—(స్వగతం) చిట్టితల్లి వరస యిలా వుంది. (దుఃఖంతో) తండ్రిలేనిపిల్ల అయిపోయింది.

(తెరదించాలి)

అయిదోరంగం

[హాలులో బీరువాపక్కన బంగారమ్మ కూచుని వుంటుంది. సుమ్మంయెక్కి సూటిగాచూస్తూ లోపలి తలుపుకేసి వెళ్లేవారికి ఆమెకనపడదు.]

బంగారమ్మ—పాపం నిన్నరాత్రల్లా కష్ట పెట్టాను బావని. మొదట బధ్ధకించాడు; గాని చివరికి మూడుకాలాలూ ఫిడేలుమీద అలవాటయీదాకా నేర్పాడు పాపం. శ్రీరాగంవర్ణం మాబాగావుంది. ఇది బావపాడితే మరీబాగుంటుంది. అతను ఫిడేలు మీదవాయిస్తే—వూరికే పాకిపోతుంది. బావ యెంత

మంచివాడూ? నాకోసం యెంత కష్టపడుతున్నాడూ? వారాలు చేసుకుంటాడు; కాని యెన్నివిధాల బతిమాలినా—తనే యెదర బతిమాలుతాడుకూడాను. ప్లీడర్లూ, వుద్యోగస్థులూ, భాగ్యవంతులూ పిలిచి భోజనం పెడుతూవుంటే కాళ్లతో తన్నేసుకోడంకానయితే మంచిదికాదు. నిజమే. అయితే కల్లీబొల్లీమంటూ కబుర్లుచెప్పుకుంటూ అతనిదగ్గిరకూచుని తిందామంటే నాకు యోగంలేకుండావుంది. ఎప్పుడో వొకమాటు యీమాట నోరుజారి అనేటప్పటికి లడ్డూ, హల్వా, మైసూరుపాకూ, బాసండీ, జహాంగీరూ—యిలాంటివి తెచ్చి, వొళ్లోకూచోబెట్టుకుని "మరితినూ, కబుర్లు చెప్పూ" అంటూ కవ్వించడం మొదలుపెట్టాడు. యెంతమంచివాడమ్మా బావా? పాటపాడేటప్పుడు ఆ కళ్లు తిప్పుకుంటూవుంటే, ఆకంఠం ఖంగుమనిమోగుతూ వుంటే, ఆకథలు చెబుతూవుంటే—బావని విడిచివుండడంకష్టమే.

(అప్పుడు పేరుభట్టు వొకకండువాలచాపు పట్టుకొనివస్తాడు.)

బంగారమ్మ—(స్వగతం) అడుగోబావ. కాస్సేపు మాట్లాడకుండా కూచుంటాను. ఏంచేస్తాడో చూద్దాం. ఆకొత్తబట్టయేమిటో?

పేరుభట్టు—(స్వగతం) ఇంకాభోజనాలు కాలేదు. తలుచుకోండీ యివాళ యీవిందునాకు. కండువాలచాపు చాలామంచిదీ. (చూసి) సేలంకండువాలా యేమిటి? ఆఅడావడిలో చూడేలేదు తిన్నగాను. భేష్! బంగారానికి వల్లెవాటువేసుకోడానికి మహా బాగుంటాయి! ఇవాళ రథసప్తమికనక యీపండుక్కి కూడా యేదో కొత్తవస్తు విచ్చినట్లవుతుంది. బాగానే కుదిరిందిపదకం......ఇచ్చిందాకా తోచదూ. పిలిస్తే తొరగానేనా అన్నంతినివస్తుంది. (తలుపు నెమ్మదిగా తట్టి) బంగారం!

బంగారమ్మ—(స్వగతం) అప్పుడే పలగ్గూడదు.

పేరుభట్టు—(మళ్లీతట్టి) ఓరత్నమాణిక్యం!

బంగారమ్మ—(స్వగతం) ఇంకా యేమంటాడో అననీ. ఏదోతెచ్చాడు. అందుకోసమే యీతొందర.

పేరుభట్టు—ఓవెండీ!

బంగారమ్మ—(స్వగతం) చివరికి తగరంఅనీ, సీసంఅనీ అంటాడేమో కొంపతీసి.

పేరుభట్టు—(మళ్లీతట్టి) మామయ్యకూతురా!

బంగారమ్మ—(స్వగతం) మార్చేశాడు ఇంకా యేమంటాడో?

పేరుభట్టు—(మళ్లీతట్టి) మరదలా!

బంగారమ్మ—(స్వగతం) యిదీ బాగానేవుంది.

పేరుభట్టు—యింటోవున్నట్టా, లేనట్టా?

బంగారమ్మ—(స్వగతం) చెప్పుకో చూస్తానూ.

పేరుభట్టు—బావమరిదీ!

బంగారమ్మ—(స్వగతం) ఇది మరీబాగుంది. ఇకపలికేస్తాను. పాపం, బావకి గొంతుకు నెప్పిపెడుతుంది.... పోనీ, యింకా స్తసేపు చూస్తాను.

పేరుభట్టు—ఓరేబావా!

బంగారమ్మ—(స్వగతం) ముద్దినుపేర్లూపెడుతున్నాడు పాపం. ఇంకోమాటుకూడా చూస్తాను. పోనీ పలికేస్తే? ఉండడం కష్టంగా వుంది......ఇంకా యెంతచక్కని పేర్లు పెడతాడో పెట్టనీ.

పేరుభట్టు—వోసంగీతపాఠకురాలా!

బంగారమ్మ—(స్వగతం) తనకంటేనా?

(తెరలో)

వాకిట్లో లేదుటోయి?

పేరుభట్టు—లేదత్తా!

(తెరలో)

దొడ్లోవుందేమో యింకోమాటుపిలు. లేకపోతే నేను చూసివస్తానుండు.

పేరుభట్టు—(మళ్లీతలుపుతట్టి) బంగారంపంతులుగారూ!

బంగారమ్మ—(తటాలున లేచివచ్చి) యెందు కండీ పేరుభట్టు శాస్తుల్లుగారూ!

పేరుభట్టు—ఇందాకణ్ణుంచీ యెక్కడున్నావు చిలిపిల్లా?

బంగారమ్మ—అప్పుడే చత్వారంవచ్చిందా యేమిటి పెంకిపిల్లాడా?

పేరుభట్టు—ఏంచేస్తున్నావూ మరి పలక్కుండానూ?

బంగారమ్మ—(ఎదటికివచ్చి రెండుచేతులూపట్టుకొని) నువ్వేంచేస్తావో చూద్దామని వూరుకున్నాను బావా! గుట్టుకిపడి వూరుకున్నానుగాని మహాకష్టం అయిందిసుమా! అదేమిటిబావా?

పేరుభట్టు—నీకోసమే తెచ్చాను యీకాండువాల చాపు. వల్లెవాటు వేసుకోడానికి బాగుంటాయేమో చూడూ.

బంగారమ్మ—(పుచ్చుకొని చూస్తూ) నిక్షేపంలా వున్నాయి; కాని యెప్పుడూ యేమీ తేవద్దంటే యెందుకు తెచ్చావుబావా?

పేరుభట్టు—కొన్నానా యేమిటి?

బంగారమ్మ—మరెలా వచ్చాయమ్మా?

పేరుభట్టు—ఆవీధిని వొకప్లీడరుగారి కొడుక్కి పెళ్లి. ఇవాళ జామార్లుకట్టుకున్నారు. అవతలా ప్లీడరుగారే, యివతలాప్లీడరుగారే. ఇద్దరికీ నామీద అభిమానమే. వీరు కూడా తీసుకువెళ్లారు. వారు ఆదరించి బహుమతీ యిచ్చారు.

బంగారమ్మ — నువ్వు నాకు బహుమతీ చేస్తున్నావు.

పేరుభట్టు—నువ్వు పరీక్ష చేస్తున్నావు.

బంగారమ్మ—నాకోసం అస్తమానూ డబ్బు ఖర్చుపెడుతూ వుంటే చెయ్యనాయేమిటి?

పేరుభట్టు—చేస్తే చేశావుగానీ, వల్లెవాటు వేసుకురా ముందూ.

బంగారమ్మ—వేసుకుంటానుగాని ఆపెళ్లిలో నువ్వేంచేస్తావు బావా? ఆడపెళ్లివారిలో చేరతావా, మొగపెళ్లివారిలో కూడతావా?

పేరుభట్టు—రెండువేపులా పెద్దనే నేనూ. అయితే: నాపెళ్లిలో నువ్వేంచేస్తావో చెప్పూచూద్దాం.

బంగారమ్మ—నేనా—నేనా—మరీ—మరీ—

పేరుభట్టు—తొరగాతెల్పూ.

(తెరలో)

నీతోకూడా పెళ్లిపీటమీద కూచుంటుంది.

(సరిగ్గా యీసమయంలో ప్రకాశంవస్తాడు. బంగారమ్మ చెయ్యివిడిపించుకొని యింటోకివెళ్లిపోతుంది.)

ప్రకాశం—ఏంచేస్తావు కోడలా? నుంచో—వెళ్లిపోతావేం?

పేరుభట్టు—ఎంతమంచిమాటా? ఎన్నాళ్లకి వినపడిందీ? ఎంత అనుగ్రహంవచ్చిందీ అత్తకిప్పటికీ? చాలు నాకిది. నేను పుణ్యమేచేసుకున్నాను. నాబంగారం నాకు తక్కింది.

(అప్పుడు కాంతమ్మ బంగారమ్మని చెయ్యిపట్టుకు తీసుకువస్తుంది).

కాంతమ్మ—అంతసిగ్గెందుకే? బావకొత్తవాడా యేమిటెనీకు? ఇందాకటిదాకా యెలాంటిబావో యిప్పుడుమాత్రం అలాంటి బావకాదూ పేరుభట్టు నీకూ? "పేరూ" అనివొకమాటూ, "భట్టూ" అనివొకమాటూ, "నీపేరు భట్టూ" అని యింకోమాటూ, "మాబావ పేరు భట్టూ" అనిమరోమాటూ, "భట్టుపేరు బావా" అని యింకొకమాటూ—యిలాగ చెవులుపట్టుకుని ఆడించేదానవు కాదుటే, ఇప్పుడు సిగ్గుపడతావూ? సమయానికి పిలిచినట్టు మామయ్యగారుకూడా వచ్చారు దణ్ణం పెట్టమ్మా! (అని అతనిదగ్గిరికితీసుకువెళ్లి) ఇలాఅన్నా నన్నయ్యగారూ! నాబిడ్డ అతనికి తగిందికాదు గానీ—

ప్రకాశం—చాలా మంచిపనిచేశారండీ అక్కయ్యగారూ! వరుడికితగినవధువూ, వధువుకితగిన వరుడూనూ. ఇకతాహతా—?

పేరుభట్టు—అదినేను సందేహించవలసిన విష యం. ఎటుచూసినా బంగారానికినేను తగను—కానీ—

ప్రకాశం—అక్కయ్యగారి మాటా మీమాటా కూడా నాకులెక్క లేదు. ఏమంటే? మాకోడ లిదివరకి వొకపేనుగనీ, వొకయేనుగనీ యేరిపారేసింది ఇక యెక్కడో సింహంవుందిట. ఆసింహం యెవరో యిప్పుడు తేలాలి. ఏంకోడలా? యేమంటావు? సింహం—

కాంతమ్మ—(మందహాసంతో) చెప్పవేతల్లీ!

బంగారమ్మ—(తలవంచుకొని చిరునవ్వునవ్వి వూరుకుంటుంది.)

ప్రకాశం—చెబితేగాని నేను వొప్పుకోను. ఇది వరకి మాట్లాడితే నన్ను వోడించేసేస్తున్నావు. యిప్పుడు_

కాంతమ్మ—తప్పుకాదుటే అలావూరుకుంటావూ? చెప్పమ్మా!

బంగారమ్మ—(అలాగే చిరునవ్వు నవ్వుతూ వొకమాటు మొగంయెత్తి ప్రకాశానికి నమస్కారంచేసి మళ్లీ తలవంచుకొంటుంది.)

ప్రకాశం—ఇందాకా మీఅమ్మగారు దణ్ణం పెట్టమన్నందు కిప్పుడైనా పెట్టావు. సంతోషమే. కాని చెప్పేదాకా నేను వొప్పుకోను.

కాంతమ్మ—పోనీ, చెప్పలేకపోతే చూపించు తల్లీ!

బంగారమ్మ—(చిరునవ్వుతో పేరుభట్టుకేసి చూసి మళ్లీతలవంచుకొంటుంది.)

ప్రకాశం—అన్నా! ఎంతదానవై నావుకోడలా? ఎక్కడ, యెప్పుడు నేర్చుకున్నావూ ఈసిగ్గంతానూ? వెంకన్న!బావని కంయిమని కసిరినప్పు డీసిగ్గంతా యేమై పోయిందీ?

కాంతమ్మ—అన్నయ్యగారూ! మీకుసమాధానం చెప్పగలదా నాబిడ్డా?

ప్రకాశం—ఇంతకంటే యేం చెప్పాలీ? యెవరు చెప్పగలరూ? చాలామంచిపని చేశారు మీ అక్కయ్య గారూ! ఈమాట వినడానికి నేను చాలారోజులనుంచి యెదురుచూస్తున్నాను. పేరుభట్టుగారు మీయింటికి మొట్టమొదట భోజనానికి ఉండిపోయినరాత్రి బావ గారూ నేనూ యీమాటే అనుకున్నాం. బావగారి వుద్దేశాన్ని మీరు అక్షరాలా నెరవేర్చారు.

కాంతమ్మ—ఆయనవుంటే యెంతఅందంగా వుండు నన్నయ్యగారూ యిప్పుడూ?బిడ్డ కన్నిముచ్చట్లు తీరును? అంత అదృష్టం నాకు లేందే తండ్రీ!

పేరుభట్టు—నామాట చెప్పండి బాబుగారూ! మావాళ్లకీ మామామయ్యగారికీ చాలారోజులనుంచి మాట ల్లేవు. నేను విజయనగరంలోనూ, అక్కడావుండి పోయాను కనక విరోధంతో సంబంధం లేకపోయినా_ దూరదృష్టి లేకపోవడంచేత యీవూళ్లో వుండికూడా_ బంగారం ఆవేళపిలవడం యిలాంటి అదృష్టం నాకు సంభవిస్తుందనడానికి సూచనకామోసు—

కాంతమ్మ—పేరుభట్టు పిలవగానే వస్తాడని మాకెంతమాత్రమూ నమ్మకంలేదు. తీరా పిలిస్తే చిన్న పుచ్చుకోవలసివస్తుందేమోనని బిడ్డని వద్దనికూడా మేం బోధించాం; కాని అది—

పేరుభట్టు—బంగారం పిలిచినప్పుడు గుమ్మం లోకి రావడానికి మొదట నాకు మొగంచెల్లిందికాదు, ఏమంటే? మొదట నేను పలకరించవలసినవాణ్ణి. అలా చెయ్యనందుకు సిగ్గుపడిపోయి తటపటాయించాను. మామయ్య నన్ను పిలిచి సిగ్గుపోగొట్టాడు కనక—యింతకీ అప్పుడు బంగారం నన్ను తానై పిలవడం వరంయిచ్చిన ట్లుంది.

ప్రకాశం—నిజంగా యీసంతోషం అంతా నాదీ. ఏమంటే? బంగారాన్ని పెళ్లాడ్దాని కనేకమంది వుబ్బూతలూగుతున్నారు. కోటమ్మగారి మాటకేంగాని రత్తమ్మగారు తపస్సే చేస్తున్నారు. ఇంకా యిద్దరు ముగ్గురు నాస్నేహితులుగూడా వూగిసలాడుతున్నారు; గాని భగవంతుడు మీయిద్దరికీ ఘటనకూర్చాడా లేదా అని నేను తహతహలాడిపోతున్నాను. ఇంకోపిల్ల మీకు

పనికిరాదు. ఇంకోపిల్లాడు బంగారానికి పనికిరాడు. మీదాంపత్యం దేవతలికికూడా లోభంపుట్టించగలదు.

కాంతమ్మ—అన్నయ్యగారూ! మీబావగారి వుద్దేశం నేను చాలామట్లు గ్రహించాను. ఆయన యీ సంగతి నన్ను మనస్సులో పెట్టుకోమన్నారు. అయితే పేరుభట్టువొప్పుకుంటాడో వొప్పుకోడో—

పేరుభట్టు—బంగారాన్ని తిరస్కరించడంఅంటే మానవత్వం లేదన్నమాట. హృదయంగలవాడెవడూ నీమాతుర్ని వద్దనలేడు. పైగా పీసపాటివారి మర్యాదని గురించీ, ఔదార్యాన్ని గురించీ, సాంప్రదాయాన్ని గురించీ యెవరికీ సందేహాలుపుట్టవు. బాబుగారూ! నిజంచెబుతున్నాను నేను. రాయడుకోసం మారత్తమ్మ పిన్నీ, వెంకన్నకోసం మాకోటమ్మదొడ్డమ్మా చేసే ప్రయత్నాలు నేను చాలామట్లు చూశాను. దాంతో నాకు మనస్సుమనస్సులో వుండటంలేదు. బంగారం యెక్కడ పైకిదాటిపోతుందోఅని నేను నిద్రాహారాలెరక్కుండా తపించిపోతున్నాను.

కాంతమ్మ—నాయనా! ఏంచెప్పనూ? నేనేం చెప్పగలనూ? దిక్కులేనివాళ్ల కిలాంటి కోరిక లుండకూడదు. నిజంచేత తాహతుమాలినపరుసులు మంచివి కావుగాని—.అయినా ఆశకి అంతమూ తారతమ్యమూ తెలవదుకామూ? కట్నా లివ్వలేను, కానుక లివ్వలేను, ముద్దుమురిపాలు తీర్చలేను. పండుగునాడు పప్పూ అన్నమూ అయినా సరిగ్గాపెట్టలేను. నాపిల్లని నీ కిస్తున్నాను. అందం లేకపోయినా, తెలివితేటలు లేకపోయినా, మేనమామకూతురుగనక అభిమానించుకొని, నాచిట్టితల్లిని (బంగారమ్మచేతిని పేరుభట్టుచేతిలో వుంచి) అన్నయ్యగారూ! ఆశీర్వదించండి.

ప్రకాశం—సర్వేశ్వరుడు ఈనూతనదంపతులికి సకలసంపదలూ సమకూర్చుగాక. అక్కయ్యగారూ! ఈశుభసన్నివేశాన్ని యింతటూకీగా ముగించకూడదు. మీవొదెన్ని తీసుకువస్తాను. తాంబూలాలు యిప్పుడే అయిపోవాలి.

కాంతమ్మ—అలాగే చెయ్యండన్నయ్యగారూ!

పేరుభట్టు—అవకాశంవుంటే చెప్పండి బాబుగారూ! నాస్నేహితుల్ని పిలుచుకునివస్తాను. రెండు గంటలు వ్యవధివుంటే అన్నీ సక్రమంగా జరిగించవచ్చు.

కాంతమ్మ—ఆలోచించండన్నయ్యగారూ!

ప్రకాశం—పంచాంగంచూసి చెబుతాను. (గోడనున్న పంచాంగంతీసిచూసి) బాగుంది. సాయంత్రం ఆరున్నరగంటలవేళ అమృతఘడియలు వస్తాయి. అప్పుడు ముహూర్తంకూడా రాసివుంది. యీలోపుగా తరవాయిలన్నీ తీర్చుకోవచ్చు. పేరుభట్టుగారూ! మీరు వెళ్లి అదేదోచూడండి.

పేరుభట్టు—చిత్తం. (కాంతమ్మకీ, ప్రకాశానికీ పాదాభివందనంచేసి వెళ్లిపోతాడు.)

కాంతమ్మ—బజారుకివెళ్లి జామారుకూడా తెస్తారా అన్నయ్యగారూ?

ప్రకాశం—అలాగేతెస్తాను. ఈలోపుగా మీరు కోడలికి అభ్యంగనం చేయించండి. పేరుభట్టుగారికి మాయింటో చేయిస్తాను. మరి వెళ్లివస్తాను. (వెళ్లిపోతాడు)

కాంతమ్మ—గావేతల్లీ! (బంగారమ్మచెయ్యి పట్టుకొని యింటోకి తీసుకువెడుతుంది.)

ఆరో అంకం

మొదటిరంగం

[భద్రయ్యబస. పేరుభట్టు రెండుచేతులతోటీ ద్వారబంధపుకమ్ములు పట్టుకొని యివతలే నుంచుని వుంటాడు. భద్రయ్య వొకకండువాకోసం రైలుసంచీ తిరగవేస్తూవుంటాడు.]

భద్రయ్య—ఆవేళ నువ్వు నన్ను కొట్టినంతగా సకలహంగామా చేశావు; కాని చివరికి నామాటే నిరుకయింది చూశావా?

పేరుభట్టు—నీకు పరేంగితజ్ఞానం యింతగా వుందన్నమాట.

భద్రయ్య—ఇంకా వొప్పుకోవాయేమిటి?

పేరుభట్టు—ముమ్మాటికీ వొప్పుకోను. నువ్వు ఆవేళ ఆమాట అనడం చాలాతప్పు. అప్పుడు నాస్థితి యెంతసున్నితంగా వుండిందో యిప్పటికికూడా నీకు బోధపడలేదు. ఇక కట్టిపెట్టు ఆప్రస్తావన.

భద్రయ్య—నేను కట్టిపెట్టను. అప్పుడు నే నామాటే అనివుండకపోతే మీఅత్తకి బంగారాన్ని నీ కివ్వాలనే ఆలోచనే కలక్కపోవును. ఈసంగతి నువ్విప్పటికికూడా గ్రహించలేకపోయావు. (ఒకకండువా తీసుకొని రైలుసంచీతాళం వేసేసి) అంతా నీప్రయోజకత్వంవల్లనే నెరవేరుతోందని గర్విస్తున్నావుకాబోలు పాపం. వేషాలు చాలించు.

పేరుభట్టు—అంటే యీసమ్మంధం నువ్వే—

భద్రయ్య—నేనే కుదిర్చానని ఘంటాపథంగా చెప్పవచ్చు; చెప్పగలనుకూడానూ. సందేహమేం?

పేరుభట్టు—సెబాస్! చాలా సంతోషించాను. అయితే యీకార్యంకూడా నువ్వేగట్టెక్కించి యీమాట కూడా తక్కించుకో.

భద్రయ్య—నువ్వలాకోరుతూవున్నపుడికఆలోచనకూడా యెందుకూ? చూసుకో యెంతదర్జాగా— అంటే—

పేరుభట్టు—డబ్బుకూడా మాటతక్కిస్తివా—

భద్రయ్య—తక్కిస్తునా, తక్కించి చూపిస్తునా?...... ఎందుకూ? (కండువా జందెప్పెట్టుగా వేసుకొని సవరించుకొంటాడు.)

పేరుభట్టు—తక్కించినంత మాట అన్నావు. అంతేఘాలు. ఈనాలుగురోజులూ నాకూడా తిరిగితివావనూలయినసొమ్మంతా నువ్విచ్చినట్లే జమ.

భద్రయ్య—అయితే, దానికి ఖర్చుపద్దుకూడా చెప్పూ, అదెలావుంటుందో విందాం.

పేరుభట్టు—“దంపతుల వివాహ మహోత్సవ సమయమందు బహ్మశ్రీ—

భద్రయ్య—ఆ! ఆ! కొంచెం వుండూ. (ఆలోచిస్తాడు)

పేరుభట్టు—పోనీ మహారాజశ్రీ—

భద్రయ్య—ఏదీ రెండూ కలుపూ.

పేరుభట్టు—బ్రహ్మశ్రీ, మహారాజశ్రీ—

భద్రయ్య—వూరుకుంటావేం?

పేరుభట్టు — బ్రహ్మశ్రీ, మహారాజశ్రీ, శ్రీయుత—

భద్రయ్య—(చెయ్యిజాడిస్తూ) బ-లే బ-లే!

పేరుభట్టు—వేమూరి భద్రయ్యఅనే భద్రాద్రి రామచంద్రశాస్త్రి పంతులు మహాశయుడుగారు వధువుకి కంఠాభరణం నిమిత్తమూ, వరుడికి హస్తాంగుళ్యాభరణం నిమిత్తమూ—

భద్రయ్య—ఏం? మొత్తం చదివేసెయ్యవోయ్!

పేరుభట్టు—అది నువ్వు తేల్చండే.

భద్రయ్య—అయితే, యింతవరకూ వచ్చాక యిక చచ్చేందుకూ? వెయ్యిన్నూటపదహార్లు అనేసెయ్యి.

పేరుభట్టు—ఔదార్యం అంటే అలావుండాలి. నిజంగా చేతిలో డబ్బున్నవా డింతమాట అనగలడా?

భద్రయ్య—అనగలడా కాదు. ఎవరేనా అంటే కూడా వినగలడా? అను.

పేరుభట్టు—వహవ్వా!.....పురాణధోరణిలో పడ్డాక సమయస్ఫూర్తి యెలా హెచ్చవుతోందో చూశావా?

భద్రయ్య — అదంతా నీచలవే. మరి నేను తయారూ.

పేరుభట్టు—నే నరుగే దిగాను.

(ఇద్దరూ గదిదాటి యివతలికి వస్తారు. భద్రయ్య గదికి తాళం వేసి శకునం చూస్తాడు.

పేరుభట్టు—చూడ నక్కర్లేదు. పూర్ణకుంభ ద్వయం!

భద్రయ్యా—వా! నెత్తిమీదబిందెలు తోణ కక్కుండా మహాలక్ష్మిగా నడుస్తున్నారోయి నాయనా పిల్లలూ. జేబు నిండిందన్నమాటే యివాళ. చూస్తావేం. అడుగువెయ్యి ముందుకి.

పేరుభట్టు—యశ్శివో నామరూపాభ్యాం—

భద్రయ్యా—యాదేవీ సర్వమంగళా.

పేరుభట్టు—తయో స్సంస్మరణా త్పుంసాం—

భద్రయ్యా, పేరుభట్టున్ను — సర్వతో జయ మంగళమ్.

(ఇద్దరూ గుమ్మందిగి వెళ్లిపోతారు)

రెండో రంగం

[కాంతమ్మయింటో పేరుభట్టు గది. జేబులో వున్న మూట తీసి, విప్పి, అందులో ఉన్నరూపాయలు చిక్కంలో పోస్తాడు.]

పేరుభట్టు— (స్వగతం, గర్వంతో) పేరుభట్టంటే రాజమహేంద్రవరంలో యింత గణ్యతఉందా? మూడురోజులప్రూట కే నాలుగువందలయెనభైరూపాయలు వసూలా? చెట్టు దులిపినట్లే. పాతికరూపాయలు లిగాడుపద్దూ. యాభైలు సర్వసామాన్యం. పెద్దమెట్టు నూటపదహార్లు. ఇంకో అయిదారువందలకి తక్కువ వస్తాయా ?......సన్నాయి అలాగా, భోగంమేళం అలాగా యేర్పాటయిందికదా? భేష్ ! ఇంకేం? ఫరవా లేదు. పెళ్లి సలక్షణంగానే జరుగుతుంది. (చిక్కం నూటుకేసులో వుంచి) అత్తకి నేను సంపాదిస్తున్నానని తెలుసు. కాని పరిమితి తెలవదు. ముందుముందు నేను బాగా సంపాదించగలననీ, సంసారం లోటు లేకుండా నిర్వహిస్తానని అనుకొంటూనే వుంది; కాని యిదివరకే బాగా జాగ్రత్తపడ్డానని బాగా యెరగదు. మనప్రయోజకత్వం వొక్కమాటు ఆనిడికి చూపించాలి. కనక పొట్టంకూడా పైకితీద్దాం. (ట్రంకుఅడుగునుంచి వొకపొట్టం తీసి తూచడం అభినయిస్తూ) మహాలక్ష్మీ! తెల్లవారి లేచి రోజూ వొక్కమాటు మొక్కితే యెక్కడికి వెళ్లినా యింత అన్నం దొరుకుతుంది. (రెండు చేతులతోటీ పట్టుకొని కళ్లకద్దుకొని) బంగారం యిప్పటిదాకా బావ బాగా పాడతాడనీ, అందంగా ఉంటాడనీ, సుఖపెడతాడనీ సంతోషిస్తూనేఉంది. అయినా ఆబావ వొట్టొట్టిబావ కాడని ఆమెకికూడా తెలియచెయ్యాలి. ఈపొట్టం చూసిందంటే ఆమె పొంగిపోతుంది. (ఆపొట్టంకూడా నూటుకేసులో పెట్టి మూటు నొక్కి, ట్రంకుతాళం వేసి నూటుకేసు పుచ్చుకొని బయలుదేరతాడు.)

(హాలు, మేడమీదనుంచి వస్తూ బంగారం కూడా పేరుభట్టులాగే అప్పుడే హాలులో అడుగుపెట్టి, పేరుభట్టుని చూసి సిగ్గుచేత వెనక్కి జంకుతుంది; కాని పేరుభట్టు ఆమెని గభీమని రెక్కపట్టుకొని బల్లదగ్గిరికి తీసుకువెళ్లి, నూటుకేసు బల్లమీద పెట్టి ఆమెని కాళ్లతో పెనవేసి బల్లమీద కూచుంటాడు. బంగారం విడిపించుకోడానికి ప్రయత్నిస్తూవుంటుంది. కాని చాలా సున్నితంగానే పెనగులాడుతుంది.)

పేరుభట్టు—(ఆమెమొగంమీద మొగంపెట్టి) ఏం? నీకూ నాకూ మాటలు లేవూ?

బంగారమ్మ—(తల వంచుకొంది. ఆనందం మొగంఅంతా ఆవరించివుంది; కాని మాట్లాడదు.)

పేరుభట్టు—(మెల్లిగా) ఇక్కడ యెవరూ లేరులే. దూరాన్నుంచేనా యెవరూ చూడ్డం లేదు. ఇలాచూడూ. (గడ్డంకింద చెయ్యిపెట్టి మొగం పైకెత్తుతాడు.)

బంగారమ్మ—(వెళ్లిపోడానికి చేసే ప్రయత్నాలు మానేస్తుంది. కదలదు; కాని కళ్లు మూసుకుంటుంది.)

పేరుభట్టు—మొగం పైకెత్తితే కళ్లుమూసుకుంటుం దేమిటో? (కళ్లమీదవూది) ఏం? ఈమాటు ఏం చేస్తావూ?

బంగారమ్మ—(మూడదు. కదలదు.)

పేరుభట్టు — చక్కలిగిల్లి పెడితే యేం చేస్తావూ? (పెడతాడు.)

బంగారమ్మ—(అతని చేతుల్లోనే యెగిరెగిరి పడుతూ గునుస్తూ) చూడవే అమ్మా!

పేరుభట్టు—మీఅమ్మ వచ్చి యేంచేస్తుందేమిటి నన్ను? బుద్ధిపూర్వకంగా నిన్ను మీఅమ్మే యిచ్చేసిందినాకు. మునపటిలాగ నే నిక జంకుతా ననుకున్నావేమో? మాచెల్లెలి నప్పగించానంటే అది పెళ్లయి అత్తారింటికి వెళ్లేదాకా ముక్కు నేలకెట్టి రాసేస్తుంది. కనక యిలాచూడు. వోమాటు చూడు. ఏదీ? కొంచెం. ఇంకా కొంచెం. (మెల్లిగా మొగం పైకెత్తుతాడు.)

బంగారమ్మ—(మళ్లీ బాగా కళ్లు మూసేసుకుంటుంది. నవ్వు వస్తోంది. కాని అణుచుకొంటుంది. అయినా పెదిమెలు విడతాయి. దంతాలు కొంచెం కనపడతాయి.)

పేరుభట్టు—నవ్వుతోంది. వచ్చేస్తోంది. పెదిమెలచివరికి వచ్చేసిందికూడాను. దొంగా! అణుచుకొంటున్నావా? ఏదీ? (గడ్డంపట్టుకొని బతిమాలుతూ) పైకి రానిచ్చెయ్యి. వొక్కమాటు. వొక్క క్షణం.

బంగారమ్మ — (మొగం వంచుకొంటుంది. అప్పుడు కాంతమ్మ వచ్చి మాట్లాడకుండా నక్కుతూ లోగుమ్మంలో నుంచుంటుంది. పేరుభట్టు అది కనిపెడతాడు; కాని చూడనట్టే వుంటాడు.)

పేరుభట్టు—(బంగారమ్మ మొగం పైకెత్తుతూ) మామయ్యకూతురవుగా మాత్రమే వున్నప్పుడు 'బావా, బావా' అంటూ యేమీ తోచనిచ్చేదానవుకాదు. పెళ్లయాక యేంవొరగతోస్తావో కాని యిప్పుడు మాట్లాడం, చివరికి కళ్లతోచూడ్డమే మానేశా వేంపుణ్యమే? పేరుకాకుండా పలుకే బంగారం అయిపోయిం దేమిటే కుందనబ్బొమ్మా!

కాంతమ్మ—జవాబు చెప్పమ్మా! తప్పుకాదూ? (బంగారమ్మ వులిక్కిపడుతుంది; కాని ఆలాగేనుంచుంటుంది)

పేరుభట్టు — చూశావా అత్తా నీకూతుర్ని? క్షణంలో యెంత పెంకితనం వచ్చిందీ దీనికి? ఇలా అయితే కష్టమే. బతిమాలడం నాచేతకా దేమనుకున్నావోగానీ. చిలకలాగ కులుకుతూ, హంసలాగ తక్కుతూ, పావురంలాగ తారుతూ చలాకీగా వుంటేగాని నాకు పనికిరాదుమరి.

కాంతమ్మ—సిగ్గుపడకమ్మా! మునపటి పేరుభట్టుబావేకదుటే? కొత్త యేంవచ్చిందీ యిప్పుడూ? తిన్నగా కూచోతల్లీ వొళ్లోను.

బంగారమ్మ—(పలకదు. కదలదు)

పేరుభట్టు—ఇలా కాదు ఉండవమ్మా అత్తా! ఇక వొట్టొట్టిమాటలు పనికిరావు కాబోలు నీకూతురికి. ఏదీ? ఆపెట్టి—పోనీ నన్నందుకోనియ్యి.

(పేరుభట్టు పెట్టి దగ్గిరికితీసుకొని తెరుస్తాడు. బంగారమ్మ వోరకంట చూస్తూ నుంచుంటుంది. కాంతమ్మ మహానందపడుతూవుంటుంది.)

పేరుభట్టు—అత్తా! నీకు చూపించడానికి నా దగ్గిర యేమీ లేదు; గాని—అయినా పెళ్లన్నాక వూరికే కాదుకనక—

కాంతమ్మ—ఇప్పు డెందుకోయి? కాకపోయినా నాకు చూపించే దేమిటే?

పేరుభట్టు—అలాకాదు. ఇంటిదగ్గిర నాకున్న ఆస్తి నీకు తెలవంది కాదు. అది నాకు తక్కుతుందని యేమీ ఆశ లేదు. ఇక నాకు రెక్కలే ఆధారం.

కాంతమ్మ—మీ తాత మాకూ రెక్కలే ఆధారం చేశారు. అయినా రాజమహేంద్రవరం ప్రవేశించాక మా కేమీ లోపం రాలేదు. రెక్కలు చల్లగావుంటే యిక లేనిదేమిటి నాయనా?

పేరుభట్టు—నే నలాగే ధైర్యం చెప్పుకొంటున్నాను. నీ ఆశీర్వచనంవల్ల నాకు సంగీతంలో కొంచెం పేరువచ్చింది. సాహిత్యంలోకూడా బుద్ధి ప్రసరిస్తోంది. దేవుడు మేలుచేస్తే నా కేమీ లోటుకలగకూడదు. కాని చదువుచూసుకొని మురుస్తూకూచుంటే సంపాదన—

కాంతమ్మ—నీసంపాదన నాకు తెలుస్తూనే వుంది. ఒక్క సంవత్సరంలో బంగారానికి నూటయాభై రూపాయలు ముట్టచెప్పావు. నీదగ్గిర యెంతా లేకపోతే అంత యివ్వగలవూ?

పేరుభట్టు—ఏమీ లేనివా ళ్లేమీ యివ్వలేడు. నిజమే; కాని నేను బంగారాని కిచ్చింది యేమంత గొప్ప? బంగారం నామీద చూపిస్తూవున్న దయకి నేను చేసినసేవ యేం సరిపోతుందీ? కాకపోయినా అదలావుండనియ్యి. రెండేళ్లయింది నాకు పెళ్లిచేసుకోవాలని సంకల్పం కలిగి. ఇప్పుడు కాకపోతే మరోకప్పుడేనా మావాళ్లు నాపెళ్లికోసం ప్రయత్నం చేస్తారు. మాఅమ్మతో తాసికలు చెప్పి మాచిన్నన్నయ్య నాపెళ్లి పడగొడితే పడగొట్టావచ్చుకూడాను.

కాంతమ్మ—ఎంతెంతవిరోధా లుండినా అన్నదమ్ము లంతంతద్రోహం చేసుకుంటారా నాయనా?

పేరుభట్టు—కాకపోయినా జ్ఞానం వచ్చాక, యేదో ప్రయోజకత్వంకూడా కాస్త కలిగాక నాపెళ్లి భారం మరొకళ్లమీద యెందుకు వెయ్యాలీ.

కాంతమ్మ—అదీ మాట. ప్రయోజకుడిలక్షణం అదీ.

పేరుభట్టు — పెళ్లిమీద దృష్టికలగడంతోటే బాగా ఆలోచించాను. పిల్లనిచ్చేవా ళ్లేంచూసియిస్తారు? పెళ్లాం వచ్చాక యేమిటి తినడం? తీరా అప్పుడు ప్రయత్నంచేస్తే డబ్బురావడం యెలాగ? ఇలాఆలోచించాటప్పటికి అంతా అయోమయంగా కనపడింది.

కాంతమ్మ—అంత ముందుచూపు యీకాలంలో యేపిల్లాడి కుందీ?

పేరుభట్టు—ఉండకపోతే తరవాత బోల్తాపడతాడు. పెళ్లాం తమలపాకులు తెమ్మంటే "మాఅమ్మనడిగి డబ్బుతెస్తా" నుండు అనాలి.

కాంతమ్మ—బాగా చెప్పావు.

పేరుభట్టు—అంచేత అప్పుడు పెళ్లిమీదికి పోయినదృష్టిని డబ్బుమీదికి మళ్లించాను. అందుకు ఫలితంగా యిదిగో యీకాసులు (పొట్లం విప్పిచూపిస్తూ) సంపాదించాను. ఇవి అరవైమూడు. కాసుపదమూడు—పద్నాలుగురూపాయలలోపున కొన్నాను.

బంగారమ్మ—(కాసులకేసి వోరకంటచూస్తుంది.)

కాంతమ్మ—కాసులికి దణ్ణంపెట్టవే బంగారం.

బంగారమ్మ—(ఊరుకుంటుంది.)

కాంతమ్మ—చూసి వూరుకోగూడ దమ్మా, పోనీ కళ్లకద్దుకో.

బంగారమ్మ—(గునిసిగునిసి నమస్కారంచేసినట్లు కాసులకేసిచూస్తూ, శిరస్సు వంచుకొంటుంది.)

కాంతమ్మ—నోట్లో ముక్క వున్నవాడవు. నీ కేంలోటు నాయనా?

పేరుభట్టు—ఇవి రూపాయలు. పాతికతక్కువ నాలుగువందలు. ఆకాసులతో నగలూ, యీరొక్కంతో ఖర్చులూ సరిపెట్టా లనుకొంటున్నాను.

కాంతమ్మ—చేతిలోవుంటేమాత్రం వున్నవన్నీ ఖర్చుచేసుకొంటే—మనం జమీందార్లముటోయి?

పేరుభట్టు—ఇది పూర్వపుసంపాదన. నీకు నామీద అనుగ్రహం కలిగినతరవాత—అంటే బంగారాన్ని నాకిస్తా నన్నతరవాత మూడురోజులపూటలోనూ సంపాదించినవివీ. (ఇంకోమూటవిప్పి బల్లమీద పెడతాడు.)

కాంతమ్మ—నీకు అడ్డేమిటోయి? ఎక్కడికి వెళ్లినా యెలాంటివాళ్లనీ కూడా నువ్వు క్షణంలో లోపుచేసుకోగలవు.

పేరుభట్టు—ఇవి నాలుగువందల యెనభైరూపాయలు.

కాంతమ్మ—బాగుంది నాయనా!

పేరుభట్టు—ఇంకా ఆరువందల చిల్లరవాగ్దానా లున్నాయి. మంగళసూత్రమూ, ప్రోల్లో పెట్టవలసిన

పట్టుచీరా వొక జమీందారుగా రిస్తామన్నారు. వారిది వరకి—అంటే మొన్న సాయంత్రం నూటపదహార్లిచ్చారు.

కాంతమ్మ—ఎంతధర్మాత్ములోయి వారూ ?

పేరుభట్టు—పెళ్లి వారిపెత్తనం మీదే జరుగుతుంది.

కాంతమ్మ—ఆహా! సరసం అంటే అలా వుండాలి.

పేరుభట్టు—ఇంకా చాలామంది బట్టలిచ్చేవా రున్నారు. ఇవి యిలావుండగా : వేంకటరాముడు గురుదక్షిణగా తనజట్టుతో వచ్చి అయిదురోజులూ—గృహప్రవేశం [illegible]యిందాకా సన్నాయి వాయించివెడతానన్నాడు. తనతమ్ముణ్ణి ఫిడేలువాద్యంలో తయారు చేసినందుకు సంతోషంగా పరంజ్యోతి తనమేళంతో వచ్చి ఆరురోజులూ మేజువాణీ చేస్తానంది.

కాంతమ్మ—నీవన్నీ జమీందారీమెత్తులు. నీకు నే నేమి ముచ్చట్లు తీర్చగలనూ ? మీమామయ్యావుంటే నీప్రయోజకత్వంచూసి పొంగిపోదురు. పిల్లా, నేనూ పెట్టిపుట్టలేకపోయాం. (కళ్లు తుడుచుకొంటుంది.)

బంగారమ్మ—(కళ్ల నీళ్లు పెట్టుకుంటుంది.)

పేరుభట్టు—(గద్గదికతో) ఆ మరదృష్టంఅంతా నాదీ. మామయ్యఆసరా చూసుకొని నే నెన్నోకల్పనలు చేసుకొన్నాను. అన్నీ గాలిమేడ లయిపోయాయి

(వొక్క క్షణం యెవరూ మాట్లాడలేకపోతారు.)

కాంతమ్మ—పదిమాట్లు చెప్పడం యెందుకు నాయనా ? నాబిడ్డకేనా, నాకేనా నువ్వే ఆధారం. నన్ను వొక్క కడుపున పుట్టిన తమ్ముడులాగ చూస్తున్నావు నువ్వు.

పేరుభట్టు—ఎదటివాళ్లని త నెలాచూస్తే ఆయెదటివాళ్లు తన్నలాచూస్తారు. నన్ను నువ్వు తోడబుట్టినవాణ్ణిలాగ చూసి, నేను నిన్ను తోడబుట్టినపడుచుని చూడవలసినట్లు చూ నేలాగ చేశావు. ఇందులో నావిశేషం యేమీలేదు. అ దలావుండనియ్యి. కష్టం వచ్చినా, సుఖంవచ్చినా సంసారంలో యేదీ నిలిచిపోదు—

కాంతమ్మ—ఏం అడ్డింది నాయనా! పెనిమిటి పోయినా కూతురికి పెళ్లి చెయ్యడం తప్పిందికాదునాకు.

పేరుభట్టు—అది అంతాయింతాలోటా ? ఈశ్వరుడేనా తీర్చలేని దది.

కాంతమ్మ—అంతా 'జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం' చేసుకోవాలి.

పేరుభట్టు—అంతే మరీ......ఇక చెప్పవలసిం దేమీలేదు. పెళ్లిపేరు చెప్పి యింకా చాలాసంపాదించగలనని ధైర్యం వుంది. అది యెలావున్నా, ముందీకాసులికి సరిపడేనగలికి పురమాయిద్దాం. ఏంబంగారం! ఏంకావాలి నీకూ ? నీయిష్టం వచ్చిన నగలు చేయించమంటావా, నాయిష్టంవచ్చినవా ? కాసులు చూపించినా మాట్లాడకపోతే యింకెలాగా మరీ ? వొక్కమాటు—నాకేసి కాదులే. ఈకాసుచూడూ. (మొగం పైకెత్తుతాడు.)

బంగారమ్మ—(కళ్లు మూసుకుంటుంది. ఆనందం మొగంఅంతా కమ్మి వుంటుంది.)

కాంతమ్మ—సమాధానం చెప్పు తల్లీ! అత నంతగా బతిమాలేటప్పుడు మాట్లాడకపోతే మోటతనం అనిపించుకోదూ ?

పేరుభట్టు—ఇదివరకి నేను వుత్త త్తిబావనే. ఇప్పుడు తాళికట్టబోతున్నాను కనక బతిమాలించుకోవాలి. ఆడపిల్లలికి యెలావస్తుందో యీగడసరితనం ఆశ్చర్యం కలుగుతుంది.

కాంతమ్మ—నేనుకనుక్కుంటానులే నాయనా!

పేరుభట్టు—అలాగే చెయ్యి. అది లోకధర్మం కనక అలా వూరుకుంది. కాని బంగారానికి నామీద దయలేదా. అది నే ననుభవించలేదా ?

కాంతమ్మ—దయవున్నా ప్రేమవున్నా నీకేవుంది. చంటిపిల్ల, దాని కేంతెలుసును నాయనా ? లోట్లన్నీ నువ్వే సద్దుకోవాలి.

పేరుభట్టు—లోట్లంటూ వుంటే, నువ్వు వుండనిస్తే సర్దుకోవలసిందే. లేకపోతే సంసారా లెలా నెగ్గుతాయి? ఇంతకీ: నావల్లమాత్రం లోట్లు రాకుండా వుంటాయా? ఇక నాకు వేళ అవుతోంది. సబుకలెక్టరుగారు ఇవాళ విందుచేసి బహుమతి యిస్తారు. అప్పుడే తొమ్మిది దాటింది. తొరగా వెళ్లాలి.

కాంతమ్మ—వెళ్లిరా నాయనా!

పేరుభట్టు—కాసులూ, రూపాయలూ జాగ్రత్త చేయించు.

కాంతమ్మ—నీదగ్గిర దాచవోయి!

పేరుభట్టు—నాదగ్గిరెందుకూ? నాదగ్గిర వున్నదీ, నీదగ్గిర వున్నదీకూడా యిక నీచేతిమీద నడవవలసిందే. (లేస్తాడు.)

కాంతమ్మ—అయినా—

పేరుభట్టు—ఇక మారు చెప్పవద్దు. పూచీ అంతా నీది కాని నాది కాదు. వెళ్లివస్తానే బంగారం! (బంగారమ్మవీపుతట్టి వెళ్లిపోతాడు.)

(బంగారమ్మా, కాంతమ్మా ఒక్కక్షణం గంభీరంగా చూసుకొంటారు.)

కాంతమ్మ—అవిదాచుకోమ్మా!

బంగారమ్మ—ఏమోబాబూ! (వసారాలోకి వెళ్లిపోతుంది.)

కాంతమ్మ—నాకేం. పోనీ అలాగే వుండనిచ్చుకో.

బంగారమ్మ—నీవు కాకపోతే నాకా యేమిటమ్మా పూచీ?

కాంతమ్మ—అవి జాగ్రత్తచేయించమన్నాడు; కాని నన్ను జాగ్రత్త చెయ్యమన్నాడా యేమిటమ్మా నీమొగుడూ?

బంగారమ్మ—(చకితురాలై) అదా యేమిటి అర్థం?

కాంతమ్మ—మరేదేమిటి?

బంగారమ్మ—(తీక్ష్ణంగా చూస్తుంది.)

కాంతమ్మ—(మందహాసంతో నిదానంగా చూస్తుంది.)

బంగారమ్మ—నువ్వు దాచగూడదా యేమిటి?

కాంతమ్మ—నువ్వు దాచమనగూడదాయేమిటి?

బంగారమ్మ—(గునుస్తూ) ఇవి దాచండీ అమ్మగారూ!

కాంతమ్మ—(కళ్లు తిప్పుకుంటూ) గదిలోకి పట్టుకురండీ రాణీగారూ!

బంగారమ్మ—ఇదుగో తెస్తున్నానండీ.

కాంతమ్మ—ఇనప్పెట్టి తాళాలుగూడా తీసుకురండీ.

బంగారమ్మ—నిమిషంలో తెస్తా నివి పుచ్చుకోండీ.

కాంతమ్మ—నే నిప్పుడు యినప్పెట్టి ముట్టుకోను, యెలాగండీ మరీ?

బంగారమ్మ—చూశావా? (గునుస్తుంది.)

కాంతమ్మ—చూస్తున్నావా?

బంగారమ్మ—(ఆలోచిస్తూ పైకిచూస్తుంది.)

కాంతమ్మ—(ఓరచూపులు చూస్తూ వూరుకుంటుంది.)

బంగారమ్మ—(తల్లి కేసి నిదానంగా చూస్తుంది.)

కాంతమ్మ—(తనలో) ఏమీ తోచడం లేదు మాఅమ్మకి. మన స్సెంత కొట్టుకొంటోందో? అయినా గొక్కక్షణం—

బంగారమ్మ—(బతిమాలుతూ) దాచిపెట్టవూ అమ్మా?

కాంతమ్మ—(తటాలున ఆమెని పొదివిపట్టుకొని) మామ్మే! మాతల్లే! ఇప్పటికి తోచిందా అమ్మా? దాచిపెడతానమ్మా! నా కింతకంటే మరోపనేంవుందమ్మా?

బంగారమ్మ—అమ్మో! నీమడి...

కాంతమ్మ—అయితేలే తల్లీ! నువ్వెక్కువా నాకు మడి యెక్కువా? (ఆమె నెత్తుకొని) నాచిట్టి తల్లి యీకాసులతో నగలు చేయించుకొని, అవన్నీ పెట్టుకొని వొయ్యారంగా మసులుతూవుంటే నా కింక నిద్రయెందుకు, ఆహారం యెందుకు? అంతకంటే నాకు మ డేమిటి, పుణ్యం యేమిటి? నా అదృష్టం మంచిది. కనక నాతల్లికి మంచిమొగుడు దొరికాడు. మా అమ్మకి తండ్రియిచ్చినమేడలో మొగుడు కాసులూ, రూపాయలూ రాసులుపోస్తాడు. (ఆమెని ముద్దుపెట్టుకొని) అవునా నామాటా?

బంగారమ్మ — (ఆనందంతో తల్లిని గట్టిగా కౌగిలించుకొంటుంది.)

కాంతమ్మ — (ముద్దుగా) నీ మొగుడు పేరు చెప్పవూ తల్లీ!

బంగారమ్మ—(తల అడ్డంగా వూపుతుంది.)

కాంతమ్మ—వొక్కమాటు చెప్పమ్మా!

బంగారమ్మ—ఊఁ ఊఁ! (గునుస్తుంది.)

కాంతమ్మ—నాచిట్టితల్లివికామూ? (బతిమాలుతుంది.)

బంగారమ్మ—పెళ్లిలో చెప్పిస్తారుకాదా యేమిటమ్మా?

కాంతమ్మ—అప్పటిదాకా వూరుకూ కూచోమంటావా?

బంగారమ్మ—వులకం!

కాంతమ్మ—కాకపోయినా అప్పుడు నేను నలుగురిలోకీ వచ్చి వుంచుంటానా యేమిటమ్మా?

బంగారమ్మ—(తల్లి చెవిలో నోరు పెట్టి పెదిమలు కదుపుతుంది.)

కాంతమ్మ—పెదిమలు కదిపావు. చెవులు వింటాయి గాని చూస్తాయిటే మాతల్లీ?

బంగారమ్మ—(మళ్లీ చెవిలో నోరుపెట్టి కాస్తబ వినపడీలాగ చెబుతుంది.)

కాంతమ్మ—సరిగా వినపడలేదమ్మా!

బంగారమ్మ—(చెవిలోనే యింకాస్త గట్టిగా చెబుతుంది.)

దేకాంతమ్మ—వొక్కచెవికే వినపడింది. ఇమిటే మామ్మా యింతబతిమాలించుకొంటావూ?

బంగారమ్మ— (చెవిలోనే గట్టిగా) పేరుభట్టు బావ!

కాంతమ్మ—మామ్మే! మాతల్లే! నాచిన్నారి నామాట తీసెయ్యదు. నేను చెప్పింది కాదనదు. చాలమ్మా! బ్రహ్మానందం అయింది. కాని యిక 'బావ' అని తుంచేసి పలకకూడదమ్మా!

బంగారమ్మ—(తల్లిచెవికేసి నోరుపెట్టి కొంచెం నింపాదిగా) పేరుభట్టు బావగారు. (గట్టిగా) ఏం? బాగుందా?

కాంతమ్మ — నిక్షేపంలా వుంది. అమృతం లాగకూడా వుంది. పెళ్లిలోకూడా యిలాగే ఝాంకారంగా చెప్పెయ్యమ్మా!

బంగారమ్మ—ఇకదెంపుమరి, తాళాలు తెస్తాను.

కాంతమ్మ—నువ్వెందుకమ్మా తేవడం? ఇక నిన్ను నడవనిస్తానా నాకొండా? అలా అయితే నేను బతికివున్నలాభం యేమిటమ్మా? (ఆమెని మాటిమాటికీ వక్షానికి అదుముకొంటూ, ముద్దుపెట్టుకొంటూ గదిలోకి వెడుతుంది.)

దేవుడితో ముగ్గురం, ఇకేమి?

అక్కరాజు ఆంజనేయులు, బి. ఏ.,

౧

"సరోజినీ, సరోజినీ! ఏమే సరోజినీ! నీదుంపతెగా, ఇల్లెత్తిపొయ్యేటట్టు కేకలు వేసినా పలకవు. ఒసే సరోజినీ!" అంటూ కోపంతో అరుస్తూ కమలమ్మ వాకిట్లోకి వచ్చింది. సరోజిని మంచం మీద పండుకొని చేతులతో పిలుస్తూ "చందమామ రావే, జాబిల్లి రావే, బం డెక్కి రావే, బంతిపూలు తేవే" అని పాడుతూ మధ్య మధ్య చప్పట్లు కొడుతూ ఉంది. పిల్ల ఆటచూచేసరికి అమ్మకోపం ఆకాశాన పోయింది. కమలమ్మ వచ్చి మంచంలో కూర్చొని పిల్లను ముద్దుపెట్టుకొంటూ, బొడ్డులో వేలుపెట్టి చక్కిలిగింత పెడుతూ లాలన చేసి "తల్లీ, ఇక అన్నానికి రావూ?" అంది.

సరో:—ఆఁ, నువ్వు నెయ్యివెయ్యవు. ఆపాడు కారం పచ్చడితో నేను తినలేను. నాకొద్దు పో.



"...నెయ్యిముంత దించి కొంచెం వేస్తుండగా..."

కమ:— ఎట్లనో నాలుగుముద్దలు తినకుంటే ఎట్లా?

సరో:— ఆఁ, రోజూ ఇంతే. మాటలు చెప్పడానికేమి? రోజుకొంటూ తినేదానికి నాక్కదూ ఆకష్టం తెలుస్తుంది?

కమ— రోజూ ఇంతేనంటావా? బావవచ్చి పోయినప్పటినుంచేకదూ లేకపోవడం? రేపు మళ్లీ అప్పతద్దినం, కావలసినంత వేసుకో.

సరో:—ఛీ, ఎవరు పెంచమన్నారు? చంపి వెయ్యకపోయినావా? ఈబాధ లేకపోనే.

కమ—కడుపుతరుక్కో నిపొయ్యేటట్టు మాట్లాడుతావుకదే! తల్లీ, రేపుపొద్దున అన్నవస్తాడు, తద్దినానికి. లే, అన్నంతిని పెందలాడే పండుకొంటే, పొద్దున నాకు పుట్టెడు పనిఉంది. వడలన్నా చెయ్యక తప్పదు. రేపు నీకు వడలూ, అన్న ఏమైనా తెస్తే అవ్వీ తిండానికి కావలసినన్నీ.

సరో—అయితే అన్న వస్తాడూ?

కమ—వస్తాడు, నీకు తిండానికి తెస్తాడు.

సరో—అన్నవస్తాడు, అన్నవస్తాడు.

అంటూ చప్పట్లు కొట్టుకొంటూ, అమ్మచంక యెక్కింది. కంచం చూచే సరికి రోజను మొదలు పెట్టింది. పిల్లను కంచంముందర కూర్చోబెట్టి, రేపటికి దేవుడున్నాడనుకొని, తద్దినానికని పిల్లకుకూడా కడుపుకట్టి నిలవచేస్తూవచ్చిన నెయ్యిముంత దించి కొంచెంవేస్తుండగా సరోజిని "ఆఁ, అంతా వెయ్యి" అంటూ, ఎంగిలిచేత ఒడిసిపట్టి లాగి దొర్లించుకొంది సరోజిని. కంచంలో నేతిముద్ద పడింది; పిల్లవీపున దెబ్బలు పడ్డాయి. లేమివల్లకలిగినదుఃఖంచేత వచ్చిన కోపంలో కొట్టిందేగాని, మళ్లీ తన్నుతానే 'బంగారు తల్లిని కొడితినీ పాడుముండనూ' అని తిట్టుకొంటూ, ఏడుస్తూ గోడను చేరబడ్డది. పిల్ల ఆత్రంతో నెయ్యి ముందుతిని మరి అన్నం తిన మొదలుపెట్టింది.

పిల్లనుకొట్టినదెబ్బలు వినబడికాబోలు భానుమూర్తి పరుగెత్తుకొంటూ లోపలికి వచ్చాడు. భానుమూర్తీ, కమలమ్మకొడుకు శ్రీహరీ, స్నేహితులు. చిన్నప్పటినుంచీ ఒకటిగా చదువుకొంటూ, ఆడుకొంటూ, ఆలోచిస్తూ పెరిగారు. భానుమూర్తికి అమ్మా నాయనా ఒక్కమారు చనిపోవడంవల్ల, సంసారభారం తలపైనబడి, భూములపైన పెత్తనం చేసేవారు లేక తాను ఆరోఘారంతో బడిచదువు మానాడు. శ్రీహరికి తండ్రిపోయి ఆయనహానీకేసులో మూడుకోర్టులూ తిరగడంలో ఆస్తిపోయి, అమ్మనూ, చెల్లెలినీ పోషించేభారం తలమీద పడినా, ఏమి పెట్టి పోషించడం? భానుమూర్తిలాగా పైపెత్తనం చెయ్యడానికి ఊళ్లో ఉండే ఆస్తిఅంతా పోయింది. తనకున్న కొంచెం చదువుతో ఏఉద్యోగమూ దొరకలేదు. అందువల్ల ఊరూరా తిరిగి తనమంచితనం, నేర్పూ, తెలివితేటలచేత తన్ను తానే చదివించుకొంటున్నాడు. సహపాఠులిద్దరూ ఇప్పుడు వేరైనా, మనస్సులొకటిగానే ఉన్నాయి. కొడుకు దగ్గరలేని కమలమ్మకు భానుమూర్తినిచూస్తే ఏనుగునెక్కినంత సంతోషం. భానుమూర్తి కమలమ్మను అమ్మా అనిపిలుస్తూ కొడుకును మరపించాడు.

ఎంతకష్టాలలో ఉన్నా, అనాదిగా పెట్టినచెయ్యేగాని పట్టినచెయ్యి కాకుండా బ్రతికి పెద్దల ఆర్వేలనియోగివంశంలోది కాబట్టి, ఇట్టి స్థితిలోకూడా ఇతరుల ఋణం పైన ఉంచుకోదు కమలమ్మ. ఇక భానుమూర్తి కమలమ్మతో ఆమెకష్టాలనుగురించి మాట్లాడడానికి సందేహించేవాడు, భయపడేవాడు. పౌరుషవంతులు తమకష్టాలు ఇతరులతో చెప్పుకోరు; మరిన్నీ, ఏవిధంగానన్నా ఇతరులు తెలుసుకొంటే తలవంపులైనట్టు భావిస్తారుకదా! అందువల్ల తనకు సహాయం చెయ్యడానికి ఎంతఇష్టమున్నా "ఇది తీసుకో అమ్మా" అని అడగడానికికూడా భయపడేవాడు. ఇంట్లో తిండికికూడా ఇబ్బంది పడుతూ ఉంది కమలమ్మ అని తానెరుగును.

దెబ్బలు వినబడగానే, భానుమూర్తికి దుఃఖమూ, భయమూ కలిగాయి. అన్నం తింటూ ఏమీతోచక ఎంగిలిచేత్తో పరిగెత్తాడు. సరోజిని పచ్చడిఅన్నం తింటూ, గోడ చేరబడి కన్నీళ్లు కారుస్తుండే అమ్మను చూస్తూ-విచారంగా ఉంది. భానుమూర్తి హఠాత్తుగా ప్రవేశించాడు. తటాలున మొగంతిప్పి, కొంగుతో కన్నీరు అద్దుకొని, పొంగివచ్చే దుఃఖాన్ని అణచుకోలేక, అణచుకోలేక అణచుకొని, సగమణిగిన గొంతుతో, 'భానూ, రారా' అంది కమలమ్మ.

ఆవలిస్తే పేగులెంచేజాతికదా? రెప్పపాటులో అంతా గ్రహించాడు: 'చెల్లీ, రా' అని సరోజినిని ఎత్తుకొన్నాడు; అమ్మముఖం చూస్తూ తడబడుతూ వెళ్లాడు.

గది శుభ్రం చేసి కమలమ్మ పండుకొంది. ఎంత ప్రేమ తనకు ఎక్కువైనా, భానుమూర్తి తనకంటే ఎక్కువ ఆదరం చూపగలడు పిల్లవిషయంలో. అయినా, తనదగ్గర లేనంతమాత్రంచేత, సరోజిని కేమో లోటు అయ్యేట్టుగా మూడునాలుగుమార్లు వెళ్లి చూచివచ్చింది కమలమ్మ. ఇందులో తెల్లవారితే తద్దినమనే ఆలోచన బుర్రలోకి వచ్చింది. శ్రీహరి వచ్చేబండికి బాడుగ ఇచ్చుకోవాలి; తిరిగివెళ్లడానికి ప్రయాణపుఖర్చు ఇచ్చుకోవాలి., తద్దినపుఖర్చుకాక బ్రాహ్మలకు దక్షిణలు ఇచ్చుకోవాలి. పన్నెమాసాలు తిరిగివచ్చిన ఈ కర్ణాటకపుబ్రాహ్మలు తలకు అర్థరూపాయ భోజనాలకుముందు ఇస్తేనేగాని ముద్ద యెత్తరు. "ఏమిచెయ్యడం భగవంతుడా!" అని కమలమ్మ ఏమీతోచక కుళ్లిపోతూ ఉంది. నిద్ర పట్టదు.

దరిద్రంలో తనకు కలిగిన ఒక ఆలోచనకు సంతోషించింది. పౌరోహితుడు గణపతిశాస్త్రికి ఈ తద్దినప్రసంగతి ముందుగా చెబితే, మరియిద్దరితో ముగ్గురుగా తయారౌతాడు. తద్దినంనాడు పొద్దున తెలిపితే, ఆవూళ్లో ఇక వైదీకులు లేరు కాబట్టీ, పైవూరికి వెళ్లి పిల్చుకొనివచ్చే వ్యవధి ఉండదు కాబట్టీ, తాను ఒకడే వస్తాడు. ఖర్చు తగ్గుతుంది; దక్షిణ మిగులుతుంది. ఇదీ ఆమెకు తోచినయుక్తి. ఇది తోచబట్టే ఆమె ఒకమనిషిగా తెల్లవారి లేచింది.

కండ్లు తెరిచేసరికి, శ్రీహరి పక్కలో కూర్చొని అమ్మముఖం చూస్తున్నాడు. సరోజిని అన్నపక్కను కూర్చొని ముంతమామిడిపప్పు తింటూఉంది. 'ఎం[illegible] సేపైంది శ్రీహరీ, వచ్చి? అబ్బా, ఎంతఎండబడ్డది? తల్లీ, లేవనీ, పుట్టెడుపని ఉంది" అనుకొంటూ ప్రక్కలోనుంచి లేచింది. "బండిమనిషి యేడి నాయనా? బాడిగ ఎంతయివ్వాలి.?" అని బెంగతో అడిగింది. అటూఇటూ చూడగా, పెట్టె కనబడదు. శృంగారనైషధముమాత్రము మంచంమీద ఉంది. ఒక్క క్షణంలో అంతా కండ్లగట్టినట్టైంది. సాయంత్రం వారపింటికివెళ్లి అన్నం తిని, రాత్రి చీకటిలో బండ్లవెంబడే బంగారు తండ్రి ఇరవైమైళ్లూ నడిచివస్తున్నట్లు కండ్లకు కనబడ్డాడు. కొడుకుకాళ్లమీద చెయ్యివేసి నిమురుతూ, ఒత్తబోయ్యేటప్పటికి, శ్రీహరికి ఆమహాతల్లి మనసులో ఉండేదుఃఖం తన్ని కొట్టినట్టయి, ఎక్కడలేని పొంగువచ్చి, కన్నీరు రాల్చాడు. వేడికన్నీళ్లు చేతిమీద పడగా కమలమ్మ తల యెత్తింది. "వెధవదేవుడా" అని తానూ కంట నీరుబెట్టింది. ఇదంతా చూచి పరుగెత్తుకొంటూ వెళ్లి భానును పిల్చుకొని వచ్చింది సరోజని. ఏడుస్తూఉండే తమ్ముణ్ణి చూచేసరికి భానుమూర్తికి దుఃఖంవచ్చింది; కాని అణచుకొని అటూయిటూ చూచాడు; అంతా గ్రహించాడు. "ఎంతసేపైంది తమ్ముడూ వచ్చి?" అంటూ వచ్చి పక్కలో కూర్చొన్నాడు.

సరో—అన్నయ్యా వచ్చి నిన్ను లేపకుండా నన్ను ఎత్తుకొని వచ్చి పండ్లుతోమి ముంతమామిడిపప్పు పెట్టాడు. ఇదో తింటున్నా.

భానుమూర్తి తమ్ముడు ఎందుకు వచ్చాడా అని ఆలోచిస్తున్నాడు. సెలవులు ఏమీ లేవు. కారణమేమిగా ఉండునో అనుకొంటుండగా, సరోజిని "ఇవ్వాళ నాకు అన్నయ్యతెచ్చిన ముంతమామిడిపప్పు,

తద్దినంవడలూ తిండానికి కావలసినన్నీ. అమ్మా నాకి ప్పుడు అన్నం వద్దే" అంది. భానుకు తద్దినం అని జ్ఞాపకం చేసింది చెల్లెలు. "ఇవ్వాళ ఖర్చు ఉన్నదే! అమ్మ ఎట్లా నమ్ముతుంది? ఇస్తే తీసుకోదు" అని ఏమీ తోచక ఆలోచిస్తున్నాడు భానుమూర్తి. కమలమ్మ లేచిపోయింది.

౨

సరోజిని తనపాటికి తాను పప్పు ఒలుచుకొంటూ తింటూఉంది. శ్రీహరి వంచినతల యెత్తకుండా, ముడిచికలిపిన ఉంగరపువ్రేలూ బొటనవ్రేళ్ల మీద గడ్డం మోపి చూపుడునడిమివ్రేళ్లురెండూ చెంపచేర్చి, తనువు నేలను మనసు ఆకాశానగా ఉన్నాడు. భాను నైషధం అటూయిటూ తిప్పుతూ 'తమ్ముడూ, ఈ ఒక్క నాటికికూడా పుస్తకం మోసుకరావాలా? బండిలో కూడా రాలేదే! ఒక్కనాటికి చదువు పోతే కొంప మునిగినట్టు ఏమిటె యీశ్రమ? మొన్న వచ్చినప్పుడు ఇది లేదే! ఎప్పుడు కొన్నావు? ఎంతవెల? దీనికి అయిదురూపాయలు ఎక్కడ తెచ్చావు?

శ్రీహరి—కొత్తదిగా ఉందేగాని చెయ్యి మారినపుస్తకం రెండురూపాయలే. అయింది.

భాను—తమ్ముడూ, నీవు ఇక్కడ ఉంటే నేను దీనిని చదువుకోవచ్చును. మరి నీవు వెళ్లుతావు గదా. నేను చాలాకాలంగా నైషధం చదువుకోవలె నని సరదాపడుతున్నాను. ఇది నాకిద్దూ. ఎంత అయిందీ? అయిదు కదూ?

శ్రీహరి—కాదు రెండే. ఎంత అయితే నేమి? నీవు చదివి తరువాత నాకు ఇవ్వరాదు?

భాను—తొందరగా చదవాలని నీకెంతో సర దాగా ఉండికదా కొన్నావు. నేను అయిదురూపా యలు ఇస్తాను. అక్కడికి వెళ్లికొనుక్కో. ఇది నా కియ్యి.

శ్రీహరి—నే నది రెండిటికే కొన్నాను.

భాను—అయిదురూపాయ లని వెలవేసి ఉంటే రెండని చెబితే నేను నమ్ముతానా?

శ్రీహరి—చెయ్యిమారిన పుస్తకమంటూంటే నే?

భాను—చెయ్యిమారిన పుస్తకము ఇట్ల ఉం టుందా, అచ్చులోనుంచి ఇప్పుడే వచ్చినట్లు?

శ్రీహరి—వాడినవాడిజాగ్రత్త. నేను అబ ద్ధము చెబుతానా?

భాను—పోనీ, మళ్లీ నీవు కొనుక్కోడానికి సిద్ధంగా చెయ్యిమారిన పుస్తకము దొరకదుకదా? కొత్తది అయిదురూపాయలకు కొనుక్కోక తప్పదు కదా? నీవో నేనో కొత్తది కొనక తప్పదు. నేను వ్రాసి తెప్పించడానికి పోస్టుఖర్చులు పైన పడతాయి. నీవైతే ఆఖర్చు లేకుండా అయిదు రూపాయలకు అక్కడ కొనుక్కోవచ్చు.

శ్రీహరి—వృథాఖర్చు ఎందుకనుకుంటే, ఇది నీవు చదువుకొంటూ ఉండు. నీ అయిదు రూపాయలతో అక్కడ కొని వచ్చేటప్పుడు తెచ్చి యిస్తాను. అంతేగాని, నేను రెండు రూపాయలకు కొన్న పుస్తకానికి నీవు అయిదురూపాయలు ఇస్తానంటే తీసుకోడానికి నేను కోమటిని కాను.

భాను—అట్లగే చేయి. ఇది నేను తీసుకొం టాను.

శ్రీహరి—అట్లగే నీపుస్తకము వచ్చేవరకూ.

బ్రతికాను దేవుడాఅనుకొన్నాడు భానుమూర్తి. ఎంత లేదన్నా నాలుగురూపాయలు లేనిది తద్దినం కాదు. తనను అమ్మ అప్పుకావలెననికూడా అడగదు; ఎందుకంటే, ఆమె లేవడితెలిసి భానుమూర్తి ఎంత దుఃఖిస్తాడో అని. అడగకుండా యిస్తే, "ఎందు" కని అడిగితే ఏమి జవాబు చెప్పడం? సరోజినిచేతికి యిస్తామంటే, పండగా, పర్వమా? అంతేకాక, ఇది వరకు అమ్మ కొట్టినప్పటినుంచీ, భానుదగ్గర ఏమి తీసు కోవలెనన్నా అమ్మ ఒళ్లునిరగకొడుతుం దని భయం. ఇన్ని చిక్కులు ఉన్నవి. పోనీ తమ్ముడిచేతికి యిస్తామం

శే అమ్మకు మించినకొడుకు, ఆత్మగౌరవం కాపాడుకోవడంలో. అన్నదమ్ములవలె ఉన్నా, ఆసంబంధం డబ్బువిషయంలోకి రానీయడు శ్రీహరి. ప్రతిష్ఠకు ప్రాణం విడుస్తాడు. ఇదంతా ఆలోచించే, పుస్తకం తానిప్పుడు చదవాలని అనుకోకపోయినా, సరదా తెచ్చిపెట్టుకొని, పాతదని తెలిసీ, అయిదురూపాయలు తీసుకోమంటాడు. భానుమూర్తిమోసానికి లొంగి శ్రీహరి అట్ల తీసుకోడు. తుదకు ఒకరాజీమార్గానికి తెచ్చి, భానుమూర్తి మనిపర్సులో అయిదురూపాయలు తీసియిచ్చాడు.

3

కమలమ్మ గణపతిశాస్త్రియింటికి వెళ్లి "నాయనా, మీబావతద్దినం ఇవ్వాళ. అల్లుడు ఊరినుంచి వచ్చాడు. కార్యం జరిపిపోవూ?" అని అడుగుతుండగా, పక్కఊరి సుబ్బావధాని గుమ్మంలోనుంచే "ఒరే గణపతీ! రేపు పాలెంలో సంతర్పణరా. కొంచెం నడకశ్రమకు ఓర్చావంటే రూపాయ సంభావన రారా. చెప్పడానికేవచ్చాను," అంటూ లోపలికి వచ్చాడు.

గణ—రేపటిసంభావన సరేకాని, ఇంతదూరం వచ్చినవాణ్ణి ఊరకే పంపను నాకు ఇష్టంలేదు. ఇక్కడ తద్దినం; బ్రాహ్మణార్థానికిరా, అర్ధరూపాయ దక్షిణ.

సుబ్బా—అమ్మామ్మా, పంతులుగారి తద్దినం యీరోజేనా? అయితే మీరు ఇక్కడికి రావాలా, ఈ వైభవాయని పిలవడానికి? ఎంత వారు పోయినా, ప్రభుకుటుంబంలోవారనికూడా కనిపెట్టకుండా, మీచేత పిలిపించుకొంటున్నాడా? మొన్నటిదాకా మీయింటికి వచ్చి పంచాంగం చెప్పుతూఉండిన గణపతికి పంతులుగారు పోగానే కండ్లు మీదకువచ్చాయా?

అని కమలమ్మగారిని తన్ను పిలవడానికి వచ్చేంత అగౌరవం చేసినందుకు గణపతిని నాలుగు చీవాట్లు వేశాడు. పల్లెలలో ఆచారం ఎవరింట్లో ఏకార్యం ఏతిథినాడు జరిగేదీ తనఅబ్బశ్రాద్ధంవలె జ్ఞాపకం ఉంచుకొని, ఆయానాడు ఆయాయింటికి వెళ్లి వారికి జ్ఞాపకం చెయ్యడం పౌరోహితుడివిధి. ఇక కమలమ్మగారు దేశపాండ్యకుటుంబమువారు కాబట్టి, వారియింటికి వెళ్లి గణపతికుటుంబమువారు ప్రతిరోజూ పొద్దున తిథివారనక్షత్రాలు చెప్పి వారుయిచ్చిన మోయిన తీసుకొనిపోవడం అనాదిగా ఆచారం.

వైదికవృత్తి అంటే పాడిబఱ్ఱెవంటిది. లేవడి కలలోకూడా కనబడదు. ఆవృత్తిని అందరూ చులకనగా చూస్తున్నారేగాని, దానివల్లనే గణపతి అందరికంటే మెరుగుగాఉన్నాడు. ఇప్పుడు నాలుగుకాసులువచ్చాయి గదా అని కండ్లు మీదకువచ్చాయి. కమలమ్మగారియింట తద్దినమని తెలిసీ, ముందురోజు వెళ్లి జ్ఞాపకం చెయ్యడం మాని, ఇప్పుడు ఆమెచేత పిలిపించుకొన్నాడు; అందుకు నాలుగుచీవాట్లూ తిన్నాడు.

సుబ్బావధాని గణపతిమీద కోపపడి, ఇటు తిరిగి, "అమ్మా, సమయానికి నేను రాబట్టి సరిపోయింది కాని, లేకుంటే ఒక్కబ్రాహ్మడితో తద్దినం సక్రమంగా ఎలాజరుగుతుంది? చాలాపనిఉందిగదా? అబ్బాయి వచ్చాడా? ఒరేగణపతీ, వదినెను పంపరా, తద్దినపువంట అమ్మగారు చేయలేరూ" అన్నాడు.

గణ—నిన్నటిరోజు ఇంట్లో రెండుకూరలూ, పప్పూ చేసేటప్పటికే మీవదినెకు ఆయాసం వచ్చింది. ఇక తద్దినపువంట చెయ్యడమే?

సుబ్బా—ఔరా, కాలం! ఔరా, సుకుమారం! మొన్నమొన్నటిదాకా యీగణపతిపెండ్లామే అమ్మగారియింట అంట్లుకూడా పనిమనిషికి అడ్డంపోయి తాను తోమేది. మరి యింతలో యీసుకుమారం ఎక్కణ్ణుంచి వచ్చిందో? అమ్మా, మీరుపొండి. కాలకృత్యాలు తీర్చుకొని నేను వస్తాను వంటకు. వ్యగ్రతగా అనుకోకండి. అనాదిగా మీయింట పనిచేసి బతికినవాండ్లమే. మీరు పొండి తల్లీ, వస్తా నింతలో.

ఇలాగా సుబ్బావధాని మాటిమాటికీ బలవంతపెట్టగా కమలమ్మ నెమ్మదిగా కదలింది. కాని ఏదో గణపతితో మాట్లాడ దలచి, కొత్తమనిషి వచ్చినందువల్ల మాట్లాడలేక పోయినట్లు వారికి తోస్తూనేఉంది. ఒక్కబ్రాహ్మడితో పితృకార్యం వెళ్లతీస్తామనే తల

పుణ్యో ఆమె ఉండింది. ఇప్పుడు గొప్పచిక్కు తెచ్చి పెట్టాడు దేవుడు. సుబ్బావధాని బ్రాహ్మణార్థానికి రావడమేకాక, వంటచేస్తానన్నాడు. వంటకు పైగా ఏమైనా ఇవ్వాలి. వద్దంటే వినడు; తీసుకొని వస్తాడు. స్థితి చెప్పుకోడానికి నోరు రాదు. ఆయన వచ్చేసరికి ఇంట్లో సామగ్రిఅంతా సిద్ధంగా లేకపోతే లేవడి బయటపడుతుంది. "భగవంతుడా! ఎందుకు ఆయనను తీసుకొనిపోయి నన్ను ఉంచావు? భూదేవీ, దారియిచ్చి ఇంతట నన్ను కడుపున బెట్టుకో" అని ఆమె ఏడవడమేకాని, యీ మొఱ్ఱలు భగవంతుడు వింటాడా? నెమలికంట నీరు కారితే వేటగాడికి ముద్దా? ఏమిచేయనూతోచక, కమలమ్మ నడుస్తూవుంది. ఎవర్నడిగితే నాలుగురూపాయలు అప్పు ఇస్తారు? అప్పైనా అడగడానికి అలవాటుపడ్డనోరు గాదు. అడిగి లేదనిపించుకోవడం మహావమానం. పొద్దెక్కుతూఉంది. సుబ్బావధాని వచ్చి గొంతుమీద కూర్చొంటాడు. ఏమిటిదారి దేవుడా? అనుకొంటూ అంగడి మీదుగా నడిచింది.

అంగడివాడిని అడిగితే అప్పు ఇవ్వనన్నాడు. కమలమ్మకు అప్పిస్తే తొందరలో ఆడబ్బు రాదు. డబ్బు ఆలస్యం లేకుండా తిరుగుతుంటేకదా పిల్లలు పెడుతుంది? ఈమె కిస్తే యే సంవత్సరానికోగాని రాదు, అసలు వస్తే. అప్పటికి ఆనాలుగురూపాయలూ నాలుగ్గానే ఉంటాయి. పాపము బ్రతిమాలుకొంటుంది; వినడు, ససేమిరా అంటాడు. ఒకప్పుడు ఈకోమటే పంతులుగారు తనఅంగడిలో ఖాతా పెడితే బాగుండు నని కమలమ్మభర్తచుట్టూ కనబడినప్పుడల్లా తిరిగేవాడు. ఇప్పుడు కమలమ్మ వచ్చి అడిగితే అప్పు ఇవ్వనన్నాడు ఔరా! కాలం ఎంతతలక్రిందు లైంది. ఓడలు బండ్లు అవుతాయి; బండ్లు ఓడలు అవుతాయి. అడిగినఅవమానమేకాక లేదనిపించుకొన్న అవమానంతో తలవంచుకొని ఆమె ఊరినుంచి వచ్చిన కొడుకును ఒక్కమారు చూచుకొని మరి తద్దినంసంగతి ఆలోచిస్తామని ఇంటికి వెళ్లగా కొడుకు లేడు. "అన్నయేడీ" అని అడగ్గా "సామానుకు అంగడికి పోయినా" డని సరోజిని చెప్పింది. "ఏఅంగడి"కంటే "ఏమో" అంది. కమలమ్మకు ఏమీ తోచలేదు. సామానుకు డబ్బు ఎక్కడిది? ఎవరైనా అప్పు ఇస్తారనుకొందామా? ఏది కావాలో, ఎంతకావాలో తన కేమితెలుసు? అనుకొంటూ తన కేమీ తోచక పిల్లను ముద్దాడుకొంటూ కూర్చొంది.

౪

ఇంతలో భానుమూర్తిగారి నౌకరిచేత సామాను ఎత్తించుకొని భానూ, శ్రీహరీ వచ్చారు. భానుమూర్తిని చూడగానే కమలమ్మకు కోపం వచ్చింది. తమ్ముణ్ణి మోసంచేసి తద్దినానికి డబ్బు ఇచ్చాడని గ్రహించి కోపంతో చూచేసరికి భాను అదలిపోయాడు. నెమ్మదిగా ధైర్యంతెచ్చుకొని "అమ్మా! డబ్బునాది కాదు, తమ్ముడిదే" నన్నాడు.

కమ—తమ్ముడి కెక్కణ్ణించి వచ్చింది?

భాను—వాడు నైషధం కొనితెమ్మని తమ్ముడి చేతికి అయిదురూపాయలు ఇచ్చాను. దానితో ఇప్పుడు సామాను కొన్నాడు. ఏది ఎంతకావాలో చెప్పడానికి నేను తోటే వెళ్లానేగాని మరేమీ కాదు.

వాడుకోడానికి చేతిలోకి డబ్బు వచ్చిందికదా అని బ్రహ్మానందమైంది కమలమ్మకు. వెనక ఏలాగో తేల్చి పుస్తకము కొని భానుకు ఇవ్వవచ్చు. ఆ క్లిష్టావస్థలో ఉన్న కమలమ్మకు మనసు ఇంతకుపైన పోలేదు.

వీరు మాట్లాడుకొంటూఉండగా నౌకరి సామాను తీసి కిందపెట్టాడు. కమలమ్మ నౌకరిని అన్నానికి రమ్మన్నది. భాను, తన్ను పిలుస్తుందేమో అని భయపడుతూ, ఏమిసాకు చెప్పి తప్పించుకోనా అనుకొంటున్నాడు. మరొకఆలోచన కలిగింది. శ్రీహరి మరుసటినాటిరాత్రికి వెళ్లుతాడు. శ్రీహరితో భోజనం మరి యెన్నినెలలకో? మంచిసందిగ్ధావస్థ కలిగింది. ఇదంతా మనస్సులో ఒక్కక్షణంలోకలిగిన ఆలోచన. "భానూ! నీవూ పద్మా ఇక్కణ్ణే ఇవ్వాళ. రేపు తమ్ముడు పోతాడు. మరెప్పటికో రావడం" అని కమలమ్మ పిల్చింది. తనతల్లి పోయినప్పటినుంచీ కమలమ్మే భానుకు తల్లి. అమ్మమాట తోసివేయగలడా? తమ్ముడు

ఉండేఒక్కనాడూ తమ్ముడితో భోజనం చెయ్యక ఓర్వగలడా? ఎట్లయితేనేమి? "అట్లగేఅమ్మా" అన్నాడు. ఇంతకూ తనమనసులో ఆలోచన యేమి? మంది యెక్కువఅయ్యేకొద్దీ మజ్జిగ పల్చన అన్నారు. నౌకరిని పిల్చింది. ఇక తానూ పద్మా మనిషికి మనిషి తోడయితే కష్టమౌతుంది. ఎవరు ఏమడిగినా లేదన రాదుకదా? కానీ చూతా మనుకొన్నాడు. ఒప్పుకున్నాడు. "చెల్లీ, వెళ్లి మీవదినెను పిల్చుకరా" అని సరోజినితో చెప్పాడు.

సరో:—వదినంటే ఎవరు ?

భాను—దానిపేరు చెప్పిందాకా వదలదయ్యా యిక. పో, పద్మను పిల్చుకొనిరా.

సరో—పద్మా! పద్మ ఏమిటి గిద్మ. బాగు బాగు. నన్ను 'సర్రూ' అంటావా యిక? ఆకలై పేర్లు తింటావా? పూర్తి పేరు చెబితేనే.

భాను—పద్మావతి.

సరో—ఆహాఁ.

భాను—పద్మావతమ్మ, పద్మావతమ్మ, పద్మావతమ్మ.

సరో—పద్మావతమ్మ, పెండ్లామమ్మ, అమ్మగారు, అలారా. ఇప్పుడు పిల్చుకొనివస్తా.

ఇలా అన్నను వేళాకోళంచేసి మరి వెళ్లింది.

౫

పద్మావతి వచ్చి ముందు మినప్పప్పు నానబోసి, తక్కినవన్నీ బాగుచేస్తూ "అత్తా, తద్దినంసంగతి నాకు చెప్పకపోయినావేమీ? పడమటింట్లోనుంచి 'పద్మా, వంటకు రావే' అంటే రాకపోయినానా? ఎంతపొద్దు పోయింది." అంటూ ఏమేమో మాట్లాడుతుండగా కమలమ్మ మడికట్టుకొంటా నని స్నానానికి లేచింది. చివాలున పద్మ లేచి, "పీట్లో రాళ్లు తీసియిచ్చి పైపని నీవుచెయ్యి. వంట నేను చేస్తా. ఇంతమందికి నీవు వండలేవు." అని పడమటింట్లోకి వెళ్లింది. ఒకరి మనసు ఒకరు కనుక్కొనేభాష యీభార్యాభర్తలకు బాగా వచ్చు. ఇంతలో భానుమూర్తి అటుతిరిగి వెళ్లి తనయింట్లో అయిదాగ్గరి మోయినసామాను అమ్మకు తెలేకుండా చూరులోగుండా ఇవతల పడమటింట్లో ఉండేపద్మకు అందించాడు. అవి దాచి తాను తొందరతొందరగా తలస్నానం చేసి మడికట్టుకొని, వంటమొదలుపెట్టింది. ఇంతలో సుబ్బావధాని స్నానంచేసి వచ్చి తిన్నగా వంటయింట్లోకి వెళ్లేసరికి వంట అవుతూఉంది. పైకివచ్చి "అమ్మా, నేను వస్తూఉండగానే ఇంతతొందరా? నాకు పని చెప్పడానికే యింతమొగమాటమైతే యెలాతల్లీ? మీ మామగారినాయన ఆదిమూర్తిగారు దానంచేసినఅగ్రహారంలో నాభాగానికి అయిదువందలరూపాయలు వస్తున్నాయి. మూడుతరాలుగా మావంశమంతా పుష్కలంగా బ్రతుకుతున్నామే! మీబిడ్డలము. నాకు పనిచెబితే ఋణపడతారా? కానీండి, ఏమిచేతాం? మీ రేపనిచెప్పినా చెప్పండి, చేస్తా. మీరు చేస్తుంటే చూడలేను. మీ అబ్బాయినిఒకటిగా నన్నొకటిగా చూచుకోకండి;" అంటూ తడిసుడ్డలువిచ్చి పొడిసుడ్డలుకట్టిదొన్నెలూ, దర్భలూ తయారు చేస్తూ నమకచమకపారాయణం చేస్తున్నాడు. కమలమ్మ ఏమిచేయబోయినా ఏమితేబోయినా తాను అడ్డముపోతాడు.

ఎట్లయితేనేమి, వంటఅయింది పద్మావతి వచ్చి "ఇక తేవవచ్చు" నన్నది. "ఈమె ఎవరమ్మా?" అని అవధాని అడగగా, "మాభానుమూర్తిపెండ్లాముకదూ నాయనా," అని కమలమ్మ బదులుచెప్పింది. అది మొదలు సంభాషణకు. అటువంటిసమయాల్లో ఇంటివారికీ బ్రాహ్మలకూ జరిగేసంభాషణ స్వభావం అది విన్నవాండ్లకే తెలియాలి. కర్తయొక్క పెద్దలు చేసిన గోదానాలు, భూదానాలు, కన్యాదానాలు చెప్పి పెద్దలను పొగడడం. మామూలుగా ఈఔదార్యాన్ని గోరంతలు కొండంతలుచేస్తారు. ఎందుకనుకొన్నారు? దక్షిణ దగ్గర కర్త వెనకతియ్యకుండా ఉండడానికి. పెద్దలను పొగిడితే, ఎవడు వశంగాడు? అట్లని కమలమ్మగారి కుటుంబమువారు చేసినదానాదులు అల్పాలని కాదు. సుమీ. ఆమెమామగారినాయన సంవత్సరానికి రెండు

వేలువచ్చే అగ్రహారాన్ని ధారపోశాడు. ఆఅగ్రహారపు పేరు పోయి ఆయనపేర ఆదిమూర్తిపురం అనేపేరు నిల్చింది.

ఈతద్దినపుసంభావణ జరుగుచుండగా, గణపతి వచ్చాడు. బ్రాహ్మలు స్నానంచేశారు. మంత్రం మొదలు పెట్టారు. సుబ్బావధాని సక్రమంగా ఆద్యంతాలూ బాగా జరుపుదామనే ఉద్దేశంతో ఉండగా, గణపతి అడ్డంవచ్చి తాను మంత్రం చెబుతానన్నాడు. గణపతికి మంత్రం రాదని అవధాని యెరుగును. గణపతి శాస్త్రికి శాస్త్రినామం నామకరణంలో వచ్చిందే గాని, శాస్త్రజ్ఞానంవల్ల వచ్చింది కాదు. అయినా "మీరు రాజపురోహితులు. మీవెనకనే మేము" అని అవధాని సర్దుకున్నాడు. గణపతి అయిదునిమిషాల్లో మంత్రం ముగించాడు. "అపవిత్రః పవిత్రోవా" లగాయతూ "కాయేనవాచా" ఆఖరువరకూ "సర్వం శ్రీకృష్ణార్పణమస్తు" అన్న కలికాలపుసంధ్యలాగా, మంత్రంలేని సంధ్యకు మరిచెంబెడు నీళ్లన్నట్టు, గణపతి పెట్టించే తద్దినానికి తంత్రలోపం లేదు, మంత్రం సన్నమైనా. అక్కడ కానీ, యిక్కడపరకా, అప్పుడు అణా, యిప్పుడు బేడా అని మంత్రపుడబ్బులక్రిందనే రూపాయ లాగాడు. ఇదే ఇంతైతే దక్షిణ ఎంత కావాలి?

వడ్డించవచ్చునన్నాడు గణపతి. సరోజిని వెళ్లి భానును పిల్చుకొనివచ్చింది. పిండాలు ముందే చేయించి, అంతా ఒకటిగా కూర్చొన్నారు. భోక్తలకు భోజనమైనతర్వాతకదా కర్తకు తిండిఅంటే, అక్కరలేదన్నాడు గణపతి. ఈనియమాలు అట్టే అక్కరలేదు. అతనికి దక్షిణనియమం తప్పకుంటే చాలు. అవుపోసనం పట్టడమే ఆలస్యం ఇక ముందుపు రోహితుడు పడితేనే గాని ఇతరులు పట్టరు. గణపతి ఎంతసేపటికీ పట్టడు. అవధానిచేత నీళ్లు పోసుకొని, ఎడమచేతివ్రేల విస్తరి ముట్టుకొని ఉన్నాడు; 'కానీరా' అంటాడు. ఆఖరుకు 'దక్షిణ' అన్నాడు గణపతి. "సిగ్గులేనిమనిషివిగా ఉన్నావు. నీదక్షిణ ఎగవేస్తారట్రా? ఏడ్చావులేకానీ; తారతమ్యం అక్కరలేదూ?" అని చీవాట్లు వేసేటప్పటికి గణపతి అవుపోసనం బట్టాడు.

నెయ్యివడ్డనలో చాలుఅనేవరకూ వడ్డించాలి. గణపతి వేళ్లు సందులుగా పట్టుకొని, ఎప్పటికీ చాలు ననడు. నేతిగిన్నె ఖాళీఅయినా చేర నిండదు. పద్మావతికి భయం వేసింది. ఇక అందులో అదితక్కువ, ఇందులో ఇదితక్కువ అనడం; రెండోపిండివంట లేదని ఆక్షేపణ: పరమాన్నంలో బెల్లం వేసినందుకు తప్పుపట్టడం. భానుమూర్తికి కోపం వస్తూఉంది: ఏమీ అనగూడదు. ఏమిచెయ్యడం? ఇక పట్టలేక, "తద్దినపు పాయసంలో పంచదార పనికిరాదుగదా?" అన్నాడు. "వీటికంతా శాస్త్రాలేమిటి?" అని గణపతిజవాబు.

ఎట్లాయితేనేమి, భోజనాలు అయినవి. కమలమ్మ "నాయనా, శ్రీహరీ, తాంబూలాలు ఇయ్యి" అనగా అబ్బాయి అర్ధఅర్ధరూపాయ పెట్టి తాంబూలాలు ఇచ్చాడు. అవధాని ఆశీర్వదిస్తూండగా గణపతి తాంబూలం క్రిందపెట్టాడు. శ్రీహరి 'తాంబూలం తీసుకోండి శాస్త్రులుగారూ' అని బతిమాలుకొంటాడు.

గణ—మీతాతగారు మానాయనకు ప్రతి తద్దినానికీ గోదానం చేసేవారు. మీనాయన పంచలచాపు ఇవ్వడం మామూలు. అదీపోయింది మీకాలాన "నా నాటికి తీసికట్టు నాగంభొట్లూ" అన్నట్టు. అందుకూ అనను. పెదవి కదల్చని అవధానికీ అర్ధరూపాయా, మంత్రంచెప్పిన నాకూ అర్ధరూపాయూనా? ధర్మమా?

భాను—తమ్ముడూ, మరోపావలా ఇయ్యి.

శ్రీహరి—(పావలాపెట్టి) తీసుకోండి శాస్త్రులుగారూ.

గణ—(తీసుకొని) అయితే మూడోబ్రాహ్మడే కూర్చొనిఉంటే తాంబూలాలు ఇవ్వవలసిందేగదా? గంధపుచెక్క పెట్టామంటే బ్రాహ్మడు ఉన్నట్టే. ఆతాంబూలం నాకు వస్తుంది, రాజపురోహితుణ్ణి కాబట్టి.

ఇంతటికి భానుమూర్తికి వచ్చిన కోపానికి మేర లేదు. కాని తద్దినపుబ్రాహ్మణ్ణి యేమనగలడు? నా

రకహాస్యంగా, "మీభోజనానికి పైగా మూడో బ్రాహ్మడి పాలు మీరు తింటే, మీకు ఆదక్షిణ వస్తుంది. లేదా గంధపుచెక్క చేత తినిపించండి దానికిస్తాం" అన్నాడు. "బ్రాహ్మడిమర్యాద గంధపుచెక్కకు జరపాలి. లేకుంటే బ్రాహ్మడేనని గంధపుచెక్కను ఎందుకుపెట్టడం?" అని గణపతి అన్నాడు. "నిజమే, అదితిని తీసుకుంటే" నని భానుమూర్తి అన్నాడు. అంతట అవధాని నాలుగుచీవాట్లువేసేసరికి ఆకర్కోటకుడు, "నీ సొమ్మేం పోయింది, నాకు వచ్చేడబ్బులు పోతే" నంటూ అతికోపంతో తాంబూలం అక్కడపెట్టి లేచి పోయినాడు. "తీసుకోరా గణపతీ" అంటూ అది పట్టుకొని అవధాని వెనకనే వెళ్లాడు.

"మంచీచెడ్డా, న్యాయం అన్యాయం ఆలోచించరుగదా యీకర్కోటకపుబ్రాహ్మలు" అని భానుమూర్తి అన్నాడు.

కమ—అలాఅనకు నాయనా! తప్పు. పితృకార్యం జరిపిన బ్రాహ్మడిలో పితృదేవతలు ఆవహించి ఉంటారు.

భాను—వీడిలో పితృదేవతలే ఆవహించిఉంటే ఆపితృదేవతలు వీణ్ణి యిలా ప్రవర్తించనిస్తారా?

కమ—వాండ్ల కులాచారం అది.

భాను—ఆకులమేగదా సుబ్బావధానిది. ఆయన చూడూ, ఎంతసౌమ్యంగా ఉన్నాడో!

*   *   *   *

కష్టపడి వంటచేసినపద్మావతికి ఆకలి అవుతూంది. వృథాగాపొద్దుపోవడం ఎందుకని "అత్తా! లేచిరావూ?" అని పిలవగా, కమలమ్మ లోపతికి వెళ్లింది.

౬

భాను—తమ్ముడూ, నీవైనా అమ్మకు చెప్పుదూ. లక్ష్మివంటి యీపిల్లకష్టము చూస్తే గుండె నీరైపోతుందీ. జాతీనీతీలేని నీచులకు ఐశ్వర్య మిస్తాడు వెధవదేవుడు. శౌర్యమానవంతులకు తిండికి లేకుండా చేస్తాడు. మొన్నటిరోజు అమ్మ చెల్లెను కొడితే నాగుండె బద్దలయింది. ఈముద్దులుగులికే లక్ష్మికా యీ కష్టాలు?

సరో—అన్నయ్యా, అన్నయ్యా, బావ వచ్చి పోయినప్పటినుంచీ అమ్మ నెయ్యిలేకుండా అన్నం పెట్టుతూంది.

శ్రీహరి—దానికితోడు కొట్టడమెందుకూ?

సరో—రాత్రి నేను యేడిస్తే నెయ్యివెయ్యడానికి ముంతతెచ్చింది.

(లోపలినుంచి) సరోజినీ, ఏమిటది?

సరో—(నోరుమూసుకొంది.)

భాను—తమ్ముడూ, ఈవెధవతద్దినంనాడు యీ కర్కోటకపువైదీకులకు పిండివంటలు చేసిపెట్టడానికీ, ఎంతటికీనిండని కన్నాలచేరలలో పొయ్యడానికీ నని కూడవేస్తూ, బంగారుతల్లికి కడుపుకాలుస్తూ, వారం రోజులు నెయ్యి లేకుండా తల్లి అన్నముపెట్టడమా? వివేకానందులవారు "మూఢాచారాలలోబడి జీవనము దుర్భరమౌతున్నది" అన్నమాటకు అందరికీ అర్థము తెలుస్తుందా? ఎన్నికష్టాలు అనుభవించాలి, లేక ఎంత లోకవిమర్శన ఉండాలి?

సరో—అయితే, అన్నయ్యా, వీండ్లకోసమా నాకు నెయ్యిలేకుండా చేసింది?

శ్రీహరి — వాండ్లకోసంగాదు చెల్లీ, తద్దినం కోసం. ఇవ్వాళ మనయింట్లో తద్దినంగడూ!

సరో—అంటే?

శ్రీహరి—అప్ప చచ్చిపోయినరోజు ఇవ్వాళ. ఆయనకు ఇవ్వాళ అన్నము పెట్టాలి. పెట్టకుంటే ఆకలికాదూ?

సరో—అయితే, మనశాస్తుర్లూ ఇంకెవరో ఒకాయనా వచ్చారు గాని, అప్పవచ్చాడా? వస్తే నాకేమీ తిండానికి తేడూ?

శ్రీహరి—చచ్చిన అప్ప ఎట్లా తెస్తాడు?

సరో—ఎట్లా వచ్చి తింటాడో అట్లనే.

శ్రీహరి—అట్లకాదు చెల్లీ. వీండ్లకు పెడితే ఆయనకు ఆకలి తీరుతుంది.

సరో—బహుబాగు! — అయితే నీవు చదువుకొంటుంటే ఇక్కడ ఎవరన్నా తింటే అక్కడ నీకు ఆకలి తీరుతుందా?

భాను—ఒక్క ముద్దు. ఏదీ, మరో ముద్దు.

సరో—నీపేరు చెప్పి ఈ అన్నయ్యకు ముద్దుపెడతాను; నీకు ముద్దు పెట్టినట్టే.

సరోజినికి జవాబు చెప్పలేక ఒకర్ని మార్చి ఒకరు ముద్దుపెట్టుకుంటూ నలిపేసరికి, అక్కణ్ణుంచి పారిపోయింది.

భాను—తమ్ముడూ, మతగ్రంథాలేమైనా చదివావా?

శ్రీహరి—అట్టే చదవలేదు. తీరిక ఉంటేకదూ? నీకంటే బడిచదువూ, పరీక్ష బెదురూ లేదు కాబట్టి అన్నీ చదువుతావు.


భాను—వివేకానందులవారి గ్రంథాలన్నీ చదివావా లేదా?

శ్రీహరి—నీదగ్గరనే గదా చదివాను?

భాను—అవి చాలు. పరిశోధన చేసేజ్ఞానం కావలసినంత కలుగుతుంది. శ్రాద్ధమంటే యేమిటి?

శ్రీహరి—అనగా శ్రద్ధతో చూడినది.


భాను—అవును. అంటే పెద్దలు ఏసత్కార్యాలు చేస్తూఉండిరో వాటినిపుత్రులు శ్రద్ధతో చేస్తే పెద్దలు పరితృప్తులౌతారు. అంతే గాని వారిపేరు బెట్టి నీవు భప్పళాలు కొట్టడంగాదు. ఆలోచించు. నీకు చెప్పే దేమిటి? విమర్శనశాస్త్రము చదివే ఉంటావు గదా. పోనీ, పామర జనుల విశ్వాసాన్ని బట్టి పెద్దల ఆకలి తీరుస్తామనే భావతోం ఆలోచిస్తాము.



"తీసుకోరా గణపతీ" అంటూ అది పట్టుకొని

నీఆకలి నీవు తీర్చుకో లేవు, పితృదేవతల ఆకలి తీరుస్తావా యిక ?

శ్రీహరి— ఈవిషయమై అట్టే నేను ఆలోచించలేదు. ఇద మిత్థమని జవాబు తేల్చిచెప్ప లేను.



అవధానివెనకనే వెళ్లాడు.

భాను — చచ్చిపోయిన తర్వాత పితృదేవతలు ఇంకా వచ్చి నీ పిండాలు తింటున్నారనే అనుకొంటున్నావా ?

శ్రీహరి—వచ్చి తినరని నీ వెట్లు చెప్పగలవు ?

భాను — పిండాలు ఖర్చుకావడం లేదు కాబట్టి.

శ్రీహరి—తమాషా కాను. దివ్యజ్ఞానసభవారు మరణించినవారి జీవులను పిలిచి వాటితో సంభాషణలు జరుపుతున్నారే ?

భాను — వస్తున్నాయనే అందాము. నీ పిండాలు వాటికి కావలె నని సిద్ధాంత మేమిటి ? తిలకుగారి ఆత్మను 'నీదినచర్య యేమిటి ?' 'అని అడిగితే దేశాలు తిరిగి ఇండియాకు స్వరాజ్యము సంపాదించే ప్రయత్నమే' నన్నాడు. ఆకలి దప్పికలు లేవని చెప్పాడు.

శ్రీహరి — ఆయనకంటే లేకపో వచ్చు. సామాన్య మానవులకో ?

భాను—ఇందులో దిగితే, మన మతం ఒక మహారణ్యం. ప్రతి సిద్ధాంతానికి విరుద్ధంగా పదిసిద్ధాంతాలు ఉన్నాయి. ఎవడి కర్మనుబట్టి వాడు కర్మఫలము అనుభవించడానికి పోతున్నాడనే కర్మసిద్ధాంతం ఉండగా, ఇక నీపిండాలు వాడికి చెందవుకదా ?

శ్రీహరి—పుత్రుడంటే 'పుం' అనే నరకమునుండి కాపాడేవాడు. శ్రాద్ధమువల్ల ఆకార్యము సాధ్యమౌతుంది.

భాను—చేసినకర్మకు ఫలము తప్పదుకదా అను. ఇక ఒకడు మంచికర్మ చేసిఉంటే వాణ్ణి అదే రక్షిస్తుంది. లేకపోతే నీపిండాలు అతణ్ణి రక్షించలేవుగదా? అట్లు రక్షించడమే సాధ్యమైతే దుష్కర్మచేసినవారిని శ్రాద్ధాదికకర్మలచేత డబ్బుగలపుత్రులే రక్షించగలరు; లేనివారురక్షించలేరు. దీన్నిబట్టి, డబ్బుగలవారు దుష్కర్మచేసినా వారికి భయం లేదు. లేనివాడు చేస్తేముక్తి లేదు. అనగా, దేవుణ్ణి డబ్బుగలవారు కొనివెయ్యవచ్చునన్నమాట. ఇదే మనమతమైతే నా కక్కర లేదు.

శ్రీహరి—ఆఅభిప్రాయముచాలామందికి ఉన్నదిసుమీ.

భాను—ఇంకొకవిషయము. పితృదేవతలన్నాము. వారిని దేవతలనుగా భావించి భక్తితో ఆరాధించే వేళను ఈచండాలపు బ్రాహ్మణనామకులను వారిస్థానంలో కూర్చోబెట్టడమా? తానుబోతులూ, ముండలముఠాకోరులూ, అసత్యవాదులూ, అన్యాయకారులూ నా పితృదేవతలస్థానం ఆక్రమించేవారు? పితృస్థానం ఆక్రమించగలవాడేడీ?

శ్రీహరి—ఆవిషయంలో సందేహం లేదు. నిజమైనబ్రాహ్మడు నీకు చిక్కడు. మాళవ్యాగారిని 'మనదేశం బాగుపడడానికి ఏమికావలె'నని అడిగితే 'నిజమైనబ్రాహ్మలు కావలె' నన్నాడు. అంటే వారు లేరన్నమాట.

భాను—ఇక శ్రాద్ధభోజనమే పితరులకు అవసరమనుకొందాము. మనలో ఎవడైనా సన్న్యాసం పుచ్చుకొన్నవాడు మరణిస్తే, వాడికొడుకు ఆరాధన అని ఒకపితృకార్యం చేస్తాడు. అందులో తాతముత్తాతల పోలూపొందూ రాదు. తండ్రిని ఆరాధించడమే. అట్టివిషయంలో, ఈయన సన్న్యాసం పుచ్చుకొన్నాడని, ఈయన తండ్రితాతలు తిండిమానుకొంటారా? మరిన్నీ, ఏమీవద్దని సన్న్యాసంపుచ్చుకొన్నవాడిని బలవంతమాఘుస్నానంగా సంసారంలోకి లాగి నీవు అన్నంపెడితే, వాడు వస్తాడా? తింటాడా? సంసారంలోనే వున్న తాతముత్తాతలను తలచవు; వారి ఆకలి చస్తుందా?

శ్రీహరి—పితరులకు అన్నమే అవసరము అయితే, కొడుకు సన్న్యాసి అయినమాత్రాన ఆయనకు ఆకలిపోతుందా? ప్రకృతివిరుద్ధము.

భాను—ఇక ఆధ్యాత్మికంగా ఆలోచిస్తాం: మన ఆధ్యాత్మికసారస్వతసారం భక్తీ,సద్వర్తనమాత్రమే ప్రధానము అని. జ్ఞానియైనవాడు ప్రతివాడూ, ఈజపతపాలూ, ఈపితృకర్మలూ అనవసర మంటున్నాడు. సన్న్యాసాశ్రమము మనజీవనంలో పరమావధి. అది సత్యమని అందరూ ఒప్పుకొంటారు. అదే సత్యమైతే, ఈ అసత్యంతో మన కేమిపని? సత్యం అవలంబించడం, అసత్యం విసర్జించడం యోగుల కేమి, కాని వారికేమి? అందరికీ అవసరమే. "వారు యోగులు; వారికి సత్యం ప్రధానం. మనం సంసారంలో ఉన్నాము. మనకు ఈఅసత్యమే ఉండవలెను." అని జ్ఞానం గలవాడు ఎవడూ అనడుగదా? అసత్యం వదలేకొద్దీ జన్మ పవిత్ర మౌతుంది. క్రమక్రమంగా పవిత్రమైతేనే కాని ఆత్మజ్ఞానం గలుగదు. ఒక్కమారు యోగులమయ్యేవరకూ అసత్యమే పట్టుకొనిఉందాం అంటే అందులో తెలివేమిటి?

శ్రీహరి—నాకు చాలాకాలంగా మనసులో ఒకఆలోచన ఉంది. ఈమూఢ్యానికంతా స్వార్థపరులైనబ్రాహ్మలు కారకులని.

భాను—అది రూఢి.

శ్రీహరి—ఈ మూఢాచారాలు మనకే కాదు, అన్నిజాతులవారికీ ఉన్నవి.

భాను—శ్రాద్ధము, మళ్లీ, కేవలము మూఢాచార మనడానికి వీలులేదు. మూఢులచేతులలో బడి మూఢమైంది. నీవు చెప్పినట్లు ఈమూఢాచారాలు అన్నిజాతులవారికీ ఉన్నవి. మనకూ ఉన్నవి. ఇవన్నీ మన వేదమతానికి సమ్మతములు కావు. అని వేదములుబాగుగా పరిశీలించినవారు చెబుతారు. కాని ఇవి ప్రాచీనాచారాలక్రింద నిల్చినవి. వేదం దైవదత్తము, అపౌరుషేయము

అనిచెప్పువారు వేదములో చెప్పినట్లు ఎందుకు నడుచుకోరు ? అందులో చెప్పినట్లు నడుచుకోవాలి, లేకుంటే దానిని వదలుకోవాలి. ఇకసంప్రదాయమూ, ఆచారమూ అంటే ఎవరు ఏర్పరచిన ఆచారం ఆచరణీయమని నిర్ణయించడం? తరతరాలుగా పెద్దలు చుట్టలు తాగితే పుట్టేవారు తాగాలి; ఆచారం విడువరాదు గదా? అట్లయితే నేను ఒకఆచారం ఏర్పాటుచేస్తాను, సురాచారం. సంప్రదాయమని ఇక తరతరాలవారూ ఆచరించకతప్పదు. ఆలోచిస్తే యీవంశాచారాలూ, సదాచారాలూ అనేవి కొన్ని పరమమూఢాచారాలు మనను తినేస్తున్నవి. ఈకర్మమూవత్తూ అనవసరమని జ్ఞానులు చెప్పనేచెప్పారు. మనమే అడుసులో పడ్డ పిల్లికి అదేవైకుంఠ మన్నట్టు బాధపడుతున్నాము.

శ్రీహరి——ఈచిక్కంతా వదలించుకొని మన కర్మలన్నీ సంస్కరించుకొనవచ్చునుగదా ?

భాను—— శ్రాద్ధకర్మ కేవలము చెడ్డదికాదు.మానవుడికి ఎప్పుడూ ఉదాహరణభూతంగా మార్గదర్శిగా ఒకడు ఉండాలి. ఊరక "సత్యంవద", ధర్మంచర" అని ధర్మసూత్రాలు చెప్పినంతమాత్రాన ప్రపంచం బాగుపడదు. ఆవిధంగా ఒకవ్యక్తి ఆచరిస్తే, అందరికీ అతన్ని చూచి ఉత్సాహమూ, తెంపూ, నీచజీవనంమీద రోతా పుట్టి మంచిదారి తొక్కుతారు. ఆవిధంగా కష్టాలెన్నో పడి సత్యవ్రతమాచరించిన మహాపురుషులను అప్పుడప్పుడూ సాధ్యమైతే ఎప్పుడూ స్మరిస్తుంటే, భ్రమరకీటన్యాయంగా వీరిజీవితాలు బాగుపడతాయి. అందుకోసమని పోయినవారిని శ్రద్ధతో స్మరించడం, అనగా శ్రాద్ధం పెట్టడం. అంతేగాని, చండాలపుబ్రాహ్మలకు పెట్టడానికని కన్న బిడ్డలకు కడుపులు కాల్చడం గాదు. తమ్ముడూ, నేను చెప్తాను విను. సత్యంగా చెల్లెలికి వారంగా నెయ్యి ఉన్నట్టు కనబడదు. ఈవిధంగా మనదేశంలో ఎన్నివేలకుటుంబాలు ఉంటాయంటావు? వారందరికీ ముక్తియెన్నటికి ?

శ్రీహరి —— మనమేమిచెయ్యగలము ? లోకం అంతా మరామత్తు చేయగలమా ? నేనొక్కణ్ణి, నీవొక్కడివి.

భాను——అట్లనకు, 'నేనొక్కణ్ణీ, నీవొక్కడివి' అంటావేమి ? 'మనమిద్దరము' అనరాదూ ? మనమధ్య ఉండే భగవంతుడితో ముగ్గురము. ఇక ప్రపంచాన్ని ఎదిరించవచ్చు. సత్యం మనపక్క ఉన్నంతసేపూ భయ మెందుకూ ? కష్టానికి వెరవడం నీచలక్షణం. ధర్మానికి కష్టాలుపడ్డవారే శాశ్వతప్రతిష్ఠ సంపాదించి విశ్వజీవనానికి మూలకారకు లౌతున్నారు.

శ్రీహరి——అయితే మనం సదుద్దేశంతో మూఢాచారాలను తుంగలోతొక్కినా, ప్రస్తుతం డబ్బులేక ఉన్నందువల్ల, గతిలేక సదాచారాలు మానారు అంటారు.

భాను——అంటే అననీ. భయమెందుకు ? ఎల్ల కాలమూ నీవు డబ్బులేకనే ఉంటావా ? ఇక రెండు నెలల్లో బియ్యేపరీక్ష అవుతావు; ఉద్యోగం చేస్తావు. అప్పుడు అయిదురూపాయలు లేక తద్దినం మానాడు అనలేరుగదా ? దానికి తోడు లోభితనం దగ్గరచేరనీయకుండా సద్వ్యయం చేస్తుంటివా, అందరూ నిన్ను చూచి హర్షిస్తారు. ముందు అనుమానించినా, నెమ్మదిగా నీదారికే వస్తారు. తెలేనివారు తెలియక మాఢ్యంలో ఉండీ, తెలిసినవారు భయంలో, మౌఢ్యంలో ఉంటే తరించడ మెన్నటికి ? విద్యావంతులు మార్గదర్శకులు కావాలి. ప్రతిఆచారమూ శోధించి, చెడ్డా చెత్తా మాని, మంచిమంచిరీతిన ఆచరిస్తాము. అందరికీ జీవనం కొంచెం సాధ్యంగా, రుచిగా చేతాం. తమ్ముడూ, ఇదే కంకణంగట్టాను. ధర్మసేవకుడనైనాను. నీతో ఇద్దరమూ, దేవుడితో ముగ్గురమూ, ఇకేమి ? దీర్ఘంగా ఆలోచించి సత్యమని తోచింది విశ్వమంతటా వెదజల్లుదాం.

శ్రీహరి——ఇద్దరమా ?

భాను——మళ్లీ ఆమాటఅంటావు ? బౌద్ధమతకర్త బుద్ధుడు మొదట ఒక్కడే ఒకపక్షము. మొదట క్రైస్తు ఒక్కడు; మహమ్మదు ఒక్కడు. సత్యం తోడైతే, ప్రపంచమంతా ఎదిరించినా ఏమిభయం ? ముందు ఎదిరించినా, వెనక నీకు పాదాక్రాంత మౌతుంది.

శ్రీహరి——మౌఢ్యవిముక్తి సమాజం లేవదీస్తాము. దేవుడితో ముగ్గురమూ మొదటిసభ్యులం, నీవన్నట్టు.

అణ్ణామలై విశ్వ విద్యాలయము

ఒంగోలు పద్మరాజు, బి, ఏ.

"సహ నౌ యశః సహ నౌ బ్రహ్మవర్చసం"

(తైత్తిరీయోపనిషత్తు)

విశ్వవిద్యాలయములు విజ్ఞానమును వెదచల్లు స్థానములు. ప్రాచీనకాలమున భారతదేశమున విశ్వవిద్యాలయము లనేకములు వర్ధిల్లినవి. వాటిమూలమున భారతదేశ విజ్ఞానము ప్రపంచమున కంతయు ప్రసరించెను. పూర్వము మనదేశపు విశ్వవిద్యాలయములను ఆకాలపు రాజులు పోషించుచుండిరి. విద్యాభిమానులగు సంపన్నులు విద్యాపోషకు లయిరి. మనదేశమున ఆంగ్లప్రభుత్వము ప్రారంభమయిన తర్వాత పాశ్చాత్య నాగరకతా విజ్ఞానములు ప్రబలినవి. గడచినశతాబ్ది మధ్యభాగమునుండి మనదేశమున విశ్వవిద్యాలయములు కొన్ని మొలక లెత్తినవి. ప్రాయికముగ వీనియందంతటను ఆంగ్లభాషాబోధనమునకును, పాశ్చాత్యనాగరకతా విజ్ఞానముల ప్రసరణకును ఎక్కుడు ప్రాధాన్య మొసగబడుచున్నది. ఈ విశ్వవిద్యాలయము లన్నియు ప్రభుత్వమువారి యాదరణవలన వృద్ధికి వచ్చియున్నవి.



రాజా సర్ అణ్ణామలై శెట్టిగారు (విశ్వవిద్యాలయస్థాపకుడు)

మనచెన్నపురిరాజధానియందుగల మూడువిశ్వవిద్యాలయములలో రెండు చాలవరకు ప్రభుత్వమువారి పోషణలోనే యున్నవి. అణ్ణామలైవిశ్వవిద్యాలయస్థాపనమునకుగాని, తదభివృద్ధికిగాని సంపూర్ణముగ రాజా సర్ అణ్ణామలై శెట్టిగారిసహజౌదార్యమే కారణము. ఈవిద్యాసంస్థ చిదంబరమునకు తూర్పుదిశను ఒకటిన్నర మైలుదూరమున నున్నది. చిదంబరము చాలపురాతనమైన శైవక్షేత్రము. అనాదిగ చిదంబరము ద్రవిడ వాఙ్మయ విజ్ఞానములకు కేంద్రమై, విద్యార్థులను, రాజులను, జిజ్ఞాసువులను అనేకుల నాకర్షించుచుండెడిది. అట్టి చిదంబరమునకు చేరువనే విశ్వవిద్యాలయము నొకదానిని స్థాపించుట మిక్కిలి యొప్పియున్నది. ఈవిశ్వవిద్యాలయస్థాపనమునకు పూర్వ మిచట నుండిన శ్రీ మీనాక్షీకళాశాలను, తమిళ సంస్కృతకళాశాలలను, గానకళాశాలను శ్రీ అణ్ణామలై శెట్టిగారే పోషించుచుండిరి. ఈ విద్యాసంస్థల నెల్ల కలిపి విశ్వవిద్యాలయము నొకదానిని స్థాపించి ద్రవిడ భాషాపోషకులయి తమిళనాడున కొకప్రత్యేకవిద్యాపీఠము కావలయునని యువ్విళ్లూరుచుండిన ౧,౫౦,౦౦,౦౦౦ల తమిళులకృతజ్ఞతకు పాత్రులు శ్రీ శెట్టిగారే. దీని స్థాపనమునకు వీరు ఇరువదిలక్షలరూప్యముల నొసగిరి.

మదరాసుప్రభుత్వమువారును వీరి యౌదార్యమునకు మెచ్చి విశ్వవిద్యాలయభవననిర్మాణములకుగాను ఏడు న్నరలక్షల రూప్యములను, విరాళముగ ఇరువదియేడు లక్షలరూప్యములును, ఇవిగాక వార్షికముగ ఒకటిన్నర లక్షలరూప్యములను ఒసంగుటకు సమ్మతించిరి. తరువాత ౧౯౨౯-వ సంవత్సరము జనవరినెలయం దీవిశ్వవిద్యాల యము స్థాపింపబడినది.

అణ్ణామలై విశ్వవిద్యాలయమున ప్రాచ్యభాషా వాఙ్మయవిజ్ఞానములకు ప్రాధాన్య మొసగబడియున్నది. ఇచటి పాఠసూచియందు తమిళసంస్కృతవాఙ్మయముల పరిశోధనకు ప్రత్యేకవసతు లేర్పరుపబడియున్నవి. ఈ విద్యాపీఠమునగల మహాపండితులయాజమాన్యమున జరుగు పరిశోధనలు అమూల్యమైన విజ్ఞానసంపదను విస్తరింప జేయగలవనుటకు సందేహము లేదు. ప్రతిభాషాశాఖ యందును ప్రత్యేకము భాషాపరిశోధకవిద్యార్థులు గలరు. వీరు చేయువాఙ్మయపరిశోధనలయందు ఇచటిపండితులు వీరికి సాయముచేయుచుందురు ఇతరవిద్యాపీఠములందు వలె నిచటను ప్రాచ్యభాషలయం దున్నతపట్టపరీక్షలు




రావుబహాదూరు యస్. ఇ. రంగనాథంగారు, యం, ఏ., ఐ, ఇ. యస్. ఉపాధ్యక్షులు.

కలవు. ప్రాచ్యభాషాకళాశాలయందు విద్యార్థులకు వారి తరగతులనుబట్టి విద్యార్థివేతనముల నిచ్చుటగలదు.

ఈవిద్యాపీఠమునకు సంబంధించిన గానకళాశా లయు ఒకటిగలదు. ఇచట నాలుగుసంవత్సరములు సంగీ తము నేర్పబడును. గానకళాశాలయందలి విద్యార్థులు ముఖ్యముగ తెలుగు నభ్యసించవలెను. అందుకుగా ప్రత్యే కమైనఏర్పాట్లు చేయబడియున్నవి. గానకళయందు కొంతప్రవేశమున్నవారిని రెండవతరగతియందుగాని, మూడవతరగతియందుగాని చేర్చుకొనెదరు. ఈ విద్యార్థు లకు వేతనము లీయబడుచున్నవి.

ఇతరవిశ్వవిద్యాలయములందువలెనే యిచటను గొప్పప్రధానకళాశాల యొకటి గలదు. ఇంటరుమీడి యటుమొదలు యం. ఏ., వరకును ఇందువిద్య నేర్ప బడును. ఇచటచదువువిద్యార్థులసంఖ్య షుమారు అయిదు వంద లుండును. ఇచటసయితము ప్రతిశాఖయందును పరిశోధనలకు ప్రత్యేకవసతు లేర్పరుపబడియున్నవి. భౌతిక, రసాయన, గణిత, వార్తా (Economics) శాస్త్రములందును, చరిత్ర, వేదాంతము మొదలయినవిద్య లందు పరిశోధనలు జరుగుచున్నవి. వీరికి విశ్వవిద్యా లయమువారు సౌకర్యముల గూర్చి వీరిపరిశోధనలకు ఎక్కుడుసాయము చేయుచున్నారు. ఈవిధముగ నీ విద్యాపీఠమున సర్వవిద్యలకును, సకలకళలకును, శాస్త్ర ములకును, అత్యుత్తమమయినబోధన పరిశోధనలకును తగినవసతులు కల్పింపబడినవి. పరిశోధనకు వసతులు కల్పించుట, విద్యాబోధనమునకు సరియయినఏర్పాటులు కావించుట, విశ్వవిద్యాలయమున విద్యార్థులకు వసతి గృహముల స్థాపించి వారికందరికి ఏకవిధమయిన విద్య గరపునట్టివసతి విశ్వవిద్యాలయపద్ధతుల నెలకొల్పి విద్యా ర్థులకును, విద్యాబోధకులకును పరస్పరముమైత్రిని కలి గించుట, ప్రాచ్యవిద్యావిజ్ఞానముల పునరుజ్జీవింపచేయుట, వీటికన్నిటికి కావలసినద్రవ్యమును ప్రోగుచేయుట, ఈ విద్యాపీఠమువారి యుద్దేశములలో ప్రధానము లయినవి.

ఈవిశ్వవిద్యాలయమువారియాశయములు చాల గొప్పవి. వీరుతలపెట్టినరీతినే విద్యాలయమును సాగించిన యెడల ఈవిశ్వవిద్యాలయము దేశమునకు గొప్పసేవ




ప్రధాన కళాశాల

చేసినదగును. ఈవిశ్వవిద్యాలయము స్థాపింపబడి యింకను అయిదుసంవత్సరములు కాలేదు. ఇంతలోననే, వీరు సాధించి నిర్వహించినకార్యము లెవ్వియని ప్రశ్నించుట సరికాదు. ఇచట పారిశ్రామికవిద్యలుసయితము నేర్ప వలయునని కొందరియభిప్రాయము. కాలక్రమమున ఈ విద్యాసంస్థ వృద్ధియై అన్నివిద్యల కును ముఖ్యస్థానము కాగలదు. అందుల కనువగు వసతు లనేకములు వీరికిగలవు. పారిశ్రామికకళాశాలను స్థాపించుటకు ద్రవ్య మపారముగ వెచ్చింపవలయును. ఈ కార్యము త్వరలో నెరవేరునది కాదు. విశ్వ విద్యాలయమువారి మనస్సునను ఈ ఆలోచనే యున్నది. పారిశ్రామిక విద్యల ప్రాముఖ్యమును, ఆవశ్యక ములనుగూర్చి ముచ్చటించుట యనవసరము. బీదవిద్యార్థుల కిచట విద్యార్థివేతనములనొసగి భోజనము పెట్టుచున్నారు.


ఇచట అణ్ణామలై విశ్వవిద్యాలయగ్రంథాలయ మొకటి యున్నది. సుమారు మున్నూటికి పైగా దేశ విదేశ పత్రిక లిచటికి వచ్చుచున్నవి. ఈ గ్రంథాలయము, ముఖ్యమైన సెలవుదినములందు తప్ప ప్రతి దినమును, ఆదివారమునాడు సయితము తెరువబడియే యుండును. ప్రతి విద్యార్థికిని ఒకేసారి నాలుగుపుస్తకముల నిచ్చెదరు. ఈ గ్రంథాలయము కాక విశ్వవిద్యాలయమునకు సంబంధించిన ప్రతిశాఖకును ప్రత్యేకము వేరొక గ్రంథాలయము కలదు. ఎప్పటి కప్పుడు అచ్చగు గొప్ప గొప్ప గ్రంథములను వీరు తెప్పించుచునే యుందురు.

అణ్ణామలై విద్యాపీఠపుటావరణము మూడువందల



శాస్త్రశాఖ

యొకరములవిస్తీర్ణము గలిగియున్నది. విద్యాలయపరిసరములవిద్యార్థులకొరకు విశాలములగు ఆరామస్థలము లేర్పరుపబడియున్నవి. ఆచేరువనే నాలుగువందలకుపైగా విద్యార్థులకు వసతిగూర్పగలహాస్టెలు భవనములుగలవు.




ప్రాచ్యవిద్యాశాఖ

హాస్టెలునందు భోజనాదిసౌకర్యములు చక్కగ నమరియుండును. ఇందులకగుఖర్చుసయితము స్వల్పమే. విశ్వవిద్యాలయము నెలకొల్పబడినపూర్వపు 'తిరుక్కళమ్' అను పల్లె నేటి అణ్ణామలై నగరముయి అత్యారోగ్యవంతమైన ప్రదేశముగ నున్నది. విద్యార్థులకు సదుపదేశములనొసగి వారిని సన్మార్గానురక్తుల చేయుటకు కొందరుపాధ్యాయులు హాస్టెలునందు వసించుట కేర్పాటు లునున్నవి.


చిదంబరము స్టేషనుకడ రైలు దిగి రాగనే విశ్వవిద్యాలయోపాధ్యక్షుల భవనము కానవచ్చును. ఆ భవనమున కుత్తరదిశను ఉపాధ్యాయుల భవనములు కొన్నిగలవు. ఆ మార్గముననే యింకను తూర్పున విద్యాలయభవనములు మూడుగలవు.

ఉత్తరదిశయందు గల భవనములలో రసాయన భౌతిక శాస్త్ర ప్రయోగశాలలును, ఉపన్యాసమందిరములును కలవు. మధ్యనున్న విశాలసౌధము క్రిందిభాగమున విశ్వవిద్యాలయగ్రంథాలయము గలదు. పైభాగమున విశ్వవిద్యాలయపు కచేరీలు, ఉపాధ్యాయుల గదులు, విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘ సమావేశముల సభామందిరము (Assembly Hall) గలవు. ఇందే పట్టప్రదాన మహాపరిషత్తు ప్రతిసంవత్సరమును జరుగుచున్నది. దక్షిణదిశనుగల మరియొక పెద్దభవనమున ప్రాచ్యభాషాకళాశాల గలదు. ఈ భవనమునకు పైభాగమున, ఇంగ్లీషు, చరిత్ర, వార్తాశాస్త్రము, గణితశాస్త్రములకు సంబంధించిన యుపన్యాసమందిరములు కలవు. విద్యాలయములను దాటివచ్చినపిదప విద్యార్థుల సౌకర్యార్థము నెలకొల్పబడిన వైద్యశాల గలదు. తరువాత విశ్వవిద్యాలయమున కతిథులుగ వచ్చు ప్రముఖుల సౌకర్యార్థ మొకవిశ్రాంతిభవనము కలదు. దానిప్రక్కనే తపాలాఫీసు, తంతిఆఫీసు గలవు. తపాలాఫీసునకు సరిగ దక్షిణమున బోవుమార్గమున కళాశాల ప్రధానాచార్యుల



ఉపాధ్యక్షుని భవనము

గృహములుగలవు. ఆదారినే పోయి మరల పశ్చిమము నకు తిరిగినయెడల విద్యార్థుల భోజనశాలలు వచ్చును. అటనుండి హాస్టెలు ప్రవేశించ వచ్చును. హాస్టెలు నుండి తిన్నగా ఉత్తరము నకు వచ్చిన వ్యాయామ శాఖాధికారి గారి కచ్చేరి గలదు. ఈ విశ్వవిద్యాలయము మున విద్యార్థుల ఆరోగ్య విషయమై చాల శ్రద్ధ తీసుకొనుచున్నారు. ఇందులకు గా విశ్వవిద్యాలయోపాధ్యక్షుని యాజమాన్యమున నొక సంఘముకలదు. కళాశాలయందు అన్నితరగతుల విద్యార్థులు వ్యాయామములందును ఫుట్‌బాల్, క్రికెట్, హాకీ మొదలగు ఆటలయందును పాల్గొనుట తప్పనిసరియై యున్నది. వారమునకు రెండుమారులు పాఠములు చదువు కాలముననే, ఆరోగ్యము, శుభ్రత మొదలగు విషయములం దుపన్యాసము లొసగబడుచున్నవి.



విశ్వవిద్యాలయోపాధ్యాయుల నివాసములు


ఇచట విద్యార్థిసంఘము లనేకము లున్నవి. విద్యార్థులను సంఘసేవయందు నేర్పరులజేయుటకు సంఘసంస్కారసమాజ మొకటి గలదు. వీరు గ్రామపున ర్నిర్మాణము మొదలగుకార్యముల చేయుచున్నారు. విశ్వవిద్యాలయవిద్యార్థిసంఘ మొకటి గలదు. ఇందు నిర్వాహకులందరు విద్యార్థులే. వీరు ప్రతిశనివారమువాడను సమావేశమై ఏదేని విషయముల చర్చించుచుందురు. ఇచ్చోట్లగల ఆంధ్రవిద్యార్థులును, కర్ణాటకులును, మలయాళీయులును వారువారు తమకు ప్రత్యేకసంఘముల నిర్మించియున్నారు. ఇట్టిసంఘములనుసయితము విశ్వవిద్యాలయమువారు ప్రోత్సహించుచున్నారు. ఇవిగాక విశ్వవిద్యాలయమున నాటకసంఘ మొకటి గలదు. ఇందు ఉపాధ్యాయులును, విద్యార్థులును కలిసి సంవత్సరమున కొకటిరెండుసారులునాటకముల నాడుచుందురు. ఈ వివిధసంఘములను నిర్వహించుటకు విశ్వవిద్యాలయము వారు సాయపడుచున్నారు. విద్యాలయమునగల సకల విద్యాశాఖలకు సంబంధించినసంఘములు ప్రత్యేకముగా నున్నవి. వీటియన్నిటికిని విద్యార్థులయుత్సాహమును, విశ్వవిద్యాలయమువారిప్రోత్సాహమును కారణములు.

ఈవిశ్వవిద్యాలయము ఆయామవిస్తారముల భారతదేశమందలి విశ్వవిద్యాలయములన్నిటిలోనను చిన్నది. కాని విద్యాభివృద్ధివిషయమున దేనికిని తగ్గినది కాదు. విశ్వవిద్యాలయచిహ్న మున్నతాదర్శములను స్ఫురింపజేయుచున్నది. దాని పైవరుసను రెండువైపుల గల ఏనుగుతలలు గాంభీర్యమును, గొప్పతనమును, తెలివిని, విధేయతను తెలుపుచున్నవి. మధ్యనున్న కమలము, స్వచ్ఛతకును, విజ్ఞానమునకును, జ్ఞానోదయప్రభకును గుర్తయి యున్నది. క్రిందివరుసను పతాకమున కడమవైపున టెంకాయచెట్టు కలదు. (తెన్ = దక్షిణపు, టెంకాయ = దక్షిణదేశపు కాయ) దక్షిణదేశముయొక్కయు, తద్విజ్ఞానము యొక్కయు సమృద్ధిని తెలుపుచున్నది. కుడిప్రక్కనుగల వీణెసా



ముద్రిక

స్వతోపలక్షణమై, సంగీతసాహిత్యముల స్ఫురింప జేయును. మధ్యనున్న గోపురము, స్థలమాహాత్మ్యమును, ప్రాచీనభారతశిల్పకళానైపుణ్యముయొక్క యౌన్నత్య




విద్యార్థుల నివాసములు

మును సూచించును. ఇన్నింటికంటెను, అందుగల "With Courage and Faith" అను ఆదర్శవాక్యము అచటికివిద్యాభ్యాసముకొరకు చేరువారికందరికిని తారకమంత్ర తుల్యము గుచున్నది. మనము నిర్వహింపదలచిన కార్యమును ధైర్యముతోను, దృఢమైన నమ్మకముతోను తలపెట్టవలయు ననుటకన్నను న్నతౌదర్శము వేరొకటి లేదు.


భారతదేశమున విద్యాపద్ధతి సమీచీనముగ లేదనియు, విద్యార్థులకు కొన్ని చిలుకపలుకుల నేర్పి వారిని పరీక్షలకు మాత్రము సిద్ధము చేయుచున్నారనియు నొకయపవాదము గలదు. గవర్నమెంటు ఉద్యోగములకొరకు విశ్వవిద్యాలయ పట్టపరీక్షల కనేకులు చదువుచున్నారు. ఈవిషయమై విశ్వవిద్యాలయములు శ్రద్ధగొని కేవలము పరీక్షలయందుత్తీర్ణులగుటకు మాత్రము విద్యార్థులను తయారుచేయక నిజమైన కళావిజ్ఞానముల వారి కందజేయుట కర్తవ్యము.

దక్షిణహిందూస్థానము వాఙ్మయమందును, చిత్రకళయందును, శిల్పమందును, గానకళయందును, ఇంకను అనేకలలితకళలయందును నిరుపమానమైన ప్రజ్ఞగల దేశమని యనేకులు కొనియాడి యున్నారు. వాస్తవముగ నదియట్టిదియే. అట్టిదేశమున, నేడు మరల సకలకళలను, శాస్త్రములను పోషింపగల విద్యాలయము లవసరములు. అణ్ణామలై విశ్వవిద్యాలయ మీ విషయమున నితోధిక శ్రద్ధాభినివేశములు వహించి మార్గదర్శి కాదగును. విద్యార్థులకు మానసికాధ్యాత్మికశారీరికసంపదలను పొడిగించు విద్యలనొసగి ఆంధ్రద్రావిడకర్నాటాదినాగరకతలను పున



వ్యాయామశాఖాధికారి కార్యాలయము

ఉద్ధరించుటకు ఈవిశ్వవిద్యాలయము నిరంతరము కృషి చేయునగును. త్యాగమూర్తులగు శ్రీ రాజా సర్ అణ్ణామలై శెట్టిగారి కింకువలన ననన్యమగు ధన్యత చేకూరును. సత్ప్రతికవలన నుభయగోత్రములకును కీర్తిగలుగు నటులు శ్రీ అణ్ణామలై శెట్టిగారి ఈమహావిద్యాపీఠము వలన గురుకులమునకును, శిష్యమండలమునకును ఉపనిషద్విగ్రహమగు యోగపద్యముగ "సహ నౌ యశః సహ నౌ బ్రహ్మవర్చసం" అను నుత్తమత్వసిద్ధి కలుగు గాక. మరియు విద్యాపీఠము పరాకాష్ఠ నిట్టిదియ.



శ్రీ శాంతి

—సూర్య.

వినోదశిల్పము


కాగితముల తోరణములు

కో. నరసింహాచారి

పలురంగులకాగితములు తీసికొని, ఒక యంగుళము వెడల్పును, నాలుగంగుళముల పొడవును గలతునుకలుగా కత్తిరించవలెను (చిత్రము 1). అం దొకతునుకను దీసికొని దానికొనలను చేర్చి అతికించినయెడల ఉంగరమువలె నగును (చిత్రము. 2) ఈయుంగరమున మఱియొకతునుకను దూర్చి దానిని గూడ ఉంగరమువలె నతికించవలెను. ఇట్లే ఒకదానిలో నొకటిగా తునుకలను దూర్చుచు ఉంగరములవలె నతికించుచు వచ్చినయెడల నొకపెద్దగొలుసుగా నేర్పడును (చిత్రము 3). గొలుసునందు కొన్నియుంగరముల కొకమారు కాగితములరంగును మార్చుచు రావలెను. ఇట్టిగొలుసునకు సాధారణపువ్రాత కాగితమువలె నంతమందమగు కాగితము బాగుండును.

మఱొకవిధమగు తోరణము

ఈతోరణమునకు సన్ననికాగితములు బాగుండును. గాలిపటముల కుపయోగించు కాగితములను పలురంగులుగలవాటిని దీసికొనవలెను. ఒకకాగితము మొదట రెండు లేక మూడంగుళముల వెడల్పునకు చిత్రము 4 నందు a, b, c అను చుక్కలగీతలవెంబడి మడువవలెను. అట్లు మడిచినదానిని చిత్రము 5 నందు d, e, f, g అను చుక్కలగీతల వెంబడి సమచతురాకారముగ నుండునట్లు మడువవలెను. ఇట్టిసమచతురములు ఒక కాగితమునందు అనేకములు ఏర్పడును. మడువబడిన సమచతురముచుట్టును అంచు వెంబడి కత్తిరించినయెడల చతురములన్ని వేరగును. చిత్రము 5 నందలి చతురములు చిత్రము 6 నందు పెద్దవిగ జూపబడియున్నవి. ఈచతురములను 7 లేక 8 ని చేర్చి తీసికొని a, c అను చుక్కలరేఖవెంబడి మూలకు మడువవలెను (చిత్రము 6). పిమ్మట (చిత్రము 7) o, b అనుచుక్కలరేఖ వెంబడియు, అటుపిమ్మట (చిత్రము 8) o p అనుచుక్కలరేఖవెంబడియు క్రమముగా మడుచుచు వచ్చినయెడల చిత్రము 9 యందలిరూప మేర్పడును. దానిని, చిత్రము 9 యందలి o a అను మూలనుండిగాని, చిత్రము 10 యందలి o p అనుప్రక్కవెంబడిగాని గలచుక్కలగీత వెంబడి కత్తిరించవలెను. o అనుమూలను గూడ కొంచెముగా కత్తిరించవలెను. మడిచిన కాగితమును విప్పినయెడల, చిత్రము 9యందలి రీతి కత్తిరించినయెడల చిత్రము 11 నందలి విధముగను, చిత్రము 10 యందలి విధముగ కత్తిరించినయెడల చిత్రము 12 నందలిరూపము గను ఏర్పడును. o అనుచోట నొకరంధ్ర మేర్పడియుండును. ఒకతోరణమునకు కావలసిన ముక్కలన్నియు, పై రెండువిధములలో నేదోయొకవిధముగనే కత్తిరింపబడియుండవలెను. పిమ్మట నొకనిడుపగుదారమును ఈ ముక్కలమధ్యగల o అను రంధ్రముగుండా



దూర్చి దారముయొక్క రెండుకొనలను రెండు అట్టముక్కలకు కట్టివేయవలెను.

తర్వాత మొదటిరెండుముక్కలను దీసికొని, వాటిలో నొకదానియందలి X గల మూలలను రెండవదానియందలి యదేవిధములగు మూలలకు అతికించవలెను (చిత్రము 11, 13). ఇందలి మొదటితునుకనుదాని ప్రక్కనుండు అట్టముక్కకు అతికించవలెను. పిమ్మట రెండవ ముక్క యొక్క a, b, c, d అను వెలుపలిమూలలను, మూడవ ముక్కయందలి యదే విధముగు బయటిమూలలకు అతికించవలెను. మూడవముక్కయందలి X వంటి లోపలి మూలలను, నాలుగవ ముక్కయందలి యదే విధముగు లోపలిమూలలకు అతికించవలెను.

ఈ విధముగా నతికించుచు పోయినయెడల, ముక్కలన్నియు చిత్రము 14 నందలి విధముగ s t అనుదారముపై పువ్వులవరుసవలె నేర్పడును. ఇందు కడపటిముక్కను, రెండవకొనయందుగల అట్టకు అతికించవలెను.

కావలసినపుడు దార మాధారముగ దీనిని పొడవగుతోరణముగ కట్టవచ్చును. అక్కర లేనపుడు, ముక్కలన్నింటిని దగ్గరకు చేర్చి చిన్నకట్టగా కట్టిపెట్టవచ్చును.

"దేవునిపై విశ్వాసరాహిత్య తీర్మానము"

నందివాడ చిదంబరం, బి. ఏ., బి. యల్.,

[ఇది ఆంధ్రవిశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలరుగారైన సర్. యస్. రాధాకృష్ణన్‌గారి ఆధిపత్యమున ౨౧-౨-33 తేదీని జరుపబడిన రాజమండ్రి ఆర్ట్సుకాలేజి ప్రాతవిద్యార్థిసంఘముయొక్క వార్షికోత్సవ సందర్భమున గ్రంథకర్తచే చదువబడినది.]

సృష్టినుండియూగూడ దేవుని ప్రభుత్వముపై నసంతృప్తిచెందినవారు పెక్కులు ఉండియున్నారు—రిఫారమ్‌ఆక్టువచ్చిననాటినుండియూ దానిపై నసంతృప్తిచెందినవాళ్లు ఉన్నట్టు. కాని, యింతవరకూ, భగవంతుని తోసిరాజనేమొనగాళ్లు,ఎవళ్ళూ గట్టిగా బయల్దేరియుండలేదు—తాలూకాబోర్డుప్రెసిడెంట్లను ఎలక్షను ఆయినమరునాడే విశ్వాసరాహిత్యతీర్మానంతో తోసిరాజనేమొనగాళ్లు బయల్దేరియుండినట్లు. పూర్వకాలంలో మనుష్యులకే స్వతంత్రత, ధైర్యం ఉండేవి కావు. వారు ఒట్టిపోలీసువారిచేతిలోనున్న మేజస్ట్రేట్లు. క్రొత్తకోడళ్లకూ,స్కూలుమాష్టర్లకూ ఉన్నంత స్వతంత్రత, ధైర్యమూకూడా పూర్వీకులకు ఉండేవి కావు. అక్కడక్కడ హిరణ్యకశిపుడూ, నరకాసురుడూవంటి హేమాహేమీలు, ఒకళ్లిద్దరు బయలుదేరినా, అప్పట్లో వాళ్లది మైనారిటీపార్టీ అగుచూ వచ్చుటవల్ల మహాఅయితే ఒకఊపుఊపేరేమోగాని, మొత్తంమీద వారిఆటలు సాగిరాలేదు. పైగా దేవునికి ఎదురుతిరిగి, కాస్త 'ఢీ' అంటే 'ఢీ' అన్నవాళ్లని, అప్పట్లో "రాక్షసు"లని నామకరణం చేసి, దుర్మార్గులక్రింద లెఖ్ఖలలో నమోజుచేయించి పారేశారు. పార్టీబలం లేకయూ, పలుకుబడి లేకయూ అప్పట్లో వారు దుర్మార్గులక్రింద లెఖ్ఖలలో ఎంచబడ్డారుకాని, లేకపోతే శ్రీమహావిష్ణువుకున్నూ,భూదేవికిన్నీ జన్మించిన నరకాసురుడు దుర్మార్గుడగునా? సృష్టికర్తయైన బ్రహ్మమనుమడు రావణాసురుడు ఒట్టిఆకతాయిమనిషి అగునా? ప్రపంచమంతయూ భగవంతునిపరిపాలన క్రింద ఉన్నప్పుడు భగవద్విరోధులు రాక్షసులవడం, భగవంతునికి గులాములై దొంగసలాములుచేసే తాబేదార్లు దేవతలవడం ఏమీ ఆశ్చర్యంగాదు. ఏకాలమందునూగూడ పరిపాలనావర్గమునకు చెందిన పార్టీమనుష్యులు అధికసంఖ్యాకు లగుటవల్ల దేవత లగుచూ వచ్చారు. అల్పసంఖ్యాకులయిన ఎదటిపార్టీ మనుష్యులు "రాక్షసులు" అగుతూవచ్చారు. ప్రస్తుతంలోగూడా 'చిత్తం', 'చిత్తం' అంటూ, పనికల్పించుకొని; వారమున కొకసారైనా జడ్జీగారింటికి అటూయిటూ కాస్త ఎవ్వరూ లేకుండా చూచి, లోపలికి జొరబడి, గులాములై మాటలు జేరవేస్తూన్న ప్లీడర్లంతా సదరు జడ్జీకోర్టులో దేవతలే. తక్కినప్లీడర్లు ఆకోర్టులలో రాక్షసులు. దేవతలకి కమీషన్లు; రాక్షసులకి హాజరు లేనప్పుడు దావాలు కొట్టివేయబడుట: దేవతలకి వాయిదాలు దొరుకుతాయి. రాక్షసులకు దొరికేవి చివాట్లే. దివ్యులకు "బెయిలు" దొరుకుంది. రాక్షసులకు "బెయిలు" నిరాకరింపబడుతుంది. ఇలాగే జిల్లాబోర్డులలోనూ, మ్యునిసిపాలిటీలలోనూగూడా దేవతలూ, రాక్షసులూ అంటూ రెండుతెగలు ఉన్నట్టు కనబడతాయి. దేవతలకు మారుపేరుతో కంట్రాక్టులు. రాక్షసులవార్డులకు మరమ్మతులు సహితం మర్దార్. దేవతలసన్నిహితవర్గానికి ఉద్యోగాలు నూతనంగా సృష్టింపబడుతాయి. రాక్షసుల దూరబంధువులకి సహితం ఉన్న ఉద్యోగాలే ఊడి ఊరుకుంటాయి. ఏది ఎట్లున్ననూ, అసలు భగవద్విరోధులు అంటూ ఒక ఎదటిపార్టీవారు అన్నికాలములలోగూడా ఉండబట్టి దేవునియొక్కపరిపాలనావిధానంలోని లోటులు, అక్రమములూ, కొన్నిగాకపోతే కొన్నైనా వీధులో

బడ్డాయి. లేకపోతే, ఉద్యోగస్థుల లంచాలవలె, వితంతువుల ప్రణయప్రయత్నములవలె, పరీక్షలలో విద్యార్థుల కాపీలవలె, డాక్టర్ల పొరపాటులవలె, జెయిళ్లలో జరిగే ఘోరములవలె, పై ఉద్యోగస్థులు క్రిందవాళ్లను పెట్టేబాధలవలె భగవంతుని ప్రభుత్వంలోని లోటు పాటులు ఇంతమాత్రంగూడా వీధులలో బడకుండానే ఉండేవి. ఏమయితేనేం, అప్పట్లో దేవునిమీద ఒక్కమాటైనా విశ్వాసరాహిత్యప్రతీర్మానం ఉపపాదింపబడేన్నా లేదు. ఒక్కపర్యాయం అట్లు విశ్వాసరాహిత్యతీర్మానం భగవంతునిపై ప్యాసుచేయబడ్డా—పాపం, ఏమాటకిఆమాటే చెప్పుకోవాలి,—ఆమహానుభావుడు ఉద్యోగానికి నీళ్లువదలి, ఛార్జి వప్పజెప్పి వెళ్లిపోయేవాడేగాని, రెండుమాట్లూ విశ్వాసరాహిత్యతీర్మానములు ఆక్టుప్రకారం ప్యాసుచేయించుకొని రెండు చెంబులపేడనీళ్ళు కొట్టించుకొంటేనేగాని వెళ్లనని మూర్ఖించే తాలూకాబోర్డు ప్రెసిడెంటు కాదు.

పోనీ, విశ్వాసరాహిత్యతీర్మానం ప్యాసుచేయకపోయినా, కనీసం, దేవుణ్ణి కోర్టులోకెన్నా లాగే, ఒకఆట ఆడించారాఅంటే, అప్పట్లో కోర్టులుగూడా పకడ్బైనవి కానందున, అదికూడా సాగించికాదు. అదీగాక, ఏదెన్నా కాస్త అవుసరంవచ్చినప్పుడు, కొంచెం "అబద్ధం సాక్ష్యం" సృష్టిద్దామంటే, ఇప్పుడు దొరికినట్లు అప్పట్లో సాక్షే దొరికేవాడు కాడట. అసలు ఆరోజుల్లో సాక్ష్యం యివ్వడం వృత్తిగా పెట్టుకుంటబొత్తిగా అయిదుగురేనట—పృథ్వి, ఆకాశం, జలం, వాయువు, అగ్ని. ప్రతికేసులో ఈఅయిదుగురే సాక్ష్యానికి తయారయ్యేవారట,—మావూళ్లో ప్రతీశవానికి వాహకులు ఒక్కరేవలె. ఆరోజుల్లో కోర్టులే సరిగ్గావుంటే, ప్రజలకి గార్డియను అని విర్రవీగుతూఉన్న భగవంతుడు। ప్రజాభిప్రాయములకు భిన్నంగా నడచిన ఉత్తరక్షణం, గార్డియన్‌గా తొలిగించి, ఏకోర్టుగార్డియన్‌గాడినో ఒకడిని నియమించమని ఠీవైన పిటీషను ఒకటి, ఏకోర్టుపక్షియో కోర్టులో పారేశేఉండును. అప్పట్లో కోర్టులే తిన్నగాఉంటే, వెనకటికి హరిశ్చంద్రమహారాజుకొడుకు తిండి లేక మలమల మాడడం ఎందుకు? అడవులపాలవడం ఎందుకు? ఏచెట్టుక్రింద ప్లీడరో వెళ్లి "అబ్బాయి, నే ఉన్నా పద, మరేమీ భయము లేదు. ఆస్తికి ఒకపాపరుదావాపడేయి, దానితో విశ్వామిత్రునికి "సప్తపాథోధివిభ్రాజిత ఖండభూవలయం" పోయి, ఆయనస్వార్జితంతాలూకు "గెడ్డం" మాత్రం మిగులుతుంది" అని సలహా యిచ్చే ఉండేవాడు. ఆరోజుల్లో కోర్టులే సరిగాఉంటే దశరథమహారాజు కైకేయికి లోగడ ఎప్పుడో యిచ్చిన మూజివానీవరములు ఆయనని బైండుచేసి ఉండేవా? ఏప్లీడరుగుమాస్తాగాడో దశరథమహారాజుదగ్గరకు ఒగరస్తూనైనా పరుగెత్తివెళ్లి "రెండువరాలు యిచ్చినట్టు వ్రాతమూలకమైన సాక్ష్యం లేదయ్యా, లిమిటేషను తగాయిదా, ప్రైమొజనిచరు తగాయిదాలూ ఉన్నాయి. నీవు యిచ్చినవరములు నిన్ను బాధించవు" అని నూరిపోశేసేవుండును. శ్రీరామచంద్రమూర్తి అడవులపాలవడం, ఆయనకు వాలిని అన్యాయముగా చంపిన అపఖ్యాతి రావడం, రావణాసురుని చంపినందుకు బ్రహ్మహత్యాదోషం మీద పడడం "హింసూలా" అంగీకరించనిచర్య సీతాఅమ్మవారిని వదలివేయుటలో కనబర్చడం లేకుండా ఉండేవి. ఎట్లనో యిప్పటికి భగవంతునిపార్టీ క్రమంగా క్షీణదశకు వచ్చింది. భగవంతుని తాబేదార్లు ప్రతిష్ఠించిన వర్ణాశ్రమధర్మములలో వికారాలు బయలుదేరాయి. షట్‌శాస్త్రములలోనూ వెఱ్ఱినమ్మకాలు అగుపడుతాయి. మతాలు మన్నయినాయి. కట్టుబాట్లు గంగలో గలిశాయి. వివాహములలో నమ్మకములు తగ్గాయి. శాసనమంటే భయం పోయింది. నేరముచేయుటలో తప్పు కనబడుట లేదు. అయినా, రోమన్ ఎంపైరులాంటిదే కొంత కాలానికి నశించగా, ప్రజల అమాయికత్వంమీద మాత్రమే ఆధారపడిన భగవంతుని ప్రభుత్వం శాశ్వతమా? అందులో ఈ ఎలక్షనుయుగములో ఆయన పప్పులు ఉడుకుతాయా? భగవంతునికి పలుకుబడి నీరసించడంవల్ల, అప్పుడే, దేవునిమీద విశ్వాసరాహిత్యతీర్మానం ఒకటి ఘాటుగా ప్యాసు చేసి, రాక్షసప్రభుత్వాన్ని ప్రతిష్ఠించేందుకు, తగిన

ప్రయత్నాలు జరుగుతూన్నట్టు వినికిడి బయలుదేరింది. సర్వజనులూ మెచ్చేటట్టు, సర్వప్రపంచాన్నీ భగవంతుడు సక్రమంగా నడిపించాడా అంటే, అలాంటిది ఏమీ కనపడదు. పరిపాలనలోని లోటులు, లొసుగులు, అక్రమములు, అవకతవకలు అపారంగా ఉన్నట్టు అందరికీ తెలియకపోలేదు. ప్రభుత్వవిధానంలో భగవంతుడు ఒట్టిచండశాసనుడు. దయాదాక్షిణ్యములు శూన్యం. భట్రాజుపొగడినట్టు షేక్సుపియర్, పోతన్న వగైరాలు దేవుని పొగడుతూ తాళంవేసినా నౌకర్లు అయిన సూర్యచంద్రాదులూ, సముద్రం వగైరాలు సదరుకవుల అభిప్రాయములతో ఏకీభవించరు. త్రిలోకోపకారపరాయణుడగు సూర్యభగవానుడు తనకొకరు అనిచెప్పి పనిలోకి హాజరవడంలో, బొత్తిగా ప్రపంచమందలి ప్రజ లంతా యింకా ఒకమూల నిద్రపోతూండగానే, లేచి రారమ్మని బాధపెట్టూ, కాస్త ఉదయాన్నే ముఖప్రక్షాళన, కాఫీ, క్షౌరం, స్నానం ఏమీ లేకుండా, పరుగుపరుగున వచ్చి హాజరవమనడం కేవలం కర్కోటకత్వం. ఇది పోనీ, ఒక్కరోజు ఏడుపైతే సరేఅనుకోవచ్చు. ఎల్లకాలమూ, తెల్లవారగట్టే, కొండలు మునిగిపోతూన్నట్టు, డ్యూటీకి రమ్మనడం, లేకపోతే తాలూకాబోర్డుప్రెసిడెంటు ఎలిమెంటరీస్కూలుమాష్టర్లను బెదరించినట్టు బెదరించడం, ఏమీ న్యాయంగా లేదు. పైగా పైముపట్టింపు ఉన్నప్పుడు, భగవంతుడు సూర్యునికి ఓబిగ్ బెన్ గడియారమైనా దగ్గిరఉంచుకోమని యివ్వగూడదూ? అదేమీ లేక, కాలచక్రం తన చేతిలో ఉంచుకొని, పైముకు రమ్మని నిర్బంధనా?

పోనీ, సూర్యభగవానుడు ఒట్టిదొంగ. ప్రపంచములో ఎక్కడెక్కడ ఏంరహస్యం జరుగుతూఉన్నా తనవెల్తురు అక్కడకు పోనిచ్చి, రహస్యం బట్టబయలు చేసే ఒట్టిగ్యాసులైటుగాడు. వీడిని ఏంచేసినా తప్పు లేదంటారు [illegible]కోండి; అతిసుకుమారపు చంద్రునిగతి మాత్రం దేవునిచేతిలో ఏమిబాగుంది? సాయంత్రం, ప్రజలంతా, క్లబ్బులలో యింకా కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ, పేకీశయంకర-పేకఆటయో, కాలక్షేపచక్రవర్తి బిల్లియర్డుఆటయో, కాలహంతక-చదరంగమో యింకా ఒకమూల ఆడుకుంటూ ఉంటే, బీచ్ దగ్గర ఒకమూల యింకా ప్రియులు తమరహస్యప్రేమమాడ్కులతో ఏమీఎరుగనట్టుండి ప్రసంగములు నడిపిస్తూఉంటే, సినీమాల్లో విద్యార్థులు ఆడంగుల బ్లాకుకు కాస్త చేరువగా కూర్చొని "రుడోల్ఫువేలంటినో" యొక్క ప్రణయసరసములను చూచి ఒకమూల యింకా ఆనందిస్తూ ఉంటే, అలాంటివన్నీ వదలిపెట్టి స్నేహితులను విడనాడి, తొందరగా, నాలుగుమెతుకులెన్నా నమలీనమలక, కిల్లీకి మొహం వాచి, కత్తెరమార్కు సిగరెట్టు కాల్చుటకుసహితం నోచుకొనక, ఒంటరిగా, ఉత్తశేలయినవాడిమొహం పెట్టుకొని, డ్యూటీకి సిసలుగా పైముకిప్రతిరోజూ సాయంత్రాన్నీ హాజరవమని ఫర్మానా పైగా, పట్టపగలు డ్యూటీమీద ఉన్నసూర్యునికి ఎవరూ తోడు అవసరం లేదూ అంటే అర్థం ఉందిగాని, యావత్తు ప్రపంచమూ నిద్రపోతూ ఉన్నప్పుడు, ఒంటరిగా అర్ధరాత్రి అంతా దివిటీవేస్తూ కూచునేచంద్రునికి, భయసడ్డా చేసినా, కాస్తవయస్సులోనున్న ఒకఆడపిల్ల నన్నా దగ్గిర ఉంచకపోవడం కేవలం. హుజూరులోనున్న అశ్రద్ధ. అదీగాక బ్రిటిషు గవర్నమెంటువారి ప్రభుత్వంలో సహితమూ నౌకర్లకుఉండే Casual-Leave, Privilege Leave వగైరాలు-వలయునప్పుడు వాడుకొనుటకు—చంద్రునికి నిరాకరిస్తూ, కాస్త మనసైనప్పుడు ఏ "తారాశశాంకవిజయ" మో చదవగా తనివితీరగ విని సంతోషించుటకుగాని, తాను నిజముగ సారంగధరుడుగానని కవులకు బుద్ధిచెప్పుటకై ప్రచారంమీద నాల్గు ఊళ్లూ తిరుగుటకుగాని, వియోగులు నిష్కారణంగా తనమీద పడి ఏడవడం ఎందుకూ అని హరిశ్చంద్రబాహుకులకు గడ్డిపెట్టు నిమిత్తం పయనమైపోవుటకుగాని ప్రభువైనదేముడు చంద్రునికి తగినవిశ్రాంతి, శెలవూ యివ్వకపోవడం కడుంగడు శోచనీయం.

సూర్యచంద్రాదులమాట అటుంచినా, సముద్రునిగతిమాత్రం ఏంబాగుంది? సముద్రునికి స్వేచ్ఛ అనేది నిరాకరించి, కాళ్లకూ, చేతులకూగూడ సంకెళ్లు

తెగిలించి, మేరమీరి ఎక్కడకూ కదలకుండగా ఫర్మానా విధించవచ్చునా? ఎన్నడైనా ఆటవిడుపు ఉండగూడదా? లంచికి లేవనిజడ్జీలలాగున అస్తమానం ఉన్నచోటునసె ఉంటే, సర్వవ్యాధులూ బయలుదేరవూ? విహారానికి ఎప్పుడైన్నా కాస్త చెన్నపట్నంలో ఏరాక్సీథియేటరువైపుకో, ఢిల్లీలో ఏకొత్త ఢిల్లీభవనములవైపుకో, దక్కనులో ఏహైదరాబాదు చూచుటకో వెళ్లనియ్యగూడదూ? బ్రిటిషు జెయిలలో గూడ ఖయిదీలకు అంతకన్న ఎక్కుడు విశ్రాంతి యిచ్చుచున్నారే! కొత్తకోడళ్లకు తలవెంట్రుకలున్న అత్తగార్లు సహితము అంతకన్న ఎక్కువస్వేచ్ఛ యిస్తున్నట్లు ఈమధ్య ఈమధ్య వింటూన్నామే. భగవంతుడు, పోనీ, ప్రపంచములో విద్యావిషయమై బోధనాభ్యాసనపద్ధతులలో ఏమన్నా వివేకం కనబర్చియున్నాడా అంటే, అదికూడా కనపడదు. ఏవిషయమైనా బోధచేయవలెనన్న Experimental గానూ, సులభముగా గ్రాహ్యమగునట్లునూ చెప్పవలెను. అంతేగాని వెనకటికి మాస్నేహితుడొకడు చెప్పినట్లు "గుఱ్ఱం" అంటే "అశ్వం" అని అర్థంచెప్పగూడదు. ప్రళయములు, అగ్నిపర్వతములు, భూకంపములు, ఉప్పెనలు అని ప్రజలు చాలమంది ఊహించుటయేకాని, స్వయముగా యెరుగరు. సదరు భూకంపములు వగైరాలను ప్రతీదేశములోను, ప్రజలందరికీ క్షుణ్ణంగా తెలిసేటట్టు చెప్పవలెనన్నచో మాసమున కొకసారెన్నా వాటిని అన్నిచోట్ల రప్పించవలెను. అట్లురప్పించక పోవడం కేవలం నిర్లక్ష్యం. దీనినిపట్టి చూస్తే దేవదేవుడు యల్. టీ., పరీక్షలో బోధనాభ్యాసనపద్ధతులు తెలియక ఫట్టీగొట్టినవాడిలాగున కనబడతాడు.

పోనీ, ఈఅనంతసృష్టిలో ఏమన్నా ఆలోచన గనపర్చాడా దేవదేవుడు, అంటే, ఎక్కడా వివేకం, దూరదృష్టి, అవుసరబేఅవుసరములు పరికించినట్టు కనబడదు. సీతాఫలం చిన్నలూ, పెద్దలూగూడ అతి అప్యాయంగా తినేఫలంగదా, దానిలో తినడానికి అడ్డంగా అన్నిగింజలు పెట్టుకోవడం ఏమిటి? విత్తనం కోసమైతే, ఏదోమూల ఒకగింజ అఘోరించరాదూ? మామిడిపండులో టెంక, సైజులో ఏగచ్చకాయంతో ఉంచక అంతపెద్దదిగా ఉంచనా? తినేవాళ్లు అందులో ఏమితింటారు? కొనుక్కొనేటప్పుడు కోమట్లు ఏమనుకుంటారో కాస్త తెలుసుకోనక్కరలేదూ? అన్నివిషయములలోను సపోటాపండుకు సరిపడ్డఫలం లేదంటారుగదా, అటువంటిఫలమును సైజులో బొత్తిగా అంతచిన్నదిగా సృజించడం ఏమిటి? దానిని ఏసుమ్మడికాయ అంతగానో సైజులో సృష్టిస్తే బొక్కసంలో ఏంనష్టం వస్తుంది? ద్రాక్షపండుమట్టుకు ద్రాక్ష, కిస్మిసు పండుమట్టుకు అది, బొత్తిగా పంటిక్రిందకెన్నా రాకుండాచేసి వదలనా? పెద్దగుమ్మడికాయలోని గింజలు బొత్తిగా పెద్దచదువుచదివిన ఆషంగులలాగ పల్చగా, రేకుల్లాగున ఉంచడంఎందుకు? కాస్త ఒకఅంగుళం దళసరెన్నా ఉంచితేనేగాని పంటిక్రిందకు వస్తుందా? తొక్కవల్చినశ్రమకెన్నా గిట్టుబాటు అవద్దూ?పోనీ, పుష్పముల సృజించడంలోనెన్నా ఆలోచన ఉందా? మోదుగపుష్పమును అంతఅందముగా సృజించి సువాసన అనేది అసలేలేకుండా, ఒట్టినిరక్షరకుక్షియైన తాలూకాబోర్డుప్రెసిడెంటులాగున చేసి వదలడం న్యాయమే? పోనీ, లోహములవిషయం చూద్దాం. కావలసిన బంగారం, వెండి బొత్తిగా తక్కువగా చేసి, అనవసరమైన రాయి, రప్ప, యిసుక, యినుము విరివిగా చేసిపారవెయ్యడమా? ఒక్కొక్కదేశములో ఉన్న బంగారం యావత్తూ, ఫక్తు, ఒక్కపోలీసు డిపార్టుమెంటువారికే చాలదే, అటువంటిసందర్భములో, తక్కినవాళ్లమాటేమిటి?

పోనీ, సృష్టిలో సంతానంఏర్పాట్లు సవ్యంగా ఉన్నాయా అంటే, అవికూడా సరిగ్గా ఉన్నట్టు కనపడవు. సంతానం కావాలయ్యా మహాప్రభూ! అని అహోరాత్రాలు దేవుళ్లాడేవాళ్లకి సంతానం శూన్యం చేసి, "దేవా! నాకు యిక మరి సంతానం వద్దూ, నేనూ రివెన్యూడిపార్టుమెంటువాడినీ, నాకు సాగదూ, యిదివరలోనే మాయింట్లో పిల్లలూ నేనూ కలసి ఒక మ్యునిసిపాలిటీకి సరిపడ్డజనాభా ఉన్నాం" అంటూన్న అమోఘవీర్యులకి ఏట్లా తెంపడేసి, కనీసం రెండేళ్లకి

మూడుపంటలెన్నా లెక్కల్లోకి వచ్చేటట్టు చెయ్యడమా? పోనీ, సృష్టిలో వెంట్రుకసమస్యను ఎట్లు నిర్వహిస్తున్నదీ చూద్దాం. మొన్నమొట్టుకు మొన్న, పాపం, ఒకాయన "అయ్యా! నాఛాతీమీద కొన్నిఎకరాలూ పొట్టమీద మరికొన్నిఎకరాలూ వెంట్రుకలు సాగుచేసుకుంటున్నాను; ఇంక గెడ్డంమీదకూడ వెంట్రుకలసాగు చేసేందుకు పెట్టుబడీ, పనిచేసేవాళ్ళూ, సావకాశం లేదూ, నాకుసాగదూ" అని మొరపెట్టూ గెడ్డమును "పర్రనేలక్రింద చేసేవయ్యా" అని మహజర్లుపెట్టుకుంటే, ఉద్యోగస్థులు రివాజుగా మహజర్లను చూడకుండానే తోసిపారేసినట్టు, తనుగూడా వాట్లను తోసిపారెయ్యడమేగాకుండా, వానిగెడ్డమును పాటిమన్నుతోలిన భూమికన్నా, డెల్టాలోని భూమికన్నాకూడా సారవంతముగా చేసి వదలిపెట్టవచ్చునా? అది, పోనీ, అటుంచగా, మొన్న, వేమమూరిపార్వతీశ్వర్రావు "మహాప్రభూ, నాతాలూకు మూతిమీద సరియైన నీటిసప్లయిలేక, వెంట్రుకలు ఏమీపండటం లేదు. వెంట్రుకలసాగు చాలకష్టంగా ఉంది. తమ తాలూకు యింజనీర్లలో లంచాలు స్వీకరించని అమాయకుణ్ణి ఒకణ్ణి పంపి, ఆయనచేత ఏగోదావరినుండో ఒకచిన్నపంటకాలువ నామూతిప్రక్కనుండి పెట్టించి, కాస్త నామూతిని ఆయకట్టులో చేర్చి, పల్లంభూమిక్రింద లెఖ్ఖలో 'నమోదుచేయించ"మని కాళ్ళావేళ్ళా ప్రాధేయపడుతూఉంటే, అది లక్ష్యంచేయక, దానిని ఒట్టిబంజరుభూమిక్రింద వదలివేయడం న్యాయమేనా? అవన్నీ అలాఉంచగా, ఈమధ్య నిరుపేదలు కొందరు వాడకములేని కాళీస్థలములున్నూ, పోరంబోకులున్నూ తమకు ఇప్పించమని భగవంతునికి దరఖాస్తులు చేయడంలో బట్టతలలుగల ప్రభుత్వపెన్షనర్లయొక్క బట్టతలలలోని మధ్యనున్న సన్నని కాళీస్థలమును తమకు ఇళ్లుకట్టుకొనుటకు నివేశనస్థలములుగానూ, పొగాకు పండించుకొనుటకు పెరళ్లుగాను వాడుటకు యిప్పించమని దరఖాస్తులు చేస్తే, అవి సహాయనిరాకరణ ఉద్యమంలో పనిచేయని రాజభక్తులకుమాత్రమే యిస్తామని చెప్తూ, నిరుపేదలలో పెక్కుమందికి సదరు కాళీస్థలములను మంజూరుచేయడం మానవచ్చునా? అదీగాక, యీడబ్బుయిబ్బంది రోజులలోనైనా వితంతువులు వెంట్రుకసమస్యలో ఎంతయిబ్బందిపడుచున్నదీ తెలుసుకోనక్కరలేదూ? వారికి మాటిమాటికి మంగలికి డబ్బుయివ్వడం అవసరంరాకుండా ఉండేటట్టు వితంతువుఅయిన ఉత్తరక్షణంనుంచీ తలమీద వెంట్రుకలు మొలవకుండా ఒకఫర్మానా జారీచేయిస్తే ఎంతబాగుండేది? సృష్టినుండీ కూడా భగవంతుడు ఈవిషయము అశ్రద్ధచేయడం, కేవలం, అనాథలయందు విముఖత్వంగాని వేరొకటి గాదు. అదీగాక, శిరంమీద సాహేబులు సాఫుగా వెంట్రుకలు లాగిపారేస్తారుగదా, ఆసంగతి తెలిసి, మళ్లీ అలావారికి,అక్కడ వెంట్రుకలు మొలిపించడం ఎందుకు? వారికి క్షౌరంలో డబ్బుతగులబాటుచేయించడం ఎందుకు? సృష్టిలో పశువులను బరివంటితో వదలివేసి, సాటి మానవులకు దుస్తులు ధరించడానికి ఏర్పాటు చేస్తూ, సృష్టిలోనే పక్షపాతమా? పశువులకుగూడ దుస్తులువుంటే అవిమాత్రం శాసనసభ్యులంత ఠీవిగా ఉండక పోయాయా? సృష్టిలోనే మేకలకి మెళ్లో Bands రెండున్నూ ఉంచుకొనుటకు అర్హత యిచ్చియు, యీరోజువరకు హైకోర్టులో అడ్వొకేటుగా ప్రాక్టీసుచేయనియ్యకపోవడం కేవలం అన్యాయం కాదూ? ఒకపల్లెటూళ్లో వెనకటికి ఒకమేష్టర్ని, "ఏం చేస్తూన్నావయ్యా, మేష్టరా" అంటే "తప్పుచెయ్యా దిద్దుకోనూ" అన్నట్లు దేముడు అసలు పొగాకును ప్రపంచంలో సృష్టించడంఎందుకు? దానిని సృష్టించడం పొరబాటు అనిగ్రహించి మళ్లీ కాల్చిపారేయించడం ఎందుకు? సృష్టిలో ఇలాంటిలోపాలు యిన్నీఅన్నా! మోడరేట్సులోగూడ మొగవాళ్లని సృష్టించడ మేమిటి? జస్టిసుపార్టీలోగూడ స్వార్థత్యాగులను సృష్టించడ మేమిటి? కాంగ్రెసుపార్టీలోగూడా అభిప్రాయములను తరుచు మార్చనివాళ్లనిగూడా సృష్టించడ మేమిటి?

అదీగాక మానవుడు అనే "చాచా" జంతువుని సృజించినతర్వాత, మళ్లీ వేరే యితరజంతువులనుకూడా

సృజించడంలో దేవదేవుడు, ఏం వివేకం కనబర్చాడు? కోతిచేసే చేష్టలన్నీ మానవులలో విద్యార్థులు చేస్తూండగా, వేరే మర్కటముల నెందుకూ సృష్టించడం? తోడేళ్లకన్న క్రూరులు పోలీసువారిలో నున్నప్పుడు సృష్టిలో తోడేళ్లెందుకు? నక్కకన్న జిత్తులమారులు వకీళ్లలో నేమి, వైశ్యులలో నేమి వేలకువేలుండగా మళ్లీ నక్కలెందుకు? హుతహూసి ప్రక్కనుండే మోటారులు వెస్తూన్నా, రోడ్డుమీద గేదెలకన్న అశ్రద్ధగా నడచేమానవు లుండగా మళ్లీ గేదెలెందుకు? చిత్తకార్తిలో శునకములకుగల ఉత్సాహముకంటె ఎక్కువ ఉత్సాహ-ఉద్రేకములు సర్వకాలములలోనూ గలవారు అనేకమంది మానవులలో నుండగా సృష్టిలో వేరే శునకము లెందుకు? ఎలుగుబంటికన్న దళసరి రోమముల రాజ్యం (Roman Empire) గలవారు పెక్కులు మానవులలోనే ఉండగా మళ్లీ సృష్టిలో ఎలుగుబంటులెందుకు? మానవస్త్రీలచిత్తములు జింకనేత్రములకన్న చంచలములుగదా, అట్టియెడ సృష్టిలో వేరే జింక లెందుకు? సింహముకన్న ముఖంమీద ఎక్కువజూలు పెంచేవారు మనుష్యులలో కావలసినంతమంది మోటారుడ్రైవరు లుండగా, సృష్టిలో మళ్లీ సింహము లెందుకు? పులికన్న ఆకలిగల బెంచిసుమాస్తా లుండగా వేరే పులులెందుకు? కరణము అనేవా డుండగా వేరే సృష్టిలో తేళ్లెందుకు? పందికంటె ఎక్కువభోజన ప్రియులు, గాడిదకన్న శుద్ధతెలివితక్కువ మొద్దులు, గోవుకన్న శాంతస్వభావులు, పిల్లికన్న పెద్దదొంగలు, గొర్రెకన్న కొమ్ములు ఎక్కువతిరిగినవారు, ఏనుగకన్న ఎక్కువ చర్మం దళసరిగలవారూ మానవులలో అనేకు లుండగా వేరే సృష్టిలో ఆయాజంతువు లెందుకు? నూకలుమాష్టర్లు Redundancy అని తెలవిస్తారు అనెన్నా తోచలేదూ?

ఇవి అన్నీ అటుంచగా, మానవులలోనే, సృష్టిలో వేర్వేరురంగులు పెట్టి, సృష్టించడియూ రంగులపోటే పెట్టి, పార్టీలు లేవగొట్టి పోరుపులు పెట్టతగునా? మానవులందరకూ, ఏకంగా ఏగాంధిమహాత్ముని నిర్మలాత్మయొక్క శ్వేతవర్ణమో, లేక అమావాస్యచీకటిని ధిక్కరించు ఏ ఆర్డినెన్సులయొక్క నల్లనిరంగో, లేక చామనచాయలో మిఠాయి అని అనబడే తొక్కుడు లడ్డూరంగో పారేస్తే, మనలో మనము రంగువిషయమై రౌండుటేబిల్ కాన్ఫరెన్సు ప్రతినిధులు తగాయిదా పడ్డట్టు పడక, దేశమంతా ఐకమత్యంలో ఉందుము గదా? పోనీ. ఆరంగులలోనైనా, కాస్త, కుడీ, ఎడమా ఉండనక్కరలేదూ? ధనమునుబట్టి రంగు నిర్ణయిస్తూ, ధనికులకు బీదలరక్తము త్రాగగా బయల్దేరినట్లు కనబడుటకోయన, ఏ ఎర్రనిరంగో యిచ్చి, బీదలకు రక్తములేక పాలిపోయినందున ఏ సఫేదురంగో యిచ్చి, మధ్యస్థులకు ఏ నీరకావిపంచరంగో పారేస్తే ఎంతవీలుగా ఉండేది? ఇంకంటాక్సువారు పన్ను విధించడంలో ఇష్టమువచ్చినట్లు విధించక, రంగును బట్టి మనిషికి పన్ను వేశేవారుగదా? ఇటువంటివర్ణ నియామకం సృష్టిలో లేకపోవడంవల్ల ధనికులలో నల్లనివారు బయల్దేరారు, అందమైనపిల్లకు అవకతవక మొగుడు తయారయినట్టు. బీదలలో ఎర్రవారు బయల్దేరారు— పోలీసుడిపార్టుమెంటులో దయాదాక్షిణ్యాలు గలవారు బయల్దేరినట్లు. ఇట్లు రంగులలో తేడాలు పెట్టుటవల్ల ఎన్ని యిబ్బందులు వస్తూన్నాయో దేముడు గ్రహించనక్కరలేదూ? దంపతులలో సహితం రంగు తేడాలేనా? మాణిక్యంలాటిపిల్లకి మశిపాతగాడిని కట్టడంలో భగవంతునివివేకము ఏముంది? కాకికీ గోరింకకీ స్నేహ మలవడునా? నల్లవాడంటే తెల్లవాడి కెప్పుడైనా గిట్టుతుందా?

పైగా, సృష్టిలో సముద్రం నాల్గువంతులు, భూమి వకవంతూ సృజించడమేమిటి? భూమి నాల్గువంతులూ, సముద్రం ఒకవంతూ అయితే ప్రజలు మసిలేందుకు భూమి ఎంతవిశాలంగా ఉండేది? భూమియే నాల్గువంతులు అయితే, పట్నంలో బ్రాడ్వే, రాజమండ్రిలో రాజవీథి, బెజవాడలో బజారు, విశాఖపట్నంలో సముద్రంప్రక్కరోడ్డు, యిప్పుడున్నంతయిరుకుగా ఉండేనా? లావుపాటిమనుష్యులు ఒకేసారి యిద్దరువెళ్లినా, ఒకరినొకరు తోసుకోనకుండా వెళ్లగలిగి ఉండేవారు గదా? ప్రపంచములోని భూమివైశాల్యం పెరిగడం

వల్ల రైలుబండ్లుగూడా విశాలమయి, యింటరుక్లాసు లోనిసీట్లు వెడల్పు పెరిగి, కాస్తపెద్దపిరుదులుగలవారిని గూడా ఇబ్బందిలేకుండా కూర్చోనిచ్చేవిగదా? పూట కూళ్లయిళ్లలోనిపీటలు, మద్రాసులో మరుగుదొడ్లు, జట్కాలోనిస్థలము, వైశాల్యంలో కాస్త ఎదిగి, ప్రజలకు ఎంతహాయి యిస్తూండేవి?

సృష్టిలో, పాలవిషయంఏర్పాటులు ఎంత తెలివితక్కువగా చేసిందీ అందరికీ తెలియకపోలేదు. పిల్లలకు జీవనాధారమునకున్నూ, పెద్దలకు, కాఫి, టీ, లకున్నూ పాలు ముఖ్యావసరముగదా, అటువంటి సందర్భములో ఆవులను, గేదెలను నిష్కారణంగా, నిర్దయతో నిత్యమూ బాధపెట్టడంకన్న, భగవంతుడు తన దగ్గిరనున్న క్షీరసాగరంనుండి, కాల్వని ఒకదాన్ని ఈప్రపంచంలోకి లాగి, దానినుండి అన్నియిళ్లకూ పిల్ల కాలువలు లాగేస్తే, తనది ఏంమునిగిపోతుంది? భూత దయాళుత్వం ఇతరులకి చెప్పటకేనా? గొల్లలు పైపుల దగ్గిర పాలలో నీళ్లను కలపడం, హెల్తాఫీసర్లు గొల్ల ఆడంగులను పాలవిషయమై తనిఖీచేయించడం, ప్రజలకు డబ్బుఖర్చు లేకుండాఉండేవిగదా! పోనీ, ఈ వర్తకమందంరోజులలో, ప్రపంచం యావత్తూ ఆర్థిక దుస్థితిలోనూ, ఇతరయిబ్బందులలోనూ బాధపడుచున్నప్పుడు, సదరుయిబ్బందులను అన్నింటినీ అణచుటకు, తనసాన్నిధ్యములోనున్న కల్పవృక్షమునకు తాను కాస్త అంటులుకట్టి, ప్రపంచంలోకి కొన్నివేలఅంటులను దిగుమతిచేస్తే ఎంతకామితార్థప్రదాయకమై యుండెడిది.

పరీక్షలలో ఫేలయినవిద్యార్థులకు, నిరుద్యోగులకు, పదవిభ్రష్టులైన మంత్రిపుంగవులకు, విశ్వాసరాహిత్యతీర్మానంవల్ల గెంటివేయబడ్డ బోర్డుప్రెసిడెంట్లకు సదరుఅంట్లు ఎంతఉపకారం చేసియుండెడివి? సంతానరహితులగు భార్యాభర్తలకు కాలవశాత్తూ ఒకరు ఢిల్లీలోనూ, మరియొకరు కొలంబోలోనూ ఉన్నప్పటికీగూడా, సంతానలోపము లేకుండా ఉండేవికదా? పాపకరంబగుకోరికను పుట్టుకలోనే నిర్మూలనము చేసే కల్పవృక్షమును అంట్లు కట్టి, దేవదేపు డీభూలోకంలోకి పంపక, పైపెచ్చు "కోరిక అనే దాన్ని మీరే అసలు చంపుకోండోయి" అని ప్రజలకు తానూ సలహాయివ్వడమా?

సృష్టిలో, కొన్ని పరమముఖ్యములైనవిషయములలో భగవంతునిఅశ్రద్ధ మెండుగ నున్నట్లు కనబడుచునే యున్నది. స్త్రీపురుషులు ఒండొరులను ప్రేమించెడిప్రేమలోని నిజమైన గాఢతను కొలచుటకుగాని, కవిత్వము, చిత్రలేఖనము, శిల్పము, గానము, నృత్యము మొదలగుకళలయొక్క ప్రత్యేక ఔన్నత్యమును కొలచుటకుగాని, మానవుని కీర్త్యపకీర్తులను కొలచుటకుగాని తగినకొలతయంత్రములుగాని, వీళ్లుగాని ప్రపంచంలో లేకుండా జేయడం ఎంతపొరబాటు? ఉద్యోగస్థులయిబ్బందులను భగవంతుడు అసలే పరికించినట్లు కనబడదే. కొందరు ఉద్యోగస్థులకు మెదడులో వెల్తురు తక్కువగా నుండినందున, తగిన ఎలక్ట్రిక్‌బల్బు ఒకటి Enlightenment నిమిత్తం మెదడుల్లో నుంచ నక్కరలేదూ? కొందరు ఉద్యోగస్థులకు అస్తమానం మిక్కిలి ఆలోచించడంవల్ల మెదడు మరీకదిలి స్క్రూలు వదలయినప్పుడు అని మధ్యమధ్య బిగింపులు చేయిస్తూ ఉండేందుకు తగిన మేకులు మారుగా ఏర్పాటు చేయించగూడదూ? అదిగాక, ఉద్యోగస్థులకు కాస్త పెద్దఉద్యోగము కాగానే చూపు నేలమీదుగా ప్రసరించక, కొంచెం పైకి ఉండడం యిబ్బందివల్ల, పెద్దఉద్యోగము అయినతక్షణం సదరు ఉద్యోగులకి నేత్రములు మామూలుచోటికి మూడుఅంగుళములు క్రిందకు ఉంచితే ఉద్యోగం అవగానే కళ్లయొక్కచూపు సరియైనఎత్తులో నుండిపోవుచూ ఉండునుగదా! సృష్టిలోపములకన్న పరిపాలనావిధానంలో ఉన్న లోపములు మరీ ఎక్కువ. బ్రాహ్మణవ్యవసాయమువలె జగన్నిర్మాత ఎక్కడో కూర్చుని, ఏజన్మానీ ఒక్కసారైనా యీప్రపంచంలోకి వచ్చి, విషయాలు స్వయంగా దరియాప్తు చెయ్యక, నౌకర్లని నమ్మి ప్రభుత్వం చేస్తాడా? పోనీ, కావలిస్తే జిల్లాబోర్డు ప్రెసిడెంట్లు T. A. పుచ్చుకోవడంలో హద్దులేని పూర్వంరోజుల్లో పుచ్చుకొన్నంత T. A. పుచ్చుకో

నెన్నా కాస్త స్వంతంగా వచ్చి చూసుకుంటే, ఉద్యోగులమదాంధత, అమాయికులు చిక్కులలోకి రావడం, దుర్మార్గులు వృద్ధిలోకి వచ్చుట, స్త్రీల యిబ్బందులు, మగవారిధిక్కారం, వడ్డీవ్యాపారస్థుల క్రౌర్యములు, అన్నియూ తేటతెల్లముగా తెలిసేవిగా. పోనీ, ప్రజలలోనినాయకులు డిప్యూటేషనుమీద దేవదేవుని సందర్శించి యిబ్బందులు చెప్పుకుందామా అంటే, తాను ఎక్కడో పాలసముద్రంక్రింద దాగుకొనడమూ? ఊపిరిఆడని సముద్రంక్రింద సంభాషణకి సావకాశం ఏది? పోనీ అని, సాహసించి, గాలి అక్కరలేని 'ఒకరిద్దరు రికామీగా ఉన్న పేషర్లు, ఎంత చెడ్డా భూలోకంకంటె అధీనయం అని ఎంచి వెళ్తామా అంటే, తాను వేయితలలశేషునిపై టింగురంగామని కూర్చుంటే, ప్రాణాలమీద ఆశ వదలుకొని, దగ్గరకు వెళ్లడం ఎట్లు? బ్రతికిఉంటే బలుసుతిని బ్రతుకుదామని ఎంత బండాభాయిలకు సహితమూ తోస్తుందే. అదీగాక, తనబదులు ఏటా ఒకామూటెన్నా లెక్కాడొక్కా, కాస్త తెలిసిన, తనబంటు అయిన ఏ Ex-Accountant General గారినెన్నా, ఒక బిరుదిచ్చి భూలోకంలోకి పంపితే ఎంతబాగుండును? జిల్లాబోర్డులలోనూ, మ్యునిసిపాలిటీలలోను కంట్రాక్టర్లు సదరుసంస్థల ప్రెసిడెంట్లకు లంచములు యిచ్చినట్టయితే అవి రోజుబుక్కులోకి, ఎక్కించబడినదీ, లేనిదీ తేలునుగా! సబ్‌రిజిస్ట్రారుఆఫీసులో సాయింత్రం అనుసరికి కోర్టుకి రావలసినడబ్బుగాక, పైన ఏమన్నా రివాజుగా రోజూ ఉండేదీ, లేనిదీ తేలునుగా! ఇంజనీర్లు, పోలీసువారూ, ఆబ్కారీవారు, ఉద్యోగానంతరము వారిదగ్గర జాగ్రత్త పెట్టబడిన సొమ్మంతయు, వారికి నెలజీతంలో వచ్చినడబ్బులో మిగిల్చినదో, లేక యితరత్రా వచ్చినదో తేలునుగా.

పోనీ, అధికారి అయినప్పుడు, నిష్పక్షపాతంగా ఉండాలిగాని, ప్రజలలో ఒకరికి రొట్టె, మరొకరికి ముక్కా యివ్వడం న్యాయమేనా? కొందరిని షరాఫులుగాను, కొందరిని అధికదరిద్రులుగాను, కొందరిని శుద్ధతెలివితక్కువ మొద్దులుగానూ సృష్టించడమేమిటి? పైగా వాళ్లు ప్రభువుని నిలేసి 'ఇదేమిన్యాయమయ్యా' అని అడుగుతే, "మీకర్మం అంతే, మీరు నాకు ఎప్పుడూ సలాములు చేయడంసహితం మానేశారు. అంతపొగరా! పైగా బొట్టుపెట్టడంలోసహితం, నేను పెట్టినట్టు పెట్టుకోవడం లేదు. మీరు నేను కనబడ్డా లేకపోయినా గూడా, తాహసిల్‌దారులు, మేజస్ట్రీటులు, రివిన్యూయినస్పెక్టర్లు, కరణాలు, డిప్టీకలెక్టరువారిని ప్రత్యక్షంగాను, పరోక్షంగాను పొగడుతూన్నట్లు పొగడుతూఉండాలి. అలాచెయ్యకపోతే మీకు అన్నియిబ్బందులు తెచ్చి, ఆఖరుకి మీకు ఎలక్షన్లలో వోటుసహితం లేకుండా చేసి బోలెడు నష్టం చేస్తాను" అని జవాబుచెప్పడమా! పైగా బొట్టులో అడ్డబొట్టు అయితేఏం, నిలువుది అయితేఏం? నిలువుబొట్టు పెట్టకపోతే పోషణకర్తయైన శ్రీమహావిష్ణువు మానవునకు జీవించియున్నంతకాలం చిక్కులు తెప్పించడమున్నా, అడ్డబొట్టు పెట్టకపోతే లయకారణుడైన శివుడు సదరుమానవుని పెందరాళే చంపిపారేయడమూనా? పాపం, ఆవిఘ్నవినాయకుడిని చూడండి, నిలువుబొట్టువాడు కాకపోయినంతమాత్రమున ప్రపంచపోషణమునకు జవాబుదారీగానున్న శ్రీమహావిష్ణువు, వినాయకునికి, ఇన్నిఏళ్లువచ్చినా, యీరోజువరకూ యింకా వివాహం అన్నా చెయ్యక, ఆయనను 'బ్రహ్మచారిగా అలా వదలివేయడం న్యాయమేనా? ముడిపెట్టేందుకు పిల్లయే దొరకలేదా? శారదా ఆక్టు అమలులోకి రాబోయేరోజులలో, గాలివాన వచ్చిన మరునాడు మామిడిపిందెలు దొరకినట్లు పిల్లలు దొరికారుగదా! అప్పుడేన్నా ఒకపిల్లను ముడిపెట్టి, వినాయకుడినిగూడా ఒకయింటివాడిని చేస్తే ముల్లె ఏమిపోతుంది? పోనీ, యిప్పటివిద్యార్థులవలె వినాయకుడు నీరసుడా? సుగ్రీవునికి, పంచపాండవులకీ, కుచేలునకూ శ్రీమహావిష్ణువు ఎక్కువ పక్షపాతం చూపినసంగతి ఎవడికి తెలియదూ? ఉద్యోగస్థులు కారణాంతరములవల్ల ఒకపార్టీకి అనుకూలం చేస్తే అప్పట్లో తెలియకపోయినా తరువాతన్నా ప్రజలకి

ఎలా తెలుస్తుందో, అల్లే భగవంతుని పక్షపాతపుచర్యలు గూడ యివతలబడక దాగుతాయా ?

ప్రభుత్వపరిపాలనలో చురుకుతనం లేకపోవుటయేకాక, బహుఅశ్రద్ధ, మందకొడితనం కనబడుతోంది. మునసబుకోర్టులలో బెంచిగుమాస్తా కారణాంతరములవల్ల అనుగ్రహిస్తేతప్ప పెట్టినపిటీషను సంవత్సరములతరబడి ఆర్డరు అవకయే ఉంటుంది. దేవదేవుని ప్రభుత్వంలోగూడా, ప్రజలమొరలు వినిపించుకొని సత్వరం ఆర్డరు వేయడం కనబడటం లేదు. Disposal లో మందం సృష్టినాటినుండీ కనబడుతోంది. లోగడ, గజేంద్రుడు వెయ్యిసంవత్సరాలు దేవుని C. P. C. ౧౫౧ సెక్షనుక్రింద వెయ్యిసంవత్సరములు నోరుపడిపోయేటట్టు చంపకమాలలలోనూ, సీసపద్యములలోనూ ప్రార్థించిప్రార్థించి ఏడ్చినతర్వాత ఒహామూల "తావులూ పావుతావులూ" కూడా తప్పి డస్సి సొమ్మసిల్లినతరువాత, అప్పుడా గజేంద్రునిరక్షించడం ? గజేంద్రునిభక్తికిమెచ్చి గజేంద్రునిభక్తికి కనిపెట్టినవాడైతే అన్ని సంవత్సరాలు ఏడ్పించి ఏడ్పించి మరీ రక్షించడం ఎందుకు ? జడ్జీలు మేజస్ట్రేటులు చేతులో అధికారం ఉందికదా అనిచెప్పి, బెయిలు యివ్వడంలో నాల్గు మూడురోజులు ఆలస్యం చేసి తరువాత బెయిలు యిచ్చినట్లు. హరిశ్చంద్రమహారాజువిషయంలోమాత్రం ఏం బాగా చేశాడు ? ఒహామూల మహారాజత్వం మంటగలసి, బానిసయై, తిండికి మలమలమాడుతూఉంటే చూసి ఊరుకొని, కుమారుడు లోహితుడు చస్తూంటే చూస్తూ ఊరుకొని అనుంగుభార్య సకలబాధలూ పడుతూ ఉంటే చూస్తూ ఊరుకొని, బాకీలకు Arrest warrent పెండింగుగా ఉంటే ఊరుకొని, చిట్టచివరకు ఆయన పించనుపుచ్చుకునేటైముకు ప్రత్యక్షమయి "మెచ్చుకొన్నానోయ్, నీసత్యవ్రతనిష్ఠకు, పంతులూ, నీవు చాలాగట్టివాడవోయి" అంటే హరిశ్చంద్రునికి ఏం కడుపునిండింది ?

దొంగలు పడ్డ ఆరునెలలకు కుక్క మొరిగిన నేమిలాభము ? మొరగకపోయిన ఏమి నష్టము ? ప్రజా

పతిఅయిన ఆసామీ ప్రజలకు యిబ్బందులలో ఆదుకొనవలెను గాని, తనసంగతి కాదుగదా అని ఉపేక్ష చేయతగునా ? అదే హరిశ్చంద్రుడూ, గజేంద్రుడూ కాబట్టి ఉపేక్షచేసెనుగాని, స్వంతంవిషయమైతే దేముడు అంత అశ్రద్ధచేయునా ? ఒక్కవిషయం చూడండి, ప్రపంచంలో ఎంతమంది భార్యారత్నములను ఎంతమంది అపహరించుకపోతూంటే భగవంతుడు "నామాలకాకి" అంటూ ఊరుకున్నాడుగాదు ? అదే తనభార్యవిషయం రాగానే, సీతామ్మవారిని రావణాసురుడు ఎత్తుకెళ్లినాడని చెప్పి, దానికై రావణాసురుని చంపి, రాక్షసుల రూపుమాపి పెద్దఅట్టహాసం చేశాడు. భగవంతుడైనా తనదాకా వచ్చిందాకా ఎవడికీ మంచిచెడ్డలు వంటపట్టవు. భీష్మునిబాణములు తనకు తగిలిన వెంటనే, భగవంతుడైన శ్రీకృష్ణుడు, యుద్ధంలో చక్రం పట్టి మాట తప్పాడా, లేదా ? బావగారైన అర్జునుని రక్షించుటకు భారతయుద్ధంలో ఇండియన్ పీనల్ కోడ్ క్రింద ఉండేప్రతీసెక్షను క్రింద నేరంచేసేన్నా కాపాడియున్నాడుగదా. ఇలాగే ఎంతచూచినా, మోడరేట్లవలె, భగవంతుడుకూడ ఒట్టి స్వార్థపరుడువలె కనిపిస్తాడుగాని, గాంధిలాంటి త్యాగివలె కనిపించడు. పరాయివాళ్లను ఇబ్బందిలోనుండి వెంటనే తొలగించి కాపాడడం ఆయన నైజం గాదు. ఈ అనంతసృష్టిలో అన్నిటికన్న చిత్రం ఏమిటంటే, ప్రతీవస్తువునుగూడ ప్రజలకొరకు సృష్టించినట్లు చెప్తూ, అందులో మళ్లీ కొన్నివస్తువులు తింటే జబ్బులు తెప్పించడం. జీడిమామిడిపండు, సీతాఫలం, జామకాయ తేగలు, మొక్కజొన్నపొత్తులు మొదలుగాగల ఫలాదులను తినమని సృష్టించి, తిన్నవాళ్లకి తిన్నందుకు జబ్బులు తెప్పించడం కేవలం ప్రజలను దగాచేయడం గాని వేరొండు గాదు. ప్రజలకు భగవంతుడు తండ్రివంటివాడైనప్పుడు ప్రజలకు జబ్బు తెప్పించడంలో దేవదేవునికి భూతదయ అనేది హారతికర్పూరంలా హరించిపోతోందా ? లేక పాపాత్ములను శిక్షించుటకే ఈజబ్బులను సృష్టించెనా ? ప్రతిమానవునిలోనూ తాను ఒక అడ్డిగెత్తు మకాం ఉండడంవల్లను ప్రతి


మానవుడుగూడ భగవంతునిలో ఒకభాగమే అయిన సందర్భంవల్లనూ్న తనే తనకు జబ్బులు వగైరా శిక్షలు విధించడంలో ఎక్కువవివేకం ఏముంది? ఈరోజున ఉండి రేపు నశించే ఈమానవుని భౌతికదేహము ఎన్నటికినీ బాధచెందదు. ప్రతిమానవునిలో వెచ్చగా దూరి కూర్చున్న చిన్నదేవుడే బాధపడేది.

మానవులకు శిక్షలు విధించే ఆసామీ అయిన భగవంతుడు తాను ఎంతఆదర్శప్రాయమైన ప్రవర్తనను కలిగియున్నదీ పరిశీలించినచో చిత్రములు కనిపించక పోవు. భూభాగములో నాల్గవవంతుభాగమును ఏలుచున్న బ్రిటిష్‌గవర్నమెంటువారిచే సృష్టించబడ్డ ఇండియన్ పీనల్ కోడ్ లోని యించుమించు ప్రతిసెక్షనుక్రింద నూ భగవంతుడు నేరములు చేసినట్టు కనబడుచున్నది. భగవంతునిఅవతారమగు శ్రీకృష్ణుడు తాను పాలుత్రాగెడి రోజులలోనే పాలీయవచ్చిన పూతనను గుండెలమీద తన్ని చంపి పీనల్ కోడ్ ౩౨౩ సెక్షనుక్రింద నేరము చేసియుండెను. పోలీసువారైతే ఆనేరమునే ౩౦౨ సెక్షనుక్రింద హత్యానేరము జరిగియున్నట్లు రుజువు చేసియుందురేమో తెలియదు. చిన్ననాటినుండియు శ్రీకృష్ణుడు గొల్లయిండ్లలోకి దూరి, తక్కినపనులు ఏవిచేసినా మానినా పాలు, వెన్న, మీగడ వగైరాలెన్నో దొంగిలించి యిళ్లలోని వంటలక్కలు చేసినట్లు హీనమైనదొంగనేరమెన్నో చేసియుండుట అందరు విని ఎరుగనిది కాదు. రామావతారమందూ భగవంతుడగు శ్రీ రామచంద్రుడు, తాను దగ్గరనుండి లక్ష్మణునిచే శూర్పణఖయొక్క ముక్కూ, చెవులూ కోయించి పీనల్ కోడ్‌లోని ౩౨౫-౧౧౮ సెక్షన్లక్రింద నేరము చేసియుండెను, పోలీసుఇనస్పెక్టరు దగ్గరనే ఉండి కనిస్టేబులచేత లాఠీచార్జి చేయించినట్టు. శ్రీ కృష్ణావతారములో రుక్మిణీపరిణయంసందర్భమున భగవంతుడు దౌర్జన్యంగా రుక్మిణిని వివాహం చేసుకుందామనే దురుద్దేశ్యంతో, ఆమెను, తండ్రిగార్డియన్‌షిప్పునుండి ఎత్తుకొనిపోయి Kidnap చేసి, ఐ. పి. సి ౩౬౩ సెక్షను క్రింద ఘోరమైననేరము చేసియుండెను. సైంధవవధ సందర్భమున, శ్రీ కృష్ణుడు సూర్యభగవానునికి సుదర్శనచక్రము నడ్డముపెట్టి, తాత్కాలికముగ చీకటిని దెచ్చి, సూర్యుడస్తమించనిదే అస్తమించెనని సైంధవుడు నమ్మినట్లు చేసి, ఆతనిని చెన్నపట్టణములో మూర్‌మార్కెట్టువద్ద దగా చేసేవారివలె దగాచేసి ఐ. పి. సి. ౪౧౭ సెక్షన్ క్రింద నేరము చేసియున్నాడు. అదియునుగాక, భగవంతుడొక్కడే యయ్యూ, దశావతారములు దాల్చుటలో ప్రజలకు పది వేరువేరు రూపములుగా అగుపడి సదరు రూపములు పది వేరువేరువ్యక్తులతాలూకువని ప్రజలను నమ్మించి, పగటివేషధారివలె భూప్రజలను దగాచేసి ఐ. పి. సి. ౪౧౯ సెక్షనుక్రింద నేరము చేసియుండెను. శ్రీ రామావతారములో చెట్టుచాటున దాగి, వాలిని బాణమువేసి చంపుట కేవలము ఐ. పి. సి. ౩౦౨ సెక్షనుక్రిందవచ్చే హీనమైన ఖూనీనేరమై యున్నది. గోపికలు తమచీరెలను కొలనుప్రక్క నిడుకొని, స్నానము చేయుచుండగా, శ్రీకృష్ణుడు కొంటితనముతో అక్కడకు చేరి, సదరుచీరెలను తీసికొనిపోయి, సామీప్యముననున్న చెట్టుపై నిడి, ఐ. పి. సి. ౪౨౬ సెక్షనుక్రింద కొంటెతనపు అల్లరినేరము చేసియుండెను. అది అటుండగా వస్త్రహీనలై సిగ్గుపడుచున్న సదరు గోపికలను కోరచూపులతో చూచుచు, వారి నవమానపరచుటలో శ్రీకృష్ణుడు ఐ. పి. సి. ౩౫౪ సెక్షనుక్రింద, స్త్రీని అవమానము చేయుట అనే నేరము చేసియుండెను. రాధ మరియొక మానవుని భార్యయని తెలిసియుండి, దురుద్దేశముతో, ఆమెను తరుచు తనవెంటబడి వచ్చునట్లు ఆకర్షించి, అనేకపర్యాయములు, ఐ. పి. సి. ౪౯౮ సెక్షనుక్రింద, పరాయివాని భార్యను ఆకర్షించి తీసికొనిపోవుట అనే నేరము చేసెను. అఖిలోచనుడను రాక్షసుని పెట్టెలో కూర్చోమని చెప్పి అట్లాతడు కూర్చొనినతర్వాత, శ్రీకృష్ణుడు పెట్టెకు మూతవేసి సదరు అఖిలోచనుని బాధించి ఐ. పి. సి. ౩౪౨ సెక్షనుక్రింద అక్రమబంధము (Wrongful Confinement) అనునేరము చేసెను. రారాజైన దుర్యోధనమహారాజు రాజ్యము పరిపాలించు నప్పుడు, రాజవిరోధులైన పాండవులపక్షము బూని,

కుట్రలు పన్ని రాజుపై యుద్ధమునకు పురికొల్పవ ట్లుండి పురికొల్పి మహాత్మాగాంధీగారునూ, లోక మాన్య బాలగంగాధరతిలకుగారునూ చేసినారని చెప్ప బడే ఐ. పి. సి. ౧౨౪ A సెక్షను క్రింద రాజద్రోహ మను నేరము చేసియుండెను.

ఇవన్నియు అటుంచగా, భగవంతుడు ఇతర చట్టముల క్రిందగూడ మిక్కిలి హీనమైననేరములు చేసి యున్నట్లు కనబడుచున్నది. శ్రీరామావతారములో విల్లునకుగాని, అమ్ములకుగాని, శ్రీ కృష్ణావతారములో సుదర్శన చక్రమునకుగాని, అవిదగ్గర ఉంచుకొనుటకు గాని, వాడుటకుగాని ఎన్నడును లైసెన్సు పొంది యుండక Arms act క్రింద నేరము చేసియుండెను. బోలెడుడబ్బు రాబడి ఉన్నప్పటికినీ, ఎన్నడును Accounts Income-tax డిపార్టుమెంటువారికి చూపక రాబడిని దాస్తూ, పన్నును evade చేస్తూ, అప్పటి గవర్నమెంటువారికి నష్టం దెచ్చి Income-tax Law క్రింద నేరము చేసియుండెను. కాబట్టి యిన్నిహీనమైన క్రిమినలు నేరములుచేసిన ఆసామి ప్రజలకు ప్రభువుగా నుండుటకు ఎట్లు అర్హుడు?

ఇట్టి క్రిమినల్ నేరములు చేసిన ఆసామీ, ఓట్లసంఖ్యనుబట్టి మానవుని మంచిచెడ్డలు నిర్ణయింప బడే ఈఎలక్షను యుగములో, ప్రజలను పరిపాలించ డానికి ఎంతమాత్రమూ వీలులేదు. అందుకనే అనతి కాలములో దేవునిపై పరిపాలన సవ్యముగా లేనందు లకు ఒక విశ్వాసరాహిత్య తీర్మానం ప్రజలు ప్యాసు చేయుస్తారనేవదంతి బయులుదేరింది. సంతాననిరోధం మీద పుస్తకములు వ్రాయుట, ఉపన్యాసములు యిచ్చుట సంతాన నిరోధమూగూడ సర్వేశ్వరునిమీదకు దండయాత్రకే, సృష్టిప్రతిఘటించుటకే! విశ్వాసరాహిత్య తీర్మానము పెట్టబడునటుకు యిదియే ప్రథమ తార్కా ణము !!!



పొందామరకొలను

—యస్. శంకరసుబ్రహ్మణ్యము.

ప్రస్థానభేరి!*

శ్రీ డి. రాజశేఖర శతావధాని

కాండ్రుకాండ్రని పెద్దగా మ్రోఁతలు నిగుడ్చి గబ్బిబెబ్బులిపిండు బొబ్బరించు;
శైలముల్ వదలి పచ్చడిగాఁగ ధ్వని లేపి సింహపోతములు గర్జించు చుండుఁ;
జేమెత్తు లేచి పచ్చివిసంబు వెదచల్లి కోడెనాగులు బుసకొట్టు చుండు;
వసుధ యిట్టటు లాడ బరువై పరువులెత్తి యేనుంగుఁగుములు ఘీంకృతులు చేయుఁ;
బ్రహ్మజాతాండమంతలై భయమూఁగొలుపు-గండశిలలకొండలు చుట్టు నిండి యుండుఁ;
బ్రమథయుతుఁడైన కైలాసభర్తకైనఁ-జాలునే గుండె నాదురాజ్యంబుఁ జొరఁగ!

భూలోకనాకమా! జోమెపాళెం బుండుఁ జందనతరువరచ్ఛాయ లుండుఁ
గొలువుకూటం బుండుఁ గోడెగుబ్బెతగుముల్ వింజామరమ్ములు వీచుచుండ్రు
బొమిడికంబులభిల్లపుంగవుల్ నడదివ్వె లగుదు: రందఱును నీయాజ్ఞ నుండ్రు
నా సూత్మ కెంతో యానందమా; నాదుసింహాసనంబందు నీ వధివసింపు:
మంచఁ గూర్చుండి తుణమైన నవలఁబోకఁ-గొలిచి దేవ్రన కట్లు సేవలు ఘటింతు.
నడుగు మన్నొట కోర్వ; నాహస్తయుగము-జాళువాపట్టుదిండుగా నంతరింతు.

సరి యంచుఁ దలయూఁచి చూచు మఱి యాస్వర్గంబునందైన ని
ర్జరులుఁ ముప్పదిమూఁడుకోట్లపుకు పూజల్ చేసి సేవించు న
ప్పురుహూతుండును జూచియుండని సుఖంబుల్ భోగముల్ వచ్చి దొం
తరలై చుట్టును జేరి కొల్చు నిను; మద్వాక్యంబు నాలింపుమీ!

అకటా! నీమెడ నెయ్యపుంబలిమి నే నట్లాడితిఁ గాక, యే
టికి నాప్రార్థన మియ్యకొంన: వెపుడుం డెందంబునం దేశమా
తకు వాటిల్లు విపత్తుకై వగచి చింతం గ్రాఁగు నీ వగ్గి మ్రిం
గక స్వాతంత్ర్యము దక్కుదాఁక నొకచోఁ గాలూని కూర్చుందువే!

జాతియు జన్మదేశమును భిన్నములైన మనపూర్వులకు మైత్రి దనరకున్న
నాకన్న వయసు సుంతగఁ దక్కువైన బాల్యమున నొండొరు చూచినది మొదలుగ
నీపైన నవ్యాజనియతి నామది నిల్చె; రెండవ దేవుఁ డంరీతిఁ జూతుఁ;
గడఁబోదు నీదుజాగ్రన్మంగళాకృతి కలనైన హృత్ఫలకమునుండి!
నీవు పాల్గొనట్టి యీనిఖిలలోక-సార్వభౌమత నరకవాసముగ రోతు!
నండ నీవున్న నంబలినైన నమృత-మట్లు సేవించి యానంద మంద నేర్తు.

---

* మత్కృత "రాణా ప్రతాపసింహ చరిత్రము"— అముద్రితమునుండి యుద్ధృతము.

అహితదైతేయపశ్చాత్త్యాలమూర్తులౌ శౌర్యదుర్జయు లొక్క-జాతివారు;
తరతరంబులుగ స్వాతంత్ర్యలక్ష్మిమహోదయముఁ గోరి, విదేశధరణిపతుల
మాఱొడ్డి, బాహుశుంభత్ప్రతాపము చూపి, ధనధాన్యవస్తువాహనయుతముగ
సర్వార్పణ మొనర్చి, శాశ్వతధన్యత్వ మందు రెవ్వరికి వంద్యంబు గాదు!
హృదయము గలట్టిమానవుం డెవఁడు వారి-యడుగులను గొల్చి యహితుల నణఁచి
పావనము చేయఁ! డాతని బ్రదుకదేల!- బలమదేల! నిరర్థకైశ్వర్య మేల! [జన్మ

అకటా! ముప్పదికోట్లహైందవులు మోయన్ దగ్గభారంబుఁ గొం
కక నీవొక్కఁడ వెత్తుకోఁదలఁచి! తెంకన్ నిన్ను సేవించి గొం
తుక లర్పించెడువారు పూజ్యులగుభక్తుల్; నీపతాకంబు క్రిం
దికి రానొల్లనివార లందఱును మాతృద్రోహులున్ వంచకుల్.

'పొదలన్ వెల్వడుదొడ్డక్రోలుపులులు, లేపున్ జూపు నాసింగపుం
గొదమల్ వీ' రనిశాత్రవుల్ బెదరు నుక్కుండుంట లున్నార లేఁ
బదివే లెంకలు భిల్లవంశజులు: నీపాదాబ్జముల్ గొల్వ నే
కొద లేకుండఁగ నందఱున్ బనిచి నీకున్ బ్రీతి గావించెదన్'.

వెదురుపొదలనుండి ప్రిదిలినయాణిముత్యములు కుప్పలుకుప్పలై రహించు;
ఫణిఫణాగ్రములందుఁ బండి రాలినమణుల్ పరుపులుపరుపులై, పరిఢవిల్లు;
గనులు మొల్చినయనర్ఘస్వర్ణరౌప్యాదిలోహముల్ పెనుకొండలుగఁ దనర్చు;
శైలసానువులలోఁ జంద్రకాంతశిలలీ జగమంతటికినైనఁ జాలి యుండుఁ;
బెఱుగుటయె కాని తఱుగుట యెఱుగనట్టి-రత్నగర్భ సార్థముగ నారాజ్యసీమ!
యాఁచముట్టుగ నాయొద్దనున్నసిరులు-నాథ! నాప్రోల సర్వార్పణం బొనర్తు!

రవిబింబధ్వజ మొప్ప నీ వనికిఁ జేరన్, నీకు మున్ముందె, యా
రవికన్నన్ మును దోఁచు నప్పుడుపుఁ దారన్ బోలె జృంభించి యా
హవరంగాగ్రభముఁ జొచ్చి శాత్రవకులధ్వాంతంబుఁ జీల్చన్ బ్రతా
పవిభుం డన్నపిరంగి కీఘనుఁ డయఃప్రస్ఫీతగోళంబనన్!

పారతంత్ర్య మదల్చి స్వాతంత్ర్యమును నిల్పుబవరమ్ము వచ్చె సంవత్సరాది
పండుగుపోలె నీభారతప్రజకెల్ల సమభాగమైన యుత్సాహవేళ!
యందఱు మొకమొగంబై నిల్చి యరుల గెల్చితిమేని స్వాతంత్ర్యసిద్ధి యొదవు!
ననిలోనఁబడినఁ గల్పాంతంబువఱకు శాశ్వతనాకలోకవాసంబు గలుగు!
రెంట నేదిగల్గినఁ గృతకృత్యులగుదు!-మింతకన్నను జిరపుణ్య మేది గలదు?
మీనమేషంబులను బ్రొద్దు మించకుండ-నిపుడె ప్రస్థానభేరి మ్రోయింపవయ్యా!

"భీమచాందు"

ప్రభుత్వవ్యాపారపరిమితి

శ్రీపాద గణపతిరావు

(The Scope of the state activity)

మనము చేయు ప్రతికార్యమును ఏదేని ఒక ఆశయముచేత ప్రేరేపింపబడి ఉన్నది. అనగా మనపనులలో ఉద్దేశరహితముగాని, ప్రయోజనరహితముగాని అగునది ఒక్కటియు కానరాదు. ఒకవ్యక్తి యొక్క ప్రారంభములు అతని ఆదర్శములను, ఆశయములను అనుసరించియుండును. మత, సారస్వత, వర్తకాదిసంఘములయొక్క వానివాని ఆశయములచేత నియమింపబడును. అట్లే ప్రభుత్వవ్యాపారమును అది సాధింప యత్నించు ప్రయోజనములబట్టి యుండును. కనుక ప్రభుత్వవ్యాపారపరిమితిని నిర్ణయించుట అది సాధింపగోరు పరమావధులను తెలిసికొనుటయే.

ప్రభుత్వ మెందులకు పుట్టినది? దాని పరమావధి యేమి? దాని ప్రయోజన మేమి? దాని అవధులు, ఆశయములు దృష్టిలో నిడికొని, ప్రభుత్వవ్యాపారము పరిమితమా, అపరిమితమా? అను ప్రశ్నలకు సమాధానములు చెప్పుట కీవ్యాసమున కొంతయత్నము చేయబడుచున్నది.

ప్రభుత్వపరమావధి ముఖ్యముగా త్రివిధము:

౧. వ్యక్తిపరమావధి (The end of the individual)

౨. జాతిపరమావధి (The end of the nation)

3. విశ్వమానవపరమావధి (The end of mankind as a whole)

౧. వ్యక్తిపరమావధి:— బేకను (Bacon) ప్రభువు చెప్పినట్లుగా "భగవంతుని ఐశ్వర్యము, మానవుని మోక్షము" కొరకే ప్రపంచవ్యాపారమంతయు నున్ముఖమగుచున్నది. ఈప్రపంచమున తొలుత ప్రతి మానవుడును స్వేచ్ఛాభావనయు, స్వేచ్ఛావర్తనయు గలిగిన యొక స్వతంత్రజీవిగా జన్మించును. సాంఘిక జీవనమున మానవుని యథాపదవికి ఉద్ధరించుటయే ఫరాసువిప్లవము (French Revolution) నాటి వలెనే నేడును గొప్పసమస్యయైయున్నది. ఇదియే యథార్థమగు స్వాతంత్ర్యమున కర్థము. ప్రతిజీవియు ప్రపంచమునం దవతరించుట సౌఖ్యమును, ఆనందమును అనుభవించుటకుగాని, దుఃఖమును, బాధయు ననుభవించుటకు గాదు. కనుక అతనిశక్తి గమించినంతదనుక పోనిచ్చి అతనికి సాధ్యమయినంత కల్యాణమును పొందగలుగునటుల అవకాశము లేర్పరచుటయే ప్రభుత్వమునకు విధియైయున్నది. అవకాశలోపముచే నేవ్యక్తియు దుఃఖభాజనము కాకుండ చేయుకొరకు ప్రభుత్వము పాటుపడవలసియున్నది.

౨. జాతిపరమావధి:— వ్యక్తిపరమావధికంటె జాతిపరమావధి మరియు విశాలమైనది. వ్యక్తివలెనే జాతియు సుఖజీవనము నడపుటకును, సాటిజాతులలో ప్రతిష్ఠ గడించుకొనుటకును కోరును. వ్యక్తివలెనే జాతియు కీర్తికై, ఐశ్వర్యమునకై, ప్రపంచవిజ్ఞానమున స్థానమునకై, సాటిజాతులపై అధికారమునకై యత్నించుచునేయుండును. జాతిపరమావధి వ్యక్తిపరమావధికి భిన్నమును, విరుద్ధమును నగుటయు తటస్థింపవచ్చును. కనుక ప్రభుత్వముయొక్క వివేకము ఈ రెంటికిని సామరస్యము గలిగించుటలో గాని, వీనిలో నేది యుత్తమము, ఏది గ్రాహ్యము అని నిర్ణయించుటలో గాని ఇమిడియున్నది.

3. విశ్వమానవపరమావధి:—విశ్వమానవపరమావధి అత్యంతవిశాలము, ఉత్కృష్టము నైయున్నది. ప్రతివ్యక్తికిని సౌఖ్యమునకు హక్కుగలదనిచెప్పినప్పుడు,

సమూహాముమీద మానవులెల్లరకు నగి హక్కు అని వేర చెప్పనక్కరలేదు. కాని వ్యక్తి, జాతిపరమావధుల వలెనే విశ్వమానవ, జాతిపరమావధులు కూడ విరుద్ధములగుటయు సంభవమే. కనుక ఒకజాతికల్యాణముకంటె విశ్వమానవకల్యాణము కర్తవ్యమనుసంగతి గుర్తింపవలసినది ప్రభుత్వము.

ఇన్నియుగాక సర్వసాధారణసౌఖ్యము (General welfare) అనున దొకటియు గలదు. ఇది బెంథము (Bentham) మొదలగువారి ప్రయోజనవాదమునకు (Utilitarianism) సమంజసమగు పూర్వపక్షముగా ప్రతిపాదింపవచ్చును. ప్రభుత్వము దాని ప్రజలశుభము, సౌఖ్యముకొరకే కావలయునని వారివాదన. "సౌఖ్యము నభివృద్ధిచేయుటకై యత్నించుటలోనే ఒకపనియొక్క మంచియు, ఇందుకు భిన్నమగుటలో దానిచెడుగును కలదు" అని మిల్ (Mill) మహాశయుడు పలికెను. కాని, విశ్వమానవసౌఖ్య మనునది కేవలము భావనాత్మకమును అసంభవమునని ప్రయోజనవాదులుసైతము విశ్వసించెదరు. కనుక అధికసంఖ్యాకులయొక్క అధికతమసౌఖ్యము రెండవపక్షమున ఆమోదించెదరు. మరియు నైతికప్రమాణమగు సుఖజీవనము, అనగా వ్యక్తియొక్క అత్యధిక సౌఖ్యముగాక 'అధికసంఖ్యాకుల అత్యధికసౌఖ్యము' అనవచ్చును. కనుక ఈసూత్రమే ప్రభుత్వవ్యాపారమును నియమించుచు, దాని పరిమితి నిర్ణయించవలెనని ప్రయోజనవాదుల ఉద్దేశము. సాంఘికప్రయోజనము, వ్యక్తికల్యాణము అను ఆదర్శములను ప్రభుత్వమునకు నిర్ణయించుటలో పైవిషయమునందు కొంత సత్యము గలదు. కాని ఈ సూత్రమునకు ముఖ్యముగా రెండు లోపములు గలవు: ౧. అట్టిసూత్రము ప్రజలహక్కులు, ధర్మములు నియమింపజాలదు కనుక అధికసంఖ్యాకుల యత్యధికసౌఖ్యమే న్యాయపరిపాలనకు ప్రమాణమెంతమాత్రము కాజాలదు. ౨. సౌఖ్యమనునది ప్రతి వ్యక్తికిని ప్రత్యేకమగుటచే, సౌఖ్యానుభవము ఎట్టి బహిరంగవిధానముచేతను ప్రత్యక్షానుభవములో ప్రదర్శించుటకు వీలుకాదు. ప్రతివ్యక్తికిని, తనకనురూపమగు పద్ధతిని తనహక్కులను వినియోగించుకొని సుఖము సంపాదించుకొనుటకు అవకాశమును కలిగించుటయే ప్రభుత్వము ప్రజలకు చేయగలపని.

కనుక సర్వసాధారణసౌకర్యమనునదియే ప్రభుత్వవ్యాపారమునకు ఉత్తమ మగు సూత్రమని తోచుచున్నది. బ్రైస్ (Bryce) ప్రజాపరిపాలనమును గురించి వ్రాయుచు "ఏప్రభుత్వమునకైనను సౌకర్యము, న్యాయము కలిగించుటయే ధర్మము" అని చెప్పినాడు. కనుక ఏప్రభుత్వమునందు ప్రజలు అత్యంతము సుఖితులు, సంతృప్తులు నైయుందురో ఆప్రభుత్వమే ఉత్తమము! అదియే లోకములో అన్నిప్రభుత్వములలోను మహోన్నతస్థానము నాక్రమింపదగియున్నది.

ప్రభుత్వవ్యాపారపరిమితి—

౧. మనము State అనిపిలుచునది విల్సన్‌గారు (Woodraw Wilson) చెప్పినట్లు "ఏకశాసనబద్ధమగు నొకభూఖండములోని ప్రజాసమూహము" కనుక ప్రభుత్వము ఏపనిచేసినను, అది యారాష్ట్రములోని ప్రజలకు సంబంధించినదై యుండవలయును. ఏలననగా ఒకరాష్ట్రములోని ప్రజల కుపయోగకారియైనది వేరొకరాష్ట్రములోని ప్రజల కుపయోగకారి కాక పోవచ్చును. అట్టి విరుద్ధములగు పనులను ప్రభుత్వము తలపెట్టజాలదు. కనుక మనము State అనునది ఒక భూభాగమున నివసించుజనులకే చెందుటచే ప్రభుత్వవ్యాపారమున కిది యొకహద్దును నిరూపించుచున్నది.

౨. ప్రభుత్వముయొక్క సాధనము శాసనము. ఇదియు ప్రభుత్వవ్యాపారమునకుకొంతపరిమితిని విధించుచున్నది. ప్రభుత్వము తనఉద్దేశమును దేనినైనను నెరవేర్పదలచినయెడల దాని సాధనసర్వస్వమును శాసనమే. కనుక ప్రభుత్వము చేయదలచినపనులు పెక్కులున్నను, అవన్నియు శాసనముక్రింద రానందున అది వానిని నెరవేర్పజాలకున్నది. ప్రజలయొక్కమతము, నీతి మున్నగున వీజాతివి. కనుకనే నేటిప్రభుత్వములు మతములో జోక్యము కలిగించుకొనుట కిష్టపడవు. ఆహారము, దుస్తులు మున్నగునవి నియమించు శాసనముల నిష్ప్రయోజనమునకు నిదియే కారణము. వ్యక్తులయొక్క

బాహ్యసంబంధములనే ప్రభుత్వము శిక్షింపగలదుగాని ఆంతరంగికవిషయములలో జోక్యము కలిగించుకో జాలదు.

3. ప్రభుత్వము ఒక సంస్థగా తక్కినసంస్థల కంటె చాల విలక్షణమైనది. తక్కిన సంస్థలకంటె నది దీర్ఘజీవి. ఏసంస్థయైనను దాని ప్రస్తుతసభ్యుల అభ్యుదయమునకైమాత్రము యత్నించి భవిష్యత్సభ్యులు దాని సూత్రములను భిన్నములుగా చేయులోపలనే గతించవచ్చును. కాని ప్రభుత్వము తనప్రజల వర్తమానాభ్యుదయమును, ఒకటి రెండు భవిష్యత్తరముల యభ్యుదయమునుమాత్రమే కాక సాధ్యమయినంత సుదూర భవిష్యత్కల్యాణమును గూడ గణింపవలసియున్నది. కనుక సహజసంపత్సంరక్షణాదులు (Conservation of natural resources) ప్రభుత్వపుపనులలో చేరుచున్నవి. ఈవిధముగా ప్రభుత్వము స్థిరస్థాయిగనుక అది శాసననిర్మాణమును భావిప్రజల సౌకర్యమును లక్ష్యమునందిడుకొని కావింపవలయును. ఈవిషయము మాత్రము ప్రభుత్వవ్యాపారపరిమితిని విశాలము చేయుచున్నది.

౪. విశ్వజనీనత (Universality) యను లక్షణముచేతగూడ ప్రభుత్వము తక్కిన సంస్థలకంటె ఉత్తమస్థానము నాక్రమించుచున్నది. ప్రభుత్వవ్యాప్తత చాలవిశాలమైనది. అనగా అది ఒకరాష్ట్రములోని ప్రజలసంస్థ కనుక ఆరాష్ట్రములో పుట్టినమాత్రముననే ప్రతివ్యక్తియు నందు సభ్యుడగుచున్నాడు. ఇతరసంస్థలలో సభ్యత్వము ఐచ్ఛికముగాని జన్మసిద్ధము గాదు. కనుక ఒకరాష్ట్రములోని ప్రజలందరు నాప్రభుత్వము నందు విధిగా సభ్యులై యుండవలయును. అందుచేత సమూహముమీద వారందరి సౌఖ్యమును చూడవలయునేగాని ప్రభుత్వము ఏఒకపక్షముయొక్క సౌఖ్యమునుమాత్రమే గణింపరాదు. ఈకారణమువల్లను ప్రభుత్వము ప్రజలమతములలో జోక్యము కలుగజేసికొనదు. కనుక ప్రభుత్వవిధానము స్థూలదృష్టికి పాక్షికముగా తోచినను, యథార్థమున నది సర్వప్రజాసౌఖ్యమునకే యత్నించవలయును. కార్మికశాసనవిధాన (Labour legislation) మిట్టిది. అది స్థూలదృష్టికి పనివాండ్ర సౌఖ్యమునకే నిర్మింపబడినది అని తోచినను, సత్యముగా నది సర్వప్రజాసౌకర్యమునకే ఉద్దేశింపబడినది. కనుక ప్రభుత్వము పాక్షికమైన ప్రభుత్వ నిర్మాణము చేయజాలదు. ఇదంతయు ప్రభుత్వముయొక్క స్వైరప్రవర్తనపై నియమముల విధించుచున్నది. ప్రభుత్వము తనచిత్తము వచ్చినట్లు శాసననిర్మాణము చేయజాలదు.

కాని యథార్థము విచారించిన ప్రస్తుతకాలమున ప్రభుత్వవ్యాపారమున కొక హద్దున్నట్లు తోచుట లేదు. మానవుని అవసరములకు, కోరికలకు అంతము లేకుండుటయే దీనికి కారణము. కనుక ప్రభుత్వవ్యాపారపరిమితి యెంతవిశాలమగుచున్నను, అది యొక స్థిరస్థాయి యగు సంస్థయనియు, భావిప్రజల సౌకర్యమునకై యీ విపులీకరణ మగత్య మనియు సమాధానము చెప్పవచ్చును. లాస్కి (Laski) గారు చెప్పినట్లు మానవహక్కుల చరిత్ర పూర్వమువాని విపులీకరణకథ. కాని నేడు అవి క్రమముగా సంకుచిత మగుచున్నవి. క్రమక్రమముగా మానవుని స్వేచ్ఛను ప్రభుత్వము కొల్లగొట్టుచున్నది.

ఉపసంహారము:—

కనుక ఒకప్రభుత్వముయొక్క విధానము దానియొక్క ౧. వ్యక్తిపరమావధిని, ౨. జాతిపరమావధిని, 3. విశ్వమానవపరమావధినిబట్టి నిర్ణయింపవలయును. సర్వసాధారణ సౌకర్యమను విషయము దానిని సర్వదా నిర్దేశించుచునే యుండవలయును. ప్రభుత్వము స్వభావసిద్ధముగ చలచిత్తము, స్వైరము నై యుండజాలదు. అది యొక రాష్ట్రీయసంస్థ యగుటచేతను, శాసనమే దాని సాధనసర్వస్వమగుటచేతను, దాని స్థిరస్థాయిత్వము చేతను, దాని విశ్వజనీనత్వముచేతను ప్రభుత్వముయొక్క వ్యాపారములు పరిమితము లగుచున్నవి.



తీయని తలపులు

—డి. బుచ్చి కృష్ణమ్మ, రాజమండ్రి.

వీరభద్ర విజయములు

విద్వాన్, కట్టి సాంబమూర్తిశాస్త్రి

వీరభద్రవిజయ మనఁగానే పాఠకులకు వీరభద్ర విజయ మనుపేరఁ బ్రకటింపఁబడిన యాంధ్ర ప్రబంధము స్మరణకు వచ్చును. కాని నేను దెలుపఁబోవు విజయములు దేవుఁడగు వీరభద్రునకు సంబంధించినవి కావు. క్రీ. శ. ౧౫-వశతాబ్దాదిని రాజమహేంద్రవరము రాజధానిగా నుత్తరాంధ్రదేశము నుత్కలసీమావధిగ నవక్రపరాక్రమంబునం బాలించిన పంటవంశముక్తామణి యగు వీరభద్రారెడ్డికి సంబంధించినవి. ఆనరపాలుని విజయము లభివర్ణించుటకు ముందుగా నాతనియాస్థాన కవియగు శ్రీనాథునిగూర్చి యెంతయేని చెప్పవలసి యున్నది కాని యీవఱకే పలువురు మహాపండితు లాతనిచరిత్రమును బుహ్కలముగా రచించియుంటచే నిప్పు డావిషయ మప్రస్తుతమే.

కాని దేశోద్ధారకులగు కవులలో మన శ్రీనాథుఁ డగ్రగణ్యుఁడను విషయముమాత్రము మనవి చేయక తప్పదు. లోకములో ననేకులు మహానుభావు లనేకరీతుల దేశాభ్యుదయమునకై మానప్రాణధనములు తృణప్రాయములుగా వ్యయించి కీర్తి గనియున్నా రనుట యెల్ల రెఱింగినదే. కాని మహాకవులు సేయుదేశ సేవ అనన్యాదృశము, నఖండము నైనది. వాల్మీకి మహర్షి రామచరితమును బ్రబంధముగా రచింపకున్నచో నీలోకమున నీతిసత్ప్రవర్తనములకుఁదావే లేకపోయెడిది. కాళీదాసుఁడు రఘువంశకావ్యమున నాల్గవసర్గమందు, నాఱవసర్గమందు నాకాలపురాజుల బలపౌరుషసాధన సంపత్తులను, దేశనైసర్గికస్వరూపములను, దేశసంపదలను నిప్పటికిని గనులకుఁ గట్టునట్లు వర్ణించియున్నాఁడు. శూద్రకుని మృచ్ఛకటికనాటకము నాఁడు నేఁడుగూడ లోకవ్యవహారములకు దర్పణప్రాయమై యున్నది. తిక్కనసోమయాజియు, నల్లసాని పెద్దనయుఁ దమకవితా

మధురిమ చేఁ బరహస్తంగతములగు మహారాజ్యములనేచియున్నాఁడు. కవి భీమఖండరచనమునాఁటికి రెడ్డి

రక్షింపఁగల్గిరి. మన శ్రీనాథుఁడుగూడఁ గవిత్వమహత్త్వంబున శత్రుహస్తములకుఁ జిక్కిన తనప్రభువుల కటారిని దిరిగి తెచ్చెనుగదా? కావుననే కవులు కావించు దేశోద్ధార మనన్యాదృశమైనది. ప్రతాపరుద్రయశోభూషణ మను నలంకారగ్రంథమును రచించిన విద్యానాథ మహాకవియు, మన శ్రీనాథకవిసార్వభౌముఁడు నిరువురు మాత్రమే మనయాంధ్రదేశమునఁ గవితామృతరసమునఁ జరిత్రాంశముల నిమిడ్చి భావకుల కఖండానంద మొనఁ గూర్చిన మహానుభావులు. శ్రీనాథకవిగ్రంథముల ననుసంధించియే నే నిపు డారాజచంద్రుని విజయంబుల నివేదించుచున్నాఁడను.

శ్రీనాథుఁడు కొండవీటిరెడ్డిరాజుల యాస్థానకవిగా నుండి యనేకదానశాసనములు మొదలగు కృతులను సంస్కృతాంధ్రభాషలలో రచించి యారాజులకీర్తి దిగంతవిశ్రాంతముగా నొనర్చియున్నాఁడు. కొండవీటి రాజ్యము క్షీణించినవెనుక ననేకాస్థానములు దర్శించి, యనేకకృతుల నక్కడక్కడ రచించి, రాజమహేంద్రవరమున కరిగి యందు రెడ్ల యాదరాభిమానముల నొందెను. రాజమహేంద్రవర రెడ్లమంత్రి యగు బెండపూఁడి యన్నయమంత్రి కంకితంబుగా భీమేశ్వరపురాణమును రచించి, యందుఁ దనకును నామంత్రికి నేలిక లగు వీరభద్రవేమనరపాలుర రాజ్యము సింహాద్రిపర్యంతము వ్యాపించియున్నదని వర్ణించియున్నాఁడు.

"ధారాసురత్రాణ ధాటీసమారంభ
గర్వసాధోరాశికలశజులకు
సప్తమాడియరాయ ఝాడియక్ష్మాపాల
వందిత శ్రీపాద వనరుహులకు
సింహాద్రిపర్యంత సీమాంధ్రమేదినీ
మండలీపాలనాఖండలులకు."

అను పద్యమున నా రెడ్డిరాజుల విజయము వర్ణిం

రాజులరాజ్యము సింహాద్రిపర్యంతవ్యాప్త మైనదని కంఠోక్తిగాఁ జెప్పుటచే కీ. శే. వీరేశలింగముపంతులుగారు తమకవులచరిత్రమందు నట్లే వ్రాసియున్నారు. కాని యాకాలమునాఁటికే వీరిరాజ్యము గంజాంమండలము లోని చిల్కసముద్రమువఱకు వ్యాపించియున్నదని యీపద్యమువలననే తెలియఁగలదని ముందు ఋజువు పఱిచెదను. నైషధభీమఖండములు రాజులకుఁ గాక వారిమంత్రుల కంకితము గావింపంబడుటచే నారాజుల విజయచరిత్రము లెక్కుపగా వర్ణింప ననువైనది కాదు. కాశీఖండము రాజునకే యంకితమిచ్చుటంజేసి దాని యందు వారి విజయములు సమగ్రముగ వర్ణించి యున్నాఁడు.

కాశీఖండమందలి విజయములం దెల్పుపద్యముల నీక్రింద నుదాహరించి వానిని వివరించెదను.

నిజభుజావిక్రమంబున నిఖిలదిశలు
గెలిచి తను రాజ్యపీఠ మెక్కించి పట్టి
యన్నవేమేశ్వరునియంక మాశ్రయించి
నిండుకొలువుండెఁ గన్నులపండువుగను.

(ఆ. ౧, ప. ౧౦.)

అనవేమక్షితిపాలు పౌత్రియను వే
మాంబామహాదేవికిన్
ఘనుఁడయ్యల్లడభూమిపాలునకు సం
గ్రామస్థలీగాండివుల్
తనయుల్ వేమవిభుండు వీరవసుధా
ధ్యక్షుండు దొడ్డప్రభుం
డను నన్నయ్యయు బాహువిక్రమకళా
టోపప్రతాపోద్ధతుల్.

సప్తమాడియరాయ చంద్రబింబాననా
చికురవల్లరులపైఁ జిన్నిపువ్వు
ఝాడెజంతుర్నాటిజననాథశుద్ధాంత
కుచకుంభములమీఁదఁ గుంకుమంబు
బారహదొంతిభూపాలలీలావతీ
గండస్థలంబులఁ గలికినవ్వు
కలువపల్లొడ్డాదికటకాధిపతివధూ
సీమంతవీథులఁ జేరుచుక్క

*   *   *   *

కొనియెం గంచుకముల్ సముద్ఘటనట
ద్ఘోటీభటప్రౌఢి గై
కొనియె న్వేడుక జీకికోటయసిత
క్షోణీశు లల్లాడఁ జే
కొనియె న్మాకవరంబు వీఁక మనవ
ద్ఘోరారిసంహారియై
ఘనుఁ డల్లాడమహీశువేమన నిరా
ఘాటైకధాటీగతిన్.

పండువాసులతానిపావడం బిచ్చిన
భద్రేభములు వీథిఁ బాళెముండు
నొడ్డెధాత్రీనాథుఁ డుపదఁ బుత్తెంచిన
బింబాగుణోష్ఠి సంబెల వహించుఁ
గర్ణాటభూపతి కానుక యనిపిన
ముక్తాతపత్రంబు మ్రోల మెఱయు
యవనాధిపతి యుపాయనముగా నొసఁగెన
పాగాహయంబులు వాగె వచ్చు
దూర మంతంత బారహదొంతి మన్నె
సప్తమాడియరాజన్యసమితి మ్రొక్కు

....

ఔరా యల్లయరెడ్డివొడ్డవసుధా
ధ్యక్షుండు ధాటీచమూ
భేరీభాంకృతఘోరఘోషమున ని
ర్భేదించె నొడ్డాదిశృం
గారంకోటయు లోతగడ్డయును ను
ద్ఘాటించె నత్యుద్ధతిన్
క్షీరాంభోధితటంబున న్నిలిపె ది
క్సీమాజయస్తంభముల్.

హరిదాటించెఁ బురోపకంఠమున వా
హ్యాళీప్రదేశంబునం
దరుదే యల్లయరెడ్డినందనుఁడు దొ
డ్డయ్యాక్షమాధీశ్వరుం

డిరువై నాలుగుమూళ్ల మేర యనుగో
　　సెక్కింపఁగా నేల య
ద్ధరణీనాథుని కీర్తి దాఁటెఁ గడు ను
　　ద్దండించి బ్రహ్మాండమున్.

ప్రాకటవిక్రమస్ఫురణ
　　రాజమహేంద్రము రాజధానిగా
నేకసితాతపత్రమున
　　నేలెను వీరనృపాలుఁ డుత్తమ
శ్లోకుఁడు వేమశౌరి యను
　　జుండు సమున్నతవైభవాఢ్యుఁడై
చీకటియుం గళింగమును
　　జిల్కసముద్రము సింహశైలమున్.

బలవద్బారహదొంతిమన్నెధరణీ
　　పాలావరోధాంగనా
విలసన్మంగళసూత్రరక్షణకళా
　　విఖ్యాతకారుణ్య యు
త్కలకర్ణాటతురుష్కరాట్పరమమి
　　త్రా.............

కర్ణాటోత్కలపారశీకనృపస
　　ఖ్యప్రాభవశ్రీనిధీ
....

పంచారామవధూటీ
పాంచాల కళింగరాజపరమేశ్వర య
భ్యంచితదయాధురంధర
చెంచూమలచూరకార చిరపుణ్యనిధీ!

వేమక్షోణినరానుసంభవ.........
　　మత్స్యవంశనృపరక్షా కేళిపద్మేక్షణా!...
....

కసిమికోట వేంకటాయికప్పకొండ కిల్లెడా
ద్యసుహృదవనిపాంతరంగహాలహాలవిషానలా!
ధారాపట్టణసార్వభౌమ సురధాణ్దర్పాపహారక్రియా
ధౌరంధర్య పటిష్ఠనిష్ఠురభుజాదంభోళిసంరంభ!
....

ధారాసురధాణదర్పధరణీధ్రపవీ!

అనుపద్యములందు వీరభద్రారెడ్డియు,నతని యగ్రజానుజులును జయించిన రాజ్యములను జేర్కొని యున్నాఁడు. వీనిలో పండువాసులతాని, ఒడ్డెధాత్రీనాథుఁడు, యవనాధిపతియుఁ గాక తక్కినరాజులందఱు విశాఖపట్టణ, గంజాం మండలములలోని చిన్నచిన్న సంస్థానములకుఁ బ్రభువులు. వీరిరాజ్యములు చిన్నవేయైనను బలపరాక్రమాదిశూరగుణములుమాత్రము పరభయంకరములై, యసాధారణములై యుండుటచేతనే మన కవి యీరాజ్యముల జయించినవృత్తాంతమును విపులముగా వర్ణించియున్నాఁడు. ప్రస్తుత మీగ్రామముల గూర్చిన యైతిహ్యములును, వింతవింత సంగతులను బాఠకుల కించుక నివేదింపవలసియున్నది.

పూర్వము కళింగదేశమును గంగగాంగవంశపు రాజులు పాలించియుండిరనుట చారిత్రికులకుఁ గ్రొత్త విషయము గానుగదా! క్రీ. శ. ౧౩-వ శతాబ్దమువఱకునుగూడ నీదేశము కళింగరాజుల పాలనమునందే యున్నట్లు తలంపనగును. అనంతరము కాకతీయు లీదేశమును జయించినట్లు వాడుక కలదుగాని ప్రబలాధారము లగపడలేదు. ఆకాలమున నీదేశమున నేకపాలనము లేక బలవంతులెల్ల దమకు చేఁజిక్కినంతభూమినిఁ బాలించుచుఁ జిన్నచిన్నసంస్థానముల నేర్పఱించి యుండిరి. తొలుదొల్త ౧౪-వ శతాబ్దమునఁ గాకతీయరాజ్యక్షయానంతరము కొండవీటి రెడ్లు స్వతంత్రులై సింహాచలపర్యంతము గల దేశమునెల్ల నేకచ్ఛత్రాధిపత్యంబుగ నేలిరి. ఆసమయమున నేరాజమహేంద్రవరరాజ్యము వేమవీరభద్రారెడ్లవశ మయిన తరువాత నారాజసోదరులు నలువురును సాహసోత్సాహములు మెఱయఁ జిల్కసముద్రమువఱకుఁ గల కళింగాంధ్రదేశమునెల్ల స్వాధీనము గావించికొని యవక్రపరాక్రమంబునఁ బాలించిరి. రెడ్డిరాజుల ప్రాభవ మించుకపలుచబాఱినతఱి నుత్కలరాజు లీదేశమునుమాత్రమే కాక కృష్ణామండలములోని కొండపల్లి యుదయగిరులవఱకును గూడ స్వాధీనపఱుచుకొనిరి. ఇంతలో విద్యానగరమున శ్రీకృష్ణదేవరాయ లవతరించి తన బాహుబలంబునను, తిమ్మరుసుమంత్రీశ్వరుని శేముషీవిశేషంబు

నను నుత్కలరాజులవశమందున్న కళింగాంధ్రదేశమును వశముచేసికొనుటయేకాక కటకమువఱకుఁ గల యుత్కల భూమినిఁగూడ జయించి గజపతులతోడి సంబంధవశమున నారాజ్యమును వారికే యిచ్చివేసెను. విజయనగర రాజ్యము క్షీణించినపిదపఁ దురుష్కు లీదేశమునెల్లఁ దమయేలుబడిలోనికిఁ దెచ్చుకొనిరి. కావుననే "రెడ్డి యొడ్డితెలుఁగుతురకలు" ఈదేశము నేలిరని సామాన్యులు గూడ చెప్పుకొనుచుందురు. గంజాంమండలమందలి బరంపురప్రాంతమున మన్నెసంస్థానము లధికముగా నుండుటయు, నుత్కలదేశీయులధాటి కిని సన్నిహిత ముగా నుండుటయుఁ గారణములుగ నాయారాజులు వారివారిపాలనకాలమున నిక్కడఁ దమతమకు విశ్వాస పాత్రమగు కొంతసైన్యమును, రాజప్రతినిధులను నిలువ యుంచెడివారు. ఆసైనికులు కాలక్రమమున నీదేశము ననే స్థిరపడుటచే వారివంశము లిప్పు డీప్రాంతమున శాఖోపశాఖలుగా నున్నవి. విశాఖపట్టణప్రాంతము మొదలుగ బరంపురమువఱకును గల "రెడ్డిక"యనుజాతి వా రానాఁటి రాజమహేంద్రవరరాజులస్వజాతీయులు, వారి సైనికుల వంశస్థులు నై యున్నారు. అజ్ఞాన వశమున నితరజాతులవారు వారి నిపుడు "రెడ్డిక" వా రని వ్యవహరించినను వారుమాత్రము "పంటరెడ్లు" మని చెప్పుదురు. వీరిలో చాలమంది యిపుడును దొరతనము వారి సేనలలో సైనికులుగా నుండుచుందురు. నాఁటికి నేఁటికిఁగూడ వీరవిహారమే వారి కానందదాయక మగు వృత్తియై యున్నది.

తెలుఁగురాజుల (కృష్ణదేవరాయని) కాలమునఁ దెలగాణ్యమునుండి తెలుఁగుసైనికు లీ దేశమునకు వచ్చి యిక్కడ స్థిరనివాస మేర్పఱుచుకొని యున్నారు. ఈ తెలగాజాతివాఁడ నీ ప్రాంతములం దధికసంఖ్యముగానే యున్నది. వీరును ననేకులు పటాలములలోఁ గొలువు చేయుటకే యుత్సహించుచుందురు.

తురకలపాలనమునఁ నీదేశమున దురుష్కులు చాలమంది నివాసమేర్పఱుచుకొనియుండిరి. కాని ప్రస్తుతము వారిసంఖ్య యీప్రాంతములందు చాల సన్నగిల్లియున్నది. ఆయాస్థలములలో నున్న శిథిలము లయిన మసీదులును, వేనవేలుగానున్న మృతసమాధులు మాత్రమే వారి పూర్వాధిక్యమును వ్యక్తపఱుచు చున్నవి. ఇంక నీసామాన్యవిషయమును విడిచి రెడ్డి రాజులు జయించినరాజ్యములగూర్చి యించుక పరి చయము గావించుకొందము.

౧. ధారాసురత్రాణుఁడు, ధారాసురథాణుఁడు అనునామములతో నొక్కరా జగపడుచున్నాఁడు. ఈ ధారాపుర మెక్కడిదో తెలియరాలేదు. గంజాంమండల మందు ఏజెన్సీప్రాంతమున ధారాకోట యనునొక జమీం. దారీస్థలము కలదు. కాని యాకాలమున దానిని సుర త్రాణుఁడు పాలించెనా యనుసంశయము గలుగుచున్నది. సుల్తాను అనుతురకపదమును సురత్రాణ, సురధాణపద ములతో మనకవు లుపయోగించిరి. ఈదేశమును బాలిం చినవారు, నిప్పుడు నీదేశమం దట నట నివాస మేర్ప ఱచుకొన్నవారు నగు తురుష్కులెల్లరును నైజాము దేశమునకు సంబంధించినవారుకాని యుత్తరమునుండి వచ్చినవారు గారు. విజయనగరరాజ్యము క్షీణించిన పిదపనే దక్కనుతురుష్కు లీదేశమునకు వచ్చిరి. కావున రెడ్డిరాజులకాలమున ధారాకోటలో సురత్రాణుఁ డుం డుట సంశయాస్పదమే. కావున నీధారానగరము వేఱొక స్థలమందిలిదియని యైనను, లేక సురత్రాణపదమునకు వే ఱొకయర్థమైనను జెప్పవలసి యుండును. ఈధారాసుర త్రాణపదము ఈ రాజులవిషయముననే కాక చాల మందిరాజుల విజయములందుఁగూడ వర్ణింపఁబడినది.

౨. "సప్తమాడియ" యనుపేరుగలగ్రామ మేది యొ నిపుడు స్పష్టముగాఁ దెలియకున్నది. బరంపుర మునకు సమీపమున "సప్తపాండ్య" యనుగ్రామము గలదు. ఉత్కలప్రాంతమందే 'సప్తబానియా' యను వేఱొకగ్రామము కలదట. ఈరెంటిలో నేదైనను గావ చ్చును. ఇదికాక విశాఖపట్టణమండలమందు "మాడుగుల" యను సుప్రసిద్ధమగు సంస్థానము నేఁటికిని గలదు. కృష్ణ దేవరాయని విజయవర్ణనమున "మాడెముల నేర్చె నొడ్డాది మసియొనర్చె"నని పెద్దనార్యుఁ డామాడుగుల విజయము చేర్కొన్నాఁడు. ఇందు మాడుగుల,మాడె ముల యనుపదములు లేకున్నను "మత్స్యవంశనృపరక్షా"

కేళిపద్మేక్షణా!" యని కలదు. మాడుగులరాజులది మత్స్యవంశము. కావున నీసప్తమాడియపదము మాడుగులకైనను జెందియుండును. మాడుగులకు నలుక్రోసు దూరమునఁగల "మాకవరము"ను వీరభద్రారెడ్డి జయించినట్లు కాశీఖండమున నుండుటంజేసి యీసప్తమాడియ యుత్కళసీమయందలిదే యనిచెప్ప టుచితముగా నుండును.

ఒడ్డాది, శృంగారంకోట, లోతగడ్డ యను గ్రామములు విశాఖపట్టణమండలములోనివి. ఇప్పటికిని వీరులు, బలిష్ఠులు నగు తెలగాలకు ఒడ్డాది ప్రసిద్ధికెక్కినది. పూర్వ మది విరటరాజు రాజధానియని యక్కడివారు చెప్పుకొందురు. మాడుగుల ద్రుపదునిరాజధాని యందురు. శృంగారంకోటయం దిప్పుడు శిథిలమైనకోట యొకటి కలదు. ఆకోట చాలఁ బ్రాచీనమైనదని యనేకులు చెప్పుచున్నారు. లోతగడ్డయను గ్రామము లోతుగడ్డయను పేర ఆంధ్రసంస్థానమునకు దగ్గఱగా మెంటాడ గ్రామముకడ నున్నది. ఈగ్రామములన్నియు మాళియా ప్రదేశములందలివే. శృంగవరపుకోటకు సమీపమున విరటకొండయను నొకపర్వతము కలదు. ఆకొండకడనే యుత్తరాభిమన్యులకు వివాహమైనదనియు నక్కడి వారు చెప్పుదురు. వర్షకాలమునందా ప్రాంతభూములందు బియ్యపుగింజపరిమాణముగల బంగారుకణికలును, వంగగింజలంతేసి బంగారునాణెములును లభించుచుండును వీనినే వంగపరక లందురు. కొన్నింటిమీఁద నందివిగ్రహము ముద్రితమై యుండును. వానిని నందిపరకలని వ్యవహరింతురు. ఉత్తరాభిమన్యుల తలఁబ్రాలుగా వీనిని వ్యవహరించుచున్నారు. మఱియు శృంగవరపుకోట కనతిదూరమున నున్న జామిగ్రామమును శమీపురమనియు, దానికి దగ్గఱగనే కల "అలమండ"ను ఆలమంద యనియు, పాండవులు శస్త్రములుంచిన శమీతరు వుండుటచే శమీపుర మనియు, విరటునియాలమంద లున్నతావునకే "యలమండ" యని పేరువచ్చెననియు నచ్చటివారు నమ్ముచున్నారు. భారతకథయెల్ల నా ప్రాంతముననే జరిగిన దని వారినమ్మకము. ఆనమ్మక మెట్లున్నను నాస్థలములుమాత్రము పాండవులుకాకున్న వారితో సమానులగు రాజన్యులచేఁ బాలింపఁబడినవనుట మాత్రము నిక్కువము. ఆపాలించినవారు కొంతకాలము రెడ్డిరాజులు, పిదపఁ దెలుఁగురాజులు ననుట నిర్వివాదము. రెడ్డిరాజులు పాలించినతావులందెల్ల వంగపరకలు, నందిపరకలు లభించుటమాత్రము వింతగొల్పుచున్నది. "క్షీరాంభోధితటంబున న్నిలిపె దిక్సీమా జయస్తంభముల్" అని కలదు కదా! ఆ క్షీరాంభోధి యేది? కార్తికశుద్ధద్వాదశికి మథనద్వాదశి యనియు, క్షీరాబ్ధిద్వాదశియనియు సంస్కృతనామములు. దాని నాంధ్రమునఁ జిలుకుద్వాదశి యందురు. అట్లే గంజాం మండలమందలి రంభకడ నున్న చిలకసరస్సును చిలుకు సముద్ర మని యాప్రాంతీయులు వ్యవహరింతురు. "చిలుకు" వ్యవహారవశమున నిప్పుడు చిలుక యైనది. శ్రీనాథుఁడు "చిలుకు" సముద్రమునే "క్షీరాంభోధి" యని పేర్కొన్నాఁడు. ఆప్రాంతముననే ఆంధ్రోత్కళ సీమలఁ దెలుపు శిలాశాసన మున్నదఁట. అదియే వీరభద్రుఁడు నిలిపిన జయస్తంభ మగునేమో!

దొంతి, కలువపల్లి, జీడికోట, చెంచూమల కప్పకొండ, కిల్లెడ లెందు నేపేరుననున్నవో తెలియవలయును. దొంతిమన్నె యని దొంతిని మన్నెముగా వర్ణించుటం జేసి యది పర్వతప్రాంతమని యూహింపవచ్చును. గంజాంజిల్లాలో దంతయను నొక్క జమీందారీగ్రామము గలదు. దానికిసమీపమునఁ గొన్నికొండలును, గుహలును గలవు. అక్కడ నొక్క గొప్పసరస్సును, దానిసమీపమున శిలపై "కణ్వశ్రీనిర్మితం పద్మసరః" అనుశాసనాక్షరములును గలవు. అదియే గంగ, గాంగవంశపురాజుల ప్రాచీనరాజధానియగు దంతవరమని కొందఱనుచున్నారు. బహుశః మనవీరారెడ్డి జయించిన దొంతి యిదియే యైయుండునేమో? కప్పకొండయనునది "అప్పికొండయను" క్షేత్రమనియు,అనకాపల్లికి సమీపమునఁ గలదనియుఁ గొందఱు చెప్పుచున్నారు. అదియే వాస్తవమైనచో నాస్థలమున నిప్పుడు ప్రాచీనతాసూచన లేవియు లేవుకాని యాస్థలమున నేఁటేట నొకయసభ్యమైన యాత్రోత్సవముమాత్రము సాగుచున్నది. చెంచూమల యనేకరాజులవిజయములందు వినఁబడుచుండునుగాని

యదియెందున్నదో యెఱుఁగఁబడలేదు. కిల్లెడకూడ నల్లేకాని యిచ్ఛాపురమునకు సమీపమునఁ గల బెల్లుపడ యే కిల్లెడయని కొందఱు చెప్పుచున్నారు. బెల్లుపడ యందును, నాపరిసరగ్రామములందును రెడ్డికుటుంబము లనేకములు గలవు. ప్రాచీనములగు మందిరాదు లేవియు లేవుగాని బెల్లుపడతోఁగలిసియున్న యిచ్ఛాపురమునందు పాడువడినకోటయొకఁగందకమును గలవు. ఆరెండుగ్రామములందును శిథిలములయిన మసీదులు చాలగలవు. ఈచోటులం గల తురుష్కమృతసమాధులకు లెక్కలేదు. దొరతనమువారిలెక్కలందు బెల్లుపడ యనియేకాని యిచ్ఛాపురముపేరు లేనేలేదు. పూర్వము బెల్లుపడ మహాపట్టణముగా నుండెడిదనియు, మహమ్మదీయు లత్యధికముగా నం దుండెడివారనియుఁ జెప్పుదురు. సయద్‌ఖానునవాబు దక్కనునవాబులకుఁ బ్రతినిధిగా నీకోటలోఁ బాలించిననవాబులలో నాఖరివాఁడనియు, నాతనితోడనే రాజ్యమువైభవము నస్తమించెననియుఁ జెప్పుచున్నారు. ఆసయ్యదఖానుఁడు త్రవ్వించినసరోవర మొక్కటి సుందరములగు సోపానములతోడను, సునిర్మలమై యమితారోగ్యకరమగు జలముతోడను నిప్పటికి నున్నది. ఇచ్ఛాపురపట్టణమున కెల్ల దీనియందలి మంచినీరే పానీయము. ఈచెఱువు ద్వాదశాదిత్యు లుదయించినను నెండదని పెద్దలందురు. దీనితలము గాంచినవా రెవ్వరును లేరు. ఈచెఱువు త్రవ్వించి హిందువులు నిశ్శంకముగా నందలిజల ముపయోగించుటకై యాతురుష్కప్రభుఁడు ఆఱువందలకావిళ్లకాశిగంగ తెప్పించి యాసరస్సును దొలుదొల్త నిండించెనఁట! ఆహా! ఆ తురుష్కుని ధర్మబుద్ధి, పరమతసహనము నెంత వర్ణించినను దనివితీఱదు. ఇచ్ఛాపురమునకు సమీపమున పీర్లకొండయను నొకకొండగలదు. దానిపైని యొకగొప్ప మసీదును, దానిప్రాంతములం దసంఖ్యాకములగు గోరీలును గలవు. అవియన్నియుఁ బురాతనములే. హిందువులు లక్ష్మీకరమని యెన్ను ప్రతిలక్ష్మీవారమునందును విశేషించి మార్గశీర్షలక్ష్మీవారములందు నాప్రాంతమునందలి జనులెల్లరు నాకొండపైనున్న మసీదున కేగి పీర్లకు మ్రొక్కులు చెల్లింతురు. ఆకొండమీఁదఁ బూర్వమొకమహమ్మదీయయోగి తపము సల్పుచుండెడివాఁడనియు, నాతని కమండలువు పవిత్రసరస్సుగాను, ఆతని దంతకాష్ఠ మొకగొప్పవృక్షముగాను బరిణమించిన దనియు చెప్పుదురు. ఇవి నమ్మదగినవిలులేని పిట్టకథలేకాని యీప్రాంతమునందలి హిందువులు, నందు దెలుఁగు మాతృభావగాఁగలవా రెల్లరును దురుష్కదైవముల నిట్లు భజించుటమాత్ర మాశ్చర్యజనకము కాకపోదు. ఇంకొక్కవింత. నాదిర్‌ఖాన్‌సాహేబను నొకతురుష్కధనికుఁ డొకనూయి త్రవ్వించెనఁట. ఆనూయి యిప్పుడును గలదు. అందలి నీరము మధురాతిమధురము. నూతియాకారము కుక్కుటాండాకారము. లోతు పదిబారలుమాత్రమే. నూయియున్నస్థలము కొండప్రక్కనున్న మిట్టనేల. అయినను నానూతినీటికి తరుగెన్నఁడు నుండదఁట. ఈనూయి దర్శింపఁదగినవింతలలో నొక్కటియనకతప్పదు. ఈబెల్లుపడ యీప్రాంతముల నున్నమన్నసంస్థానము లనేకములకు మార్గమం దున్నది. ఇక్కడ బ్రిటిషుదొరతనమువారి పటాలముకూడ కొంతకాల ముండెడిది. ౧౮౧౯ లోను ౧౮౪౭ లోను మరణించిన యిరువు రాంగ్లేయసైనికాధికారుల సమాధులీగ్రామమునఁ గలవు. ఈ గ్రామముకడ సుమ్మాళి యను గ్రామ మున్నది. ఆగ్రామసమీపమున నిప్పుడు దొరతనమువారి ఉప్పుఫ్యాక్టరీ కలదు. ఇక్కడ నొక్కకోట శిథిలమైనది కనఁబడుచున్నది. అకోటబురుజు ఒకటి, మలచినఱాలతోఁ గట్టినది నేఁటికిని దృఢముగా నున్నది. మిగిలిన మూఁడుబురుజులును మంటిదిబ్బలుగా నున్నవి. ఆబురుజులయు, ప్రాకారముయొక్కయు ఱాలు పెరికి తెచ్చి యిచ్ఛాపురముకోట కట్టిరఁట. సుమ్మాళికోట కూడ మహమ్మదీయులదేయని యిక్కడివారి నమ్మకము. మహమ్మదీయులదేయైనచో నొక్కక్రోసుదూరముననే రెండుకోట లుండుటకును, సుమ్మాళికోట భగ్నము గావించుటకును గారణములు గానరావు. బాగుగ నాలోచించిన సుమ్మాళికోట ఒడ్డిరాజులో, లేక రెడ్డిరాజులో కట్టినదేకాని తురుష్కులు నిర్మించినది కాదనియుఁ, దురుష్కులే సుమ్మాళికోటను భగ్నము గావించిరనియుఁ దేలును. ఈ బెల్లుపడకాక

ఘుంసరామన్యమున కుల్లాడయను గ్రామము గలదు. అందు శిథిలమైన కోట గలదు. అది పూర్వము గొప్ప వైభవ మొందినదని యెల్లరు నంగీకరింతురు. "కుల్లాడ" యే యింవలి కిల్లెడ యగునేమో?

సింహాచలము, చిల్కాసముద్రము, కళింగమును నెల్లరు నెఱింగినస్థలము లగుటంజేసి వానివిషయమయి తెలుపవలసినది లేదు. గంజాంమండలము మొదలుగ రంభవఱకుఁగల సముద్రము చిలుకయాకారముగా నుండుటచే నీప్రాంతమందున్న సముద్రమున కెల్లఁ జిల్కాసముద్రమని వ్యవహార మేర్పడినది. కొందఱు రంభకడనున్న సముద్రభాగమునకే చిల్కాసముద్రవ్యవహారము గలదందురు. రంభకడనున్న దానికి చిలుకసరస్సని వ్యవహారము ప్రసిద్ధము. అక్కడ సముద్రమున్నతతరంగములు లేక చిన్నచిన్న యలలతోడను, సముద్రమధ్యమున ఫలపుష్పశోభితమగు తరులతాజాలములుగల క్రీడాపర్వతముతోడను విలసిల్లుచు చూపఱ కమితానందము గల్పించును. శ్రీనాథకవి రంభకడనున్న చిలుకసరోవరమునే క్షీరాంభోధి యని పేర్కొన్నాఁడు. కసిమికోట విశాఖపట్టణమునకు ముప్పదిమైళ్ల దూరమున నున్నది. అం దిప్పుడును బ్రాహ్మణులు జమీందారులు గలరు. బ్రాహ్మణజమీందారుల కారాజ్య మెప్పుడు వశపడినదో కాని యాపట్టణ మొకప్పుడు తురకలపాలనమున నుండెడిదని పెద్దలు చెప్పుదురు. ఇప్పుడాయూర మహమ్మదీయులు పెక్కుకుటుంబములవారున్నారు.

ఇంక ఝాడియ, జంతర్నాడు, బారహా, వేంకటాయి, కంచుకముల్ అనుగ్రామముల గూర్చి తెలిసికొందము. ఝాడియ ప్రకృతము ఝాడుపూఁడియను పేర నున్నది. కంచుకముల్ అనునది ఝాడుపూఁడికిని సోంపేటకును నడుమ సోంపేటరైలుస్టేషనుకడ కంచిలి యనుపేర నున్నది. మొదట నీయూరి పేరు కంచెల. దానికి సంస్కృతము కంచుకము. గ్రంథమున బహువచనము లేఖకప్రమాదాపతితము. ఝాడుపూఁడియుఁ గంచిలియుఁ బూర్వము రాజధానులుగా నుండి యెట్టికీర్తి నొందినవో మనము కనలేదు గాని ప్రకృతమున నాళికేరకదళీపనసాదిఫలములకు మిగుల బ్రసిద్ధికాంచినవి. సోంపేటరైలుస్టేషనునకుఁ గొంతకాలము కంచిలిస్టేషననియే పేరుండెడిది. చీకటి ప్రస్తుతముగూడ జమీందారీస్థలముగానే యున్నది. ఈకోట బహుబలిష్ఠమైన గిరిదుర్గముగా నున్నది. జనసామాన్యమునందు చీకటికోటయనియుఁ, జీకటియనియు రెండుపేళ్లును వ్యవహారము గలదు. గ్రంథములందు జీకటియనిమాత్రము కలదు. గ్రామమునకే రెండుపేళ్లువ్యవహరించుట యింకొక్కయెడఁగూడ నాతఁడు గావించియున్నాఁడు. జంతుర్నాడు ఈప్రాంతముననేకల "జలంత్రా" దుర్గమని కొందఱును, విజయనగరసమీపమునఁగలదంతర్నాడే జంతుర్నాడని కొందఱును జెప్పుచున్నారు. రెండుస్థలములును బ్రాచీనవైభవముగల ప్రదేశములే. ఇందేదియైనను గావచ్చును.

పాఠకులకు తెలిసికొనవలసిన దింక నొక్క "బారహా"ను గూర్చిమాత్రమే కలదు. గంజాంమండలమునందలి బారువయే బారహా యని తెలియవచ్చుచున్నది. నేను మొదట బారహా యనుపేరు బారువ యని మాఱినదో, లేక బగహాంపురముగా మాఱినదో యని సంశయించితిని. బస్తరురాజ్యమందు బారహాకోట యనుపేర నొకయూరు కలదనియుఁ గొందఱు చెప్పిరి. కాని ముందుఁ జెప్పఁబోవు కారణములవలన బారువయే బారహాగా నిశ్చయించితిని. బారువ గ్రామము సముద్రతీరమున నున్నది. సముద్రమునకు నూరికి నరమైలుకంటె నధికదూర ముండదు. అక్కడ నోడరేవు కలదు. బర్మా మొదలగు దేశములకు జనుల రాకపోకలును, వర్తకవ్యాపారములు నారేవున విరివిగా సాగుచుండును. మహేంద్రగిరిపైని జనించిన మహేంద్రతనయ యను నది యీగ్రామమున సాగరసంగ మొందుచున్నది. ఈగ్రామమున నిప్పుడు యూనియను పంచాయతీ కలదు. ఈగ్రామవిషయమున చిత్రవిచిత్రములగు పురావృత్తముల నక్కడివారు చెప్పుచుందురు.

పాండవు లరణ్యవాససమయమున మహేంద్రగిరిపైని గొంతకాలము వసించిరనియు, నాసమయమున

నొకనాఁడు వారు వన్యమృగభ్రాంతిచే నొక కపిలగోవును సంహరించి రనియు, యథార్థము, తెలిసికొని పశ్చాత్తాపపడి పాపహరణమునకై యక్కడ యజ్ఞము గావించి బ్రాహ్మణుల కనేకసువర్ణదక్షిణ లర్పించిరనియు, మఱియుఁగోటీశ్వరుఁడను శివలింగమును, జనార్దనుఁడను విష్ణువును బ్రతిష్ఠించిరనియుఁ జెప్పుచున్నారు. కపిలగుడ్డి యను పేరఁ గొంతభూమియును, యజ్ఞంబట్టి యను పేరఁ గొంతభూమియును నక్కడ నిప్పటికిని వ్యవహరింపఁబడుచున్నది జనార్దనకోటీశ్వరాలయము లిప్పుడు నున్నవి. ఆలయములు ప్రాచీనములనుటకు సందేహము లేదు. కోటీశ్వరాలయమున నొక జైనవిగ్రహము కొంత శిథిలమైనది కలదు. కోటీశ్వరాలయమునఁ గోటిలింగము లున్నవట. లింగములు కందిగింజలంతేసి యసంఖ్యముగా నున్నవి. అన్నియుఁ జలనము లేకుండ బాతినంటుకొని యున్నవి. ఇచ్ఛాపురప్రాంతమునందు బౌద్ధవిగ్రహము లక్కడక్కడ నగపడుచున్నవి. జనార్దనాలయముపైని వరాహనారసింహ వామనావతారములం దెల్పువిగ్రహములు మూఁడు కలవు. జగన్నాథాలయకుడ్యములందును మూఁడు ప్రక్కల నా మూఁడవతారములు నున్నవి కాని యవి యంత ప్రాచీనమైనవిగా నగపడలేదు. జనార్దనాలయమందు అష్టబాహువులు, సింహవాహనము గల మహిషాసురమర్దనీవిగ్రహ మొకటి కలదు. అదియు నంత ప్రాచీనముగాఁ దోఁపలేదు జగన్నాథాలయ మొకటి గొప్పది కలదు. అందు శిథిలములైన చిత్రశిలాశకలములనేకములు పడియున్నవి. ఆలయము నవీనముగా బాగుచేయింపఁబడినది. గుడిపై నెల్లెడల చిత్రితములగు విగ్రహము లున్నవికాని యన్నియు నసభ్యములే. కవచమును ధరించిన మహారాష్ట్రయోధుఁడును, కిరస్తానిదొరసానివేషముగల యొకస్త్రీయును మాటాడుచున్నట్లు చిత్రింపఁబడియున్నది. పునర్నిర్మాణము జరిగినదికాని యీయాలయము బురాతనమైనదే యని తోఁచుచున్నది. ఇంకొక్కచిత్రము. ఈయూరుకడ మహేంద్రతనయాసాగరసంగమస్థలమును బవిత్రముగా గణించి యీప్రాంతజనులు మృతినొందినవారియస్థికల నిక్కడఁ గలుపుదురు. ఆయస్థికలు కొంతకాలమునకు సగముమేర శిలలుగా పరిణమించునఁట. సగముటాయి, సగముశల్యముగా నున్న యొకవస్తువును నేనును జూచితిని. చాల ఆశ్చర్యముగానే యున్నది. ఈయూరికి భారహారశాసనమని పూర్వనామము కలదు. పాండవులపాపభారమును హరించుటచే నీపేరు వచ్చినదందురు. శాసనమనఁగా గ్రామమని యీప్రాంతములసంజ్ఞ. ఈయూరి ప్రక్కనే తురకశాసనమను చిన్నపల్లె కలదు. అది తురకలరాజ్యమున నిర్మింపఁబడుటచే నాపేరు వచ్చినది. భారహారశాసనమే కాలక్రమమున రేఫలోపమున భారహమై, రెడ్డిరాజులనాఁటికి బారహాయై, యిపుడు బారువయై యున్నది. రెడ్డిరాజులకాలమునాఁడే దీనికి వెంకటాయి యనునామాంతరముగూడ నుండెడిది. ఇపుడును దొరతనమువారి లెక్కలలో వెంకట్రాయపురమనియే కలదు. పూర్వముగూడ వెంకట్రాయపురమనియే యుండియుండఁగా శ్రీనాథుఁడు గ్రామ్యజనవ్యవహారమం దున్న రీతినే వెంకటాయియని పేర్కొన్నాఁడు. ఇట్టిప్రయోగము లాతనిగ్రంథములలో మఱికొన్ని కలవు. కాశీఖండమున శృంగారంకోట "ఇరువైనాలుగుమూళ్ల మేర" యని ప్రయోగించినాఁడు. ఇరురేఫకు ఉకారము లేకుండ నిపుడు సామాన్యముగా వ్యవహారమందున్న "ఇరవై" యనియే కవి ప్రయోగించియుండును. సంస్కర్తలు "ఇరు" అని దిద్ది దానిని సాధువు చేయఁజూచిరి. "వై, మూళ్లమేర" పదము లెప్పుడును వ్యావహారికములే కాని లాక్షణికములు గావు. వ్యావహారికభాషామాధుర్యలుబ్ధుఁడగు కవి వాని నట్లే ప్రయోగించినాఁడని తెలియనగును. బారహాయన్నను, వెంకటాయియన్నను బారువయేకాని వేఱుస్థలము గాదు. ఈయూరఁగూడ వర్షాకాలమున వీథులందు బంగారువంగపరకలు, నందిపరకలు లభించుచుండును. రెడ్డిరాజులు పాలనము చేసినస్థలము లనేకములం దిట్టివి లభించుచుండును. ఈనాణెములు రెడ్డిరాజులవో, యింకనంతకు మునుపటిరాజులవో నాకుఁ దెలియరాలేదు. వంగపరక వంగగింజపరిమాణము గలిగి పలుచనిరేకును, చుట్టు నంచు నుండును. మధ్య నొకపెద్ద చుక్కయును


రెండవమూఁడు చిన్నచుక్కలు నుండును. ఒకప్రక్క నేమియు నుండదు. నందిపరకపై నొకప్రక్క నేవో చిన్నయక్షరములును, రెండవప్రక్క నందివిగ్రహము నుండును.

వ్యాసము ముగించుటకుముందు ముఖ్యమైనవి రెండుసంగతులు చెప్పవలసియున్నది. భీమఖండరచనము నాఁటికి రెడ్లరాజ్యము సింహాద్రిపర్యంతమే వ్యాప్తమైనదని కీ. శే. వీరేశలింగముపంతులుగా రూహించి యున్నారు. కవి "సింహాద్రిపర్యంతసీమావని" యని సామాన్యముగాఁ జెప్పినను నా పద్యమందే "ధారాసురత్రాణరఘాటీయ, సప్తమాడియ" పదము లుండుటచే నించుమించుగ పూర్ణముగనో, అసంపూర్ణముగనో వారి పాలనము ప్రస్తుత బరంపురమువఱకు వ్యాపించి యున్నదని తలంచుట సాహసము కాదేమోయని నా యూహ. ఆంధ్రకవులచరిత్రమునందు శ్రీనాథుని గూర్చి వ్రాయుచు వీరభద్రారెడ్డికి భార్యయగు ననితల్లివలన రాజ్యప్రాప్తి యైనమాట చెప్పలేదని యాతని కొకదోష మారోపింపఁబడినది. ఆదోషారోపణము ప్రామాదికమనియుఁ గవి యావిషయమును జక్కఁగా వర్ణించియేయున్నాఁడనియు నాతలంపు. కాశీఖండము నందలి పద్యమును జిత్తగింపుఁడు:

మ. మనుతుల్యుం డసకాటభూవిభుని వే
　　　మక్ష్మాతలాధీశునం
　దనఁ బాణిగ్రహణంబు చేసెఁ బ్రియమొం
　　　దన్వీరభద్రేశ్వరుం
　డనితల్లి న్ననితామతల్లి నుదయా
　　　స్తాద్రీంద్రసీమావనీ
　ఘనసామ్రాజ్యసమర్థసుప్రథిమ సా
　　　క్షాదిందిరాదేవతన్.

ఇందలి "ఉదయాస్తాద్రీంద్రసీమావనీ ఘనసామ్రాజ్యసమర్థసుప్రథిమ సాక్షాదిందిరాదేవతన్" అను విశేషణము అనితల్లిసామ్రాజ్యాధిపురాలని నిరాఘాటముగాఁ జెప్పుచున్నదే! నాయకుని రాజుగా వర్ణించు టుచితముగాని యొకరికిఁ బ్రతినిధిగా వర్ణించు టుచితము గాదు గదా! కావుననే వీరభద్రుఁడు, నాతనిసోదరులును భూములనెల్ల జయించిరని వర్ణించి వీరభద్రారెడ్డి రాజ్యాధీశ్వరుఁడని వర్ణించియున్నాఁడు. అయినను అనితల్లిదే రాజ్యము గావున నామె నట్లే వర్ణించి యున్నాఁడు. కావున నిందు శ్రీనాథుఁడు చెప్పక విడిచిన రహస్య మేమియు లేదనియు, నాతఁడు రాజమహేంద్రవరరెడ్లకు రాజ్య మేరీతివచ్చినదియు, వారు దాని నేరీతి నెంతవఱ కభివృద్ధి నొందించినదియు నుచిత రీతిని జక్కఁగా వాస్తవమును గరతలామలకముగా వర్ణించినాఁడనియే నమ్మవచ్చును.

కొంద ఱనుకొనుచున్నరీతిని వీరభద్రదేవునివిజయమును బోతనకవి యెట్లువర్ణించినాఁడో శ్రీనాథకవి వీరభద్రరెడ్డివిజయముల నట్లు విస్పష్టముగ వర్ణించి యున్నాఁడు. విజితములగురాజ్యము లాయాప్రాంతముల నున్నవని తెలుపుట వేఱొకమహాపురాణఖండము రచింప నున్నకవి కవసరము కాదు. ఆంధ్రరాజులవిజయములను స్పష్టముగఁ దెలిసికొనుట కాంధ్రుల కుత్సాహముండుట సహజము. నాకుఁ దెలిసినరీతి నాయాస్థలముల చరిత్రమును వివరించితిని.



వేకువ

—సి. జి. జగన్నాథదాసు.

దీర్ఘాలోచనాపరతంత్రునివలె ప్రవర్తించునట. తన ఉద్యోగులతో కూడ ఇతడు నిరంకుశముగ ప్రవర్తించునట.

హిట్లరు మధ్యమతరగతిలో తక్కువస్థితిపరుల లోనివాడగుటచే ఇతనికి వారియందే ఎక్కువ యభిమానము. పెద్దవర్తకసంఘములను అంతరింపజేసి ఈతరగతివ్యక్తులు చిన్నదుకాణదారులుగ పొట్టపోసికొనుటకు ఏర్పాటుచేయవలెనని తెలియజేసెను. బెర్లినులో యూదుల పెద్దదుకాణములన్నిటిని మూసివేసెదనని హిట్లరు బెదరించెను. యూదులు జర్మనుపౌరసత్వములను బడయుటకు హక్కులేదనెను.

మ్యూనిచితిరుగుబాటులో శిక్షింపబడి వదలబడినను ఆతనికి నిర్బంధములు పూర్తిగ తప్పలేదు. బవేరియాలో ఇతడు రాజకీయోపన్యాసముల నీయరాదని ఉత్తరువుచేయబడెను. ౧౯౨౭ మే మాసమువరకు ఈఉత్తరువును తొలగించలేదు. అప్పటినుండియు దొరికిన ప్రతియవకాశమును హిట్లరు చక్కగ ఉపయోగించుకొనెను.

నాజీయుద్యమము

కడచిన అయిదుసంవత్సరములలో ఈయుద్యమము అత్యద్భుతముగ ఏర్పడెను. ప్రారంభమున ఈయుద్యమము అతిస్వల్పముగ కన్పించెనుకాని రాను రాను ఇంతింతై నభోవీథిని ముట్టినది. యూరపుఅంతయు ఈయుద్యమమునకు భయపడుచున్నది. ౧౯౨౮ వరకు హిట్లరునకు రిచిస్టాగులో నాజీసభ్యులు ౧౨ గురుకంటె ఎక్కువమంది లేరు. అపుడు హిట్లరును, ఆతని 'బ్రవునుషర్టు' పక్షమువారిని ఎవరును లక్ష్యముచేయలేదు. వీ రింతపలుకుబడిని గడించెదరని కలలోనైన తలచియెరుగరు. ౧౨మాసములు గడచెను. కొంతమార్పు ఏర్పడెను. నాజీపక్షమునకు కుడిభుజముగ హ్యూగెను బర్గు బయలుదేరెను. సర్వవిధముల ఇతడీపక్షమును పెంచి పోషించెను. ఇతడు గొప్ప నిర్మాణకార్యక్రమనిపుణుడు. ఇతడు పూనుకొన్నదాదిగ నాజీయుద్యమము విశ్వరూపమును దాల్చెను. ౧౯౩౦-వ సంవత్సరము వచ్చుసరికి రిచిస్టాగుపార్లమెంటులో హిట్లరుపక్షమువారు ౧౦౭ గురు ప్రవేశించిరి. దీనితో ప్రపంచమంతయు అచ్చెరువొందెను.

ఇంతకంటె ఆశ్చర్యకరమగు విషయము ఇంకొకటి కలదు. కడచిన జూలై ఎన్నికలలో రిచిస్టాగులో వీరి సంఖ్య రెండింతలుగ పెరిగెను. జర్మనీలోనున్న రాజకీయపక్షములలో నాజీపక్షమే గొప్పదిగ నిలబడెను. కాని కడచిన నవంబరు ఎన్నికలలో నాజీలు ౩౪ స్థానములను గోల్పోయిరి. కాని వీరిబలము చెడలేదు.

మొన్న మార్చి ౫-వ తేదిని జరిగిన ఎన్నికలలో నాజీలకు అఖండవిజయము చేకూరెను. స్వతంత్రముగ ఇతరులపై ఆధారపడు నవసరము లేకుండగనే రిచిస్టాగుపార్లమెంటులో కార్యభారమును నిర్వహింపగల బలమును గడించిరి. ౨౮౮ స్థానములు వీరికి లభించెను. ఉద్యోగములన్నియు నాజీలవే. అధికారమంతయు నాజీలదే. నాజీలు పెట్టినదే భిక్ష. నాజీయుద్యమచరిత్ర మిట్టిది. మొదట ౭ గురితో ప్రారంభమైన హిట్లరుఉద్యమము నేడు విశ్వరూపమును దాల్చినది. నాజీపక్షమునకు మొదటిపేరు స్వతంత్రజాతీయసోషలిస్టుకార్మికపక్షము. బ్రవునుషర్టులే నాజీలదుస్తులు. తనకు ప్రధానామాత్యపదవిని ఇచ్చినగాని స్వీకరించెననని తెలుపుటకు హిట్లరు వెనుదీయలేదు. జర్మనీలో ఈపదవికే ఛాన్సిలరు అనిపేరు. మొన్నటివరకు హిండెంబర్గుగారు హిట్లరుకోరికను నిరాకరించెను. మార్చి ఎన్నికల ఫలితముగ హిట్లరుకీపదవిని ఇవ్వక తీరినదికాదు. పార్లమెంటుప్రభుత్వము నేర్పాటుచేయుటకు వాన్‌ష్లీషరు, వాన్‌ప్యాపెనుగార్లు విఫలప్రయత్నులగుటచే హిట్లరునకు మంచిఅవకాశ మేర్పడెను. గతమాసము మాగ్డీబర్గులో ౮౦౦౦ నాజీఉద్యోగుల సమక్షమున ఉపన్యసించుచు తమకు ప్రభుత్వాధికారము నిచ్చినగాని ఎట్టి ఉద్యోగములను నాజీలు స్వీకరించువారు కారని నిర్భీతిగ హిట్లరు పలికెను. మన యుద్యమమునకు సంపూర్ణవిజయము చేకూరువరకు నిద్రించువాడను కానని యనెను. నేడు జర్మనీలో హిట్లరునదే ప్రతిభ. ఇతడే సర్వస్వతంత్రుడు.

నేడు హిట్లరు గంగిగోవుగ మారిపోయెను. ఆరుమాసముల క్రిందటనున్న అహంభావము, అదరిపాటు అదృశ్యము లాయెను. నేడుకూడ హిట్లరు ఛాన్సిలరుగ నున్నను హిండెంబర్గు ఈనాజీపక్షనాయకుని చర్యను వేయికన్నులతో కనిపెట్టి చూచుటయేకాక వాన్‌ప్యాపెన్‌ను ఆతని ప్రవర్తనమును కనిపెట్టుటకు తనప్రక్కనే ఉంచుకొనెను.

హిట్లరు రణరంగమునుండి జర్మనీకి మరలినపుడు దేశమంతయు యుద్ధము, విప్లవములతో పీల్చి పిప్పి చేయబడియుండెను. ఎక్కడచూచినను అల్లకల్లోలమే. బోలిషివిజము అతిరయమున విజృంభించుచుండెను. దీనిని ప్రతిహతమొనర్చుటకు హిట్లరు బద్ధకంకణుడాయెను.

౧౯౨౧ జూలైలో కొద్దిపాటి అనుచరులతో నేషనలుసోషలిస్టుపక్షము నేర్పరచెను. దీనినే నాజీ పక్షము అని పిలిచెదరు. నాజీపక్షపూర్వవృత్తాంత మిదియే. ౭ గురితో ఈపక్షమును స్థాపించెను. చేత ౭ షిల్లింగులుతప్ప వేరులేదు.

మిత్రమండలి గొంతెమ్మకోర్కెలు జర్మనుప్రజలు మండిపడునటుల చేయుచుండెను. దేశములో ఎక్కడ చూచినను అధికారధిక్కారమే శ్రీమంతులు పరిభవముచే కుందుచున్నారు. యూదులపేరన్న జర్మనులకు బొత్తుగ కిట్టుటయే లేదు. ఈపరిస్థితు లన్నియు నిప్పులను గ్రక్కుచున్న హిట్లరునకు దోహదములుగ నుండెను. సంవేదనపరులగు యువకులు, దేశభక్తులు సమరోత్సాహముతో ఆయనచుట్టును మూగిరి. అతిశీఘ్రముగనే ఆతనికి చాలమంది అనుచరులు ఏర్పడిరి. వీరందరును సత్కులసంజాతులే. ప్రపంచములో నేడు హిట్లరును మించిన వక్త లేడు. ఆతని గంభీరోపన్యాసములను వినుటకు వేనవేలుగ ప్రజలు పెనగులాడుచు గుంపులుగ చేరెడివారు. ఆతని యుపన్యాసములకు టిక్కట్లు ఏర్పాటు చేయబడెను. దానివలన ఎంతయో సొమ్ము లభించెను. ఆసొమ్మునే నాజీపక్షమునకు ఆతడు వినియోగించెను. జర్మనుయుద్ధముచే తటస్థించిన అధోగతిని తొలగించుటకు ప్రతినపూనెను.

౧౯౨౮-౧౯౩౨ సంవత్సరములమధ్యనే హిట్లరు ఉద్యమము విశ్వరూపమును దాల్చెను.

ఇటలీలోవలెనే పారిశ్రామికులు ఈ నాజీ యుద్యమమును తమ పరిశ్రమలను పెంపొందజేసికొనుటకు ఎంతయు కృషిసల్పిరి.

పారిశ్రామికుల ధనసహాయముతో నాజీపక్షనాయకుడు పెక్కుసంస్థల నేర్పరచి కమ్యూనిష్టులపైనను యూదులపైనను నిర్దాక్షిణ్యముగ దాడివెడలెను. స్వస్తిక పతకములు, నాజీదుస్తులే ఎచట చూచినను. ప్రతిచోటున హిట్లరునకు సలాములే.

౧౯౩౦ ఎన్నికలలో విజయముగాంచినను హిండెంబర్గు హిట్లరును ఛాన్సిలరుగ చేయ నిరాకరించెనని హిట్లరు మండిపడెను. తన పగను సాధించుటకోయన్నటుల రెండుసారులు ప్రభుత్వమును ఓడించెను. కాని తుదకు ఆతడు సాధువర్తనమునకు దిగెను. పూర్వపు దుందుడుకుతనము పోయెను.

హిట్లరుఅభ్యుదయమునకు యూరపు అంతయు అచ్చెరువొందుచున్నది. జర్మనీకి డిక్టేటరుగ నుండవలెననియే ఆతని ప్రధానాశయము. ౧౨ సంవత్సరములక్రిందట హిట్లరు ఎవరో ఎవరికిని తెలియదు. ౧౯౧౪ లో తటస్థించిన జర్మనుయుద్ధమునకుముందు ఆతడు వియన్నా వీధులవెంట 'అన్న మోరామచంద్రా' యని అల్లాడుచుండెను. నేడన్ననో ఆతడు జర్మనీఅంతను హస్తంగతము చేసికొనుటయేగాక యూరపునంతను గజగజలాడించుచున్నాడు. ఫ్రాంసు అపుడే హాహాకారావములు సల్పుచున్నది. పోలండు కలవరపడుచున్నది. జర్మనులు అందరును తమకు మరల హిట్లరు ముక్తిని కలుగజేసెనని అపుడే సంతసించుచున్నారు.

హిట్లరుకు తల్లియందు ప్రేమయధికము. హిట్లరు తల్లి ఉపవాసములు సల్పి తననోరును కట్టుకొని పిల్లలను పోషించుచుండెను.

హిట్లరు రోమనుక్యాథలికుమతస్థుడు. ఆతనికి మతమున ఎక్కువ ఆసక్తి. ఇందుకు ఆతనితల్లియే

కారణము. హిట్లరు కళారాధకుడు. అతని గదిలో గోడ లన్నియు చిత్తరువులతో అలంకరింపబడును.

అతడు ఎన్నడును పొగాకు నెరుగడు; చుట్టను కాల్చిన పాపమున పోలేదు; మద్యపానవైరి; సాత్వికాహారమునే భుజించువాడు. శాకాహారభక్షకుడేయని చెప్పవచ్చును. సాధారణముగ ఫలరసముతోనే పొట్టను నింపుకొనును. ప్రాణము నిలుచుట కెంత ఆహారము కావలెనో అంతతిండినే తినును. అతని దుస్తులు పీలైనంత వరకు నిరాడంబరముగ నుండును.

హిట్లరు సదాబ్రహ్మచారి. కాని స్త్రీలసమస్యల యందు ఆతనికి ఆసక్తిమెండు.

తీరికసమయమున ఆతడు గ్రంథపఠనమును గావించును. థామస్ కార్లయిలు గ్రంథములన్న ఆయనకు ప్రీతి మెండు. జర్మనువేదాంతగ్రంథములు కూడ ఆతనికి ఇష్టము. పనులన్నియు రెప్పపాటున జరిగిపోవలె ననును. యంత్రములన్న ఆతనికి ఎంతయో ప్రీతి. యంత్రమేదైన చెడిపోవునో చీకాకు పడక చెడిపోయిన యంత్రములను,మరలను తానే ఉత్సాహముతో చక్కబరుచుటకు పూనుకొనును. తాను 'మెకానికు' అయిన బాగుండెడిదని యనుకొనును. సంగీతమన్న ఆతడు చెవికోసికొనును. అతడు గానకళాకోవిదుడు. వియన్నాలో తిండిలేక తిరుగురోజులలో నాటకరంగమున కడపటితరగతియందు కూర్చుండి సంగీతమును గ్రోలుచు క్షుద్బాధను బాపుకొనుచుండెడివాడు. తీరికరోజులలో కొండలపైకెక్కి ప్రకృతిసౌందర్యమును చూచుచు ఆనందించును. హిట్లరునకు ఆడంబరము మెండు. స్వోత్కర్షపరుడు. హిట్లరు పత్రికలన్నిటిని తానే నిర్వహించు తలంపుగలవాడు. జర్మనీయభివృద్ధినిగూర్చి తన తలంపులను వెల్లడిచేయుట ఆతని కిష్టములేదు. వెల్లడియగునో తన సంకల్పమునకు భంగ మేర్పడునని తలంచును.

ప్రజాహితైకకార్యములందు హిట్లరు వ్యక్తులతో మొగమాటములేక పోరాడును. కాని వ్యక్తిపరముగ ప్రజలను మిత్రులుగ ఆదరించును.

హిట్లరు సుందరాకారుడు. నిగనిగలాడు నల్లని శిరోజములు, మిలమిలలాడెడి ఆపాదుకపాటి మీసములు చూపరులకు అందముగ కన్పించునట. కాని ఆతని ముక్కుమాత్రము కొంచెము వికారముగ నుండును. అతిధైర్యశాలి. కాని మిత్రులపట్ల ఆతడు అత్యంత విశ్వాసముతో ప్రవర్తించును. మిత్రులసంఖ్య స్వల్పము. ఆత్మవిశ్వాసమే హిట్లరువిజయమునకు కారణము.

కెయిజరు నిష్క్రమించినదాదిగ జర్మనులు సోషలిస్టుప్రభుత్వముతో విసిగిపోయిరి. నష్టపరిహారములు జర్మనీని పీల్చి పిప్పిచేసెను. వెర్సెయిల్సు ఒడంబడిక కుదిరినవెనుక పెక్కుసంవత్సరములవరకు ఫ్రాంసు జర్మనీని న్యూనతగ జూచుచు అంటరానివాని నాదరించినరీతి మెలగుచుండెను. యూరపులో తన ప్రాబల్యమునే స్థాపించుకొనుటకు, జర్మనీని అణగద్రొక్కుటకు సంకల్పించుకొనెను. ప్రాతపగలను తీర్చుకొన నుద్యుక్తులాయెను. ఇట్టి పరిస్థితులందు నేను ఈఅకుంఠితవిక్రమశాలి పతితులైన జర్మనుల నుద్ధరించి శత్రుశేషమును నిష్కంటకముగా చేయబూనుకొనుటచే జర్మనులు ఆతని నాయకత్వమును స్వీకరించిరి. ప్రజలకు అతడు అభయమిడెను.

ముసోలినీ స్టాలినులవలె జర్మనీని నిరంకుశముగ హిట్లరు పాలింపదలంచెను. కమ్యూనిస్టులను, సోషలిస్టులను హతమార్చును. ఫ్రాంసు ఇంగ్లండుమాటల పెడచెవిని పెట్టును. స్వతంత్రముగ వ్యవహరించును. వారు మర్యాదగ ప్రవర్తించిన తాను గూడ మర్యాదగనే ప్రవర్తించును. ఆయుధవిసర్జనసభవారు జర్మనీకి సమానసైనికత్వమును నిరాకరించిరేని, జర్మనులందరిని ఆయుధపాణులుగ జేయును. హోయింజోలోరెను సైనికసంప్రదాయములను ప్రవేశపెట్టును. జర్మనీమితవ్యయసమస్యను పరిష్కరించుటకు పూనుకొనును. పోయిన ఎగుమతివర్తకమును మరల రాబట్టుటకు ప్రయత్నించును. వెర్సెయిల్సు ఒడంబడికను ముక్కముక్కలుగ చింపిపారవేయును.

జర్మనురైతుల దారిద్ర్యమును బాపుటకును, పని లేనివారికి జీవనోపాధిని కలుగజేయుటకును హిట్లరు నాలుగుసంవత్సరములవిధానములను రెంటిని సంకల్పించెను సంఘసంస్కరణములు, పరిపాలకసంస్కరణములనుగూడ ఇతడు తలపెట్టెను. నిర్బంధకార్మికవృత్తిని ప్రవేశపెట్టును. ప్రభుత్వకార్యక్రమమునకు ఇదియే పట్టుకొమ్మ యనుచున్నారు.

ఇతరజాతులతో జర్మనీ సమానస్థానము నాక్రమించునటుల చేయును. వెర్సైయిల్సు ఒడంబడికను పూర్తిగ రద్దుచేయుతలంపును సూచించెను. జర్మనులందరును మరల ఆయుధపాణులుగ చేయబడుదురు. ఫ్రాంసునకు జర్మనీవ్యవహారములతో ఎంతమాత్రము ప్రమేయము లేకుండ చేయదలంచెను. జర్మనులు స్వతంత్రముగ తమకు నచ్చినకార్యములను చేసికొనుటకు అవకాశము లేర్పరుపబడును. అనవసరమగు జాతిసమితిసలహాతో ప్రసక్తిలేకుండ చేయ సమకట్టును. వెర్సైయిల్సుఒడంబడికచే జర్మనీ దుర్భరస్థితియందుండెను. కాలుచేతులు బంధించినటులాయెను. ప్రజలందరకును ఇది సంకటముగనున్నది.

జర్మనుజాతీయక్షేమమునకు అవసరమగునంత వరకు హిట్లరుప్రభుత్వము వైమానికదళమును పెంపొందచేయుటకు తోడ్పడునని గోరింగుగారు తెలియజేసిరి. గోరింగుగారు ౧౯౧౮ యుద్ధములో వైమానికమంత్రిగ నుండెను. వెర్సైయిల్సు ఒడంబడికవలన జర్మనువైమానికదళాభివృద్ధికి ఆటంకము కల్గెను. ఆపాశములను తెగటార్చి ఇతరప్రభుత్వములతో సమానముగ వైమానికదళమును నెలకొల్పవలె ననిరి. ఫ్రెంచిప్రభుత్వమునకు ఇదే హిట్లరుప్రభుత్వముయొక్క మొదటిసవాలు.

ఆర్థికపరిపాలనమును సవరించుటకు పూనుకొనెను ప్రజలు స్వతంత్రముగ వ్యాపారము చేసికొని బ్రతుకుటకు తరణోపాయమును జూపును. గ్రామజీవన పునరుద్ధారణమునకు పూనుకొనెద మనిరి. కరెన్సీపరిశోధనలను చేయువారము కామనిరి. సోవియటుప్రభుత్వముతో స్నేహముగ మెలగెద మనిరి.


౨3-3-33 తేదీని హిట్లరు ఇట్లు రీచిస్టాగు సభలో వచించెను:—జర్మనీలో మరల రాజపరిపాలనమును ప్రవేశపెట్టువిషయమై ప్రస్తుతము ఆలోచించదలచ లేదు.

జర్మనీలో అన్నిమతములకును న్యాయమును కలుగజేతుము.

వెర్సైయిల్సుఒడంబడికను శిలాక్షరములుగ అమలు జరిపితిమి. యుద్ధనౌకలనుగూడ తీసివేసితిమి. కాని ఇది కొంచెముగనే జరిగెను. జర్మనుసైన్యమును హెచ్చింపరాదనే ప్రభుత్వసంకల్పము. దీనిని అవలంబించుటకు త్రికరణశుద్ధిగ ప్రయత్నించెదము. కాని ప్రపంచములో ఇతరులుకూడ తమసైన్యములను పెంచక జర్మనీసైన్యముతో సరిపోవునటులు చేయవలెను. ఆయుధములను తగ్గించవలెను. జర్మనీ సమానస్వత్వములనే కోరుచున్నది. స్వాతంత్ర్యము నపేక్షించుచున్నది. ప్రపంచమందరితోను సంధిచేసికొని శాంతముగ నుండుటయే జర్మనుల కోరిక. కడచినసంగతులన్నిటిని మరచిపోయి క్రొత్తగా అందరును మైత్రితో నుండుటకు ఇష్టపడువారితో చేతులుకలుపుటకు జర్మనులు సంసిద్ధులుగ నున్నారు. నష్టపరిహారములను, ఋణభారములను తొలగించవలెను,



ప్రవర్తక బుద్ధుడు




విష్ణువు



బోధిసత్త్వుడు

(ఈమూడును కంచువిగ్రహములు. ఇవి నాలంద మ్యూజియమున గలవు.)



గంగాధరుడు —తలిశెట్టి రామారావు.

తలిశెట్టి రామారావు, బి. ఏ., బి. యల్.,

ఆదిని నిష్కళుఁడును, నిష్పందుఁడును అగు పరబ్రహ్మము. ఈ పరమాత్మునకు సృష్టి చేయవలెననెడి యిచ్ఛ జనింప "ఓం"కారశబ్ద మాతనిగర్భమునుండి వెడలెను.[1]

"...శబ్దబ్రహ్మంబు కారణంబు బింద్వాత్మకంబై నిష్పందత్వంబునకుంబురుషేచ్ఛాప్రయత్నంబున మూలాధారావస్థితపవన సంఘుక్షణంబునంజేసి యభివ్యక్తంబై పరావాక్కనంబడు నాబ్రహ్మం బీ నాభిపర్యంతం బావాయువుచేత నభివ్యజ్యమానంబైన మనంబుతోడఁ గూడి సామాన్యస్పందప్రకాశరూపిణియు, గార్యబిందుతత్వాత్మికయు, నీశ్వరాధిదేవతయు నై పశ్యంతీ వాక్కనంబడు నాబ్రహ్మం బావాయువుచేత హృదయపర్యంతం బభివ్యజ్యమానంబై నిశ్చయాత్మకబుద్ధియుక్తంబై విశేషస్పందరూపయు, నాదబిందుమయయు, హిరణ్యగర్భాధిదేవతయునై మధ్యమావాక్కనంబను నాబ్రహ్మం బాస్యపర్యంతం బావాయువుచేతన కంఠాదిస్థానంబులయందభివ్యజ్యమానంబై, యకారాదిక్షకారాంత వర్ణమాలారూపంబై, నిశ్చయాత్మయై, శ్రోత్రగ్రహణయోగ్యంబై వైఖరీవాక్కనంబను నీ చతుర్విధసూక్ష్మస్థూలమాతృకాస్వరూప విట్టిదేవీ, నీకు నమస్కారంబు."[2]

పరబ్రహ్మమునం దిట్టిపరివర్తనమును బొంది వైఖరీరూపమున వెడలిన ఓంకారమే తరువాత తక్కిన శబ్దములకు మూలమై సృష్టికి కారణమయ్యెను. నిష్పందుడగు పరమేశ్వరుడు ఓంకారమువలన స్పందత్వమును కలుగజేసెను. ప్రపంచమునకు జగత్తను మారుపేరు కలదు. నిష్పందుడగు పరమేశ్వరుడుతప్ప తక్కిన వన్నియు స్పందత్వము గలిగి సృష్టి. స్థితి, లయములకు లోనగుచున్నవి. ఇటుల స్పందత్వముగల వస్తువుల కన్నిటికిని మాతయు, ఓంకారస్వరూపిణియు నగు దేవికి సరస్వతియనునామమే యత్యనుకూలముగ నున్నది. "సరస్వతి" యనగా "ప్రసరణము కలది; ప్రసరణము కావించునది" యనియర్థము. ఈమె పరబ్రహ్మమునందు లీనమై యుండినప్పుడు చిద్రూపిణిమాత్రము. వైఖరీస్థితికి పరిణమించినప్పుడు నీమెకు రూపము లేదు. ఇట్టి యాదిసరస్వతిని భావింపవలెననిన నోంకారాక్షరరూపమే యాధారము కాని వేరులేదు.

పరబ్రహ్మమున కన్యము లేదు. అతని శక్తిసహాయము లేక ప్రపంచమున నేదియు సాధ్యము కాదు. కనుకనే ఓంకారస్వరూపిణి సృష్టిని చేయుటకు పరివర్తనమును బొంద ప్రయత్నమున నాపరమాత్మతో గూడి గర్భముఁదాల్చి[3] లోకమాత యయ్యెను.

ఇటు లావిర్భవించిన శబ్దమునుండి యాకాశమును, ఆకాశమునుండి వాయువును, వాయువునుండి తేజస్సును, తేజస్సునుండి జలమును, జలమునుండి పృథ్వియు బుట్టినవి. ఈయాదిస్థితియం దివి యతీంద్రియములు. వీటిని పంచభూతతన్మాత్ర లందురు.

సృష్టికల్పనముకొరకు పరమాత్ముడును, సరస్వతియు తొలిస్థితికంటె తక్కువస్థితిని బొందిరి. ఈరెండవస్థితియందలి పరబ్రహ్మమునకు హిరణ్యగర్భుడందురు. హిరణ్యగర్భుడు పంచభూతతన్మాత్రలను మేళవించి భౌతికసృష్టిని జేయును.

---

౧. ఈవ్యాసమునందలి వేదాంత, మంత్రశాస్త్రభాగములను చెప్పి, కావలసిన ప్రమాణముల నేర్చియిచ్చి, నే నీవ్యాసమును వ్రాయుటకు తోడ్పడిన శ్రీమన్మహోపాధ్యాయ ఆచంట వేంకటరాయ సాంఖ్యాయన శర్మ (ఇపుడు కీర్తిశేషులు) గారికి వందనములు.

౨. శ్రీనాథుడు, కాశీఖండము, తృతీయాశ్వాసము.

3. శతపథబ్రాహ్మణము; బృహదారణ్యకోపనిషత్తు.

పరబ్రహ్మము విరాట్టుస్వరూపమున సరస్వతితో నైక్యమై మనకు కానబడు భూతప్రపంచమును సృజించెను.

పరబ్రహ్మ మొక్కడైనను సృష్టిని జేయుటకు కర్మబద్ధుడై హిరణ్యగర్భుడు, విరాట్టు అనురూపములను దాల్చెను. ఈమూడుస్వరూపములను సుషుప్తి, స్వప్న, జాగ్రదవస్థలతో బోల్చి యర్థము చేసుకొనవచ్చును.

సృష్టికంతకును మాత శబ్దస్వరూపిణి యగు సరస్వతి. ఈశబ్దతన్మాత్రయే వర్ణములుగను, పదములుగను, వాక్యములుగను మారెను.

శబ్దస్పందత్వమువలన ప్రపంచము నిలిచియున్నది. ఇందువలననే దీనియందు ప్రతినిమిషము మార్పులు కలుగుచున్నవి. ఈగుణము చరాచరపదార్థములకును, దృశ్యాదృశ్య పదార్థములకును గలదు. కొన్నివిషయము లందు మార్పు కానరాదనుటకు మనయింద్రియముల యొక్కయు, జ్ఞానముయొక్కయు నసంపూర్ణతయే కాని వేరుకాదు. స్పందత్వ మున్నయెడల శబ్ద ముండక తీరదను విషయము మనప్రత్యక్షానుభవమున గలదు. కాని మననాళములందు ప్రవహించు రక్తముయొక్క కదలికను మనము వినజాలకున్నాము. మనచెవు లాశబ్దమును వినునంతటి సునిశితములు కావు. కాని ప్రయత్నమువలన, అనగా యోగాభ్యాసమువలన ఆయింద్రియముయొక్క శక్తి నధికపరచినయెడల నాసూక్ష్మశబ్దమునుగూడ వినగలుగుదుము.

మనయింద్రియములకు తెలియువిషయముల కతీతములైన విషయము లనేకములు కలవు. భూతప్రపంచముయొక్క సృష్టికారణముల స్పందత్వమువలన గలుగు శబ్దము లీచెవులకు వినబడవు. యోగులు సాధనమువలన నీశబ్దములను కొంతవరకు వినగలరు. "వినుట" యను గుణము శుద్ధమైనయెడల నీశబ్దములన్నియు స్పష్టముగ వినబడును. ఒకరాయి యటులు సృజింపబడుటకు కారణ మొకశబ్దముగ వినబడును. అగ్ని యొకశబ్దముగ వినబడును. ఇట్టియవ్యక్తస్వతస్సిద్ధశబ్దము లటులు వినువారు మనకు చెప్పినయెడల నారవములు ధ్వన్యాత్మకములును, వర్ణాత్మకములును అగును. కాని మానవుని లోపభూయిష్ఠమైన కంఠముతో నుచ్చారణమును బొందునప్పు డీశబ్దములు లోపములతో కూడిన వగునుకాని యట్టిశబ్దములు విశేషముగమాత్రము సత్యదూరములు కావు. అగ్నియొక్కశబ్దము "రం" అని యందురు. ఇది మంత్రోచ్చారణయం దొకబీజము. ఇటులనే "హ్రాం", "యాం" మొదలగునవియు కొన్ని పదార్థముల సృష్టికారణములను సూచించు శబ్దములు. "హంస", "స్వాహా" మొదలగు మంత్రభాగము లిట్టిశబ్దముల కూటములు. ఇట్టికూటములను చేర్చుటచే మంత్రము లగుచున్నవి. ఏదో యొకటి సంభవింపవలెనన్న (ఇదియు సృష్టిలో నొకభాగమే యగును) దాని కనుకూలపడుమంత్రమును పఠించినయెడల నది సంభవించును. పదార్థములకు కారణములైన స్వతస్సిద్ధశబ్దముల ననుసరించి యుచ్చరించుటవలన నావస్తువు లుద్భవించును. మన ముచ్చరించుశబ్దములందు లోపము కలదు కనుకనే మనము సృష్టికర్తలము కాజాలకున్నాము.

అగ్నియొక్కశబ్దము "రం" అని చెప్పుట మనము వినుచున్నాము. కాని యగ్ని యనేకవిషయములు చేరుటవలన కలుగుచున్నది. ఈ ప్రత్యేకవిషయము లన్నిటికిని ప్రత్యేకశబ్దము లుండును. ఈ శబ్దముల సంపుటియే మనకు "రం" అని వినబడుచున్నది. ప్రాణవాయువు (Oxygen) ఒకవిధమగు మోలక్యూలుల (Molecules) సంపుటి. మోలక్యూలులు ఏటముల (Atoms) సంపుటి. ఏటములకు కారణము ఎలెక్ట్రానులు (Electrons). ఎలెక్ట్రానులకు స్పందత్వము కలదని యాధునికప్రకృతిశాస్త్రము మనకు నచ్చచెప్పుచున్నది. ఈయెలెక్ట్రానులకు మూలకారణ మొకటి యుండిన నుండవచ్చును. ఇటులనే శబ్దప్రపంచమున నీఎలెక్ట్రానులనుబోలు సూక్ష్మశబ్దజాలము లుండునటుల

౪. Sir John Woodroffe: Garland of Letters; Chapters VI and VIII.

మన మూహింపవచ్చును. ఇవియన్నియు గలసియే అగ్ని విషయమున "రం" అను శబ్దముగ బరిణమించుచున్నవి. ఈ సూక్ష్మశబ్దజాలముల కతీత మగుదానికి నిత్యశబ్ద మనుపేరు కలదు. ఇదియే యిన్నివిధముల పరిణామమును బొంది మనకు గోచరమగుచున్నది. ఇదియే శబ్దస్వరూపిణి యగు సరస్వతి. శబ్దములు వర్ణములుగను, భాషగను మారును కనుక నీమె విద్యలకు రాణి.

సృష్టిని జేయు సమష్టిశబ్దము "ఓం"కారము. ఇదియే స్థితిలయములు కలిగించుటకును గారణము. ఈశబ్దమున కంతము లేదు. అంతము కలిగినప్పుడు మహాప్రళయము సంభవించును. కనుకనే లోకమాతయగు సరస్వతి ఓంకారస్వరూపిణి.

ప్రార్థించుటకుగాని, వర్ణించుటకుగాని, చిత్రించుటకుగాని యీ యాదిసరస్వతిని మనబుద్ధితో నూహించుట యలవికాని పని కావున నీయమ్మ కొకరూపమును బుద్ధిమంతు లిడిరి.

లోకములను గన్నశక్తి కనుక నీమె స్త్రీస్వరూపిణి యగును.

భారతీదేవిరూపమును మనపూర్వులగు ఋషు లెటుల నూహించిరో కనుగొనుటకు సనాతనగ్రంథములం దనేకములగు నిదర్శనములు కలవు. ఇట్టి నిదర్శనములు లభించుభాగములలో మంత్రములకు సంబంధించినవి ముఖ్యములు. కృతార్థులగుటకు పఠింప ననేకములగు మంత్రములు కలవు. ఈమంత్రములు సాధారణముగ నేదోయొక దేవతనో, దేవునినో యుద్దేశించు ప్రార్థనరూపములుగ నుండును. మంత్రములయర్థము తెలియక పఠించుటకంటె, అర్థమును బాగుగ గ్రహించి, యాయిష్టదేవతయొక్కరూపమును మనస్సున నుంచి జపము చేయుటవలన నెక్కువఫలము కలుగునని పెద్దలు చెప్పుదురు. మంత్రముల కనుకూలములగు దేవతారూపములను వర్ణించు శ్లోకము లనేకములు కలవు. ఇట్టిధ్యానశ్లోకములు చిత్రకారులకు విశేషముగ నుపయోగపడగలవు.

సరస్వతి వాక్కు కాన వాగ్వాదినీధ్యానశ్లోకము చూడుడు. దీనియర్థ మిటులుగలదు:

> "పుస్తకము, జపమాల హస్తములందు గలదానా, వర-అభయ చిహ్నములు గల చక్కనిబాహులతలు కలదానా, కర్పూరమువలె నిర్మలమైన దేహము కలదానా, వాగీశ్వరీ, నాయంతఃకరణమును శీఘ్రముగా శోధింపుము." ౫

"పుస్తకము" వేదములు, విద్యయను నర్థములను సూచించును. వేదము లనగా నిప్పుడు పుస్తకరూపముల లభించు చతుర్విధవేదములు కావచ్చును, లేక మంత్రాత్మకముగ పరిగణింపబడు నాదివాక్కులగు దేవభాష కావచ్చును. ప్రతివస్తువునకును స్వతస్సిద్ధమగు నిర్మలధ్వని కలదని మీద వ్రాసియున్నాను. వ్రాత, యుచ్చారణల కతీతములును, దేవదత్తములును అగు వేదము లీ స్వతస్సిద్ధ మగు భాషయం దుండును. బ్రహ్మయొక్క నాలుగు ముఖములనుండి వెలువడు నాలుగు వేదములివియే. ఈ బ్రహ్మకు సరస్వతి భార్య. వేదములు "వా"క్కనికూడ చెప్పవచ్చును. ఈయర్థమున వేదములును, సరస్వతియు నొక్కటియే కాని సరస్వతి ఓంకారస్వరూపిణి. ఓంకారముతరువాత తక్కిన శబ్దములన్నియు బుట్టినవి. అందువలన సరస్వతి వేదములను చేత ధరించును.

"జపమాల" ధ్యానమును, మంత్రమును సూచించును. పరమేశ్వరుని సహాయము లేక సరస్వతి లోకమాత కాజాలదు. కనుక నాయమ్మ యాయాదిదేవుని ధ్యానించును. ఈధ్యానముయొక్క వ్యక్తీకరణము జపమాల. కాని, జపమాలయందు సాధారణముగ ముప్పదిరెండుపూస లుండును. చతుష్పదగాయత్రీమంత్రముఽ

౫. పుస్తకజపవటహస్తే
వరదాభయచిహ్నచారుబాహులతే,
కర్పూరామలదేహే
వాగీశ్వరి, శోధయాశు మమ చేతః.

౬. తత్సవితుర్వరేణ్యం (ణియం)
భర్గో దేవస్య ధీమహి
ధియో యో నః ప్రచోదయాత్
పరోరజసి సావదోమ్. పెరసి౩ ౨అక్షరములు.

నందు ముప్పదిరెండక్షరములు కలవు. కనుక నీజపమాల యనుదినమును బ్రాహ్మణులు పఠించునట్టియు, హిందువు లందరిచేతను పరమపవిత్రముగ పరిగణింపబడు నట్టియు గాయత్రీమహామంత్రమును సూచించును. ఈ మంత్రముయొక్క ధ్యానశ్లోక మొక్క గాయత్రీదేవినే వర్ణించినను పూజావిధానమునందు సావిత్రి, సరస్వతి, గాయత్రి యను ముగ్గురు దేవతలను బేర్కొనుట యాచారము. ఇందొక దేవత సరస్వతి యగుట గమనింపవలసిన విషయము.

లోకములను గని, వరముల నిచ్చి, రక్షించుతల్లి కనుక వరద, అభయముద్రలు కలవు.

పంచభూతతన్మాత్రలలో మొదట బుట్టినది యాకాశతన్మాత్ర. దీనితరువాతనే తక్కినభూతములును, తద్ద్వారా లోకములును బుట్టినవి. ఆకాశము యొక్క స్వతస్సిద్ధమైన వర్ణము తెలుపు. బుద్ధియొక్క వర్ణము తెలుపు. కనుకనే సరస్వతి కర్పూరమువలె నిర్మలమైన దేహము కలది. ఆమెవసనములును తెల్లనివి. మనకు కానవచ్చెడి యాకాశపురంగు నీలిమ కనుక నీమె నీవర్ణముతోను చిత్రించుట కలదు.

ఈ శ్లోకమునందు గల చిహ్నములేకాక యితర వ్యక్తీకరణబద్ధములైనచిహ్నములను సరస్వతికిచేకూర్చిరి.

సరస్వతి ఓంకారస్వరూపిణి; వాక్కు సకలశబ్దములబుట్టించి తద్ద్వారా సృష్టిని కల్పించినది. ఈశబ్దజాలములనన్నిటిని సూచించుట కామెహస్తములందు వీణ కలదు. ఇప్పుడు వాడుకయందున్న వీణయా, లేక యాదినుండియు భారతదేశమున నుపయోగపడిన వీణయా యనుచర్చ యక్కరలేదు.

సృష్టిని కల్పించవలెనని పరమశివుడు ఓంకారము నుచ్చరించి సరస్వతిని సృజించెను. ఇటుల నుచ్చరించుట కవసరమైన యుచ్ఛ్వాసనిశ్వాసములే హం, స (హంస)లు. కనుకనే హంస సరస్వతికి వాహనమయ్యెను. హంస యెట్టిపక్షిజాతి యనువాదమును అనవసరము. హంసయనుశబ్దమున కనేకములగు అర్థములు మంత్రశాస్త్రమున గలవు. హంసలో "హం" అనునది పురుషస్వరూపవాచకము. ఇదియే పురుషుడు; శివుడు. "సః" అనునది స్త్రీస్వరూపవాచకము. ఇది ప్రకృతి; శక్తి. కనుకనే హం,స ద్వంద్వము శివ-శక్తులను, పురుష-ప్రకృతితత్త్వములను[2] సూచించును. హంస యనుద్వంద్వమును వెనుకనుండి చదివినయెడల "సోహం" అగును. కనుకనే "హంస"కు జీవుడనియు నర్థము కలదు. ఇందు హకారమొకరెక్కగను, సకారమొకరెక్కగను, మధ్యనున్నది "తార"గను గణింతురు. "తార"యనగా ఓంకారమను ప్రణవమంత్రము. యోగు లూహించు హంస యంతరాత్మ. ఈహంసయొక్క ముక్కు తార(ప్రణవము) నిగమాగమములు రెండురెక్కలు; శివుడును, శక్తియు రెండుకాళ్లు; బిందుత్రయము దానిమూడుకన్నులు. ఈ రూపమునే పరమహంస యందురు. హంసయనుశబ్దమునకు మరికొన్ని యర్థములును కలవు. కాని యవి యప్రస్తుతములు.

అస్పందుడగు పరబ్రహ్మ మోంకారము నుచ్చరించునప్పుడు స్పందత్వము కలిగెను. ఈ "కదలిక" నెమలినాట్యముయొక్క కదలికవలె నుండునని యూహించుటవలన సరస్వతికి నెమలియు నొకవాహనమయ్యెను.

సరస్వతి జ్ఞానస్వరూపిణి; జ్ఞానాతీతురాలు కూడ. పద్మము జ్ఞానమును సూచించును. కనుకనే పద్మమునందు సరస్వతిని ప్రతిష్ఠించిరి. పరబ్రహ్మము సర్వాంతర్యామి కనుక మాయందును, నాయందును, తదితరవస్తువులందును గలడు. ఈయంతరాత్మకు నెలవు "అనాహత" చక్రము. అనాహతచక్రము పద్మమువలె నుండునని యోగులు చెప్పుదురు. ఈపద్మము మాయ యనుపంకమున బుట్టును. అనాహతచక్రమునందే వాక్కు మధ్యమారూపమును బొందును. హంసలకును, పద్మములకును ఉనికి యొకచోటనే. అనాహతమగు జ్ఞానమను పద్మమున స్వస్వరూపజ్ఞానమను తేనె

2. పుంప్రకృత్యాత్మకో హంసస్ తదాత్మకం ఇదం జగత్.

యం దానందించు హంసద్వంద్వమును ప్రార్థించుట కలదు.

ప్రణవమంత్రధ్వని యెంతవరకు నుండునో యంతవరకు సృష్టి, స్థితి, లయములు కలుగు చుండును. ఈరవ మాగినయెడల మహాప్రళయము సంభవించును. కనుక ఓంకారస్వరూపిణియగు సరస్వతి యీమూడవస్థలకు కారణము. వాణీపూజయందు సృష్టిన్యాసమున నీమహాదేవి నిటులు ప్రార్థించెదరు:

"యాభైయక్షరములచేతను రచింపబడిన యంగ భాగములు కలది, చంద్రఖండమును ధరించునది, తెల్ల కలువవంటి శరీరకాంతి గలది, వర, అభయ, పుస్తక, అక్షసూత్రములను ధరించునది, మూడునేత్రములు కలది, అట్టి సరస్వతిని భజింపుచున్నాను." ౮

విద్యలకు రాణియు, వాక్కును సరస్వతి కాన నీమెరూపము నక్షరములతో రచించుట యెంతయు సమంజసము.

చంద్రు డమృతకిరణుడు కనుక నీయమ్మ కలంకారము.

మూడవనేత్ర మనగా జ్ఞానము. సరస్వతి జ్ఞాన స్వరూపిణి.

స్థితిన్యాసమునందు ,

"లేడిపిల్ల, వరము, విద్య, అక్షసూత్రములను కరముల ధరించునది, (జప) మాలావిద్యలచేత ప్రకాశమానమైన హస్తములు గలది, అట్టిసరస్వతిని ధ్యానించుచున్నాను."౯

అని ప్రార్థించెదరు.

సంహారన్యాసమున ధ్యాన మిటులుండును:

"అక్షసూత్రము, టంకము (అనగా పరశువు-గండ్రగొడ్డలి), సారంగము (లేడిపిల్ల), పుస్తకము హస్తములందు గలది, మూడుకన్నులగలది, చంద్రమౌళి, స్తనభరనమ్ర, ఎర్రతామరపూవుమీద కూర్చుండునది, అట్టిసరస్వతిని భజింపుచున్నాను."౧౦

సర్వసాధారణముగ సరస్వతిని పైన చెప్పినటులు శాంతస్వరూపిణిగ, శుభదాయినిగ స్మరించెదరు. కాని శక్తి, కాళీపూజలందువలె నీమెను భయంకర రూపముతో వర్ణించుటయు కలదు. కాళీదేవికివలె నీలసరస్వతికిని౧౧ శవ మాసనము; సర్పములు భూషణములు; కపాలత్రిశూలాదివస్తువులు కరములం దుండును; పుణికెలమాల హారముగ నుండును.

మతవిషయములందే కాక యితరస్థలములందును కవు లనేకవిధముల నీమెనుగూర్చి మనోహరముగబాడిరి:

"ఎవ్వతె మల్లెలు, చంద్రుడు, మంచు, ముత్యములవలె తెల్లనికాంతి గలదో, ఎవ్వతె తెల్లని వస్త్రములను ధరించునదో, ఎవ్వతె శ్రేష్ఠమైన వీణాదండమును చేత ధరించునదో, ఎవ్వతె బ్రహ్మవిష్ణుశంకరప్రభృతులగు దేవతలచేత సదా పూజింపబడుచుండునో,

---

౮. పంచాశద్వర్ణై రచితాంగభాగాం ధృతేందు ఖండాం కుముదావదాతామ్, వరాభయే పుస్తక మక్షసూత్రం భజేగిరం సందధతీం త్రినేత్రామ్. —మంత్రమహోదధి.

౯. మృగబాలం వరం విద్యా మక్షసూత్రం దధత్కరైః, మాలా విద్యాలసద్ధస్తాం వహన్ ధ్యేయః శివో గిరమ్. —మంత్రమహోదధి.

౧౦. అక్షస్రక్టంకసారంగవిద్యాహస్తాం త్రిలోచనామ్, చంద్రమౌళిం కుచానమ్రాం రక్తాబ్జస్థాంగిరం భజే. —మంత్రమహోదధి.

౧౧. శవాసనాం సర్వవిభూషణాఢ్యాం, కర్త్రీం, కపాలం, చషకం, త్రిశూలం,
కరైర్దధానాం, నరముండమాలాం, త్ర్యక్షాం భజే నీలసరస్వతీం తామ్. —మంత్రమహోదధి.

ఎవ్వతె నిశ్శేషముగా జడత్వమును పోగొట్టునో అట్టి భగవతియగు సరస్వతి నన్ను రక్షించుగాక"౧౨

"ఒకచేతితో స్ఫటికమణిమయమగు అక్షసూత్రమును ధరించునదియు, ఒకచేత తెల్లనిపద్మమును, ఇంకొకచేత చిలుకను, మరియొకచేత పుస్తకమును ధరించునదియు, మల్లెలు, చంద్రుడు, శంఖము, స్ఫటికమణిపీటికాంతివంటి శరీరకాంతి గలదియు నగు ఈవాగ్దేవత సుప్రసన్నత గలిగి యెల్లప్పుడు నాముఖమునందు నివసించియుండుగాక."౧౩

ఇట్టివర్ణనలు, ప్రార్థనలు విశేషముగ పేర్కొననేల? ఏయాంధ్రప్రబంధమును విప్పినను మొదటిపుటయందే మనోహరమగు సరస్వతీప్రార్థనము కానవచ్చును. ఇట్టివర్ణనలన్నియు చిత్రకారుల కాధారములు కాగలవు.

మనపూర్వులు భారతీదేవి కెట్టిస్థానము నిచ్చి యెంతయర్థమును జెప్పి, యెంతమనోహరముగ వర్ణించియున్నారో చూడుడు. ఈవిషయమంతయు బోధపరచుకొనినయెడల నీమెను లెక్కలేనన్నివిధముల — పరబ్రహ్మముయొక్కయు, హిరణ్యగర్భునియొక్కయు, విరాట్టునియొక్కయు భార్యగ—చిత్రింపవచ్చును. మనోజ్ఞకళలగు సంగీతము, సాహిత్యము, చిత్రరచనలను ముగ్గురు పరిచారికలుగను, సరస్వతిని శుద్ధమైనదేవతాస్వరూపిణిగను చిత్రింపవచ్చును.౧౪

ఇట్టి మనోహరభావములను పూర్వులు మన యెదుట బెట్టినను ఆంధ్రచిత్రకారులు చక్కని సరస్వతీచిత్రములను వ్రాయకుండుటకు కారణము దురూహ్యము. పత్రికారాజమగు "భారతి" ముఖపత్రములందు కానబడు సరస్వతీచిత్రము లిందులకు నిదర్శనములు.

౧౯౩౨-వ సంవత్సరముజనవరినుండి జూనువరకు ప్రచురింపబడిన చిత్రమును జూడుడు. ఇంతటి యసహ్యాకరమగు రూపమును భారతీదేవి కిడుటకు తగిన కారణము నూహించుట యలవికానిపని. ఆంగ్లవిద్యయామోదమును బడయుచున్న యీకాలమున తమ స్వభాషను, సంస్కృతమును చదువ మానుటచే జనపదములం దాదరణమును బొందజాలక సరస్వతి యడవులపాలై యిట్టి మోటురూపును పొందియుండవలెను. సంరక్షణలేక యంగములు కృశించినవి. పాపము! తల దువ్వుటకైన నెవరు లేకపోయిరి. అలవాటు లేకపోవుటచే నామెకు చేతగాకపోయినది. నగలన్నియు శిథిలములగుటచే గాబోలు, నేకొండవారి నగలనో పెట్టుకొని, వారర్పించిన చీరను గట్టుకొనినది. వీణయు విరగుటచే నేదోయొక వీణాకృతిని జేతబూని వాయింప యత్నించుచున్నది-తీగలు లేకపోయినను. నవరసములను జలము లేకపోవుటచే నిటునటునున్న తామరలు చిన్నవైనవి-జాతిలక్షణముచే కాడలు వలముగ నున్నను. ఇట్టిపరిస్థితులను జూచి రూపుచెడియున్న హంసలు సిగ్గుతో తలలను వంచుకొనియున్నవి.

జూలైనుండి డిసంబరువరకు ప్రచురింపబడిన ముఖపత్రమును బరికింపుడు. ఈచిత్రమునుగూర్చి యేమి చెప్పుటకును దోచకయున్నది. అట్టి కాంతిలేనిముఖమే స్త్రీకినున్నను (సంసారికైనను, సానికైనను) మనము చూచి యానందింపజాలము. అందు, "మూడుమూర్తుల

౧౨. యా కున్దేన్దుతుషారహారధవళా యా శుభ్రవస్త్రావృతా యా వీణావరదణ్డమణ్డితకరా యా శ్వేతపద్మాసనా, యా బ్రహ్మాచ్యుత శఙ్కరప్రభృతిభి ర్దేవైః సదా పూజితా సా మాం పాతు సరస్వతీ భగవతీ నిశ్శేషజాడ్యాపహా.

౧౩. దోర్భి ర్యుక్తా చతుర్భిః స్ఫటికమణిమయీ మక్షమాలాం దధానా, హస్తే నైకేన పద్మం సిత మపి చ శుకం పుస్తకం చాపరేణ; భాసా కున్దేన్దుశఙ్ఖస్ఫటికమణినిభా భాసమానాఽసమానా, సా మే వాగ్దేవ తేయం నివసతు వదనే సర్వదా సుప్రసన్నా.

౧౪. ఈభావమును నేను చిత్రించియున్నాను

సారంపుముద్ద" యనదగు సరస్వతీదేవియందున్న భారతీయు డనిపించుకొన్న యెట్టివానికైనను కడు పుడుకక మానదు. మనోజ్ఞకళల కధిష్ఠానదేవత కా నిస్తేజసమగు ముఖ మేల? నడుమువరకు మనుష్యాకారముగను, దిగువ భాగము పుష్పమునందు లీనమైనటులను, చేప, గుఱ్ఱము ఎద్దు మొదలగు జంతువులుగ బరిణమించునటులను లోకమునం దనేకదేశములందు పూర్వకాలమునుండియు నూహించుట యాచారమైయున్నది. కాని ముడుకులవరకు మనుష్యాకారముగ నుండుటమాత్రము నే డీ చిత్రమున గంటిమి. పాదము లుండుట కా పుష్పమున తా వెచ్చట గలదో చిత్రకారులే యూహించుకొనెదరుగాక. ఆవీణ నెవరును పట్టుకొనకపోయినను, నడుమునకో మెడకో వ్రేలాడగట్టుకొనకపోయినను అనటు యెటులు నిలిచినదో దురూహ్యము.

౧౯౩౩-వ సంవత్సరము జనవరి మొదలు ప్రచురింపబడుచున్న చిత్రమును తిలకింపుడు. ఇందును సరస్వతి యేదియో రోగమువలన కృశించియున్నటులున్నది. ముఖమునందు నిస్పృహ, భయము కానవచ్చుచున్నవి. భయంకరతరంగములను జూచి భయపడి, పద్మాసనమునుండి దిగిపో బ్రయత్నించుచున్నది. వస్త్రములకట్టైనయు బాగుగ లేదు. తరంగములు చిత్రమున నుండునటుల నుండవు. హైందవచిత్రరచనయందటుల నుండు నని యనుకొన్నను అట్టిచోట్ల తామరలు పెరుగవన్న విషయ మందరు నెరిగినదే. పండు తామరాకు నచ్చట వ్రాయుట యేలనో బోధపడలేదు. తామరాకు పండునా?

ప్రకృతియందు కానబడినటులు వ్రాయకపోవుటయే భారతీయచిత్రకళ యయ్యె నీనాటికి! అజంతరచన నుద్ధరించుచున్నామని శుష్కాంగములను వ్రాయువారు అజంతచిత్రములయంగములు శుష్కములు కావని యెంతవేగముగ గ్రహించిన దేశీయచిత్రకళ కంత శ్రేయస్కరము. రొమ్ముపైని బట్టను తీసివేయుటకైన అర్థ ముండవలెను. పురాతనభారతీయసంప్రదాయములను దేశచరిత్రమువలన బాగుగ నేర్చుకొని యిట్టిసాహసమునకు బూనుకొనవలెను. శుద్ధదేవతామూర్తిగ వ్రాసినప్పుడు బట్ట లేకపోవచ్చును — అశ్లీలముగ వ్రాయునప్పుడును. లేక పురాతనవస్త్రధారణమువలె బట్టకట్టుండవలెను.

నాకు తోచినది వ్రాసితిని. బుద్ధిమంతులగు చిత్రకారు లీవిషయమున పరిశ్రమ చేసి, పురాతన చిత్రములను బరిశీలించి, శాస్త్రములను చదివి, చిత్రకళయొక్క కట్టుబాట్లను నేర్చుకొని, చక్కనిచిత్రములను వ్రాసి, భారతీయచిత్రరచనను పోషించెదరుగాక!

కంసాలి నగలను గడువున కివ్వనందున ?



శిఖండి

జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి, యం. ఏ., బి. యల్.,

భావము ఆత్మ! భావము సారథి! నరుని నడపు ఆధ్యాత్మికశక్తి భావము! తురగముల నంటి సారథిచేతులం దిముడు కళ్లెము చిత్తము! ఇంద్రియములు విచిత్రహయములు — ఈహలమాయలం దుపొందు హులక్కి. రథికునకు ప్రాపకుభావము బలవత్తరమైనది కానిచో, మనసును పడలాగి వారువములు నరునిలోఁతుగోతిలోఁ గూల్చును! తన కురుక్షేత్రమున విజయుఁడు కాఁగోరు పురుషుఁడు తేరును బారుగ దశతేజుల స్వచ్ఛందలంఘనమునకు విడువక పటుత్వసిద్ధినందిన భావముపై నాధారపడును. మనుజుని కర్మను ధర్మముఁ గావించునదే యీభావము! పంచభూతాత్మకమగు శరీరమున—ఇదియు నొక విశ్వమే. దివ్యమరీచుల నీనునది భావము. ఇదిలేని యంతరంగము చీఁకటికోణము. ఇదిలేని హృదయము శ్మశానవాటిక. ఇదిలేని శరీరము కట్టెమోపు. భావములేకున్న బ్రదుకే లేదు. నైతికదార్ఢ్యమునకును, ఆధ్యాత్మిక విభూతికిని, మేధాసంపదకును, శారీరకశక్తికిని—దీనికిని దానికిని అననేల? సర్వతోముఖమైన ధర్మనిర్వహణమునకు అనివార్యమైనది భావము!

భావము భగవంతునివంటిది. అగుటయు నిది భగవంతునివలెనే అదృశ్యమైనది. అదృశ్య, అఖండ, అపరిచ్ఛిన్న, నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్త, సర్వవ్యాపి, సచ్చిదానంద ఘనస్వరూపమును నిజహృదయమందు గుర్తించి ధ్యానించుట ఆతితేజిన అర్జునునకే సాధ్యముకాని పనికమట్లు అనవరతము మెకుకు వానికిఁ గాదు. విశ్వవ్యాప్తమయ్యు నీశక్తి వడ్లగింజకంటె చిన్నదియై మనుష్యహృదయమం దిమిడియుండునని ఛాందోగ్యోపనిషత్తు వాకొనుచున్నది. అద్భుతమైన నీయాధ్యాత్మికశక్తి నలవఱుచుకొనుట కెంతేని సాధన మవసరము. ధర్మనిష్ఠాగరిష్ఠుఁడగు యుధిష్ఠిరుఁడును, సగుణోపాసనయందు అద్వితీయశక్తిసంపన్నుఁడైన వడిముడియు, మూర్తీభవించిన త్యాగతితిక్షులైన నకుల సహదేవులును పరమార్థమును జయించి, ధనంజయ సార్థకనామమందిన నిర్గుణోపాసకునకు సాటిరారు. కనులయెదుటఁ గానంబడునది, చేతి కందునది, చెవులఁ జొచ్చునది, నోరూరించునది, సామాన్యమానవసాధ్యమైనది, జ్ఞానేంద్రియములును కర్మేంద్రియములును గలిసి మానసాగారమందు ప్రోవొనరించు భావరాశినే పామరుఁ డెఱుఁగును. ప్రత్యక్షానుభవఫలములను కబళింపఁజాలునేకాని దశేంద్రియములు ఎచ్చోటికో ఎగసి భావైశ్వర్యమును కొల్లఁగొట్టుకొనిరావు. శరీరావరణమును దాఁటిన, వీనికి తెరువు లేదు. సొంతయింటి నుండి, ఏదో కొంతభావఫలసాయము నివి కొలఁబోసికొనఁజాలును. కాని, దూరస్థమై, అదృశ్యమైన[illegible] భావైశ్వర్యమును కనులారఁ గాంచఁగలుగుట కల్ల.

ఉన్నమట్టునకు మనసునింపుకొని కాలక్షేపము చేయుటకు ఏకోరిక లేని—ఏయాశలు లేని పల్లీయుఁడొప్పునుగాని ఱెక్కలుకట్టుకొని పదునాలుగు భువనములందు నెగురఁజూచు విజ్ఞాని యొల్లఁడు. సంతృప్తిపడి సంతసంపడుటకంటె, అసంతృప్తియందుఁ బడి సంతపించుట కీతఁ డీయకొనును. అసంతృప్తి ఈతఁ డీఁదులాడు రత్నాకరము. మునిఁగిమునిఁగి యీతఁడు మిరుమిట్లుకొలుపు జ్ఞానరాశిని చేఁబట్టును. సంతృప్తినందు సన్న్యాసికంటె అసంతృప్తిఁ గను పాపిష్ఠి పెక్కుమడుంగు లధికుఁడని నేఁడు తత్త్వశాస్త్రము ఘోషించుట లేదా? అసంతృప్తి కింత ప్రాముఖ్యమేలని చేయెత్తుదురా?

అసంతృప్తినుండి ఆనందము నూతామడలు పర్వెత్తును. ఇది దూరీకృతమగుట అదృశ్యమై యంతరంగమున ప్రవేశించుటకే. ఆనందము ఏసువంటిది. తనయెడల విముఖులైనవారిపై నిది చల్లని యాశీస్సు కురిపించును. తమోగుణమున దిగఁబడువాతఁడు సుఖ

మునకై చెనఁగోసికొనును. మెఱుపులోనిదాని విషమెఱుఁగక నిండుప్రేమ నీమూర్ఖుఁడు దానిని కవుంగలించుకొనును. నిష్కర్మయందు వీని యిహపరములు నక్కియుండును. ఎద్దువలె తిని యీపలుగాకి మొద్దువలె పరుండును. బ్రదికియుండియు నీమహనీయుఁడు చచ్చుదాఁక చచ్చినట్లే పడియుండును. బురదగోఁతిలోఁ దిగఁబడు బఱ్ఱెవలె, దుర్గంధమందు మునిఁగి తేలు పందిపగిది ఈతిండిపోతు అలసానందమున పొరలాడుచుండును. తనలోఁదాను చీఁకటికై దీపమై నిద్దురలో నీతఁడు కూలఁబడియుండును. ఇఁక సత్త్వగుణసంపన్నుని పరికింపుఁడు. ఇతఁడు సుఖమపేక్షించు సోమరికాఁడు. రజస్తమములు అవసరమగుపట్ల వీనికి దాస్యమొనరించునుగాని, యీతనిపై స్వారిచేయవు. ఈతఁడు శాంతిమయుఁడు. భగవతి, సీత యీతనియందనారతము విరాజిల్లుచుండును. శాంతి భగవతి యున్నచోటునందే గదా ఆత్మారాముఁ డుండును! జ్ఞానద్రవము కనిన శాంతి, ద్రౌపది వీనియంతరంగమం దాసీనయై యుండును. బాహ్యదృష్టి కీతఁడును, తమోగుణబద్ధుఁడును శాంతిమయులుగఁ గానంబడుదురు. కాని యితఁడు మరీచి—ఆతఁ డంధకారము! ఇతఁడు స్వర్గము—ఆతఁడు శ్మశానము! ఇతఁ డింద్రియములను జయించిన మహారథుఁడు!— ఆతఁ డింద్రియములను జయింపనిచ్చిన జయద్రథుఁడు! ఇతఁడు వాంఛలు విసరివైచిన మహేష్వాసుఁడు! మహత్తరాశయము జేఁబూనిన ధృష్టకేతువై, చేతనశక్తి నందిన చేకితానుఁడై, అంతఃశత్రుల నిర్జించిన పురుజిత్తై, ధృఢప్రజ్ఞగల కుంతిభోజుఁడై, జ్ఞానచ్ఛటలు జిమ్ము కాశీరాజీతఁడు! కలుషభావకురుసేనకు రాజై, చిరనిరయమున మగ్గ మనుష్యాధముఁ డాతఁడు! కర్ణావస్థనుండి కడచి, శల్యశక్తిని వృద్ధిఁగావించి, వికర్ణస్థితినంది, అద్భుతమాయాశక్తి— అవిద్యాశక్తి—భీష్మశక్తి నశ్వత్థామచే నదృశ్యమొనరించి ధృష్టద్యుమ్న (ధృష్టం, ద్యుమ్నం యస్యసః) శక్తి-సాహసశక్తి నాయకత్వమును చరితార్థ మొనరించి, సకామావిద్యలు కడువ నిష్కామకృపుఁడై, వీర్యవానుఁడై న్నీ నరపుంగవుఁ డీతఁడు! దురాశయను ధృతరాష్ట్రునకుఁ బుట్టి, దుశ్చరిత్రుఁడైన దుర్యోధనుఁడై అరిషడ్వర్గమునకు లొంగిన నరాధముఁ డాతఁడు! చూపులందును, రూపులందును గుణనిర్ణయము సరిపోదు, నిరయకుండమునుండి సుందరాకారులు పరుగిడి దేవత్వ మధిష్ఠింపఁగలరు. నరాధముఁడు సుందరుఁడు కావచ్చును. నరోత్తముఁడు రూపరహితుఁడు కావచ్చును ఇరువురును సురూపులు కావచ్చును. కురూపులు కావచ్చును. బహుయత్న లబ్ధమైన పుణ్యమీతఁడు!—బహుజన్మలందు 'సిల్లి మంత్రము' వేయుచు, వసుమతికి దాపరించిన పాపమాతఁడు! ఈతఁడు చిరజీవి!—నిముసనిముసము తనలోఁ దాను చచ్చుచు, నొరులను చంపఁదలఁచు చెవటి యాతఁడు! సుఖమపేక్షింపక యీతఁ డందు సచ్చిదానందమునకును, సుఖమునే వలచి, స్వార్థమునే ఆరాధించి, అహంకారమునకు అర్ధాంగియై, అఘమునకు దాసియైన ఆతఁ డందు ఆనందమునకును భేదము లేదా? సంతృప్తి నెఱుఁగక నిరంతరపరిశ్రమచేసి కర్మవీరుఁడై, భక్తితత్పరుఁడై, జ్ఞానమయుఁడై సత్యకి (సత్యం కం యస్యసః) యైన పురుషశ్రేష్ఠుఁ డీతఁడు!—సంతృప్తిని గోరి, చిరమాంద్యమున మునిఁగియున్న పీనుఁగరాయఁ డాతఁడు! అసంతృప్తి లేకున్న చిరమగు సంతృప్తి యేది, పరిశ్రమ యేది? పురుషార్థమేది, పరమార్థమేది? ఈపరమార్థమే మహత్తరమైన భావధనముకదా! ఈధనమునందిన నరుఁడేకదా నరుఁ డనిపించుకొనఁగలఁడు?

అసామాన్యమైన ఈభావధన మెందు లభించును? పృథ్వికిని మనకును సంబంధబాంధవ్యముఁ గూర్చు ఇంద్రియము లీధనము నావిష్కరింపఁజాలకున్న యెడల చదువులనేమి, నీతులనేమి, ఉద్యమములనేమి, సాధారణ వివిధదైనిక క్రియలనేమి దేని నుద్దేశించి నడపుచుంటిమి? ఇవన్నియు వట్టిబొమ్మలాటలని తత్త్వజ్ఞులేల నగుచుందురు? వెతకివెతకి వేసారినను కానంబడని ఈవిభూతి యెందుండును? ఈప్రశ్నముల కుత్తర మొసఁగవలెనన్న, ప్రాచీనప్రస్తుత ప్రపంచ విజ్ఞానమును గుమ్మరింపవలెను. బహుజీవ, బహుజన్మయత్న ఫలితమును కనులయెదుట ప్రదర్శింపవలెను.

ఇంద్రియము లందిపుచ్చుకొను పదార్థములందు పెనగులాటయే లేదు. ఇవి యిచ్చు భావమును తనివారఁ గ్రోలి తలతిరిగి నేలఁగూలుట కెంతకాలము పట్టును? ఇంద్రియము లిచ్చు గంజిమెతుకులకై జన్మపరంపరలం దూయలలూఁగి, మాఘఫాల్గుణముల ననుసరించి (మా + అఘ; ఫల్గు + న) నరకనాకములను విదల్చుకొనవలెనా? అనిత్యసుఖమునకై స్వీయకురుక్షేత్రమును ధర్మక్షేత్ర మొనరించి, నారాయణుని మ్రోల విషాదపూరము వెడలఁగ్రక్క నేల? విజ్ఞానికృషికిని భౌతికశాస్త్రజ్ఞుని కృషికిని భేదమెంతేని కలదు. ఎదుటిదృశ్యమును భేదించి భౌతికశాస్త్రజ్ఞుఁడు తనకు వలయు జ్ఞానమును చేఁబట్టఁగలఁడు. కవికార్యమందు క్లేశము లేదు. పాలకుని పనియందు ఎంతోచిక్కు లేదు. ఇంద్రియములకు సాధ్యమైన పనికై బహుజన్మ లెత్త నక్కఱ లేదు. బహుజన్మ లెత్తినను లభింపని పరమధన మెట్లు చేఁబడును?


ఎదురరుగు నింద్రియములను వెనుద్రిప్పవలెను. వెనుఁదిరుగుట పనియైన, ప్రపంచ మేల, జన్మసంపర్క మేల అని సందియము కలుగవచ్చును. ముందులకు లంఘించు ఇంద్రియములకు ముంగలపని మనము చూపనక్కఱలేదు. సముచితముగ వల్గములను చేఁబట్టి దశాశ్వములను నడిపితిమేని ప్రపంచక్షేత్రమున నెంతేని యభ్యుదయము నందఁజాలుదుము. మహత్తరమైనదయ్యు కర్మక్షేత్రమొక్కటియు జ్ఞానపిపాసువును సచ్చిదానందముతోఁ దనియింపఁజాలదు. అసంతృప్తితో పొసలు విజ్ఞానికి కర్మక్షేత్ర మెంతభిక్ష పెట్టును? బుద్ధిశ్రమకై ఆతురపడునాతఁడు భక్తిమార్గమున విడియుటకు మక్కువపడునా? భక్తికి దీర్ఘ యోచనగాని, పెనగులాటగాని యక్కఱలేదు. భక్తున కెంతేని ఎన్నిక కలదు. భ్రమరకీటక న్యాయము సాధ్యాతీతమగునో మర్కటకిశోరన్యాయమును, మర్కటకిశోరన్యాయము అడలుపుట్టించునో మార్జాలకిశోరన్యాయమును వీనిమనుగడ నడపు ఏడుగడయై యుండును. తన్నుఁగనిన తల్లి—జగన్మాతకడుపుఁబట్టి వ్రేలాడిన భక్తుఁ డెట్టియనర్థములనైన నతిక్రమింపఁజాలును. కష్టముకాని, ప్రజ్ఞగాని అనివార్యమైయుంట జ్ఞానమార్గావలంబికే.

ఇంద్రియములను వెనుద్రిప్పఁజాలువాఁడు విజ్ఞానిమాత్రమే. మూలభావమందలి పరమార్థమును, పరమార్థమందలి మహత్త్వపటుత్వములను కరస్థామలకముఁగావించుకొనఁజాలు ప్రజ్ఞాధురంధరుఁడు విజ్ఞాని. విజ్ఞానియనిన గుట్టలకొలఁది గ్రంథములను దిగమ్రింగిన అద్భుతనోక్త కాఁడు. తమకును, తమవిజ్ఞానమునకును సంబంధములేని విజ్ఞానులు కొల్లలై ప్రపంచమున పుట్టిరి, గిట్టిరి. విద్వాంసులయ్యు, వేదవేదాంగపారంగతులయ్యు పల్వురు మనుష్యరక్తమును గుటకలువైచిరని ప్రపంచచరిత్రలు కన్నీరుజాలువార్చుచుఁ దెలుపుచున్నవి. ఇట్టి విజ్ఞానులను మట్టువెట్టుటకు సాధారణులు తలక్రిందులైరి. అఖండుఁడైన భగవంతుఁడు, స్వీయమధనము గావించుకొని మథురయందుఁ దోఁచి సాధారణబాలునివలెఁ గోకులమున నింద్రియములను పెరుగనిచ్చి, బృందావనమున వర్ధిల్లి, నిజశరీరద్వారకకధీశ్వరుఁడై, ప్రభాసియందు భాసమానమైన తనువువీడువఱకు నెందఱెందఱు పలుగాకులను దునుమాడలేదు? అవతారమూర్తులచే వధింపఁబడిన దుష్టులు విద్వాంసులు కారా? నేను లక్షించు విజ్ఞాని యీత్రోవలోనివాఁడు కాఁడు. తన విజ్ఞానము తానై, తాను తన విజ్ఞానమై, తన జీవనమును తన భావము గావించుకొని, తన భావమును దన జీవన మొనరించుకొనిన విజ్ఞానియే విజ్ఞానికాని ఒరుఁడు కాఁడు. ఇట్టి విజ్ఞాని పుస్తకపఠనమందుమాత్రము పుట్టఁడు. తనకర్థముగాని ఘోషయందు బ్రదుకీడ్చువాఁడును, నిరక్షరకుక్షియు వేఱు కారు. కొండచిల్లువడునట్లు పనసల నఱచినంతన విజ్ఞానమలవడునా? నిక్కమైన విజ్ఞాని ప్రతిపదమునుండియు, ప్రతిపదార్థమునుండియు జ్ఞానసుధను పీల్చి తనమనసునందు, తన బుద్ధియందు, తన యాత్మయందు, తన ప్రాణమందు, తన జీవనమందు దానిని ప్రవహింపఁజేయును. శరీరస్థదేవతలైదింటిని—జ్ఞానేంద్రియములైదింటిని ఉపనిషత్తులు దేవతలని పేర్కొనినవి. అల్లనవ్వలికంపి, దక్షిణామూర్తివలె,

నీఁగనుండియు, దోమనుండియు, పురుగునుండియు, చెట్టునుండియు నీతఁడు విజ్ఞానమును సంపాదించును. వేఱొకమాఱు ఇంద్రియములను లోనికిఁ ద్రిప్పి, హృదయకోశాగారమున నిండియున్న సచ్చిదానందమునుండి అమూల్యమైన మూలభావము నీతఁడు నెమరువేయును. దేహధారి లోఁగొను అన్నపుముద్ద రక్తమై, వీర్యమై, మణిపుష్పకమై, సుఘోషమై, అనంతవిజయమై, పౌండ్రమై, దేవదత్తమై, పాంచజన్యమై, (అపాం తత్త్వమ్ దరవరం, సుదర్శనం తేజస్తత్త్వమ్) శరీరస్థములైన ఐదైదులను దనిపి, పిండాండమును బ్రహ్మాండమును జేరుచున్నట్లు విజ్ఞానిభావము అంతరంగమందు మహోద్భూతి జన్మాభివృద్ధి నంది దివ్యశక్తినిఁ బడసి తుదకు కాలని భగవంతునందు నింపివైచును.

మనుష్యజన్మ దేవజన్మకంటె మహత్తరమైనదని మహాత్ముఁడు శుకయోగి ఏల వాక్రొనెను? పశువులందు వలెనే దేవతలం దభివృద్ధి లేదు. దేవతలందు సుఖమే వారి త్రోవల నడ్డుగోడయై నిలుచును. పశువులు దుష్కర్మ మనుభవింప నిలింపులు సుకర్మ లనుభవింతురు. (నాభుక్తం క్షీయతే కర్మ జన్మకోటి శతైరపి) సుకర్మవలని ఫలము ముగిసినంతనే యనిమిషులు నేల రాలవలసినదే! మనుజుఁడో, పుణ్యమును గోరక పాపమందుఁ జొరఁబడక కర్మముక్తినంది, పరమార్థమును చేఁబట్టి, పరమాత్మయందుఁ గలియఁగలఁడు. కావుననే శుకయోగి మనుష్యజన్మ కట్టియాధిక్యము నొసఁగెను. సంచితమైన కర్మము ప్రారబ్ధమై ప్రస్తుతజన్మతో బాటుగ విడిపోవుటకుఆగామి కర్మ చేరకుండవలెనుగదా! నేటియాగామికర్మ రేపటి సంచితకర్మమై, రేపటి సంచితకర్మ ఆమఱునాఁడు ప్రారబ్ధమై సంకెలకు సంకెలఁజేర్చ, జన్మపరంపరల కంతు ఉండకుటెట్లు? సంచితాగాములను మటుమాయ మొనరించి ప్రారబ్ధమును చితిచిచ్చులో చిటచిటలాడించితి మేని, కర్మపంజరమునుండి ఎగసి జీవాత్మ పరమాత్మను చేరఁజాలును. పరమాత్మను చేరఁజాలుట పరమార్థమునందుట.

ఆధ్యాత్మికమున నసంతృప్తివలననేమి, కర్మనిష్ఠాగరిష్ఠతవల్లనేమి, సగుణనిర్గుణోపాసనల మూలముననేమి, భక్తితత్పరతచేనేమి, జ్ఞానపథావలంబనమువల్లనేమి, జితేంద్రియత్వముచేనేమి పరమార్థసాధనమును, పరమభావ హృదయంగమమును సాధ్యమగును. కురుక్షేత్రయుద్ధమున విజయధ్వానము బోరుకలంగను!! నాఁడే నరుఁడు నారాయణుఁడగును!!! అఖండస్వరూపు నందిన నాఁడే మానవుఁడు శిఖండి యగును!!!!



క్రొత్తబౌద్ధాలయము-మూలగాంధారకుటీవిహారము, సారనాథము

—సి. జి. జగన్నాథదాసు.

చెన్న రాజధానియందు ౧౯౩౧-వ సంవత్సరము అక్టోబరు ప్రారంభము మొదలు డిసెంబరు తుదివరకు గల మూడునెలల కాలమున ముద్రితములయి ప్రకటితములయిన

ఆంధ్ర గ్రంథముల పట్టిక*

కథలు—ఐతిహాసికములు, పౌరాణికములు

త్రిప్రాసకంపరామాయణము—కె. వెంకటరామయ్య

భారతకథా సుధార్ణవము—యన్. రామస్వామి

శ్రీగరుడచరిత్రము—డి. సర్వేశ్వరుడు

శ్రీమహాభక్తవిజయము—యస్. సుబ్రహ్మణ్యశాస్త్రి

—కల్పితములు

కథాగుచ్ఛము, భా. 3—(ప్ర) కె. వైకుంఠరావు, మదరాసు.

కథానిధి—కె. వెంకటరావు, యం. సీతాపతిరావు

తెలుగుకథాసప్తతి, భా. ౧—సి. నారాయణశాస్త్రి

మేధానిధులు—బి. పూర్ణయ్యశర్మ

సత్యరాజాపూర్వదేశయాత్రలు—కె. వీరేశలింగం

—చారిత్రకములు

బాలుర ఇండియాచరిత్ర కథలు—(ప్ర). సి. కుమారస్వామినాయుడు అండ్ సన్స్, మదరాసు.

కల్పములు

ఏకాదశీ గురువారవ్రతము—(ప్ర). సి. లక్ష్మీనృసింహశాస్త్రి, మచిలీపట్టణము

విఘ్నేశ్వరపూజావిధానము—(ప్ర) పి. వీరేశలింగాచారి, చికాకోల్

వినాయకవ్రతకల్పము—(ప్ర) కె. శోభనాద్రిరావు, విజయనగరము

శ్రీ తులసీవ్రతమహాత్మ్యపూజావిధానము—(ప్ర) శారదాప్రెస్, అనంతపురు

షష్టిపూర్తి శాంతివ్రతకల్పము—(ప్ర) సి. లక్ష్మీనృసింహశాస్త్రి, మచిలీపట్టణము

సత్యనారాయణవ్రతకల్పము—సి.లక్ష్మీనృసింహశాస్త్రి మచిలీపట్టణము

కావ్యములు

ద్విపదమేఘదూతము—(ప్ర) పల్లెపూర్ణప్రజ్ఞాచార్యులు, గుంటూరు.

పుష్పబాణవిలాసము—కె. ప్రభాకరశాస్త్రి, కొల్లూరు.

మేఘదూత—(ప్ర) కె. నాగేశ్వరరావు, మదరాసు

శతకంఠ రామాయణము—పి. సన్యాసి

గణితశాస్త్రము

గణితశాస్త్రము—వి. శ్రీనివాసాచారి

గేయములు

ఆత్మగీతము—వి. పార్థసారథిరావు

ఆత్మబోధ సుజనతత్త్వరత్నావళి—(ప్ర) మస్తాన్ షరీఫ్, పెంటపాడు

కీరపండరీ పాండురంగ విఠల్ భగవాన్ నామములు, భజనకీర్తనలు—(ప్ర) టి. రామకృష్ణయ్య, చిలకలపూడి

గాంధీమహాత్ముని ప్రభావము—ఏ. వెంకటజగన్నాథాచార్యులు

గాంధిరత్నావళి—కరణం మహాలక్ష్మి

గాంధిరాయబారము—మున్నంగిశర్మ

గేయరామాయణము—వాసుదాసు

చారగేయములు—పి. యస్. రామశర్మ

దేవీప్రసన్నతత్త్వాలు—యస్. వీరన్న

శృంగారనిలయరంగనితత్త్వములు—జి. పోలందాసు

శ్రీభక్తజనానంద రామాయణము—బి. పాలయ్యదాస్

సంగీతకీర్తనలు—(ప్ర) కె. సీతారామయ్య, కడప

* ఈ పట్టికయందుగల సంకేతపదముల వివరణము: అ.—అధ్యాయము. అను.—అనువాదము, అనువాదకులు. ప.—పద్యము. ప్ర.—ప్రకాశకులు. భా.—భాగము. వ.—వచనము. సం.—సంపాదకులు. సటీ.—సటీకము.

సూక్ష్మరామాయణము—(ప్ర) కె. కృష్ణమూర్తి, నర్స పూరు
స్వదేశగీతమను మహాత్మగాంధిపాటలు—సి. చిన్నయ్య నాయుడు.
స్వరాజ్యపదము—కె. సత్యనారాయణ

చరిత్రము

ఆంగ్లదేశచరిత్రసంగ్రహము—బి. సుబ్బయ్య
మనమాతృదేశచరిత్ర—యం. షణ్ముఖసుందరం
మనమాతృదేశచరిత్రకథలు—యం. షణ్ముఖసుందరం
శ్రీ పూసపాటివంశానుచరితము, భా. ౧—దువ్వూరి జగన్నాథశర్మ
హిందూదేశచరిత్ర—యన్. సుబ్బరావు
హిందూదేశచరిత్రము—వి. వెంకటరంగరావు

చట్టము

ప్రావిన్షియల్ ఇన్సాల్వెన్సీ అక్టు — (ప్ర) పి. వెంకట సుబ్రహ్మణ్యం, బాపట్ల
మదరాసు లోకలుబోర్డుల చట్టదిట్టములు—(ప్ర) సి. వి. నాయుడు, మదరాసు
సివిల్ గ్రామపంచాయతి కోర్టులరూల్సు—(ప్ర) ఆర్యక్ పబ్లిషింగ్ హౌసు, బెంగుళూరు

జంతుశాస్త్రము

జంతుశాస్త్రము—యం. సాంబశివరావు

జీవితములు

అళియరామరాయలు—చి. వీరభద్రరావు
తుకారామస్వామిచరిత్రము—(ప్ర) వి. రామస్వామి శాస్త్రిఅండ్ సన్స్, మదరాసు.
వేమన—వంగూరి సుబ్బరావు
శ్రీ సమర్థరామదాసస్వామి—(ప్ర) వి. రామస్వామి శాస్త్రి అండ్ సన్స్, మదరాసు
స్వీయచరిత్ర —వల్లూరి సూర్యనారాయణరావు
హనుమద్వీరజీవితము—మూసి కామయ్యాభుక్త

జ్యోతిషశాస్త్రము

కేరళభాష్యసంగ్రహము—కాళీదాస్
దైవజ్ఞచింతామణి—యం. కోటనాగయ్య

నవలలు

దుర్గేశనందిని—(ప్ర) వి. రామస్వామిశాస్త్రి అండ్ సన్స్, మదరాసు
రాణీదుర్గ లేక దుర్గాకుమారి — బి. హనుమంతరావు, డి. సూర్యనారాయణ
సమరసింహ—జి. వెంకటకృష్ణయ్య
సీమంతిని—(ప్ర) వి. పార్వతీశం, పిఠాపురము
హత్యాభ్రమ — (ప్ర) ఏ. లక్ష్మణస్వామి నాయుడు, రాజమహేంద్రవరము

నాటకములు

కళానందవిజయము అను జరాసంధవధ—యం. వెంకటప్పయ్య
ఖిల్జీ రాజ్యపతనము—జి. వెంకటసుబ్బరావు
దెయ్యాలలంక—పి. వి. రాజమన్నారు
నిజలింగచిక్కయ్య అను పంచాక్షరీమహాత్మ్యం — పి. దేవబ్రహ్మం.
శాకుంతలనాటకము—(ప్ర) జె. గంగన్న, రాజమహేంద్రవరము
శ్రీ పాండురంగ విలాసనాటకము—పి. వీరాస్వామి నాయుడు
శ్రీ సీతాకల్యాణము—యం. లక్ష్మీనృసింహాచార్యులు

నిఘంటువు

త్రికాండశేషము—పురుషోత్తమదేవ

నీతి

బాలనీతికథలు, భా. ౧—వీ. యల్. నారాయణ
వివేకదర్పణము—వి. పాపరావు, యస్. రామలింగ శాస్త్రి

పరిశిష్టము

అధ్యక్షోపన్యాసము—(ప్ర) ప్రసిడెంట్, పుల్లా
అహింస—జె. రంగసామి
ఉత్తమమార్గము—జనమంచి శేషాద్రిశర్మ

ఉపవాచకములు, భా. ౧, ౨—పి. సూర్యనారాయణ శర్మ
ఐరావతచరిత్ర—(ప్ర) పి. అక్కిరాజు అండ్ సన్స్, నరసపూరు
కల్పలత—నేతి సుబ్బయ్యశాస్త్రి
కాశీసారము—(ప్ర) యం. వెంకటరత్నకవి, అనమనమూరు అగ్రహారము
కుటుంబనిర్వాహశాస్త్రము—వై జి. బానెల్
గాంధిమహాత్మ్యము—ఏ. సోమనాథరావు
గ్రామసహకార పరపతిసంఘములు—కె. లక్ష్మీనారాయణ
జంతుసంతాపము—నిడమర్తి ఈశ్వరప్ప
జ్ఞానాంజలి—పి. సత్యనారాయణరాజు
జ్ఞానోదయము—యస్. గోపాలం
దురభ్యాసములు, పాడుము—వేదుల సూర్యనారాయణశాస్త్రి
నయప్రదీపము—సి. వెంకటకృష్ణమూర్తి
నీయోగీశ్వరము—వెంకటాచలపతిరావు
పతివ్రతలు—వి. శేషగిరిరావు
ప్రసూతలపరిచర్య, భా. ౧, ౨—క్రిశ్చియన్ లిటరేచరు సొసైటి, మదరాసు
భగవత్కథ—(ప్ర) పి. నరసింహం, గుంటూరు
బైబిలు వాచకబోధిని—పి.బి. పాల్. యస్. భూషణం
వాచిల్ల వాచకపుస్తకము, త. ౭—జె. గంగన్న
విజయవాడఖద్దరు ప్రచారచరిత్ర, (ప్ర) విజయవాడ వైశ్యమహాసభ, బెజవాడ
విజయాభిమన్యుజన్యము—కె. వెంకటరామానుజాచారి
రయితు నిజస్వరూపము—యస్. లక్ష్మీపతిశాస్త్రి
రామమోహనగుణస్మరణము—ఓలేటి వేంకటరామశాస్త్రి
మనస్సు—యస్. నారాయణమూర్తి
మహర్నవమి పద్యములు—(ప్ర) యస్. సుబ్బరావు, పాలుకోలు
మారుతివాచకము, త. ౬, ౭, ౮—జి. గంగరావు, పి. సత్యనారాయణ, యం. పార్వతీశ్వరశాస్త్రి, బి. నారాయణమూర్తి
శుచిమాలిక, బుక్. ౧—వై. జోసఫ్ ఏలిష
శ్రీకోనసీమ ధార్మికస్వరాజ్యసంఘము—(ప్ర) పి. ఉమామహేశ్వరశాస్త్రి, గంగలకుర్రు
సంభోమణరూపక కుటుంబ సుఖాధారశాస్త్రము—వై. జి. బానెల్
సహకారకౌముది—(ప్ర) ఈస్ట్ గోదావరిడిస్ట్రిక్టు కో ఆపరేటివ్ పెడరేషన్, ఆలమూరు
సుజ్ఞానసమాజము—(ప్ర) సుజ్ఞానసమాజము, విజయనగరము

పురాణము

శ్రీబ్రహ్మేశ్వరపురాణము—(ప్ర) దోమ వెంకటస్వామిగుప్త, మదరాసు

ప్రకృతిశాస్త్రము

పదార్థవిజ్ఞానశాస్త్రము—యం. సాంబశివరావు
పదార్థవిజ్ఞానశాస్త్రము—వి. లక్ష్మీనృసింహం
ప్రకృతిశాస్త్రము—వి. సుబ్బరావు

భూగోళశాస్త్రము

కర్నూలుజిల్లా—టి. వి. చెల్లప్పశాస్త్రి
రాజమహేంద్రవరము—పెద్దాపురము తాలూకాల భూగోళము—ఏ. పార్వతీశము

మతము—హిందు

వర్ణాశ్రమధర్మములు—వి. వెంకటశివావధాని
సర్వపితృ అమావాస్యతర్పణము—(ప్ర) ఆల్ ఇండియా పురోహితమహాసభ, చిత్తూరు

—ఇతరములు

జూబిలీచరిత్ర—యం. అప్పారావు
పదియాజ్ఞలు—(ప్ర) హోప్ అండ్ కో, మదనపల్లి
సత్యవేదసారసంగ్రహము—(ప్ర) జె. సి. ఆలన్, నెల్లూరు

మాహాత్మ్యములు

ఏకాదశీమహాత్మ్యము—(ప్ర) సి. లక్ష్మీనృసింహశాస్త్రి, మచిలీపట్టణము

సింధూస్నానమాహాత్మ్యము—(ప్ర) సి. లక్ష్మీనృసింహ శాస్త్రి, మచిలీపట్టణము

యక్షగానములు

శ్రీ కృష్ణతులాభారము—గోపాలుని హనుమంతరాయ శాస్త్రి

శ్రీ సీతాకళ్యాణము—సి. నాసరుదాసు

యోగశాస్త్రము

అనుభవయోగాభ్యాసము—పాలపర్తి ఆంజనేయులు

రాజకీయము

స్వరాజ్యశంఖు—కె. సత్యనారాయణ

విమర్శనము

కావ్యనాటకాదిపరిశీలనము — అవ్వారి సుబ్రహ్మణ్య శాస్త్రి

వేదాంతశాస్త్రము

అద్వైతసుబోధిని—జి. సూరయ్య

భగవద్గీత—(ప్ర) వి. రామస్వామిశాస్త్రి అండ్ సన్స్, మదరాసు

బృహద్వాశిష్ఠరహితోపనిషత్—(ప్ర) పి. కొండయ్య, జి. అప్పలస్వామి

మహావాక్యదర్పణము—(ప్ర) వి. సామస్వామిశాస్త్రి అండ్ సన్స్, మదరాసు

శ్రీ భగవద్గీతా మంజరి—(ప్ర) రాజా పానగంటిపార్థసారథిరావు, కాళహస్తి

శ్రీమదాంధ్రోపనిషద్జ్ఞానదీపిక — ఏ. వెంకటసుబ్బరాయశర్మ

వైద్యశాస్త్రము

కలరా—(ప్ర) డిస్ట్రిక్టుబోర్డు, చిత్తూరు

తిబ్బెఅక్బర్ షాహి—డి. రహింతుల్లా బేగ్ సాహెబ్

దీర్ఘరోగ చికిత్సాసారము—పాలపర్తి నరసింహరావు

బాలతంత్రము—వల్లూరి సుబ్బరావు

మశూచి—(ప్ర) డిస్ట్రిక్టుబోర్డు, చిత్తూరు

శతకములు

అభినవసుమతి శతకము—మర్ఘా సుబ్రహ్మణ్యశర్మ

ఆత్మారామశతకము—బి. పెంటయ్య

తిరుపతి వెంకటేశ్వరశతగీతి—బి. కనకాచలకవి

పద్మలోచనశతకము—డి. గురురాజాచార్యకవి

పారమతల్లి శతకము—కె. కృష్ణరాయశాస్త్రి

రాఘవశతకము—కృష్ణకుమారమిత్రులు

లక్ష్మీశారదాశతకములు—(ప్ర) లక్ష్మి, శారద, పెనుగొండ

శ్రీ గూడలి సంగమేశ్వరశతకము—జె. లక్ష్మీనరసింహయ్య

శ్రీ తిరుపతి వెంకటేశ్వరశతకము—బి. సుబ్రహ్మణ్యం

శ్రీ వేణుగోపాలకృష్ణశతకము — జె. లక్ష్మీనరసింహయ్య

సాంబశతకము—యం. కోటయ్య

సారస్వతము

ఆంధ్రధ్వని—(ప్ర) ఏ. సుబ్రహ్మణ్యశాస్త్రి, కొవ్వూరు

స్తోత్రములు

ఆనందసురుస్తవము—మన్నవ నరసింహం

వరదరాజ నక్షత్రమాలా—జి. రామానుజాచార్యులు

విష్ణుసహస్రనామస్తోత్రం — (ప్ర) వి. రామస్వామి శాస్త్రి అండ్ సన్స్, మదరాసు

శ్రీ రామచంద్రస్తవం—యం. జాలా అప్పల నృసింహ శాస్త్రి

శ్రీ హనుమన్నామావళిః—పి. సుబ్రహ్మణ్యఅయ్య

హరికథలు

హరవిలాసము—కె. యల్లమందరాజు

వ్యవసాయ పరిశోధనాలయముల ఆవశ్యకత

రా. బ. దువ్వూరి బాలకృష్ణమూర్తి

సర్కారువారిచే వ్యవసాయపరిశోధనస్థానము లెందుకు ఏర్పాటుచేయబడినవి? వాటివలన రహితులకు ప్రయోజన మెట్లు కలుగుచున్నది? వ్యవసాయాభివృద్ధిని కలుగజేయుటలో వాటి కెట్టిస్థానము గలదు? వాటికిని, దేశముమీద వ్యవసాయశాఖాప్రచారకులు చేయు వ్యవసాయాభివృద్ధిబోధనలకును ఎట్టిసంబంధము గలదు? అనుముఖ్యాంశము లీవ్యాసములో చర్చింపబడును.

ఈదేశములో అనాదినుండి హిందూరాజులును, మహమ్మదీయ నవాబులును ఉద్యానవనములను, నందనవనములను బహుశ్రద్ధాసక్తులతో పెంచుచుండెడువారు. రామాయణాది ప్రాచీనగ్రంథములలో వర్ణింపబడుచు వచ్చిన ఇంద్రుడు, కుబేరుడు, రావణుడు మొదలగు వారి నందనవనము, అశోకవనాదులే ఇందుకు తార్కాణము. అట్టి ఉద్యానవనములు వారికిని వారికి తాబేదారులుగా నుండు ఇతరప్రభువులకును ఆదర్శప్రాయములుగా నుండుచుండెడివి. వీటిని పోషించుటలో ముఖ్యోద్దేశ్యము ఆనందమును కలుగజేయుచు ఆహ్లాదజనకములుగా నుండుటే అయినను, వాటిని బహుపొందికగాను, క్రమపద్ధతులతోను, నాజూకుగా నుండులాగునను అమర్చబడి, అచ్చట సామాన్యజనులకు సాధ్యము గాని, సహజవస్తుసముదాయమును సేకరించి వాటిని సంరక్షించుటలో బహుజాగరూకత చూపింపబడుచుండెడిది. నూతనములైన విషయములను నేర్చుకొనుటయందాసక్తిగలవారు, శిక్ష, జ్ఞానము, అభివృద్ధులకొరకీప్రదేశములకు తరచుగా మిక్కిలియాతురతతో చేరుచుండెడివారు. రాజాధిరాజులుకూడ శేరీలను నడపించుచు వాటిలో వివిధజంతువులను పోషించి వ్యవసాయమును చేయుచు పండినపదార్థమును మహలులలోని కందాలలో వంటచేయించుచు అనుభవించుచుండెడివారు. నవీనములైన క్రొత్తక్రొత్త మొక్కలను, ఆవులను, ఆబోతులను ఈశేరీలలో పెంచి క్రమముగా దేశముమీదకు పంపి ఆపరిసరప్రాంతములలో అభివృద్ధిని కలుగజేయుచు వచ్చుచుండిరి. అటువంటి శ్రద్ధాఫలితములే యిప్పటికిని మంచిమంచి జాతుల కూరగాయలలోను, బహురుచికరములగు మామిడిమొదలగు ఫలవృక్షములలోను, సువాసనగల ధాన్యాదులుమొదలగు పంటలలోను కానవచ్చుచున్నవి. జహంగీరు, ఇమాంపసందు మొదలగు అత్యుత్కృష్టమైన మామిడిజాతులు ప్రప్రథమమున బందరు నవాబువారి తోటలోమాత్రమే పెంచబడుచువచ్చి ఇప్పుడిప్పుడు ఇతరత్ర వ్యాపించుచున్నవి. అదేరీతిగా బంగనపల్లిమామిడికూడ సర్వత్ర వ్యాపించినది. ఈవిధముగానే విజయనగర సంస్థానాధీశులైన రాజపుత్రరాజుల ప్రాపకమున నెల్లిమర్లతమలపాకుతోటలు, సపోటా మొదలగు ఫలవృక్షము లెన్నో ఆంధ్రదేశమున ప్రసిద్ధికి వచ్చినవి. తంజావూరుమహారాష్ట్రప్రభువులును, మైసూరు సంస్థానాధీశులును, తిరువనంతపురం మహారాజులును, బొబ్బిలి వెలమదొరలును ఇంకా యితరరాజులును వారివారి ముఖ్యపట్టణములలోను, ఆచుట్టుప్రక్కలను నూతనమైన అనేక ఫల పుష్పాదులకు, మంచిమంచిజాతుల పశుసంతతుల వ్యాప్తికి కారణభూతులు.

ఋగ్వేదకాలమునకు తరువాత మనపూర్వులలో బుద్ధిమంతులైనవా రందరు ఆధ్యాత్మికచింతతో వారి తెలివితేటలను వేదాంతవిషయములయందును, రాచకార్యములందును, సంగీతము, సాహిత్యము మొదలగునుత్తమవిద్యలయందును వినియోగపరచుచు, సర్వదా యితరులపై నాధారపడవలసియున్నట్టియు, అజ్ఞానులై

నట్టియు దరిద్రనారాయణుల చేతులలో జనబాహుళ్యమున కంతకు వలయు ఆహారమును పండించు భారమును విడిచిపెట్టుటవలన మన దేశపు వ్యవసాయపుపద్ధతులు కడు హీనస్థితిలో నుండుచువచ్చినవి. ఈవిషయము నే కీ. శే. పద్మసోలల అగ్నిహోత్రశాస్త్రిగారు వ్యవసాయదీపిక రెండవఅధ్యాయములో వివరించియున్నారు:

"ఆర్యు లీదేశాన నాదినుండియు నుందు
రటుగాన నిద్ది యార్యావర్తమయ్యె;
ఆర్యులప్పటివార లతిశాంతబుద్ధులును
వేదవేదాంగాదివిద్యావివేకులును,
అంతియే కాకుండ యజ్ఞాదికర్మముల
గడుశ్రద్ధవహియించి గావించువారు;
సర్వకాలములందు జపతపంబులు బూని
యొరులతో మాటాడ నూహింప రెపుడు;
అద్వైతశాస్త్రంబు నభ్యసించియు కొంచ
రవనిభోగము లెల్ల నస్థిరము లనుచు,
గోరకుండెడివారు కోరినప్పటికైన
దను వశాశ్వత మనుచు దలచి మదిలోన,
కామాదిదుశ్శత్రుగణము నంటగనీక
శమదమాదులతోడ సహవాస మొంది,
పొట్టపోషించుకొన నెట్టులైనను వారు
కొంచె మబ్బిన జాలునంచు నూహించి,
కడుసంతసము బడుచు కాలంబు గడపుచును
బరమార్థమున కాసపడుచుండువారు.
కాన నెంతటితెల్వి గలిగియుండిన దమకు
శ్రమకరములగు వ్యవసాయాదికృషులు
నాచరించుట మాని యవి తెలివియును
ధనము చాలకుండినవారి పాలుగావించి
తా మూరకుండుటనె ధరణిలో నేటికిని
బహుళలాభము నిచ్చు వ్యవసాయవృత్తి
తగిన బుద్ధిబలంబు ధనబలంబును లేని
వారిచేతుల జిక్కి వర్ధిల్లదయ్యె."

ఈరీతిగా దేశాధారమైన వ్యవసాయవృత్తి విద్యాగంధములేని కడుబీదల చేతిలో నుండబట్టి, యేవిధమైన అభివృద్ధిని బొందక మనదేశపు వ్యవసాయము కడు హీనస్థితిలో నుండుటకు కారణమైనది. వ్యవసాయ మట్టి హీనస్థితిలో నుండుకాలములలోగూడ రాజాధిరాజులవలన పోషింపబడుచువచ్చిన శేరీలు రహితుల కత్యంతోపయోగకారులై యుండుచువచ్చినవి. అట్టి బీదరహితులకు వసతులు తక్కువగాను, మితము గాను ఉండుటవలన వారికి సర్వదా రాజపోషణయు, సహాయము, సలహా లగత్యములు. పూర్వకాలములో నుండిన శేరీలు ఇప్పటికిని తెనుగుజిల్లాలలో "హావేలీ" భూములుగాను, అరవజిల్లాలలో "పన్నై" నేలలుగాను నామమాత్రమున కున్నవి.

ప్రజాసంరక్షణ దేశపాలకుల విధియగుటచే అనాదినుండియు అరణ్యములలో నివసించు తపోధనులు గూడ షడ్భాగమును రాజులకు పన్నుగా చెల్లించుచున్నట్లు మన ప్రాచీనగ్రంథరాజములే చెప్పుచున్నవి. వ్యవసాయదారులవద్దనుండి పన్నులను పుచ్చుకొను రాజులకు వ్యవసాయాభివృద్ధిమార్గములను కనిపెట్టి బోధించవలసిన బాధ్యత యుండుటచేతను, రహితుల క్షేమముమీదనే దేశక్షేమము, ప్రభువుల క్షేమము ఆధారపడియుండుటచేతను అభివృద్ధిమార్గములను రహితులకు బోధించుటకుగాను పూర్వకాలమునుండి వ్యవసాయశాఖ యొకటి యేర్పడియున్నట్లు కౌటిల్యుని అర్థశాస్త్రమువలన తెలియవచ్చుచున్నది. అట్టివ్యవసాయశాఖలే యీకాలమందు ప్రపంచమందంతటను అన్నిరాజ్యములలోను ఏర్పాటుకాబడి దేశైశ్వర్యమునకు తోడ్పడుచున్నవి. మనదేశములోకూడ ఆంగ్లేయప్రభుత్వమువారొక వ్యవసాయశాఖను ఏర్పరచి బహునిపుణులైన శాస్త్రజ్ఞులచే పరిశోధనలను చేయించి వ్యవసాయాభివృద్ధికి శక్తివంచనలేక తోడ్పడుచున్నారు.

"ఈయవస్థల జూచి యిపుడు మనదొరతనము
వారు మన కందందు ఫారంబు లుంచి
ఆఫారములలోన నధికవిద్యావంతు
లతిబుద్ధిసంపన్నులైనవారలను

అధికారులుగ నుంచి యామహాత్ములచేత
బాగైన వ్యవసాయపద్ధతుల నెల్ల
నేర్పించుచున్నారు నేర్చి రైతులు మంచి
పంటలను పండించి బాగుపడుడయ్య;
పంట లెక్కువగాను బండింప కున్న
లావుభూమిని దున్ను లాభంబులేదు;
ఇదియంతయును మీర లెరిగి మనదొరతనము
వారు చెప్పుచునున్న పద్ధతుల వినుడు."

వ్యవసాయాభివృద్ధికి నవీనమార్గములు మూడు—విద్య, పరిశోధన, ప్రచారము. పరిశోధన మిగిలినరెంటికి పునాది రాయి. విద్యగరపుటలోగాని, ఒకపద్ధతి నవలంబించునట్లు చేయుటలోగాని ఏసంగతి యెట్లు తటస్థించుచున్నది, యేపద్ధతియైనను అవలంబింపతగినదో విడిచి పెట్టవలసినదో మొదట తెలిసికొనవలయును.

పరిశోధనలేనిది యెట్టి వ్యవసాయమును నేర్పు గురువును విద్యార్థులకు అభినివేశమును గలిగింపజాలడు. అట్టి అభినివేశము లేనప్పుడు గురువులవద్దకు శిష్యులు చేరనేచేరరు. పరిశోధన లేనిదే యెట్టివ్యవసాయదారుడు తనవృత్తిని చాలకాలము సాగింపజాలడు. పూర్వకాలమునందు వ్యవసాయదారులు వారిపోషణకు వలయు పదార్థములనుమాత్రమే పండించుచువచ్చిన మార్గములు అప్పటిమట్టుకు సరిపోయినను కాలక్రమమున దేశకాలపరిస్థితులు మారుచు వచ్చుచుండుటచే ప్రాచీనపద్ధతులు తృప్తికరములు కాక మార్పబడవలసి వచ్చినవి. మొట్టమొదట జీవనోపాధిమట్టుకే సరిపోవుచుండిన వ్యవసాయము క్రమముగా వ్యాపారములోనికి మారినది. వ్యాపారసౌకర్యములు ఏర్పడినకాలది ప్రపంచమంతటిలో నుండు అంగళ్లకు సరిపోవునట్లుగా పంటలను పండించవలసిన పరిస్థితు లేర్పడినవి. వ్యవసాయదారు డిప్పుడు ప్రపంచకపు పోటీలో సరిగా నెగ్గి బ్రతుకవలయు ననిన అతని పంటలనుగాని, వ్యవసాయపు పద్ధతులనుగాని మార్చుకొని తాను సుఖముగా జీవింపగలుగునట్లు తగిన వసతుల నేర్పరచుకొనవలెను. అనగా ఇతరదేశములవారితో సరిగా పోటీచేసి అందుకనుగుణమైన వ్యవసాయపద్ధతులను, పంటమార్పులను అవలంబించి సరియగుమార్గమున పంటలను పండించవలెను. ఇందుకు వ్యవసాయదారునికి పరిశోధనయే శరణ్యము. కాబట్టి వ్యవసాయాభివృద్ధికి పరిశోధనయే కీలకము. వ్యవసాయాభివృద్ధిమార్గములను బాహుళ్యముగా నవలంబించి దేశకాలపరిస్థితులనుబట్టి తగుమార్పులతో రహితుల కుపదేశముచేయుటకు వ్యవసాయపరిశోధనస్థానములుతప్ప వేరు సాధనము లేదు.

౨

వ్యవసాయవృత్తికి సంబంధించి సిద్ధాంతపరచబడిన శాస్త్రీయపద్ధతులను అవలంబించి పరీక్షించుటకు వ్యవసాయస్థానములే ముఖ్యప్రదేశములు. తక్కినచోట్ల ఎక్కువఆదాయము నిచ్చుచున్న కొన్నిపంటలను పరీక్షార్థము ఈస్థానములందు పెంచిచూడబడును. వ్యవసాయకళాశాలయందు తరిఫీదుకాబడిఉత్తీర్ణులయినవారిచోట వారు కళాశాలలో నేర్చుకొనిన శాస్త్రజన్యజ్ఞానము దేశకాలపరిస్థితుల కెట్లు అనుసరించునో పరీక్షించి చూచెదరు. ఇచ్చోటనే స్థానికపద్ధతులను పరీక్షించి అవి నిలిచియుండుటకు తగుకారణముల నరయుదురు. ఇచ్చోటనే పలురకముల యెరువులు, వ్యవసాయపు పనిముట్లు పరీక్షించి యెక్కువపంటల నిచ్చుట కెట్లుపయోగపడునో చూచెదరు. ఖర్చుతక్కువతో ఎక్కువఆదాయము వచ్చుమార్గముల నరసెదరు. రయితు లిచ్చోటికే, తమపైర్లకు జబ్బుతగిలి తెగులుగాని, చీడగాని పట్టినప్పుడును, తమపశువులకురోగములు వచ్చినప్పుడును ఎక్కువ ఆతురతతో వచ్చెదరు. ఇచ్చోటనే పశువుల మలమూత్రాదులనుసరిగా భద్రపరచి వాటియెరువును హెచ్చువిలువగలదిగాను, సారవంతమగుదానినిగాను చేయుట నేర్చుకొందురు. మంచిదూడలు పుట్టునను ఆశతో తమ పెయ్యలను ఘారముఆబోతుచే దాటించుటకు తీసుకొనివచ్చెదరు. ఇట్టిపనులన్నియు సర్కారువ్యవసాయస్థానములయందు సాధ్యమగునుగాని యొక్కొకవ్యక్తివలన నిట్టి పనులు చాలకాలము జరుగగలవో లేవోమాత్ర మెంతమాత్రము నిదానించి ఆలోచనచేయరు. ఒకయజ

మానికి గల ఆసక్తి తగ్గవచ్చును; అతని ఆరోగ్యము గాని, స్థితిగతులుగాని చెడిపోవచ్చును. అందువలన సర్వము నాశనమగును. కొంతమంది జమీందారులు, వారు కోర్టు ఆఫ్ వార్డ్సువద్దనుండి వారి శేరీలపరిపాలనమును తీసుకొనిన కొద్దిరోజులలోనే వాటిని పూర్తిగా మూసివేయుట యిందుకు తార్కాణము.

ఆరంభించినపనిని జయప్రదముగా నడిపించుటకు ఇతరత్ర ఉపయోగింపదగిన ఫలితములను సంపాదింపగలిగియుండుట, బోధించే అభివృద్ధిమార్గములలోని యుపయోగవిషయములనుగురించి నిశ్చయమైన నమ్మకము కలిగియుండుటకు వ్యవసాయస్థానములలో క్రమమైన శిక్షణను పొందిన తగినంత సిబ్బంది యుండవలయును. అచ్చట పశువులు, పనిముట్లు, యంత్రసామగ్రి చాలినంత యుండవలెను. బాగుగా పనులను నేర్చుకొనిన అనుభవశాలులైన ఖాయపుకూలీలు చాలినంతమంది యుండవలెను. పశువులను కట్టిపెట్టుటకు, ఖరీదుగల యంత్రసామగ్రి చెడిపోకుండ నుంచుటకు, విలువగల పంటల ఫలితమును భద్రపరచుటకు, తాత్కాలికోపయోగముల కవసరమగు శోధనలను చేయుటకు, తగిన వసతిగృహము లవసరము. వీటికన్నిటికి చాలినంత ఖర్చును, తరిఫీదయిన తగిన మనుష్యులును, వినియోగపరచుటకు చాలినంతకాలము కావలయును. నిజమైన వ్యవసాయాభివృద్ధికిని పరిశోధనాఫలితముల యాథార్థ్యమునకును ఈమూడును ముఖ్యాంశములు. ఈకారణముల వలన ఏవ్యవసాయస్థానమును ప్రత్యేకము వ్యాపారపద్ధతులమీదనే నడిపించుటకు వీలుపడదు ఏయొక వ్యవసాయస్థానఫలితములును ఆయాచుట్టుప్రక్కల ప్రదేశములందు క్రమక్రమముగా వ్యాపించి నిదానించి కనిపెట్టినప్పుడు సమూహముమీద కనుపించును. ఆపరిస్థితులకు ఆఅభివృద్ధి అనుకూలించినట్లును, ఎక్కువఫలితము నిచ్చినట్లును, వ్యవసాయపుఖర్చులు తగ్గినట్లును, వ్యాపారము చురుకుగా నున్నట్లును, ప్రజలు సుఖజీవనము చేయుచున్నట్లును కనుపించును. కాని యిందువలన, ఇచ్చట పనిచేయువారు అసమర్థులనియు, వారికి ఒప్పగింపబడిన ఘారమును లాభకారియగు పద్ధతులమీద నడిపించుటలో అనుభవము లేనివారనియు అర్థముచేయరాదు. ఇందు కొకఉదాహరణము—పర్లాకిమిడిరాజాగారు అనేక సంవత్సరము లొక స్వంత శేరీని నడిపింపగా ప్రతిసంవత్సరము సుమారు రెండువేలరూపాయల నష్టమువచ్చుచుండెడిది వ్యవసాయపు డిపార్టుమెంటువారి తాబేదారు ను అయిదుసంవత్సరములపాటు ఇచ్చి పనులుచేయించగా అట్టి హెచ్చుజీతగానికగు ఖర్చు, కూలీలకు హెచ్చుజీతములుకూడ పోగా ప్రతిసాలుకు రెండువేలరూపాయల నికరలాభము తేలినది. ఎస్టేటురయితులు ఈఅభివృద్ధులను అత్యంతాసక్తితో అవలంబించి యెక్కువలాభమును పొందుచున్నారు. ఇంతేకాక రాజాగారికి కూడ ఈశేరీని పోషించుటవలన మంచిలాభమును, స్థిరమైన ఆదాయమును ఏర్పడినవి. కాని పైనచెప్పిన రీతిని వ్యవసాయస్థానములను వ్యాపారపద్ధతులమీద నడిపింపవీలులేదు కాని వ్యవసాయశాఖలోని ఉద్యోగుల నిపుణతగల పాండిత్యమును పొంది జమీందారు లేరీతిని లాభములను పొందుటకు వీలుకలదో తెలియుటకు యీ ఉదాహరణము చాలును.

పరిశోధనలను కనిపెట్టుటలో, పనిచేయుటయందు సదాశ్రద్ధయు, పరిష్కారములను తేల్చుటలో ఎక్కువ ఊహాపోహలును, మితిలేనిశ్రమపడుటకు తగినంత శక్తిని కలిగియుండవలెను. ఇట్టిశక్తులను కలిగియుండుట అందరికిని లభించనూలభించదు; ఇట్టిగుణములను అవసరమైనంతవరకు కనపరచుటకు పరిస్థితులు అన్నిచోట్లను, అన్నికాలములందును సమకూడనూసమకూడవు.

పైన వివరింపబడిన సంగతులనుబట్టి వ్యవసాయస్థానముల నేర్పరచుటలో సంఖ్యలోను, ప్రదేశముల లోను మితి యేర్పడుచున్నది. రాజధానియంతటిలోను ప్రతిచోటను వ్యవసాయస్థానముల నేర్పరచుట సాధ్యపడదుగాని క్రమశిక్షణను పొందిన తగిన ఉద్యోగస్థులు లభించి చాలినంత ధనము సమకూరినప్పుడు వ్యవసాయపద్ధతులలో నిర్దిష్టమైన ప్రత్యేకస్థలములయందు వ్యవసాయస్థానముల నేర్పరచుటయే ఆశయము.

నాగరీఫారంలోని నల్లరేగడభూములలో వరిపంటకు ఎరువులపరీక్ష చేయుటకు వీలుపడదు. అచ్చట తేలినఫలితములు గోదావరిజిల్లాలోని సామర్లకోటలో గాని, తంజావూరుజిల్లాలో ఆడుదురైలోగాని ఆ పైరుకే ఉపయోగించుటకు వీలుపడదు. తిరునల్వేలి జిల్లాలోని కోయల్పట్టిలో పరీక్షించతగినది ప్రత్తిపంట; అది ఆడుదురైలో సరిగా పెరగజాలదు. ఉత్తరమలయాళములోని తెలిపరంబాలో మిరియము బాగుగా పెరుగునుగాని దానిని గోదావరియేజెన్సీలో పండించుటకు రాక్సుబర్గు దొరవారు చేసినప్రయత్నములన్నియు నిష్ఫలములైనవి. ఇందువల్ల ప్రత్యేకస్థలములకు వేరువేరు ప్రశ్నలు కలవని స్పష్టమగుచున్నది. బళ్లారి, కర్నూలు, కోయంబత్తూరు, తిరునల్వేలిజిల్లాలకు ముఖ్యమైనపంట ప్రత్తి. దత్తమండలములలో ప్రత్తిని గొఱ్ఱుతో వరుసగా చల్లుదురు. అరవదేశములో వెదజల్లుదురు. బళ్లారికర్నూలుజిల్లాలలోకూడ వరుసలలోని దూరములో వ్యత్యాసమున్నది. హెచ్చువర్షపాతము గల కర్నూలుజిల్లావరుసలు దగ్గరగా నుండును. వర్షము తక్కువ కురియు బళ్లారిజిల్లాలో వరుసలను దూరముగా వేయుదురు. ఒకవ్యవసాయస్థానమును ఆప్రదేశమునకు ముఖ్యావసరములను, వెంటనే ఫలితమును కలుగజేయు ప్రత్యేకాంశములు మాత్రమే శ్రద్ధతో పనిచేయబడును. ప్రతివ్యవసాయస్థానములోను పంటలను పండించుపద్ధతులాయాప్రదేశములకు తగియుండును. నాటి జయాపజయములమీద అచ్చటి రయితాంగముయొక్క లాభనష్టము లాధారపడియుండునట్లు చేయబడునుగాని దారినిపోవు వ్యవసాయదారులుకానివారి రుచులకు తగినట్టుగాను,వినోదములకుగాను అవలంబింపబడియుండవు.

౧౯౦౦-వ సంవత్సరమునకుపూర్వము తిరునల్వేలి జిల్లాలో ప్రత్తి కర్తీగా అమ్మబడుచుండెడిది. న్యాయమైన రయితెవరైనను తన కరుంగణిప్రత్తిని నూలు వడుకువారికి కావలసినట్లు శుద్ధముగా ఏరి, దుమ్ము, ఎండుఆకులచెత్త లేకుండా జమచేసినను శ్రమకుతగిన ప్రతిఫలము వచ్చుచుండెడిది కాదు. శ్రద్ధతో తీయబడిన శుభ్రమైన ప్రత్తి బహుమితముగా నుండుటవల్లను, దానిని ప్రత్యేకముగా నుంచుటకు తగినంత సరకు లేకపోవుటవల్లను సరియగుధర రాక, తోడిరయితులు వారు పండించుటలోను, ప్రత్తితీయుటలోను అవలంబించు చెడుమార్గములను విడిచిపెట్టకుండ నుండుటకు కారణమైనది. అందువలన కర్తీప్రత్తికి పెట్టేధరే మంచిప్రత్తికికూడా వచ్చుచున్నది. ఇందుకు ఫలితముగా వ్యాపారము మందగించుట, తక్కువధరలు వచ్చుటవలన ప్రత్తిపంటకు నష్టము సంభవించినది. తిరునల్వేలి జిల్లాలోని ప్రత్తిపంటను అభివృద్ధిచేయుతలంపుతోను, దత్తమండలములలో నుపయోగింపబడు గొఱ్ఱు, దానికి సంబంధించిన తక్కినపనిముట్లు ద్వారా వ్యవసాయపద్ధతులలో అభివృద్ధిని చేయుతలంపుతోను ౧౯౦౧-వ సం. లో కోయల్పట్టిలో వ్యవసాయస్థాన మేర్పరచబడినది. అట్టిఉద్దేశ్యముతోనే బళ్లారిజిల్లాలో పండు ప్రత్తిరకములను పరీక్షించి వృద్ధిలోనికి తీసుకొనివచ్చుటకు నంద్యాలబళ్లారిఫారము లేర్పరచబడినవి.

ఇదేరీతిగా చెరుకు కొకవిధమైన తెగులంకురించి దానికి తగినచికిత్స తెలియక రయితులకు నివారణచేయుటకు సాధ్యముకాని సమయములో బెల్లపు వ్యాపారము త్వరలో నశించిపోవు స్థితిలోనికి వచ్చినది. ౧౯౨౫-వ సంవత్సరమునకు పూర్వము జిల్లామొత్తముమీద పదివేలయకరములకుపైగా నుండిన చెరుకుతోటల విస్తీర్ణము ౧౯౨౮-వ సం.రమునాటికి మూడు వేలయకరములకు దిగిపోయినది.అందువల్ల బెల్లపు వ్యాపారము తగ్గిపోయినందున కాకినాడ వర్తకసంఘము వారి గమనములోనికి వచ్చెను. వారీసంగతిని మద్రాసు గవర్నమెంటువారికి తెలియపరచగా వెంటనే సామర్లకోటలో చెరుకుపరిశోధనస్థానము నేర్పరచిరి. వివిధప్రదేశములనుండి కొత్తరకముల చెరుకుజాతులను తెప్పించి దేశవాళీచెరుకులతోకూడ పైరుచేసి శ్రద్ధతో పరీక్షించిరి. తృప్తికరములుగా నుండిన కొత్తరకములను జిల్లామీద పంచిపెట్టి చెరుకుపంట నుద్ధరించిరి. ఈకొత్తరకములు లాభకారులని కనిపెట్టబడి దేశవాళీరకములను పూర్తిగా అంతరింపజేయుటయే కాక విశాఖపట్టణము,

దక్షిణఆర్కాడు, మలబారు, దక్షిణకన్నడజిల్లాలలో త్వరితముగా దేశవాళీరకములను త్రోసివేయగలిగినవి. సాలుకు రెండులక్షలకుపైగా నష్టమువచ్చే కాకినాడ బెల్లపువ్యాపార మిప్పుడు పదిలక్షల లాభమును పొందుచున్నది.

ఇంతేకాక తనపంటలలో నభివృద్ధిని చేయుటకు ప్రయత్నించు రయితు ఇతరత్ర హెచ్చు పంటలను, ఎక్కువలాభము నిచ్చుటకు కారణములను, స్థానికపరిస్థితులను పూర్తిగా తెలిసికొనవలయును. తిరునల్వేలి జిల్లారయితు వ్యయప్రయాసలకోర్చి నంద్యాలగాని, బళ్లారిగాని వెళ్లి అచ్చట ప్రత్తిపండించు విధానములను తెలిసికొనుటకు తగిన స్థితిలో నుండడు. తన పట్టాభూములను పరీక్షార్థము సేద్యముచేయుటకు సమర్థుడుగా నుండజాలడు. సామాన్యవ్యవసాయదారులు చేయజాలని పనులను చేయుటకు ప్రథమమున విశేషధనవ్యయము చేయవలెను. చేసినను కొన్నిసంగతులు లాభకారులుగా నుండకపోవుటయేకాక తుదకు నాశనమునకుకూడ హేతుభూతము లగును. అటుపైన లాభకారిగా కనుపించిన పద్ధతులను బహిరంగపరుచక రహస్యముగా నుంచుటచే ప్రక్కనుండురయితులకైనను ఎంతమాత్రము లాభకారులు గానేరవు. అందరికి నుపయోగముగా నుండునట్లు గ్రామములోని కొంతమంది రయితులు కలిసి సమష్టి మీద కొంత పెట్టుబడి పెట్టి పనిచేసినయెడల అది వేరేసంగతి. నష్టమువచ్చినను అందరిమీద సర్దుకొనిన ఒకరికి ఎక్కువభారముగా నుండనేరదు. లాభకరమైన సంగతు లందరికి వ్యక్తమై బాగుగ నుపయోగము లోనికి వచ్చును. ఇతరదేశములలో కార్యము లీరీతిని జరుగుచున్నవి. జావాద్వీపములో చెరుకు పండించువారు, స్వయముగా పరీక్షాస్థానమును నడపుచున్నారు. ఇంగ్లాండులో గవర్నమెంటుతో సంబంధములేకుండా రాజ్యాంగవ్యవసాయసంఘమువారు జీబరక్ వద్ద నొక వ్యవసాయస్థానమును పరిపాలించుచున్నారు. ఈ దేశములో శాస్త్రీయమైన నూతనవ్యవసాయాభివృద్ధిమార్గములను గమనించువా రెవరు తగినంతమంది లేని హేతువుచే అట్టి సంఘములు చేయుపనిని గవర్నమెంటువారే అవలంబింపవలసివచ్చినది.

వ్యవసాయస్థానమున కింకొక ముఖ్యమైనసంగతి గలదు. పరీక్షచేయబడు అంశముల ననుసరించి ఆ పరీక్షాఫలితములను కొంతకాలము కనిపెట్టి చూడవలసియుంటున్నది. మంచి ఆబోతుయొక్క ప్రాశస్త్యము ఒకసంవత్సరములోనే కనిపెట్టవచ్చును. లోతుదుక్కియొక్క ఉపయోగము ఒకమంచివర్షము కురియగానే తెలియును. క్రొత్త కసువుయొక్కగాని, గడ్డిరకముయొక్కగాని ఆధిక్యము పసువు లత్యాతురతతో తినగానే తేలును. క్రొత్తరకముల పంటఫలితము కోసినూర్చగానే కనిపించును. పచ్చిఆకుయెరువుయొక్క ఉపయోగము రెండుమూడుసంవత్సరములకుగాని, దానిని వేయుటవల్ల కలిగే క్రమమైన జాస్తి పంటవలన గాని తేలదు.

రయితు లాభము పొందవలె నన్న ఈ స్థితిగతుల లోని భేదములను వానికి చక్కగా బోధచేయవలెను. ఇట్టిపరిజ్ఞానమున క్రమమైన శిక్షణను పొందిన వ్యవసాయప్రచారకుడు సదా రయితును కలుసుకొనుచు, నూతనపద్ధతులను బోధచేయుచు, మంచివ్యవసాయపు పనిముట్లను చూపించి వాటి ఉపయోగములను ప్రత్యక్షముగా పనిచేసి కనుపరచియు, క్రొత్తరకముల విత్తనములను, ఎరువులను ఇచ్చియు వాటిని వేసిచూడవలసినదని ప్రోత్సాహము చేయుచు వానిసమ్మతముముందుకే యీ పరిజ్ఞానము నందజేయుచున్నాడు.

వ్యవసాయస్థానమున్న గ్రామములోని రయితులు అచ్చట పెంచబడు పంటల మంచిచెడ్డలను కొంతకాలము కనిపెట్టుటకు సాధ్య మగును. దానికి దూరములో నుండు రయితులకు ఆసక్తి లేకపోవుటవలనను, అసమ్మతివలనను, అజ్ఞానమువలనను తరుచుగా విముఖతకు కారణ మగుచున్నది. వ్యవసాయప్రచారకుడు సర్వదా వ్యవసాయస్థానముతో సంబంధ ముంచుకొనుచున్నాడు. అతడు వ్యవసాయస్థానములో పనిచేసినవాడుగా నుండి తరుచు దానిని చూచుచు, అచ్చట పనిచేయువారితో

ప్రసంగించుచు రహితులకు పంచిపెట్టుటకుగాను ఫారం విత్తనములను తీసుకొని వెళ్లుచు, ఆఫారంలో నుండి యినుపనాగళ్లను, వాటితో పనిచేయగలిగిన కూలీలను రయితులచేలో దున్ని చూపించుటకు తీసుకొనివెళ్లుచు, అట్టి ఉపయోగముల ఫలితములను, ఆపనియు ఏవిధముగా పని చేసినదియు ఫారంవారికి తెలియజేయుచుండును. ఈ రీతిగా నిరంతరము ఫారములనుండి దూరములో నున్న గ్రామములకును, గ్రామములనుండి ఫారములకును వ్యవసాయప్రచారకునిద్వారా పరిజ్ఞానప్రవాహము నడుచుచుండును.


క్రమమైనశిక్షణలేనిది మంచిఫలితముల నిచ్చు పంటలు పండుటకుగాని, చెడిపోవుటకుగాని కారణములను కనిపెట్టుటకు ఫారము లేనిదే వ్యవసాయప్రచారకుడు ప్రామాణికముగా నొక క్షేత్రపంటను గాని, వ్యవసాయపద్ధతినిగాని నిర్మాణముచేసి రయితులకు నమ్మకము కలుగజేయుటకు వ్యవసాయప్రచారకునికి సాధ్యముకాదు. కేంద్రస్థానములో పనిచేయు శాస్త్రపరిశోధకునికికూడ ఫారము లగత్యములు. వారు పరీక్షాలయములలో కనిపెట్టిన ముఖ్యాంశములను వ్యవసాయదారులందరికి తెలియుటకును వాటిని వేరువేరుపరిస్థితులుగల ప్రదేశములలో పరీక్షించి చూచినతరువాతనే రయితుల కుపయోగకారు లని నిర్ధారణగా చెప్పవీలగును.

వ్యవసాయస్థానముల ఆవశ్యకత పూర్తిగా గ్రహించుటకును, వాటిఉపయోగములు వృద్ధిఅగుటకును, అవి అందరకు లాభకారులుగా నుండుటకును, వాటిలో నిర్ధారణ చేయబడిన అంశములు సర్వత్ర త్వరితముగావ్యాపించుటకును మూలస్థానము చెడిపోకుండునట్లు చూచి దానినుండి విజ్ఞానమును రయితుసమూహమునకు అనేకమార్గములద్వారా ప్రవహించినప్పుడే వ్యవసాయప్రచారకుని సామర్థ్యము తెలియును. అదును కానిరోజులలోమాత్రమే వ్యవసాయప్రచారకుడు అన్ని గ్రామములను చూచుటకు వీలగును. అదునుసమయమందు విత్తనములను చల్లించుటకు, ఎరువులను వేయించుటకు, కోతలుకోసి నూర్పించుటకును ఒకేకాలమునందతడు అన్నిచోట్ల నుండుట సాధ్యపడదు. చదువుకొనిన భూస్వాములు వారి నవుఖర్లను, కవులుదార్లను వ్యవసాయశాఖవారు చేయుబోధనలను అవలంబించుటలోను, వ్యవసాయమునకు నష్టము కలుగజేయు అంశములను వ్యవసాయప్రచారకులకు సరిగా తెలియజేయుటలోను వ్యవసాయప్రచారకులతో సహకారము జరుపునెడల, అభివృద్ధియొక్క వత్వగలో జరిగి తక్కువకాలములోనే వాటి ఉపయోగములు వ్యాపించుటకు సాధ్యమగును. గవర్నమెంటువా రవలంబించుచున్న వ్యవసాయపద్ధతులపై ప్రజాభిప్రాయములను తెలుసుకొనుటకు వ్యవసాయ కళాశాలలకును, కొన్ని వ్యవసాయస్థానములకును గౌరవ ప్రేక్షకుల నేర్పాటు చేసియున్నారు. దీనిఫలిత మింకను తేలవలసియున్నది. గవర్నమెంటును, వ్యవసాయశాఖవారును ప్రజలు చేయు క్రమమైన ఆక్షేపణలను కోరుచుందురు. కాని, అట్టిఆక్షేపణలు వ్యవసాయాభివృద్ధికిని, రహితులాభమునకును, తద్ద్వారా దేశసౌభాగ్యమునకును చెందియుండవలెను.

గవర్నమెంటువారిచే నడుపబడు వ్యవసాయస్థానముల నేర్పరచుటలో నుద్దేశ్యములపై ప్రజలకుండు దురభిప్రాయము లీవ్యాసముమూలమున తొలగగలవని ఆశయము. దీనిలో పరిశోధనాలయము లొకమూలను, రహితు లొకమూలను వ్యవసాయస్థానములద్వారా వ్యవసాయ ప్రచారకులచే పరస్పరసంబంధము కనుపరుచబడినది.



౧. గంగాఘట్టములు-కాశీ (విమానమునుండి)



౨. గంగాఘట్టములు-కాశీ (విమానమునుండి)

—సి. జి. జగన్నాథదాసు.

భారతీయవిద్యాచరిత్రము

(అనువృత్తము) మారేమండ రామారావు, బి. ఏ. (ఆనర్సు) బి. ఇడి.

ఏడవ అధ్యాయము

[ఆధారములు:

Eliott—History of India.

Law—Promotion of Learning in Mahomadan times.

Kennedy—History of the Great Moguls.

Aiyeen—i—Akbari.]

మొగలుయుగము

(౧౫౨౬ - ౧౭౦౭)

క్రీ. శ. ౧౫౨౫-వ సంవత్సరమున దౌలత్ ఖాన్ అను సామంతుడు ఢిల్లీసుల్తానగు ఇబ్రాహీంలోడీయధికారమును ధిక్కరించి కాబూల్ దేశపుపాలకుడగు బేబర్ సహాయము నభ్యర్థించెను. కాని కాబూలీదేశమునకు వచ్చినవెంటనే దౌలత్ ఖాను వారిపై నెదురు తిరిగెను. గత్యంతరములేక నాసమయమున స్వదేశమునకు మరలినను బేబరు తిరిగి ౧౫౨౬లో హిందూదేశముపై దండెత్తివచ్చెను. అప్పుడితనికిని సుల్తాన్ ఇబ్రహీంనకును పానిపట్ వద్ద నొకయుద్ధము జరిగి యందు బేబరు విజయము నందెను. అనతికాలముననే ఢిల్లీ, ఆగ్రానగరము లాతనికి స్వాధీనము లైనవి. ౧౫౩౦ నాటికి బేబరున కుత్తరహిందూస్థాన మంతయు స్వాధీన మయ్యెను. ఇంతటితో భారతదేశమున మొగలు సామ్రాజ్యోదయ మయ్యెను. ఈ సామ్రాజ్యము రెండు శతాబ్దములకాలము వర్ధిల్లినది. ఈ కాలమున భారతదేశమునందు చాల మార్పులు గల్గినవి. ఇప్పటికే మహమ్మదీయపరిపాలనము ననుభవించి యందలి బాగోగులను జవిచూచిన హిందువులు దమయాచారవ్యవహారముల యందవసరములగు మార్పులను గల్పించుకొని తమ జాతీయజీవితమును బునరుద్ధరించుకొన బ్రయత్నించుచుండిరి. మొగలుచక్రవర్తు లందరును చక్కని విద్వాంసులును, రసజ్ఞులును నై యుండుటచే హైందవవిజ్ఞానము కొంచెము తలయెత్తికొనుట కవకాశ మొదవెను. అప్పటి మహమ్మదీయు లనేకులు సంస్కృతమును, హిందువులు పర్షియనుభాషను నేర్చికొని యాయాసారస్వతములందలి విశేషములను గ్రహింప బ్రయత్నించుచుండిరి. అక్బరుకాలమున హిందూమతమునకుగూడ మంచిదినములు వచ్చినవి. దానజేసి దేశమునందలి యన్నివిజ్ఞానములకును నూతనోత్తేజము గల్గినది. పారశీకసంస్కృతభాషాసమ్మిశ్రణమువలన నుర్దూభాష వెలువడి నూతనగ్రంథరచనమునకు గారణమయ్యెను. విద్వాంసులును, గవులునేకాక శిల్పి, గాయక, చిత్రకార, లేఖకాదివివిధకళాభిజ్ఞులుగూడ రాజాదరణమును బడసి యనేకవిధముల దమనైపుణ్యమును వ్యక్తీకరించిరి.

మొగలుల కాలమునగూడ మక్తాబులును, మద్రసాలును ముఖ్యములగు విద్యాసంస్థలుగ నుండినవి. ఔరంగజేబుపాదుషా తప్ప ఇతరు లందరును నిష్పక్షపాతబుద్ధితో విద్యాదాదరణము నొనర్చుటచే నీకాలము భారతవిద్యాచరిత్రమున కమూల్యమగు భూషణము. మునుపటివలెనే యొక్కొకపాదుషాకాలపు విద్యాచరిత్రము నీక్రింద సంక్షేపముగ జేర్కొనబడుచున్నది:

బేబరు, ౧౫౨౫ - ౧౫౩౦:—ఈతడు ప్రశంసనీయమగు విమర్శనాశక్తిని, పర్షియన్, అరేబియన్, తుర్కీభాషలలో నద్వితీయమగు పాండిత్యమును గలిగి యుండెను. తుర్కీభాషలో నీతడు పెక్కుకావ్యములను, ఛందశ్శాస్త్రము నొకదానిని రచించెను.

సంగీతమునను, ధర్మశాస్త్రమునను గూడ నీతనిచే రచింపబడిన గ్రంథములు గలవు తన జీవితమునందలి వివిధ విషయముల నుల్లేఖించుచు నీతడు వ్రాసిన స్వీయచరిత్రము చరిత్రమునకును, వాఙ్మయమునకును మిగుల ముఖ్యమైనది. నిరాడంబరమును, స్వాభావికమును నగు శైలి యీతని గద్యపద్యములకు గల ముఖ్యలక్షణము. నూతనమగు నొకఛందస్సును, మరియొక యపూర్వ లిపియు నీతనిచే గనిపెట్టబడినవి. చిత్రలేఖనమునగూడ బేబరున కభిరుచి మెండుగ నుండెడిది. ఈ పాదుషా విద్వాంసుల సమావేశములందును, గ్రంథాలయములందును విశేషకాలమును గడపుచుండెను

హుమయూన్, ౧౫౩౦-౧౫౫౬ :— ఈతడు చక్కని విద్వాంసుడు. జ్యోతిష, భూగోళశాస్త్రముల యందభిరుచి గల యీచక్రవర్తి స్వోపయోగార్థము భూగోళఖగోళములకు ప్రతికృతులను (Globes) నిర్మించుకొనెను. జాతకభాగమునం దీతనికి ప్రబలమగు విశ్వాస ముండెడిది. పంచభూతములయొక్క తత్త్వమును విమర్శించుచు నిత డొక గ్రంథమును రచించెను. తన దర్శనమొనర్చి తన యాదరమును బడయనెంచువారలనెల్లర నీతడు కొన్ని తరగతులుగ విభజించి యందు విద్వాంసులకు మతప్రచారకులతోడను, ధర్మశాస్త్రజ్ఞులతోడను సమముగ నగ్రస్థానము నొసంగెను. ఖగోళమునందలి గ్రహములపేరిట దివ్యభవనములను నిర్మించి యీ చక్రవర్తి శనిగురువుల భవనములలో విద్వత్సమ్మానము నొనర్చుచుండెను. యుద్ధరంగముల కేగునపుడును, దుడుకు ప్రాణములకై పరుగెత్తునపుడునుగూడ నీతడు గ్రంథములనుమాత్రము విడువకుండెనట. దీనినుండి యీతనికి గల విద్యాపిపాస, వ్యక్తమగుచున్నది. ఈచక్రవర్తి నిర్మించిన విద్యానిలయములలో ఢిల్లీనగరమునందలి కళాశాలయు, ఆగ్రానగరమున కెదురుగ యమునాతీరమునందలి మరియొక విద్యాలయమును ముఖ్యములు.

అక్బరు, ౧౫౫౬-౧౬౦౫:—సదసద్వివేకియు, దయాస్వాంతుడును, సరసుడునునగు నీచక్రవర్తి పరిపాలన కాలము చంద్రగుప్త, అశోక, కనిష్క, శ్రీహర్షాది హైందవరాజన్యుల పరిపాలన కాలమున కెనయై భారత దేశచరిత్రమునకు నెలలేనిరత్నమై యొప్పుచున్నది. విద్యాపోషణమునం దీతడు మహమ్మదీయపాలకులలో నెల్ల నగ్రగణ్యుడు. సర్వతోముఖమగు నీతని పాండితీసమాదరణము నిష్పక్షపాతముగను, గుణప్రధానముగను ఒప్పినది. అన్ని మతములను, వాఙ్మయములను నీతడు శ్రద్ధతో బరిశీలించి సమ్మానించుచుండెను. ప్రతిదినమును నిదురించుటకుపూర్వ మీత డుద్గ్రంథములను వినుచుండెను. ఈచక్రవర్తి తాను నూతనముగ నిర్మించిన ఫతేపూర్ సిక్రీ యను రాజధానీనగరమున "ఇబాదత్ ఖానా" యను నొకభవనమును గట్టించెను. ఈత డందలి పశ్చిమభాగమున సయ్యదులను మతగురువులను, దక్షిణమున ఉలేమాలను విద్వాంసులను సమ్మానించుచుండెను. ఆదిశుక్రవారములందును, పుణ్యదినములలో రాత్రులందును చక్రవర్తి, మహమ్మదీయమతప్రచారకులను, ధర్మశాస్త్రవేత్తలను, బ్రాహ్మణులను, జైనులను, బౌద్ధులను, చార్వాకులను, పారసీకులను, క్రైస్తవులను సమావేశపరచి వారివారి మతములనుగూర్చి విశేషాంశములను దెలిసికొనుచుండెను. ఇచ్చట నట్టిసమయములలో జరగుచుండిన వివాదములలో జక్రవర్తి తానును బాల్గొనుచుండెను. ఈ పాండితీప్రదర్శనమునం దగ్రగణ్యులుగ నిర్ణయింపబడినవారల కీతడు "అష్రఫీ"లను బంగారునాణెములను దోసెళ్లతో నిచ్చి బహూకరించుచుండెను.

అక్బరు ప్రేరేపణచే సంస్కృతమునుండియు, నితర భాషలనుండియు ననేకగ్రంథములు పర్షియను హిందీ భాషలలోనికి బరివర్తింపబడుచుండెడివి. ౧౫౮౨-వ సంవత్సరమున మహాభారతము 'రాజంనామా' యను పేరిట పర్షియనులోనికి తర్జుమాచేయబడెను. ఆగ్రంథమునకు చక్రవర్తి అబుల్ ఫజుల్ అను సుప్రసిద్ధ చరిత్రకారునిచే టీకను వ్రాయించి దానిప్రతులను దనసామంతులందరును గొనునటు లాజ్ఞాపించెను. అబ్దుల్ ఖ్వాదిర్ అను నతడు రామాయణమును, ఇబ్రహీం సర్ హిందీ యనునత డథర్వవేదమును, ఫైజీయనునాతడు లీలావతియను జ్యోతిషగ్రంథమును, సాహబాదీయను

నతడు రాజతరంగిణిని భాషాంతరీకరించిరి. అటులనే హరివంశపంచతంత్రములును, నలదమయంతియను కావ్యమును పర్షియనులో వ్రాయబడినవి. 'సింహాసనబత్తీసి' యను బౌద్ధగ్రంథమును, కిషన్ జోషి, గంగాధర, మహేశ్ మహానంద యనుసంస్కృతగ్రంథములును, బైబిలుగ్రంథమును, బేబరు చక్రవర్తియొక్క చరిత్రమును, తారీఖ్ ఇ ఆఫీఫ్ అను మరియొకచరిత్రమునుగూడ బరివర్తనము నందినవి.

తాను స్వయముగ సేకరించియు, నితరులనుండి సంపాదించియు నక్బరుచక్రవర్తి యనేకపుస్తకములను గూర్చి యొక చక్కనిభాండాగారమును నిర్మించెను. ఈతనికి జిత్రలేఖనమన నెక్కుడు ప్రీతి. ఈతని చిత్రశాలలో ననేకులు పనిచేయుచుండిరి. వీరిలో బెక్కుమంది హిందువు లుండిరి. వీరిచే రాజబంధువుల యొక్కయు, ప్రధానోద్యోగులయొక్కయు చిత్రము లనేకములు తయారుచేయబడినవి. సుప్రసిద్ధగాయకు లనేకులు చక్రవర్తియాదరమును బడసిరి రామదాసు, హరిదాసు ననుహిందువులు వారిలో ముఖ్యులు.

'అయినీ అక్బారీ'యనుచరిత్రమునుండి యక్బరుకాలమునందలి విద్యావిధానమునుగూర్చి కొన్నివిశేషాంశములు దెలియుచున్నవి. మతభేదములను పాటింపక చక్రవర్తి యెల్లవిద్యల నాదరించుచుండెను. పాఠశాలలో హిందూమహమ్మదీయబాలురు కలసియే చదువుచుండిరి. ఒక్కొక్కరికిని తగినవిద్యాప్రణాళిక లేర్పరుపబడియుండినవి. విద్యార్థికి మనోవికాసమును గల్గించుటయేకాక ఆతనికి భావిజీవితసమస్యల నెదుర్కొనుశక్తినిగూడ గల్పించుట విద్యావిధానముయొక్క పరమావధియని యీచక్రవర్తి నిశ్చయించెను. ఇంతకు బూర్వము బాలురు సుమారు నాల్గుసంవత్సరములకాలమును అచ్చులను, హల్లులను నేర్చుటయందు వ్యర్థపరచుచుండిరి. దీనిని మార్పుచేసి యక్బరు వార లాకాలమున జదువుట, వ్రాయుట, గద్యపద్యములను మనోగతముల జేసికొనుట, నీతి, మతము మున్నగువిశేషాంశములను గ్రహింపగల్గునటు లేర్పరచెను. విద్యనభ్యసించుటలో విద్యార్థియే మిగుల గష్టపడవలెననియు, నుపాధ్యాయుడు సేవలమును మార్గదర్శిగనే యుండవలెననియు నక్బరుచక్రవర్తి తలంచెను. పైవిధమున ప్రారంభవిద్య ముగిసిన పిమ్మట బాలురకు గణితము, రేఖాగణితము, వ్యవసాయము, జ్యోతిషము, రాజ్యాంగము, వైద్యము, తర్కము, చరిత్రము మున్నగునవి నేర్పబడుచుండెడివి. హిందూబాలురు వేదాంతమును, పాతంజలిమహాభాష్యాంతము వ్యాకరణమును జదువుచుండిరి. అటుపై నున్నతవిద్యాభ్యాసమునుగోరువారలు ఫతేపూర్ సిక్రీ, ఢిల్లీ, ఆగ్రా మున్నగు విద్యాకేంద్రస్థానముల కేగుచుండిరి.

తాత్కాలికవిద్యావిధానము నిటుల సంస్కరించుటయేకాక చక్రవర్తి యనేకస్థలముల విద్యానిలయములను నెలకొల్పెను. ఆతని దాదియగు మహన్ అన్గ యనునామె ఢిల్లీలో నొక కళాశాలను నెలకొల్పెను. మంత్రియగు బైరంఖాను, నాతని తనయుడగు అబ్దుల్ రహీమను మహావిద్వాంసులుగ నుండి చక్కనిగ్రంథాలయమును నిర్మించిరి.

రాజకీయమునందువలెనే విద్యానిర్వహణమునగూడ అక్బరుచక్రవర్తిపరిపాలనము సర్వజనసమ్మతమై యపూర్వశోభావంతమై యుండినది. నాలుగైదు శతాబ్దములనుండి యణగద్రొక్కబడి నామావశేషముగ నుండిన హిందూవైదుష్యము ఈచక్రవర్తిపరిపాలనమున దిరిగి దలయెత్తసాగినది. హిందువులును, మహమ్మదీయులును పరస్పరద్వేషములను వీడి రాజధర్మము ననుగమించి సౌహార్దముతో మెలగుటజేసి వారలనాగరికతలు నూతనోత్తేజనము నందినవి.

జహాంగీరు, ౧౬౦౫-౧౬౨౭:—ఈచక్రవర్తి రాజకీయములందువలెనే విద్యావిషయమునగూడ తన తండ్రియగు అక్బరుచక్రవర్తిమార్గము ననుగమించెను. ఈతని శీలము విషమముగ నుండెననియు, నీత డొకప్పుడతిక్రౌర్యమును, మరియొకసమయమునం దతిదయను జూపుచుండెననియు చరిత్రము దెల్పుచున్నది. అదృష్టవశమున విద్యావిషయము లీతని యత్యంతాదరమును బడసి

నవి. సహజముగ నీతనికి పర్షియను, తుర్కీ భాషలలో జక్కనివైదుష్య ముండెను. ఈతనిస్వీయచరిత్రమునుండి యీతని విద్యాభినిరతియు, లలితకళలయందలి యభిరుచియు దెలియుచున్నవి. దాయాదులు లేక మరణించిన ధనికులయొక్కయు, యాత్రికులయొక్కయు సర్వస్వమును బ్రభుత్వమునకే జెందవలెననియు, నయ్యది విద్యాలయోద్ధరణార్థ ముపయోగింపబడవలెననియు నీ చక్రవర్తి శాసించెను. "ఫర్హన్గి జహంగీరి" యను నొకనిఘంటువు నీతడు తయారుచేయించెను. లలితకళలయెడ నీచక్రవర్తికిగల యభిమానము వర్ణనాతీతము. ఈతడు తనయాస్థానపు బ్రతికృతిని సుప్రసిద్ధులగు చిత్రకారులచే వ్రాయించి దానిని తనస్వీయచరిత్రమునకు ముఖపత్రముగ వేయించెను. ఈతని పోషణమునం దుండిన దేశీయచిత్రకారులు పాశ్చాత్య చిత్రములకుసహితము మాతృకలను మరపింపజేయునంతటి చక్కని ప్రతికృతులను తయారుచేయ సమర్థులై యుండిరి. అబుల్ హస్సన్, మన్సూర్ అనువారలప్పటి చిత్రకారులలో సుప్రసిద్ధులుగ నుండిరి. ఈ చక్రవర్తికాలమున నిర్మింపబడిన దివ్యభవనములందలి శిల్పము చక్రవర్తియుద్దేశ్యము ననుసరించియే నిర్మింపబడినది. ఆగ్రానగరమునందలి ఇతిమాదుద్దౌలా సమాధియు, సికందరనగరములోని అక్బరుసమాధియు, లాహోరునగరమునందలి యీచక్రవర్తిసమాధియు నీతని కళాభిజ్ఞతకు బ్రబలనిదర్శనములు.

షాజహాన్, ౧౬౨౮ - ౧౬౫౮ :— షాజహాన్ చక్రవర్తిస్వభావమునుగూర్చి చరిత్రకారులలో నభిప్రాయభేదములు గలవు. విన్సెంటుస్మిత్తుపండితుడీచక్రవర్తి మక్కోపియనియు, నతిక్రోధమును అతిదయను జూపుచుండెననియు, విషయలోలుడుగ నుండెననియు వ్రాసియున్నాడు. ఎల్ఫిన్స్టన్ మున్నగు నితరులు షాజహాను దయాళు డనియును, మహనీయు డనియును వ్రాసియున్నారు. ఏది యెట్లున్నను విద్యావిషయమునం దీచక్రవర్తి యొనర్చిన విశేష కార్యము లేమియు లేవు. బాద్షానామా, ముంతఖాబుల్ లుబాబ్ అను రెండు చరిత్రములుమాత్ర మీతని ప్రోత్సాహముచే లిఖింపబడినవి. ఢిల్లీనగరమున జుమ్మా మసీదు నొద్ద నొకకళాశాలగూడ నీతనిచే నిర్మింపబడెను. ఈచక్రవర్తికి గానమునెడను, శిల్పమునెడను బ్రీతి యెక్కువ ఈత డాదరించినగాయకులలో రామదాస్, మహాపత్తార్ అను హిందువులు ముఖ్యులు.

షాజహాన్ కాలమునం దాతనితనయుడగు దారా మిగులబ్రసిద్ధిచెందిన పండితుడుగ నుండెను. పర్షియన్, అరబిక్, సంస్కృతభాషలలో నీతనిపాండిత్య మద్వితీయమైయుండెను. సంస్కృతవాఙ్మయము, హిందూవిజ్ఞానము నీతడు విశేషముగ బ్రేమించుచుండెను. ఈయువరాజు మణిఖచితములగు దనయంగుళీయకములపై 'ప్రభు' యనుపదమును చెక్కించుకొనెనట. కాశీనగరమునుండి సుప్రసిద్ధులగు పండితులను రావించి వారి సాహాయ్యముచే నీతడు ఉపనిషత్తులను, భగవద్గీతను, యోగవాసిష్ఠమును పర్షియనుభాషలోనికి బరివర్తించెను. హిందూమతమును, సూఫీమతమును సరిపోల్చుచు నీతడు రచించిన విమర్శనము మిగుల ప్రశంసనీయము.

ఔరంగజేబు, ౧౬౫౮-౧౭౦౭ :— షాజహాను కాలమునకు మొగలుసామ్రాజ్యము సర్వవిషయములను బరమావధిని గాంచినది. ఆతనితనయుడగు ఔరంగజేబు మహాపరాక్రమశాలియు, రాజనీతిజ్ఞుడును నైయుండినను మతావేశపిశాచమునకు లోనయ్యెను. దేశమునం దధికసంఖ్యాకులుగ నున్నహిందువుల యాదరసౌఖ్యములపైననే మొగలుసామ్రాజ్యసౌధము నిర్మింపబడవలెనను నక్బరుచక్రవర్తియాదర్శమును, హిందువులయెడ నాతడు చూపిన మతసహిష్ణుతయు, వారివిజ్ఞానమున కాత డొసంగిన ప్రోత్సాహమును ఔరంగజేబుచే తారుమారుచేయబడినవి. తనసామ్రాజ్యమునం దెల్లరును సున్నీమతానుయాయులుగ నుండవలెననియు, రాజ్యాంగమంతయు ఖొరానునందలి విధుల ననుసరించియే నిర్వహింపబడవలెననియు నీతడు కృతనిశ్చయు డయ్యెను. ఈ యాదర్శముల నీత డాచరణలోనికి దెచ్చుట హిందువులకకాలప్రళయ మొదవినటు లయ్యెను. ఈచక్రవర్తి యాగ్రహము హిందూదేవాలయములపైనను, హిందూవిజ్ఞానముపైనను బ్రసరించెను. దానజేసి ౧౬౬౯ లో

నీతనియాజ్ఞచే హిందూవిద్యానిధానములగు దేవాలయము లెన్నియో నాశమొనర్పబడినవి. అందు కాశీ క్షేత్రమునందలి విశ్వనాథాలయమును, మథురాక్షేత్రమున రాజాబీర్‌సింహుచే ముప్పదిమూడులక్షలు వ్యయపరచి కట్టింపబడి, సుందరశిల్పములలో నద్వితీయమని పేరెన్నికగాంచిన కేశవదేవాలయమును ముఖ్యములు. రాష్ట్రీయపాలకులందరకును హిందువుల యాలయములను, విద్యాలయములను ధ్వంసముచేయునటు లాజ్ఞయొసంగబడెను. ఢిల్లీసుల్తానులకాలమున వారిక్రౌర్యమున కోర్వజాలక మారుమూలల దాగి యజ్ఞాతవాసమొనర్చుచుండి యక్బరు జహంగీరు చక్రవర్తుల సహిష్ణుతాబుద్ధిచే బునరుజ్జీవమునంది దన యసమానశోభావైభవములచే వారిమన్ననను, ప్రోత్సాహమును బడసి నూతనవికాసము నందుచుండిన హిందూవిజ్ఞానవల్లిక యౌరంగజేబు పైశాచికమతావేశముచే సమూలముగ ఛేదింపబడెను. ఈసందర్భమున నెందరో పండితులును, ఎన్నియో గ్రంథములును నశించియుండినవి. కాన హిందూవిద్యాచరిత్రమున నౌరంగజేబురాజ్యకాలము మహాదౌర్భాగ్యము నొనగూర్చిన యంధకారయుగము. అతని యీ దుష్ప్రవృత్తిచే మొగలుసామ్రాజ్యనాశమునకు ప్రథమసోపాన మేర్పడుటయేకాక హిందూవాఙ్మయమునకును, నాధునిక భారతీయసారస్వతగౌరవమునకును తీరనిలోటు సంభవించినది.

చక్రవర్తిమతావేశము హిందూవిద్య కెంతకీడును గల్గించెనో మహమ్మదీయవిద్య కంత యభ్యుదయమును చేకూర్చెను. అనేకస్థలముల నితడు పాఠశాలలను, కళాశాలలను నిర్మించి సుప్రసిద్ధపండితుల నందుపాధ్యాయులుగ నియమించి వారికిని విద్యార్థులకును గూడ వేతనములను, భరణములను ఏర్పరచెను. ఫిరోజ్‌షా తుగ్లక్‌వలె నీతడును బానిసలయుద్ధరణమునకై పాటుపడెను. గుజరాత్‌దేశమునందలి బోహ్రాలను బానిసల కీతడు విద్య నేర్పించెను. ఈతనికాలమున పాదుషాల గ్రంథాలయమున కెన్నియోగ్రంథములు చేర్పబడినవి.

అక్బరుచక్రవర్తివలె నీతడుగూడ దాత్కాలికవిద్యావిధానమున దనేకములగు మార్పులను జేయించెను. విద్యావిషయమున దీతనికిగల యభిప్రాయములు గొన్ని మిక్కిలి కొనియాడదగియున్నవి. మేధాశక్తిని మాత్రము పెంపొందించు వ్యాకరణతత్త్వశాస్త్రములకు సామాన్యవిద్యాప్రణాళికయం దంతప్రాముఖ్య ముండరాదనియు, ప్రపంచజ్ఞానము నభివృద్ధిపరచుచరిత్రము, భూగోళము, భాషలు మున్నగువానిలో బ్రత్యేకబోధన మవసరమనియు నీతడు దలంచెను. జీవితరంగమునందలి వివిధసమస్యల నెదుర్కొని వానిని జయప్రదముగ దాటుట కవసరమగుపాటవము నిచ్చుచు, భావిజీవితమున ప్రతివారును దాము గైకొను వృత్తులతో సన్నిహితమగు సంబంధమును గల్గియుండువిద్యయే పాఠశాలలో బోధింపబడవలసిన విద్యయని యాతడు ప్రతిపాదించెను.

ఔరంగజేబు ప్రబలమగు మతావేశమును, వైరాగ్యమును గల్గియుండెను. నిరాడంబరమగు జీవితమును, నిరంతరాధ్యాత్మికచింతనమును జీవితపరమావధు లను ఖురానువాక్యముల నీత డాచరణలోనికి దెచ్చెను. దాన జేసి యాతడు మొగలులయాస్థానమున స్థిరముగ నాటియున్న యాడంబర, శృంగార, రాజసచిహ్నములగు లలితకళలను, శిల్పమును, గానమును, అలంకారములను దూరముగ దరిమివైచెను. ఇంతవరకును రోజున కొకమాదిరి నూతనకావ్యాభరణములతో మెరయుచు, ఘడియకొకనూతనగీతిక నాలాపించుచు, దినదినము నొక్కొక్క నూతనశిల్పనాట్యము నొనర్చుచు హిందూవాఙ్మయమోహ యనుంగుచేడియవలె వెంటరా, విశ్వమోహనగతులను విహరించుచుండిన మొగలుసామ్రాజ్యరమణి హఠాత్తుగ సర్వనాశమునంది పాలకునివలెనే పరివ్రాజికావస్థ నంది నిస్తేజయయ్యెను.

కడపటి మొగలులు, ౧౭౦౭ - ౧౮౫౭:— మొగలుసామ్రాజ్యము వాస్తవముగ నౌరంగజేబుతోడనే యస్తమించెను. ఆతనియనంతర మాతనిపుత్రులు సింహాసనమునకై తగవులాడి యొకరికంఠముల నింకొక రుత్తరించుకొనుచుండ సామంతులును, శత్రువులును వివిధ

రాష్ట్రములను వశపరచుకొనిరి. నామమాత్రావశేషులగు నా కడపటి మొగలు లెటులో మరియరువది సంవత్సరములకాలము తమ జీవితములను సాగించిరి. ఔరంగజేబునకు పిమ్మట రాజ్యమునకు వచ్చిన యాతని పెద్ద కుమారు డగు బహదూర్‌షా కాలమున ఢిల్లీ మున్నగు నగరములలో విద్యాలయము లెన్నియో యుండెడివి. పిమ్మట మహమ్మద్‌షా కాలమున జయపుర రాజపుత్ర సంస్థాననిర్మాత యగు రాజా జయసింగ్ జయపూర్, ఉజ్జయిని, మాల్వా, మథుర, కాశీ, ఢిల్లీ మున్నగు స్థలముల జ్యోతిర్దర్శనశాలలను (observatories) గట్టించెను. ఈకాలమున పర్షియా దేశపాలకు డగు నాదిర్షా భారతదేశముపై దండెత్తివచ్చి మొగలుల స్వాతంత్ర్యమును, విశేషధనరాసులను గొనిపోయెను. ఇటు లీ దేశమును బాసిపోయిన యమూల్యవస్తువులలో మొగలు చక్రవర్తుల గ్రంథాలయము మిగుల ముఖ్యమైనది.

స్త్రీవిద్య :— ఈ మొగలుచక్రవర్తుల పరిపాలన కాలమునందలి విద్యాచరిత్రమును ముగించుటకు పూర్వమా కాలమునందలి స్త్రీలవైదుష్యమును సంక్షేపముగ బరిశీలింపవలసియున్నది. పర్దానియమమునకు లోనై మహమ్మదీయవనితలును, మానభంగశంకచే హిందూస్త్రీలును నిరంతరము నంతఃపురములనే తమ జీవితములను గడపుచుండిరి. బాల్యమునమాత్రము వారలు పాఠశాలలలో చదువుచుండిరి. యౌవనప్రాదుర్భావమే వారి వైదుష్యమునకు భరతవాక్యముగ నొప్పుచుండెడిది. మహమ్మదీయపాలనమును విశేషముగ నెరుంగక ప్రాచీన హిందూమతాచారవ్యవహారముల కాలవాలమైయుండిన రసపుత్రస్థానమునందును, సుచిరకాలము స్వాతంత్ర్యము ననుభవించి హిందూమతోద్ధరణదీక్షితులగు రాజన్యులచే బాలింపబడిన దక్షిణాపథమునను మాత్రము హిందూస్త్రీ లున్నతవిద్య నభ్యసించి సుప్రసిద్ధ విదుషీమణులని ప్రసిద్ధి గాంచిరి.

మహమ్మదీయకాంతలలో గూడ వైదుష్యమును సంపాదించినవార లుండినటులు చరిత్రము తెల్పుచున్నది. ఢిల్లీసింహాసనము నధిష్ఠించిన రమణీమణియగు రెజియాబీగము చక్కనివిద్యావతి. మాల్వారాజ్యపరిపాలకుడగు సుల్తాన్ ఘియాసుద్దీను తన యంతఃపుర స్త్రీలకు విద్యనేర్పుటకై యుపాధ్యాయినుల నేర్పరచెను. బేబరుచక్రవర్తిపుత్రి యగు గుల్‌బదన్ బేగం హుమాయూన్‌చరిత్రమును రచించెను. హుమాయూన్ మేనకోడలగు నొకస్త్రీ పర్షియనుభాషలో చక్కని పద్యములను రచించెను. అక్బరుచక్రవర్తి దాదియగు మెహన్ అన్నయనునామె విద్యావతి. ఈచక్రవర్తి ఫతేపూర్‌సిక్రీలోని తనరాజభవనమునందలి కొన్ని భాగముల నంతఃపురస్త్రీల విద్యాభ్యాసమునకై ప్రత్యేకించెను. జహంగీర్‌పత్నియగు నూర్జహానుకు అరబిక్, పర్షియనుభాషలలో నిరుపమగు పాండిత్య ముండెడిది. షాజహాన్‌భార్యయగు మంతాజ్‌మహాల్ పర్షియనులో చక్కనిగీతములను వ్రాయుచుండెను. ఈ చక్రవర్తిపుత్రికయగు జహనార బేగముకూడ చక్కనివిదుషీమణియైయుండెను. ఔరంగజేబు తన తనయయగు జేబున్నిసాకు స్వయముగ విద్యనేర్పి యామె నొక సుప్రసిద్ధవిదుషీమణిగను, చక్కనివిలేఖరిగను ఒనర్చెను.

విద్యయొక్క పరమార్థము

ఆర్. యస్. పట్నాయక్, బి. ఏ.,

వర్తమానకాలమందలి పరిస్థితులు ప్రతివిషయమునందు వేదనావిషాదాంకితములై ప్రజాసంఘమును కలసుంపుచెట్టుచున్నవి. రాజకీయరంగము ప్రజాయత్తమైనను, విప్లవసూచనీయములగు గందరగోళములు మాత్రము నానాటికి పెంపొందుచున్నవి. గోరుచుట్టుపై రోకటిపోటువలె, ఆర్థికదౌర్బల్యము వ్యాధిగ్రస్తమైన దేశమును మరింత క్షీణింపజేయుచున్నది. వివిధదేశములవారిచేతను, శాస్త్రపరిశోధనాదిప్రయత్నము లసంఖ్యాకములుగ నొనర్పబడుచున్నను, నవవిజ్ఞానవికసనమునకేకాని ప్రజాక్షేమమున కించుకైనను దారిజూపకున్నవి. నిరక్షరత్వము క్షీణించినకాలది దేశమునం దజ్ఞానతిమిరము ద్విగుణీకృతమై అమాయికప్రజాకోటి కకారణ వేదనాభారమును గల్గించుచున్నది. అనిత్యములగు సంప్రదాయము లొకవంక సంఘమునకు చెదపురుగులగుట, వర్ణవైవిధ్య మేరుపడి, యనాదిగ వచ్చుచున్న తనయైకమత్యమును, సభ్యతను, మానవజాతి మరచినది. ఇట్టిసందిగ్ధావస్థలయందు విద్యావిజ్ఞానసంజనితములగు సానుభూతి, సర్వమానవ సౌభ్రాత్రము దేశమున కన్నివిధముల శరణ్యములనదగును.

విద్యారంగముయొక్క వైశాల్య మపారము; ప్రయోజనము విశాలము. మానవపురోభివృద్ధికి, నాగరకతాభివృద్ధికి దేశముయొక్క విజ్ఞానాధిక్యమే మూలకారణము. వాఙ్మయపరిమాణమునుబట్టి ఒకదేశముయొక్కగాని, ప్రజలయొక్కగాని నాగరకత, నైతికాదర్శములు, వానివిలువయు తెలిసికొనగలమని సుప్రసిద్ధులగు కొందరు ప్రవచించిరి. కాని యిది లౌకికముగను, సామాన్యముగను జెప్పబడిన యభిప్రాయము.

వర్తమాన యుగమున విద్యావంతుని లక్ష్యముద్యోగకాంక్ష. విశ్వవ్యాప్తమైన నేటివిద్యావంతుల నిరుద్యోగరోదనాప్రతిధ్వనియే యిందులకు ప్రత్యక్షప్రమాణము. దాస్యవృత్తియే విద్యకున్నతాశయమై పరిణమించుటచే స్వేచ్ఛాజీవనాధారములగు వృత్తివిద్యలడుగంటినవి. పారిశ్రామికవిద్య లనాదరణీయములగుట దేశీయపరిశ్రమలకు తావులేకున్నది. నిరుద్యోగసమస్య దేశమున ప్రబలమగుట కిది యొకకారణము. దేశముయొక్క ఆర్థికజాడ్యమటుండ, విద్యార్థి విశ్వవిద్యాలయపట్టములు, బిరుదులు సేకరింప, అపారమగు తనదేహమనోబలములుగాక వేలకొలది ధనమును వెచ్చించి అవియొసగు కృత్రిమవిద్యను బడసి తుదకు నిరాశాహతులగుచున్నారు. వెచ్చించినధనము మరల సమకూర్పలేక దీర్ఘఋణగ్రస్తులై దిగబడిపోవు తల్లిదండ్రులను పెక్కురను మనమెరుగుదుము. చిత్తచాంచల్యమునకును, నివారణాశక్యమగు అనారోగ్యదుస్థితికిని గురియైన విద్యార్థులనుగూడ కన్నులార గాంచుచున్నారము. లోకైకవిఖ్యాతుడగు జార్జి బెర్నార్డ్‌షా నుడివినట్లు సారవంతమగువిద్యను మరుగుపరచి, జీవితమునకు నిరర్థకమగు విద్యను గరపి విద్యయొక్కసదాశయములను విస్మరింపజేయు నేటి విశ్వవిద్యాలయములే ఆజన్మాంతము పరితపింపజేయు మన యసంతృప్తికి కారణములగుట నిక్కువము. కానిచో విద్యయొక్క సదాశయము లోకమున నీరీతిగ పరిణామమొందు టేమి ?

నేడు యథార్థవిద్యనుమాత్రమే పడసిన విద్యావంతులు లోకమున చాల అరుదు. యథార్థవిద్యయన నభ్యసనీయమును, మానవజీవితాదర్శనీయమును సర్వతోముఖమగు ప్రయోజనమును, తద్వికాసమును గూర్చునది; అనర్థకమును, కృత్రిమమును నై పరార్థమును మరపించి జీవితమునకు నిష్ప్రయోజనకరమగు విశ్వవిద్యాలయవిద్యయే "కృత్రిమవిద్య." ఈవిద్యలను వేర్వేరుగ విమర్శించి నిరూపించుట ప్రస్తుతము.

యథార్థవిద్యార్థి కాధునికవిద్య యవగుణములను గరపినను, అనుభవశాలురగు మహాత్ము లుపదేశించు యథార్థపరిస్థితులను కొంతకాలమునకైన నతడు తెలిసి తదనుగుణ్యముగ వర్తించును. విద్యావిహీనునకును, "కృత్రిమ" విద్యావిశిష్టునకును నట్టియవకాశము లసాధారణములు.

"అయినచో యథార్థవిద్యయొక్క సదాశయము లెట్టివి?" అని కొందరు ప్రశ్నింతురు. విద్యయొక్క సదాశయమునకు కట్టుబడిన విద్యావంతుడు నిరాడంబరముగ తన జీవితమును విశ్వమానవాభ్యుదయమునకు దోహదమొనరించును. యథార్థవిద్య సాత్వికనైజము కలది. కావున నాతడు ప్రశాంతపూరితముగ ప్రపంచ సమిష్టికి పాటుపడి, విశ్వకల్యాణమునకు వలయు అనాహ్వానకార్యదర్శకత్వమును దాల్చి, తన జీవితమును సార్థకమొనరించుకొనును. వాని వలననె సాంకేతికానువందితములైన పతితనైతికాదర్శములు పునఃప్రతిష్ఠింపబడి సంఘమునకు సుజ్ఞానబోధనీయములగును. విద్యావంతుని విమర్శకదృష్టి లౌకికసాంప్రదాయములపట్ల కొన్నియెడల తీవ్రతను దాల్చినను, నిరంకుశ ప్రతిక్రియకు బాల్పడకుండును. విద్యాలేశుడగు మానవుడు తనసంఘమునకు బద్ధుడై సందిగ్ధావస్థలలో సముచితానుచితవిచక్షణను గోల్పోయి, తదనుసారియై, స్వేచ్ఛారహితుడగుచు వర్తించును. తనకు సహజముగ నలవడిన యాత్మశక్తి నుపయోగింపక సంప్రదాయపాశములచే తనకుతానె బందితుడై, నిరంకుశత్వమునకు బాల్పడి సహజత్వమును గోల్పోవును. కావుననే ప్రత్యక్ష ప్రమాణములెన్ని కూడినను, వానిని సముదారభావాతిశయునిగను, అసంకుచితహృదయునిగను జేయలేవు. విద్యావిశిష్టుడట్లుగాక తనయాత్మవిజ్ఞానము నుపయోగించుచు, తదనుగుణ్యముగ విచక్షణననుగమించి, సత్పథగామియై వర్తించును.

విద్యావంతుడును, విద్యయు సాంఘికుల నుత్కృష్టజీవనుల జేయును. విద్యావంతుడు వివిధరూపధారి. వానియందాయారూపగుణము లమర్పబడియుండును. స్థూలదృష్టిని దిలకించినచో తనసంఘమునకాతడన్నిట ప్రధానోపకరణమని తోపింపజేయును. అతడు పండితుడు; విద్యాప్రచారకుడు; పరివ్రాజకుడు; మతబోధకుడు; విప్లవకారకుడు; కర్మచారి; ధర్మవిజయమునకు దేహమర్పించు ధర్మమూర్తి; సంఘమునకు, దేశమునకు, లోకమునకు తనసర్వస్వము నర్పించు త్యాగమూర్తి. విద్యావంతుల యాధిక్యము సంఘమున నూతనజీవనవికాసము నుదయింపజేయును. విద్య అతిశయించుకొలది వ్యక్తిత్వ మభివృద్ధినొందును; వ్యక్తిత్వము విశాలమగుకొలది స్వేచ్ఛాపూరితమగు నైతికజీవితాసక్తి యలవడును. మానవసేవకు హృదయమైన త్యాగదీక్షను, సత్యమునకు తోబుట్టువగు ధర్మమును ప్రాణప్రదముగ నెంచి తన్నిర్వహణమునకును, పరిపాలనకును నలవడిన విద్యార్థు లుదయించుచో విద్య పవిత్రమగును. విశ్వసౌభ్రాత్రము తన నిత్యజీవితవిధులలో నొకటిగ ఎంచి, పరులకష్టములను పాల్గొని వానిని తనవేనియెంచుచు ధర్మపథగామియై విశ్వమానవసౌభాగ్యమునకు తనజీవితమును వెచ్చించువాడే విద్యార్థి యనబడును. అట్టి జ్ఞానమలవరచుకొని విద్యార్థి తన విద్యయొక్క వీరప్రతాపమును కార్యరూపమున ప్రకటించిననేకాని విద్వత్ప్రపంచము విద్యయొక్క పరమార్థమును పరిపోషింపజాలదు.

యశోమూర్తి ఆనీబెసంటు చిత్రములు

(భిన్నభిన్న వయస్సులకు చెందినవి)

















భారతము - పరమార్థప్రదర్శనము

నండూరి బంగారయ్య

(అనువృత్తము)

శ్రీకృష్ణుఁడు

ఏపాత్రమున కాపాత్రముతోఁ బ్రత్యేకసంబంధ మేర్పఱుచుకొని అందఱిలోను అంతరాత్మయయి నిగూఢముగ వెలుఁగొందు కృష్ణుని విడిచి, భారతము నంతను తనతేజముచే నిండించి చరాచరాత్మకమగు ప్రపంచము నెల్ల తనదివ్యమూర్తిలో నొక్కకిరణముగాఁ జేసివైచిన శ్రీకృష్ణునికడకు వత్తము. మనదృష్టి చెదరి పోకుండునిమిత్తమయి ఈశ్రీకృష్ణుని ఇరుదెఱంగుల విభజించుకొని విచారింపవలెను. కృష్ణునియందే సగుణబ్రహ్మ మగుకృష్ణుఁ డొకఁడు, అఖండసచ్చిదానంద మయుఁ డగు నిర్వికారకృష్ణుఁ డొకఁడు. సగుణబ్రహ్మమునుగూర్చి తొలుత విచారింతము.

శ్రీకృష్ణుని లీలాస్వరూపము

ఇపుడు పాత్రములను వదలి కథ నాశ్రయింపవలెను. భారతముపేరు చెప్పఁగనే మనకనులయెదుట నిలుచు కథాభాగము యుద్ధము. ప్రథమపర్వములలో నున్న లాక్షాగృహదాహము, పాంచాలీపరాభవము మున్నగు నంశములన్నియు నదులవలె వచ్చి ఈభారతసమరసముద్రమున నేకమైనవి. యుద్ధానంతరము కథకు సంబంధింపని శాంత్యనుశాసనికపర్వములను దీసివైచినచో తక్కినభాగమంతయు భారతరణమునఁ బడక మిగిలిన రాజులవంశముల నిష్క్రమణమునుగూర్చి ముచ్చటించునది యగుటచే దానిని యుద్ధమున కనుబంధము (appendix)గాఁ జేర్చుకొనవచ్చును. ఉద్యోగపర్వము మొదలుకొని స్త్రీపర్వమువఱకునున్న ఈయుద్ధకథలో భారతకవి శ్రీకృష్ణుని కెట్టిప్రాధాన్యము నిచ్చియున్నాఁడో చూడవలసియున్నది.

ఈయుద్ధకథ మిగులవిచిత్రమైనస్వరూపము కలది. ఒకవైపునుండి చూచినచో నిదియంతయు విషాదమయముగాఁ దోఁచును. ఎక్కడఁ జూచినను మొగ్గెడుగుఱ్ఱములు, పీనుఁగుపెంటలౌ యేనుఁగులు, నేలకుఁ ద్రాలు పదాతివర్గము, గోపురములవలె కూలిపోవుచున్న యతిరథమహారథులు! ఎంతటివారికైన స్త్రీపర్వముచదువుచున్నపుడు గుండె నీరు గాకమానదు. ఆపర్వములో శ్మశానవాటికయగు కురుక్షేత్రమును దీసికొనివచ్చి భారతకవి మనయెదుటఁ బెట్టినాఁడు. మనలో విషాదాంతనాటకములు లేవను కొందుము కాని భారతపఠనమువలన కలుగు నుత్తమవిషాదానుభూతి యే షేక్స్పియరు ట్రాజెడీ (Tragedy) వలన లభించుచున్నది! కాని ఒక్కమారు మఱింత శ్రద్ధతో భారతకావ్యపఠనమునకుఁ గడంగితిమేని ఈ శ్మశానరంగమంతయు మంత్రించినట్లు మాయమైపోయి తనచేఁ బ్రేరేపింపఁబడి తనశక్తులే మహావాయువులవలె ఒండొంటితోఁ బోరాడుచుండఁగా తనలీలకు తానే యానందించు శ్రీకృష్ణుని సౌమ్యతేజము దృగ్గోచరమగుచున్నది. ఇట్లొకవైపునుండి చూచినచో భారతము విషాదాంతనాటకము; ఇంకొకవైపునుండి చూచినచో శుభాంతనాటకము. ఒకవైపున ప్రళయతాండవప్రవర్తి యగు ఫాలలోచనుఁడు, ఇంకొకవైపున లీలామానుషధారి యగు పార్థసారథి. సౌమ్యాగ్నేయవిభేదముగల ఈస్వరూపద్వయము నొక్కశ్రీకృష్ణునియందే మూర్తీభవింపఁ జేసి భారతకారుఁడు పరస్పరవిరుద్ధస్వరూపముల సృష్టికభేదార్థమును చెప్పినాఁడు.

విరాటపర్వమున నభిమన్యుని వివాహసందర్భమున శ్రీకృష్ణుఁడు చుట్టపుచూపుగాఁ బ్రవేశించినాఁడు. వివాహానంతరము రాజులసమక్షమున పాండవులరాజ్యభాగమునుగూర్చి న్యాయానురక్తుఁడగు మధ్యస్థునివలెఁ బ్రసక్తి తెచ్చినాఁడు. కౌరవులకు సందేశమంపుటకు నిశ్చితమైనవెనుక

కౌరవులును పాండవులును
నారయ నా కొక్కరూప యట్లగుటఁ దగన్
వారును వీరును తమతమ
నేరిమిమై ధరణి యేలి నెగడఁగఁ జూతున్.

ఫెండ్లికని పిల్వఁబంచిన ప్రియముతోడ
నేగుదెంచితి మిన్నాళ్లు నెల్లయొప్పి
దములఁ జూచితి నియ్యేడఁ దడవుగాఁగ
నిలువఁదీరదు పోయిరావలయు మాకు.

అని యుద్ధమనిన నేమాత్రము కిట్టనివానివలెను, ఎవ రెట్లు పోయినను తన కేమియు జోక్యము లేని తటస్థునివలెను మాటాడి సెలవుపుచ్చుకొన్నాఁడు. దుర్యోధనార్జునులు తనసాహాయ్యమునిమిత్తము వచ్చినపుడుకూడ ఈతటస్థభావమునే అత్యంతచతురముగా నటించినాఁడు. ఏపక్షమున నున్నను తా నాయుధమును వహించి యుద్ధము చేయనని ప్రతిజ్ఞ పట్టినాఁడు.

రాయబారమునిమిత్తము సంజయుఁడు వచ్చినపుడు పేరోలగమున ధర్మరాజు తన్ను మధ్యస్థునిగాఁ బిల్చి పలుకు నేమియు మాటాడనే లేదు. కాని ధర్మరాజు తన్ను పేర్కొని పేర్కొనకుండఁగనే రంగమున కుఱికి కౌరవులకు పాండవులకుఁ గల ప్రాఁతపగల నన్నిటిని త్రవ్వి "ఈసంధికార్య మత్యంతదుర్ఘటమని తలంచెద" నని తెగఁగొట్టి చెప్పుచున్నాఁడు. ఇట్లు చెప్పుటలోనైన తనమధ్యస్థభావ మెక్కడను జారిపోకుండ కౌరవులు పాండవులకు చేసినదుర్నయములను బురస్కరించుకొని యలుకపొడమిన న్యాయానురక్తునివలెనే మాటాడుచున్నాఁడు. ఈమధ్యస్థభావమున కింకను పరిపోషకముగ నుండుటకయి కౌరవులమేలుగోరి యుద్ధ మెట్లయినను తప్పింప నెంచినవానివలె "తగవును నేర్పును నామీఁద నిలుచుట నాకుఁ గీడె" యని ఎంతో గడుసుదనముతో దౌత్యభారమును బైవైచుకొనుచున్నాఁడు. ఇదిమొదలుకొని భారతపాత్రముల నన్నిటిని త్రోసి రాజని శ్రీకృష్ణుఁ డొక్కఁడే మనదృష్టి నాకర్షించుచున్నాఁడు.

రాయబారసందర్భమున శ్రీకృష్ణుని చిత్రించిన కవిబ్రహ్మచాతుర్యము వర్ణనాతీతము. శ్రీకృష్ణునికంటె యుద్ధము నపేక్షించువారు భారతకావ్యమున లేరు. కాని ధర్మరాజు తన్ను రాయబారమునకుఁ బొమ్మని ప్రార్థించుటమొదలుగా కౌరవసభనుండి తాను తిరిగి వచ్చి ఈరాజ్యతంత్రములతో విసుగువచ్చినవానివలె "నేను పోరలంగలయంతయుఁ బోరలితి..........కౌరవుల యెడ దండంబుదక్క నొండుపాయంబు లేదు. మీకుం బోలినతెఱంగు సేయుండు" అని పలుకువఱకు నెక్కడను సంధికై ప్రయత్నించు శ్రీకృష్ణుని మానుషమగు తటస్థభావమునకు ఆతనిలోపల వెలుఁగుయుద్ధసంకల్పము బయల్పడి భంగము తెచ్చుట లేదు. ధర్మరాజుతో "నేను కయ్యపుకొసనంబు లెన్నియేని గంటి నీ వనుత్సాహివి గాఁగవల" దని ప్రబోధించుచున్నను, అర్జునునితో "సుయోధనుండు సంభావనచేసి పాలొసఁగుపాడియ కల్గిన బాల్యమాదిగా నేవిధినైననుఁ జెరుప నింతలు పాపము లాచరించునే" అని యుద్ధము సూచించుచున్నను, తుదకు భీముని పురికొల్పునపుడు ద్రౌపది నోదార్చునపుడు కుంతికి ధైర్యము చెప్పునప్పుడునయినను శ్రీకృష్ణుఁడు దూరాలోచనఁ గలిగిన రాజ్యతంత్రజ్ఞుని వలెఁ గానవచ్చుచున్నాఁడే కాని యుద్ధాతురుఁడైనట్లుగ మన కెంతమాత్రము స్ఫురించుట లేదు. తన కత్యంతాంతరంగికుఁడయిన విదురునితోఁగూడ

చుట్టములలోన నొప్పమి పుట్టినప్పు
డడ్డపడి వారితోడఁ గోట్లాడియైన
దాని యుడుపంగఁ జొరకున్న వానిఁ గ్రూర
కర్ముఁడని చెప్పుదురు కర్మకాండవిదులు.

అని ధర్మానురక్తుని తటస్థభావమునే ప్రకటించుచున్నాఁడు. బహిరంగసభలో దుర్యోధనాదులకు యుద్ధము మానవలసినదని జంకించియు, భంగించియు, ధిక్కరించియు, తృణీకరించియు తనవాక్చాతుర్యమంతయు వినియోగించి ఎన్నో విధముల నుపన్యసించినాఁడు. ఋషులచేఁ జెప్పించినాఁడు. ఇంక నేమియు నుపాయము లేక విశ్వరూపమునుకూడఁ జూపినాఁడు. బాహ్లీకభీష్మద్రోణాది విశిష్టజనంబులయెదుట ధృతరాష్ట్రుఁడు తా నేమియు చేయఁజాలనని చెప్పఁగా

ఇప్పు డీసభఁ బుట్టినయంతవట్టు
మీకుఁ జెల్లంబుగాదె యీ మేదినీవి

ఘుండు దా నేమిటికిని ముఖ్యుండఁగాను
తప్పు తనదెస లేదని చెప్పె విడిచె.

అని విస్పష్టపఱచుకొని మూర్ఖతయెల్లను దుర్యోధనాదుల మీఁదనే నిలుచునట్లును, తొందరపడినట్టిదోషము నివ్వరి ముల్లంతయైన తనమీఁద నిలువకుండునట్లును శ్రీకృష్ణుఁడు వర్తించినాఁడు. ఈఘట్టముల నెంతజాగ్రత్తగఁ బఠించిన చదువరియైన ధర్మరాజుతోఁబాటు "ఇతండు ధర్మాధర్మవిదులకు గురుండు కార్యాకార్యనిరూపకులకు శిక్షకుండు ఉచితానుచితజ్ఞులకు ప్రదర్శకుండు" అని కృష్ణుని మధ్యస్థభావమును స్తుతింపక మానఁడు. కాని ఏమయినను తుదకు శ్రీకృష్ణుని హృదయాంతరాళమున నున్న సంకల్పమే నెఱవేఱి యుద్ధము సిద్ధమయినది. ఇట్లు సంధికని బయలుదేరిన శ్రీకృష్ణుఁడు మాదిరమ్మనిన కాల్చి వచ్చినాఁడను రీతిగ యుద్ధము నసందిగ్ధముచేసికొని వచ్చినాఁడు. కాని యుద్ధము ప్రారంభమయిన వెనుక శ్రీకృష్ణుని నాటకము సాగినది కాదు. తన కత్యంతప్రియుఁడగు అర్జునునితో తానే ఈయుద్ధమునకంతకు మూలకారణుఁడనని పరిస్పష్టముగ వెల్లడించివైచినాఁడు. భీష్మపర్వము మొదలుకొని స్త్రీపర్వమువఱకు నున్న కథాభాగములో మహాకవిచాతుర్యమే మోకాని కవి ప్రత్యేకముగ వర్ణించిచూప నక్కరలేకుండ శ్రీకృష్ణుఁ డెక్కడఁ జూచిన నక్కడనే తానుగ నిముసనిముసమునకుఁ బ్రత్యక్షమగుచున్నాఁడు. సేనానాయకనిర్ణయము మొదలుకొని ఉపపాండవమరణాంతము సౌప్తికవృత్తాంతమువఱకు శ్రీకృష్ణునికి రాత్రులుపవలులు విశ్రాంతి యనుమాట లేదు.

ఒకచోట యుద్ధముచేయనని గాండీవము విడిచిపెట్టిన యర్జునుని యుద్ధసన్నద్ధుని గావించుటకై విశ్వరూపము జూపుచున్నాఁడు. ఇంకొకచోట పాండవసైన్యమును మార్దించుచు విజృంభించు భీష్మునిపైకి చక్రమునుచేతఁ బూని విజృంభించుచున్నాఁడు. వేరొకచోట భగదత్తుఁడు ప్రయోగించు వైష్ణవాస్త్రమును పుష్పమాలికగా స్వీకరించుచున్నాఁడు. సైంధవవధప్రతిజ్ఞకు ప్రోద్బలముగ మొట్టమొదట పాంచజన్యము నూదినది యాతఁడు. కార్యభారముమీఁదిచింతచే రాత్రియెల్ల నిద్రపట్టక దారుకునితో మంతనము లాడునది యాతఁడు. ప్రొద్దుగ్రుంకుచున్నదని సూర్యబింబమునకు చక్ర మడ్డువేయునది యాతఁడు. శిఖండిని ముందుంచుకొని భీష్మునిఁజంపుట కర్జునునిచే నొప్పించినది యాతఁడు. ద్రోణునివధించు నిమిత్తము ధర్మరాజు నబద్ధమాడుమని ప్రోత్సహించునది యాతఁడు. క్రుంగినచక్రమును పైకెత్తుటకు దిగిన కర్ణుని అన్యాయముగఁ జంపించినది యాతఁడు. అహంభావస్వామియగు భీమునిచే నారాయణాస్త్రమునకు మ్రొక్కించుచు, దుర్యోధనుఁ డిచ్చు చీవాట్లవాయనము నందుకొనుచు, ఘటోత్కచవధను విని తాండవించుచు, ఎక్కడఁజూచిన తానయై దుర్నిరీక్ష్యతేజముతో వెలిఁగిపోవుచున్నాఁడు. ఇట్లాదినుండి యంతమువఱకు కౌరవపాండవపక్షములకు రెండింటికిఁ గల రణోత్సాహభారమంతయు శ్రీకృష్ణుని మొగమున తాండవించుచున్నది. ఒకపక్షమనిన నాతనికి దయయు లేదు. ఇంకొకపక్షమనిన విరోధము లేదు. పాండవపక్షపాతియని కృష్ణుని గూర్చి మనము సాధారణముగా భ్రమపడుచుందుము. కాని వారిపక్షమున నుండి యాతఁడు వారికి చేసినమేలేమున్నది? అభిమన్యునివధను విని అర్జునున కది యెఱుఁగఁ జెప్పకుండ మౌనమువహించుటయు, ఘటోత్కచునిమరణమును విని తాండవించుటయునా? అశ్వత్థామబారినుండి పాండవులను రక్షించినవాఁడు ఉపపాండవులను రక్షించుకొనలేకపోయెనా?


ఇంతమహాభారమును వహించి ప్రళయరుద్రునివలె యుద్ధరంగమున తాండవించు శ్రీకృష్ణుఁడు ఎంతసౌమ్యాకారమును ధరించినాఁడు? అంభోజమాలికను మెడను దాల్చి చేత నాయుధలేశమైనను దాల్పక మునికోలను వహించి ఏమియు నెఱుఁగని నిరపరాధివలె గుఱ్ఱములను కళ్లెమువదలి చల్లగాఁ బోనిచ్చుచున్నాఁడు. తనసంకల్పమనెడి ఈసుడిగాలిని తప్పించుకొనఁజాలక పరిభ్రమించుచు బంధుమిత్రుల మరణములను చూచిచూచి భరతవంశీయులు విలపించుచుండఁగా వారియజ్ఞానమున కీతఁడు "కలకలనవ్వుచున్నాఁడు." శ్మశానవాటికవలె నున్న కురుక్షేత్రమును జూచి కడుపు దహించుకొనిపోయి గాంధారి

యిచ్చుతీవ్రశాపమును భక్తిం దర్పించు పుష్పోపహారమును స్వీకరించునట్లు చిఱునవ్వుతో స్వీకరించుచున్నాఁడు.

అని ఘోరంబుగఁ బలికిన
విని విపులమనస్కుఁడైన విష్ణుఁడు చిఱున
వ్వున నానన మొప్పఁగ న
వ్వనితకు నిట్లనియె గౌరవస్తుత్యముగన్:
మున్న కాదె యాదవులకు మునివరేణ్య
కలితదారుణశాపంబు కలదు నీకు
నేల చర్వితచర్వణ మిట్లు సేయ
దీన నీ వేమిత్రవ్వితి దానిఁ జెపుము.

యదువంశజాతులకు ద
ప్పదు నాశము వారి సురలు బకినార్పఁగ లే
రదికారణముగఁ దె
గుదు రొండొరుచేత రణముఘోరత్వమునన్.

మరణవార్త లాతనిచెవులకు సరససంగీతము కాఁబోలును. ఇదివఱకు సంభవించిన కురుపాండవవీరుల మరణములకే సంతాపించుచున్న ధర్మరాజాదిపాండవులకు గాంధారీశాపవ్యాజమున యాదవవంశనాశము కూడ నున్నదని యింకొకసరిక్రొత్తవార్తను చెప్పుచున్నాఁడు. అది తనకు పూర్వపరిచితమే కావున దాని నిప్పుడు మరల గాంధారినోట వినినప్పు డాతనికి పూర్వపరిచితులను గలసికొనునప్పు డుదయించునట్లుగ చిఱునవ్వుదయించినది కాని తొట్రుపాటించుకయు లేదు. ఆహా! ఏమి ఈకృష్ణునిస్వరూపము. భూమినిదున్ని విత్తనములు చల్లి పంటకువచ్చినచేలను కోసికొని గాదిలోఁ బోసికొని యానందించుకర్షకునివలె ఒక రాజవంశము తరువాత నింకొకరాజవంశమును నాశనము చేసి యానందించుచున్నాఁడు. మహాభారతవీరు లొకరి నొకరు నఱకుకొని మరణించునట్లుగా ప్రేరేపించునది తానే. ఆఘోరదర్శనమును చూచి యానందించునది తానే. భారతరణరంగమునఁ బ్రత్యక్షమైన కర్మశక్తి యంతయు నీతనిలో మూర్తీభవించియున్నది. కాని దానిచే నెక్కుడను మనస్సమాధానమునకు భంగము రాకుండ నానందించుయోగశక్తికూడ నీతనియందే మూర్తీభవించియున్నది. అందువలననే కవి యాతనిని "యోగేశ్వరేశ్వరుఁడని" పిలచియున్నాఁడు.



బాల క్రీడలు

మంగిపూడి వేంకటశర్మ

౩౧. కుందేలు

ఒకబాలిక పెండేసి పెద్దగా నేర్పడి అందరిని జూచి "ఆటలో అరటిపండు ఎవరోయి" అని కేక వేయవలయును. "నాకోయి" అని అడిగిన బాలికకు కన్నులుమూసి ఇంకొకబాలికను ఎక్కడనైన చాటున దాగియుండుమని పంపి ఆ బాలిక యెక్కడ దాగినదో చూచిరమ్మని ఆమెవెనుకనే మరియొకబాలికను పంపవలయును. వెనుకవెళ్లిన బాలిక ఆస్థలమును చూచివచ్చి యొకచోట కూర్చుండవలయునుగాని యెక్కడ దాగియున్నదియు ఎవరికిని చెప్పకూడదు. తరువాత కన్నుల మూసినబాలికను వదలిపెట్టి దాగియున్నబాలికను కనుగొనిరమ్మని పంపవలెను. ఆ బాలిక పోయి వెదకి కనుగొని తీసుకొని రావలయును. అట్లు కనుగొన్నయెడల కనుగొనబడిన బాలికను ఒకచోట కూర్చుండబెట్టవలయును. అనగా ఆ బాలిక అయిపోయినట్లు తెలుసుకోవలయును. కనుగొన్నబాలిక పండినట్లు. కనుక ఆ బాలికనుకూడ వేరొకచోట వేరుగా కూర్చుండబెట్టవలయును. తరువాత మరియొకబాలికకు కన్నులుమూసి యింకొకబాలికను దాసుకొమ్మని పంపవలెను. ఇట్లు దాసుకొను బాలికలపేరు "కుందేలు" అని చెప్పుదురు. తరువాత మొదటివలెనే ఒకబాలికను కుందేలు ఎక్కడ దాగుకొన్నదో చూచిరమ్మని పంపవలయును. ఒకవేళ కుందేలును ఎవరైనా చాలసేపటివరకు కనుగొనలేని యెడల ఆట ఆలస్యమగును. అప్పుడు కుందేలును ఇతరులు కనుగొనుటకైన కష్టమే యగును. కనుక ప్రతి పర్యాయమును ఒకబాలిక కుందేలు దాగినచోటుచూచి వచ్చుచుండవలయును. ఇట్లు ఎప్పుడైనా, ఏబాలికయైనా కుందేలును కనుగొనలేకపోయినపుడు ఆబాలిక అయిపోయినట్లగును. కావున ఆబాలిక ఓడిపోయినబాలికలలో కూర్చుండవలయును. అట్లు కనుగొనబడని కుందేలు పండినట్లగును. కనుక ఆకుందేలు పండినవారిలో కూర్చుండవలయును. ఇట్లు ఆటఅంతా అయినతర్వాత ఓడిపోయిన బాలికలందరును చాటునకు పోయి ఏవైన పేరులు చెప్పుకొని రావలయును. అనగా ఒక్కొక్కరికొక్కొక్క పువ్వుపేరుగాని, నగపేరుగాని, ఇతరవస్తువుపేరుగాని వెనుకటి ఆటలలోవలెనే పెట్టుకొనిరావలయును. అప్పుడు ఆటపెద్ద వారినిచూచి "మీ రెందుకు వచ్చినా"రని అడుగవలయును. "బిడ్డలను అమ్ముకొనుటకై వచ్చినాము" అని వారు చెప్పవలయును. "మీ బిడ్డలపేరు లేమి?" అని మరల అడుగవలయును. అప్పుడు వారు అందరు పెట్టుకొన్నపేర్లు చెప్పవలయును. (ఫలానివారిపేరు ఫలానా అని చెప్పకూడదు.) అప్పుడు ఆటపెద్ద ఏపేరుగల బాలికను కోరునో ఆబాలికకు తరువాత కనులు మూయవలెను. ఈప్రకారము ఆడుచుండవలయును. ఈఆటకు ఎందరున్నను సరే.

౩౨. గుడుగుడు కుంచము

బాలికలందరును కూర్చుండి రెండుచేతులును పిడికిళ్లుపట్టి యొకరిపిడికిలిమీద నింకనొకరి పిడికిలి (గుప్పిడి) యుంచవలెను. అప్పుడు ఆటపెద్ద ముందుగా పైనున్న పిడికిలిలోనికి (పైప్రక్కనుండి) తనచేతి తర్జని వ్రేలునుంచి యాడించుచు (తర్జనీవ్రేలు అనగా చూపుడువ్రేలు) "గుడుగుడుగుంచం, గుండారాగం, పాముల పట్టం, పడగారాగం," అని పాడి "కత్తి వెయ్యానా బద్దవెయ్యానా, రోలువెయ్యానా రోకలివెయ్యానా, వేన్నీళ్లుపొయ్యానా చన్నీళ్లుపొయ్యానా" అని అడుగవలయును. పైన పిడికిలిగల బాలిక ఆటపెద్ద అడిగిన వానిలో తన కిష్టమైనదానిని దేనినైన వెయ్యమని కోరవలయును. అప్పుడు ఆటపెద్ద తనతర్జనీవ్రేలితోనే ఆ

బాలికపిడికిలిమీద కత్తివెయ్యమని అడిగినయెడల కత్తితో, నరుకునట్లుగను బద్దవెయ్యమని అడిగినయెడల బద్దతో కొట్టినట్లును కొట్టవలయును. రోలు వెయ్యమన్న యెడల తనపిడికిటితో మెల్లగా కొట్టవలయును. రోకలి వెయ్యమన్నయెడల తన వ్రేలితో నిలువున కొట్టవలెను. వేన్నీళ్లు పొయ్యమన్నయెడల కొంచెము గట్టిగాను



(నొప్పికలుగకుండునట్లే), చన్నీళ్లు పొయ్యమన్నయెడల మిక్కిలి మెల్లగాను పిడికిలిమీద గిల్లవలయును. అనంతరమున ఆబాలిక తనచేయి ముద్దుపెట్టుకొని వెనుకప్రక్క నుంచుకోవలయును. తరువాత ఆబాలికయొక్క రెండవ(చేతి) పిడికిలిమీదను ఇట్లే ఆడవలయును. ఇట్లే అందరు బాలికలకును క్రమముగా ఆడవలయును. తరువాత ఆటపెద్ద ఆబాలికల నందరిం జూచి "మీ చేతులేమైపోయినవి" అని అడుగవలయును. ఆబాలిక "పిల్లి యెత్తుకపోయింది" అని చెప్పవలెను. మళ్లీ ఆటపెద్ద "పిల్లి నెక్కడదాకా తరిమినావు?" అని అడుగవలయును. "గోలకొండదాకా తరిమినాను" అని చెప్పవలయును. "గోలకొండ యేమిచ్చినది?" అని అడుగవలయును. "సుద్దిగవ్వనిచ్చినది" అని చెప్పవలయును. "సుద్దిగవ్వ నేమిచేసినావు?" అని అడుగవలయును. "కుమ్మరివాడి కిచ్చాను" అనవలెను. "కుమ్మరివాడేమిచ్చాడు?" అని అడుగవలయును. "కుండయిచ్చినాడు" అనవలెను. "కుండ యేమిచేసినావు?"అని యడుగవలెను. "పువ్వులచెట్లకీ, కాయలచెట్లకీ నీళ్లుపోసినాము" అనవలెను. "పువ్వులచెట్లు, కాయలచెట్లు ఏమిచ్చినవి?" అని అడుగవలెను. "పువ్వులు, కాయలు ఇచ్చినవి" అనవలెను. పువ్వులు కాయలు ఏమిచేసినావు" అని అడుగవలయును. "పువ్వులు కొప్పులో పెట్టుకున్నాను. కాయలు కాల్చుకతిన్నాను" అనవలెను. "కొప్పేమిచ్చినది?" అని అడుగవలయును. "పేను ఇచ్చినది" అని చెప్పవలెను. "పేనేమిచేసినావు?" అని అడగవలెను. "గడపమీదవేసి కుక్కినాను" అనవలెను. "గడపయేమిచ్చినది?" అని యడుగవలయును. "పేడిచ్చినది" అని చెప్పవలయును. "పేడేమిచేసినావు?" అని యడుగవలెను. "ప్రొయిలో పెట్టినాను" అనవలెను. "ప్రొయ్యి యేమియిచ్చినది?" అని అడుగవలెను. "బూడిదయిచ్చినది" అనవలెను. "బూడిదయేమిచేసితివి?" అని అడగవలెను. "పెంటమీద పోసితిని" అనవలెను. "పెంటయేమియిచ్చినది?" అని అడగవలెను. "గడ్డియిచ్చినది" అనవలెను. "గడ్డేమిచేశావు?" అని అడగవలెను. "ఆవులకు, గేదెలకు వేసినాను" అనవలెను. "ఆవులు, గేదెలు ఏమిచ్చాయి?" అని యడుగవలెను. "పాలిచ్చాయి" అనవలెను. "పాలేమిచేశావు?" అని యడుగవలెను. "పరమాన్నము చేసుకున్నాను" అనవలెను. "పరమాన్నము నాకు కాస్త పెడతావా?" అని అడుగవలెను. "పెడతాము" అని చెప్పవలెను. "మొగము కడుగుకొనుటకు పుడక యి"మ్మనవలెను. అప్పుడు దూలాలు పెట్టి పళ్లు తోముకొనుమనియు, వాసాలు పెట్టి నాలుక గీచుకొమ్మనియు చెప్పవలెను. తరువాత ఆటపెద్ద అట్లుచేయునట్లు అభినయించుచు దూలాలుపెట్టుకొని పండ్లుతోముకొని, వాసాలు పెట్టుకొని నాలుక గీచుకొని అనిచెప్పుచూ చేసి నీళ్లుయిమ్మని అడుగవలయును. అప్పడాబాలిక దోసిలిలో నీళ్లుపోయవలయును. ఆటపెద్ద "ఆనీళ్లు మంచివికావు; ఉప్పునీళ్లు" అని చెప్పి పారబోయవలెను. ఆబాలిక మరల నీళ్లుపోయును. తరువాత , మొగముకడుగుకొని "పాశముపెట్టు"మని అడుగవలెను. అప్పుడు ఆబాలిక విస్తరివేసి "పాశెము చూచివస్తా"నని చెప్పి చూచివచ్చి "అయ్యో ప్రొయి దగ్గర కొంచెముండగా మాతాత చుట్టకాల్చుకోవడముకు వెళ్లి; అది తినేశాడు. అటికమీద దాచితే అల్లుడెత్తుకపోయినాడు. చిన్నయింట్లో పెట్టితే చిన్నన్న తినివేశాడు. పెద్దయింట్లో పెట్టితే పెద్దన్న తినివేశాడు. పెట్టెక్రిందపెట్టితే పిల్లెత్తుకపోయింది. ఇంటిమీదపెట్టితే గద్దెత్తుకుపోయింది." అని చెప్పవలెను. అప్పుడు ఆటపెద్ద ఆబాలిక లందరికి చక్కిలిగింతపెట్టును. ఇంతటితో ఆట ఆఖరు. దీనికి ఇందరుండవలయునను నియమములేదు. "మేసేగుఱ్ఱం పెళ్లికిపోతే అప్పారాయుడుగుఱ్ఱం ఆటకుపోతే, నీగుఱ్ఱం నీళ్లకుపోతే, నాగుఱ్ఱం పాలకుపోతే పాశంవెయ్యమన్నయెడల తోడు పాశంతోడు తోడితే నాచెయ్యివేడి" అందురు.

33. జో జో

అందరుబాలికలును వలయముగా కూర్చుండి ఒకరిమీజేతిమీద నొకరిమీజేయి యుంచవలయును. అనగా ముందుగా ఒకరు తమచేతిని నేలమీద బోరగించి యుంచవలయును. తక్కినవారి చేతులన్నియు దానిమీద ఒకదానిపై నొకటి యుంచవలయును. అప్పుడాకూర్చుండినవారిలో నొకబాలిక (ఆటపెద్ద) ఆచేతులదొంతరమీద తనచేతిని తిరుగబోరగిలవేయుచు "అప్పటతప్పెటతాళం, చెవులోబుడ్డి" అని పాడవలెను. అట్లు పాడినతరువాత ఆబాలిక తనచేతితో తనదగ్గరనున్న స్త్రీయొక్క చెవి పట్టుకోవలెను. తరువాత ఆటపెద్ద క్రమముగా అందరిచేతులమీదను ఇట్లే ఆడవలెను. అందరును తమతమప్రక్కలనున్న పిల్లలచెవులు రెండుచేతులతోను పట్టుకోవలెను. ఆటపెద్దకూడ తనచేతిని నేలపైని తిరుగ బోరగిలవేయుచు పాటపాడుచూ ఆడుకొని తాను తనప్రక్కబాలికలచెవులు పట్టుకొనవలెను. తరువాత అందరు బాలికలును "జో జో జో జో" అని ఆనందముతో పాడుచూ ముందుకు వెనుకకు కొంచెముసేపు ఊగుదురు. దీనిని కొందరు అప్పటతప్పిటతాళంత టందురు.

3౪. కఱ్ఱగానుగు

ఒక పొడుగుపాటి గట్టికఱ్ఱ తెచ్చి వీథిలో నొకచోట దానిమొదలు క్రిందనుంచి ఆమొదలునకు జానెడు దూరముగా నొకబాలిక ఆకఱ్ఱపై పాదములు నిల్పి పడకుండ ఆకఱ్ఱ సాయమున నే కూర్చుండవలయును. తక్కినబాలిక లాకఱ్ఱ చివరభాగమున పట్టుకొని గానుగవలె



గిరగిర చుట్టును త్రిప్పుదురు. అనగా కూర్చున్నబాలిక గానుగఆడువానివలెను, త్రిప్పెడువారు ఎద్దులుగాను ఉండి ఆడవలెను. కొంతసేపైన తరువాత గానుగమీదిబాలిక యెద్దులలోనికి రావలెను. ఎద్దులలోని బాలిక లొకరి తరువాత నొకరు గానుగాడవలెను.

3౫. అగీరనగింజలు

చింతగింజలను దెచ్చి బాలికలందరును సమముగా పంచుకొని యుంచుకొని వానిలో తమయిష్టమువచ్చినన్నిపుంజీలు ఒకొక్కరిగింజలలోనుండి తీసి నేలమీద పెద్దసున్నవలె గుండ్రముగా సుద్దతోగాని, పెంకుముక్కతోగాని ఆనవాలు కన్పడునట్లు గీచి ముందుగా ఆడుటకు నిశ్చయించినబాలిక ఆగింజల నన్నిటిని దోసిలిలోగాని, దోసిలికి చాలనియెడల చేరలోగాని పోసికొని కన్నులు మూసికొని ఆపెద్దసున్నమధ్యమున మెల్లగా పోయవలయును. అట్లుపోయునపుడు గింజలు గీతమీదకుగాని, గీతదాటి యివతలికిగాని రాకూడదు. వచ్చినయెడల ఆబాలిక అయిపోయినట్టు. అనగా ఆటపోయిన ట్లెంచబడి మరియొకబాలిక పోయవలయును. ఇట్లు ఆసున్నలో గింజలు పోసినతరువాత గింజలు పోసినబాలిక కుడిచేతి రెండవ వ్రేలితో (తర్జని వ్రేలితో) ఒకొక్కగింజచొప్పున తీసికొనవలయును. అనగా గింజను వ్రేలితో నొక్కి తనముందర ప్రక్కకు లాగుకొనవలయును. అట్లు లాగునపుడు యెడమచెయ్యియొక్క గుత్తి తనముందర ఆనుకొని వ్రేళ్లు యెత్తి ఆచేతిలోనికి వచ్చునట్టు తీసుకొనుచుండవచ్చును. అట్లు చేసినయెడల గింజలు నలుప్రక్కలకు చెదరిపోకుండ సులభముగా ప్రోగుపడుచుండును. బరిలోపలినుండి వ్రేలితో గింజలు తీసికొనునప్పుడు వ్రేలు ఆనినగింజ గాక దానిదగ్గరనున్న యేగింజకైనను ఆవ్రేలుతగిలినను, లేక గింజ బరిదాటిరాక బరిలోనే యుండినను, బరిమీద నుండినను ఆట అయిపోయినట్టు అగును. కనుక జాగ్రతగా తీసికొనవలెను. గింజలు అనగా కాయలు అని గూడ అందురు. కాయతీసికొనునప్పుడు వ్రేలు మరియొక గింజకు తగులుట, అనగా కంగుట అనివాడుదురు. అనగా ఈకాయ కంగినది, ఆగింజ కంగినది, అని చెప్పుదురు. ఒకబాలిక ఆటతప్పినయెడల తరువాతిబాలిక గింజలను తీసికోవలయును. ఆమె ఆటపోయినయెడల మరియొకబాలిక ఆడవలయును. ఇట్లు అందరును ఆడినవెనుక ఇంకను గింజలున్నయెడల మరల

మొదట అయిపోయిన బాలిక ఆడవచ్చును. ఇట్లు క్రమముగా అందరును ఆడవచ్చును. ఇట్లు బరిలోని గింజలన్నియు తీసికొన్న తరువాత తనుదగ్గర మిగిలిన గింజలుకూడ పోసి ఆడుకొనవలయును. అనగా ఆటలో సంపాదించుకున్న గింజలుగాక మొదట తెచ్చుకొన్న గింజలలో మొదటియాటకు పొయ్యగా మిగిలినగింజలని తెలిసికోవలెను. ఇట్లు పోసి ఆగింజలుకూడ మొదటి వలెనే అందరును క్రమముగా ఆడినతరువాత యెవరు తీసుకొన్న కాయలు వారు లెక్కపెట్టుకొని మొదట తాము తెచ్చుకొన్న గింజలకంటె లాభమువచ్చినదో, నష్టము వచ్చినదో, యెంతో తెలిసికొనవలయును. ఈ యాటలో ఒకరికన్న నొకరుత్సాహముతో యెక్కువ గింజలను గెలుచుకోవలయునని ప్రయత్నించవలయును. ఈయాటలో గింజలను లెక్కించునప్పుడు గింజలు పుంజెడు లేక కుచ్చెండు, ౮ గింజలు కచ్చటము, ౫ కచ్చటములు గుఱ్ఱము, ౧౦ గుఱ్ఱములు యేనుగ అని ఈమానముప్రకారము వాడుకొని ప్రోగులు పోసికొందురు. ఈయాట కింతమందియని నియమము లేదు. ఈయాట చింతగింజలు లేనియెడల సీతాఫలగింజలు, బీరగింజలు, ఆనపగింజలు, అనపగింజలు మొదలగు వానితో ఆడవచ్చును.


౩౬. కాలికంచము.


మెత్తని పొడిదుమ్ముగల చోటగాని, యిసుకగల చోటగాని, బూడిదనేలయందుగాని బాలికలందరును ఎవరికివారు కొంతకొంత ప్రదేశము నాక్రమించుకొని (అనగా ఇక్కడినుండి యిక్కడివరకుగల స్థలము నాది, ఇది నాదియని అందరును కొంతకొంత చోటునకు హద్దులేర్పరచుకొని) నిలిచియుండి ఒకకాలిమడమ యొకచోట నిల్పి మడమను కదలనియ్యకుండగనే పాదము నేలకు కొంచెము తగులునట్లుగా నుంచి రెండవ కాలి సహాయమున, అనగా రెండవకాలు తనయిష్టము వచ్చినట్లు జరుపుకొనుచూ గుండ్రముగా రెండుమూడు చుట్లులు తిరుగవలయును. అట్లు తిరిగినయెడల మడమ మోపినచోట కొంచెము లోతుగల గుండ్రని గుంటగాను, పాదము తగిలినందువల్ల పాదమునకు తగిలిన యిసుక (యిసుకగాని, బూడిదగాని, దుమ్ముగాని) పాదమున కవతలచుట్టును పడి కొంచెము ఎత్తుగా అంచువలె నుండుటచేతను, మడమ నిల్పినచోటు అంతలోను కొంచెము పల్లముగా నుండుటచేతను కంచమువలె ఏర్పడును. ఇట్టికంచములు ఎవరిస్థలములో వారు ఒకరికన్న




ఒకరు త్వరగానూ, ఎక్కువ సంఖ్యయగునట్లుగను, అందముగానూ చేయుదురు. కాలితో కంచములు చేయుట చేత ఈయాటకు కాలికంచమని పేరు. బూడిదగాని, దుమ్ముగాని గలచోట్లకంటె ఇసుకప్రదేశము లీయాటకు తగినవి. అనగా బట్టలు ఒడలు బాడిగాక దులిపినంతనే రాలిపోవును. ప్రతిబాలికచక్రములు రమారమి రెండేసి జెత్తెడులు పరిమాణముగల తాటియాకుముక్కలనుదెచ్చుకొని ఆముక్కలలో నొకదానిమధ్యభాగమున ఆయాకునకుగలయంతవెడల్పున క్రిందిప్రక్కను, మీది ప్రక్కను మెల్లగా చీల్చి ఆచీలికలలోనుండి రెండవ ముక్కను దీసి చక్రాకారముగా వచ్చునట్లు చేయవలెను. అనగా నాలుగువైపులను తాటిఆకులు సమానమైన కొలత గలవిగా నుండునట్లు చేయవలెను. తరువాత ఆచక్రమునకు మధ్యభాగమున సూదితో రంధ్రమువేసి ఆరంధ్రములో సూదిగాని, తుమ్మ మొదలైనవాని ముల్లుగాని గ్రుచ్చి దాని అమూంటిమొన నొక చీపురుపుడకను గాని, మరియొకపుడకనుగాని గ్రుచ్చి ఆపుల్లను చేతితో పట్టుకొని గాలికెదురుగా నిల్చియుండవలెను. అప్పుడాచక్రము గాలికిగిరగిరతిరుగుచుఅందముగాను, చిత్రముగాను నుండి ఆనందము కల్గును. గాలికి ఎదురుగా పరుగెత్తినయెడల చక్రము మరింతవడిగా తిరుగును. గాలి లేనపుడు చక్రము తిరుగనియెడల పరుగెత్తినయెడల వేగవశమున గాలిపుట్టి చక్రము తిరుగును. చక్రమధ్యమున గ్రుచ్చెడుముల్లు ఒంటిదైన యెడల చక్రము జారిపోవును. కనుక జంటముల్లు తెచ్చి ఒకముల్లుమొదలు మాత్రముంచితక్కినది విరుగదీసి రెండవముల్లంతయుకూడ నుంచి ఆముల్లు గ్రుచ్చవలయును. ఈయాట చిన్న బాలికలాడుకొనవలయును. బాలురును ఆడుకొనవచ్చును.

యశోమూర్తి ఆనీబెసంటు చిత్రములు








కీ. శే. పటేలు

(మరణశయ్యపైనున్న నాటి చిత్రము)



రోగవారసత్వము

వడ్డాది సీతారామారావు, B. A., M. Sc

రోగవారసత్వమునుగూర్చి మనలో చాలా తప్పు అభిప్రాయాలు వ్యాపించి ఉన్నవి. ముఖ్యముగా వాటిని పోగొట్టుటకే ఈవ్యాసము ఉద్దేశింపబడినది.

రోగములను రెండుభాగములక్రింద విభజింపవచ్చును:

౧. బీజసంబంధమైన లోపములవలన వచ్చినవి;

౨. బీజము (Germinal Matter) నందెట్టి లోపమును లేక బయటినుండి మనకు వ్యాపించినవి.

తల్లిదండ్రులలో నెవరికైనను ఉన్నరోగమే వారి సంతానమునందుకూడ నున్నదనుకొందము. అందుచే వ్యాధి తప్పక వారినుండియే సంక్రమించినదనుకొనరాదు. అది రోగవారసత్వము కాదు. ఏ అనారోగ్యపరిసరములు మొదట నావ్యాధిని తల్లిదండ్రులయందు కలుగజేసినవో ఆ అనారోగ్యపరిసరములే యింకను వారి సంతానమునుకూడ చుట్టుకొనియుండుటచే నారోగము వచ్చియుండును. ఒకడు అనారోగ్యప్రదేశములలో నివసించుచుండుటచే క్షయవ్యాధి వచ్చెననుకొందము. ఆతని పిల్లలుకూడ నాప్రదేశముననే యున్న వారికికూడ నావ్యాధి రావచ్చును. అందుచే తండ్రినుండియే ఆ వ్యాధి బిడ్డలకు వారసత్వముగా వచ్చెననుకొనుట తప్పు.

కొందరిశరీరములు కొన్నికొన్ని వ్యాధులు సులభముగా బయలుదేరుట కనుకూలముగా నుండును. దీనిని Predisposition to a disease అందురు. ఈ Predisposition, అనగా రోగానుకూలపూర్వస్థితి బీజము (Germinal Matter) నందున్న ఏదో వింత మార్పుగాని లోపమునుగానిబట్టి ఉండును, ఇది ఒక్కొక్కనికిని ఏదో ఒకప్రత్యేకమైన వ్యాధివిషయమైయే ఉండునుగాని అన్నివ్యాధులవిషయమై ఉండదు. ఒకని బీజస్థితి క్షయరోగానుకూలముగా నున్నయెడల మఱొకనిది ప్రవాతమున కనుకూలముగా నుండవచ్చును. రోగమునకు దేహమునందనుకూలస్థితి యున్నప్పటికిని, యది బహిర్గతము కాకపోవచ్చును. రోగము బహిర్గతమగుటయు, లేనిదియు దానికివచ్చు పోషణ (Nurture)ను బట్టి యుండును. శరీరప్రకృతి వ్యాధి బహిర్గతమగుట కనుకూలముగ లేనిచో నది అంతర్గతముగానే యుండవచ్చును. ఈ రోగానుకూలపూర్వస్థితులు బీజస్థమైన వగుటచే నివి వారసత్వమువలె సంక్రమించవచ్చును.

రోగమువేఱు; రోగానుకూలపూర్వస్థితి వేఱు. అట్లే రోగవారసత్వము వేఱు, రోగానుకూలపూర్వస్థితియొక్క వారసత్వము వేఱు. ఈపూర్వస్థితి బహిర్గతమైననే రోగమనబడును. బీజమునందుండునది రోగానుకూలపూర్వస్థితిమాత్రమే. వారసత్వముక్రింద సంక్రమించునవి యీ అనుకూలపూర్వస్థితులుగాని రోగములుగావు. (Diseases cannot be transmitted. What is inherited is a predisposition to a disease due to a germinal defect, which, under appropriate stimulating conditions, gives rise to a disease.)

అట్లు అంతస్స్థితమైన లోపములు రోగములవలె బహిర్గతమగుటయు లేకుండుటయు వాటికి గలుగు పోషణనుబట్టి యుండునని ఇదివఱకే తెల్పితిని. దేహప్రకృతి రోగోద్రేకమును కలిగించునదిగా నున్నతప్ప వ్యాధి బయల్పడనేరదు. బీజస్థలోపము ఒకతరమునుండి మఱొకతరమునకు రావచ్చును గనుక శరీరప్రకృతియు, పోషణయు వాటి కనుకూలముగా లేకుండుటచే నొకతరమునందు వ్యాధి బహిర్గతము కాకపోయినప్పటికిని, మఱొకతరమునందు కావచ్చును.

ఒకొక్కొక్కప్పుడు రోగానుకూలబీజస్థితులు పూర్తిగ పోవచ్చును. దీనినే Racial cure of a disease అందురు. అంతస్స్థితమైనవి తప్ప పైనుండివచ్చినవ్యాధు లెన్నడును తరతరముల సంక్రమింపనేరవు. సూక్ష్మక్రిమి సంబంధమైన వ్యాధులవిషయమైనకూడ నింతే.

రోగము తల్లిదండ్రులనుండి బిడ్డలకు రాకపోయి నప్పటికిని రోగము నాధారపడియున్నవియు, దానికి సంబంధించినవియు నైనఫలితము లెవ్వియైన వ్యాపింపవచ్చును. రోగవారసత్వము నిదియు నొకటి కాదు.

వ్యాధివలె బహిర్గతము కానివియు, శరీరమునకు సంబంధించిన అంతఃస్థిత-అసాధారణత్వము లెవ్వియైన (ముఖ్యముగా మనస్సంబంధమైనవి) తరతరముల సంక్రమింపవచ్చును.

కొన్ని తెగలమనుష్యుల కెన్నటును Yellow fever అనువ్యాధి రానేరనట్లు శాస్త్రజ్ఞులు తెల్పుచున్నారు. ఈరోగనిరోధకశక్తి స్వాభావికమైనదియు, బీజస్థమైనదియు నగుటచే నిది వారసత్వమువల్ల పొందబడుచున్నది. స్వాభావికమైన నిరోధకశక్తి (Natural Immunity) యేగాని యితరవిధముల వచ్చిన నిరోధశక్తి ముందుతరములకు సంక్రమింపదు.

ఉపేక్షితము

కొంపెల్ల జనార్దనరావు

ఒక ముసలిదోనె యిది; పడియున్న దిచట,
ఊడిగము సేఁత సత్తువ లుడిగి యుడిగి;
తనకుఁదా మృతస్మృతులు కల్పనము సేసి
కొనుచు, తనపయిఁ దా జాలిగొనుచు నిట్లు.
అఖిలజనకవాత్సల్యసహార్థి యగుట
తలఁపఁడు; స్వకీయసౌఖ్యసంధాయి యగుటె
అరయఁడు నరుండు—కట్టికొన్నాఁడు, తరువు
నఱకి, కంకాళమయ మొకనావ తనకు.
కుపితజలరాశిఁ,—ప్రకృతిసంకులవిఘట్ట
నములఁదన కంగరక్షగా నవయఁజేసె,
స్వార్థసంపాదనములకై యడఁచి దీని:
చూచి యూర్వఁడు,—చూడనేచూడఁ డిపుడు.

నిరతయాత్రామిళత్కాలచరణబహుళ
చిహ్నజీర్ణితసత్త్వ మీసికతశేణు
సముదయమునఁ గాయార్థదఘ్నముగ నిలిచి
నేర్చుచున్నది యిది ధ్యాననిరతితాల్మి.
వాయువులు నీన గుప్తభావములు చదువ
గోడఁగుచున్నవి; చెడిన ప్రాగూటిసొదలు
ఘోసికొని యేడ్చుచున్న దీపులుఁగు;—జలము
లశ్రువులు చిందుకెలన, చిరానురక్తి.
గతకథాగళనోరిగాద్గదికమాధు
రీగరిమ లోనడఁచుకొన్న పృథులశాంతి
అణు వణువునందు నాల్కవిస్ఫారి, స్వాగ
తము విశాలించి యడుగు, దైన్యము వరించి.

యశోమూర్తి ఆనిబెసంటు

సి. అశ్వత్థనారాయణరావు, బి. ఏ.,

ఏదృష్టినిచూచినను డా. ఆనీబెసంటు ఆధునికయుగమున నొకగొప్పవ్యక్తి. కొందరు గొప్పవ్యక్తులవలె బెసంటు ఇంటను, బయటను తీవ్రములగు కష్టములకు పాలయినది; అట్లే జీవితమును ఉత్తమముగ గడపినది.

ఆమె అసంఖ్యాకగ్రంథరచయిత్రి; వక్త్రీశిరోమణి; మహోదారవిద్యాప్రచారశీల. చిన్నపంచముల పాఠశాల మొదలుకొని సెంట్రల్ హిందూకళాశాల, పృథులతరములగు తియసాఫికల్ ఎడ్యుకేషనల్ ట్రస్టు, నేషనల్ విశ్వవిద్యాలయమువరకు గల విద్యాసంస్థ లన్నియు నాయమ నెలకొలిపినవి.

భారతమును బోలిన దేశమున యూనివర్సిటీలమాట కలనయిన తలపజాలినవ్యక్తి- అందును జీవితసూత్రములయం దొరులతో నెప్పుడు నైకమత్యము కుదురనిదయ్యును తాను మొదలిడినకార్యముల నన్నిటిని నిర్వహించుటకు కావలసినధనమున నొక్కొక్కకణమునకును ఒరులే గతిగా నుండిన బెసంటును బోలినవ్యక్తి — ఇంకొకరు ఊహకు తగులరు.

ఆమె రాజకీయజీవితము భారతరాజకీయరంగమున కుత్తమరూపమును నిర్మించి యచటను ఉత్తమస్థానమున నిలిచినది. ఆయమ కావించిన నిఖిలప్రపంచసంచారములో అతిమాత్రములు! అవియు నెన్నిమారులు!! ఒకమారుకన్న నింకొకమారు శీఘ్రగమనముగల యానములయందే - విమానములుసహా- ఆమెప్రయాణము. కార్యనిర్మాణనైపుణ్యమున నామెనుమించినచేయి లేదు. ఆమెవలె ప్రజల కడనుండి ధనమును సమకూర్చి యుత్తమకార్యములకు వ్యయించినవ్యక్తి యింకొకరు 'నాస్తి'.

తియసాఫికల్ సొసయిటీవంటి నిఖిలప్రపంచప్రసిద్ధసంస్థ కాధిపత్యము వహించి దానిని నిర్వహింప నింకనొకరికి సాధ్యము కాగలదని తలంపనైన నగునా? నిరంతరము నామెనే వరించుచుండిన తదాధిపత్యమునకు మరణమే స్వస్తి చెప్పగలిగినది. అల్పాల్పవిషయముల నయితము కడుజాగ్రత్త గలిగియుండుట కామె కామెయే సాటి. ఆమె ప్రయాణములయందు కాఫీని సొంతముగ తయారుచేసికొనెడిది. కాఫీని మిక్కిలిరుచిగా నుండునట్లు తయారుచేయునేర్పు ఆమెకు గలదు.

ఎల్లచోటుల నామెకే మొదటియాతిథ్యము. ఆమెయొసంగు నాతిథ్యము నత్యుత్తమము.

ఊహకందని కడగండ్లను గడచిన దామె. అట్లే విజయపరంపరలను పడసిన యదృష్టవతి. ఆమెవలె వందలకొలదికార్యములను తలపెట్టి గౌరవప్రతిష్ఠలతో వానిని కొనసాగించినవ్యక్తి యింకొక రుండబోరు.

ఒక్కటినిగాని, పెక్కిటినిగాని ప్రజాహితకార్యములను సాధించి పేరెన్నికకెక్కిన

వా రనేకులుకలరుగాని బెసంటువలె నిన్ని కార్యములను సాధించి విశ్వవిఖ్యాతిని వరియించినవ్యక్తి స్త్రీపురుషు లయం దొక్కరేని లేరు. అన్నింటిని మిగిలినవిషయము: ప్రపంచమునకు కృష్ణాజీని ప్రసాదించినది.

తొలుత మదనపల్లెయం దామె స్వీకరించినపుడు కృష్ణమూర్తి పదునొకండేండ్ల బాలుడు; కృశించిన పలుచని శరీరముగల యొకసామాన్యుడగు పిరికికుఱ్ఱవానివలె మన కానాడు పొడగట్టినాడు.

బెసంటు కాతనియం దానాడే ప్రపంచగురువు గోచరించెను. తనకు గోచరించిన సత్యము నామె ప్రపంచమునకు నాడే చాటినది. దీనివలన నామెకుగల యుత్తరవాదిత యొక్క పరిమితి వేరుగ నిట పేర్కొనబనిలేదు. ఆకృష్ణమూర్తి కామె ఉత్తమమగు విద్యను, ప్రపంచజ్ఞానమును, మిత్రమండలిని ప్రసాదించినది. నేడు కృష్ణాజి తాను ప్రపంచగురువునని అంగీకరించడు. కాని తనకు ప్రబోధము కలిగెనని చెప్పును. అనేకులు దానిని విశ్వసింతురు. వివిధజీవితపథగాములగు మహాత్ము లెల్లరు ఆయన వర్తమానయుగమునకు జెందిన గొప్పవేత్తయని నిశ్చయించిరి. ఆయనతో నైకమత్యము కుదురనివారు సైతము నాయన వేత్తృతను, వాక్శక్తిని అంగీకరింతురు.

పది, పదునొకండేండ్లవయసునాటికృష్ణాజి తాహాతు ఎట్టిది? నేటితాహాతు ఎట్టిది? ఆయనవిజ్ఞానవికాసములకు సముచితావకాశముల నొసగినవా రెవ్వరు? కృష్ణాజిని అద్భుతశక్తిసంపన్నుని గావించిన అద్భుతశక్తి బెసంటు.

బెసంటు శరీరబలశక్తిసంపన్నురాలు; విచిత్రమగు మనశ్శక్తికలయామె; ప్రతిలేని భావవైలక్షణ్యము గల యామె; అద్వితీయమగు నాధ్యాత్మికప్రజ్ఞగలయామె. ఆమె యొక అపూర్వవ్యక్తి. ఆమెయే యొకసంస్థ. తాను మొదలిడిన కార్యముల నప్రయత్నముగ కొనసాగించినది. ఆమె స్వయముగ లబ్ధప్రతిష్ఠ యయినది; పలువురను లబ్ధప్రతిష్ఠులనుగావించినది. నిశ్చయబుద్ధి కలదేని మనము నట్టియున్నతిని పొందగలుగుదుము.

ఈయమజీవితమున గొన్ని ముఖ్యములైన సందర్భములు:

౧౮౪౭ అక్టోబరు ౧. జననము.

౧౮౬౭ రెవరెండు ఫ్రాంకు బిసెంటుగారితో పాణిగ్రహణము; నేషనల్ సెక్యులర్ సొసైటీలో చేరుట.

౧౮౭౩ విడాకులు.

౧౮౭౪–౮౦ ఛార్లెస్ బ్రాడ్‌లాఫరుగారితో ప్రపంచమున కాదర్శప్రాయములైన సంభాషణలు.

౧౮౮౯ దివ్యజ్ఞానసమాజమున ప్రవేశము.

౧౮౯౮ కాశిలో కేంద్రహిందూకళాశాలను స్థాపించుట.

౧౯౦౪ కేంద్రహిందూబాలికాపాఠశాల; డాక్టరు ఆఫ్ లిటరేచర్.

౧౯౦౭,–౧౪,–౨౧,–౨౮ దివ్యజ్ఞానసమాజాధ్యక్షత.

౧౯౧౭–౧౮ అఖిలభారత జాతీయమహాసభ కధ్యక్షత; 'థియాసఫిస్టు', 'న్యూ ఇండియా' పత్రికల ప్రకటన.

౧౯౩౩ సెప్టెంబరు ౨౦. మరణము.

నక్షత్రమండలము

గొబ్బూరు వేంకటానంద రాఘవరావు (కవితానమిణీ)

కార్తిక, మార్గశిర మాసములు : (నవంబరు 1933)

ఉత్తరము

తూర్పు



పడమర

దక్షిణము

[ఈ పటము శిరస్సుమీదను ఆయాదిక్కులు నవంబరు ౧౫ తేదీని గం. ౮-౨౮ నకు నవంబరు ౨౨ సరిగా కనబడునట్లు పట్టుకొని చూడవలెను. ఇందు తేదీని గం. ౭-౫౭ కును, నవంబరు ౩౦ తేదీని గం. న్నట్లు నవంబరు ౮ తేదీని ౮ గం. ౫౨ ని. రాత్రికిని, ౭-౨౫ కును కనబడును.]

1933 నవంబరు 8 మొదలు డిసెంబరు 8 వఱకు

ఈమాసములో క్షీరవాహిని (Milky way) మండలాకారముగా తూర్పునుండి పడమటకు వ్యాపించియున్నది. ఈశాన్యదిశను చీలిపోవును. తూర్పునుండి వరుసగా మిథున, వృషభ, సారథి, భృగుపరశు, అప్సరస, ఇంద్రమద, రాజహంస, గరుడమండలములమీద నుండికాని, సమీపమునుండికాని పడమటకు వ్యాపించియున్నది.

తేజోవంతములైన నక్షత్రములు

(First magnitude stars)

మిక్కిలితేజోవంతములైన నక్షత్రములు ఈమాసపురాత్రితొలిజామున ఎనిమిది కనబడుచున్నవి. అవియేవియనగా:—

1. వీణామండలము (Lyra) లోని బ్రహ్మ.
2. గరుడమండలము (Aquila) లో శ్రవణము.
3. ఇంద్రద్యుమ్నుడు (Fourabhant).
4. బ్రహ్మహృదయము (Copella) (Auriga సారథిమండలము)
5. రోహిణి (Aldebaran)
6. ఆర్ద్ర (Betelgeuse)
7. ఒరయన్ మండలములో యమునసమీపమున Rigel.
8. ఆగ్నేయాకాశమున శంతనుడు

గ్రహములు

శని శ్రవణముదగ్గరనే ఉన్నాడు. అంగారకుడు ఈమాసారంభమున ధనుస్సులో ప్రవేశించి నెలాఖరు వఱకు ఆరాశిలోనే కనబడును. గురుడు చిత్రలో నుండుటచే రాత్రితొలిజామున కనబడడు. శుక్రుడు ఈ మాసములో ధనుస్సులోనుండి మకరమున ప్రవేశించి మకరరాశి గడచుచుండును. సూర్యాస్తమానము కాగానే పడమట చంద్రుడున్నదినములలో ఆసమీపమునందు శుక్రాంగారకగ్రహములు కనుపడుచున్నదృశ్య మెంతో మనోహరముగా నుండును.

ఉత్తర నక్షత్రములు

లఘు ఋక్షపుచ్ఛాగ్రమున ధ్రువుడును, పుచ్ఛమునందు అగ్నిమహేంద్ర కశ్యపులును కనపడుచున్నారు. చిన్నయెలుగు ఇంకను పశ్చిమముఖముగానే ఉన్నది. ధ్రువునకు కొంచెము ప్రక్కగా ఎడమపాదములోసహా ఊరువు ఉన్నది. పురూరవసు డాదిగువను క్షీరవాహినిలో నున్నాడు. సప్తఋషులు కనబడరు. నరకుడు పశ్చిమశిరస్కుడై బ్రహ్మ కనతిదూరమున కానవగుచున్నాడు.

పడమట శ్రీ మహావిష్ణుస్వరూపము పూర్తిగా నస్తమించినది. బ్రహ్మయు, అతనివాహనమైన రాజహంసయు ఇక నస్తమింపనై యున్నారు. ఈసందర్భములో నన్నయభట్టు వర్ణించిన శరత్కాలవర్ణనము స్ఫురణకు రాకమానదు:

ఉ. భూసతికిన్ దివంబునకు పొల్పెసగంగ శరత్స
మాగమం, బాసకల ప్రమోదకరమై విలసిల్లె
మహార్ణిమండలో, పాసితరాజహంసగతి భాతి
ప్రసన్న సరస్వతీక మ, బ్జాసన సదృశంబగును
నబ్జజు యానముతో సమానమై.

ద్యావాపృథివీ సమాగము, శరత్కాలపు ధావళ్యము, బ్రహ్మ సరస్వతీ సమాగమము, రాజహంస ధావళ్యము, ఇవి నేటి పశ్చిమాకాశమున నద్భుతదృశ్యములు; అత్యానందదాయకములు. నైరృతిదిగ్భాగమున ధన్వికూడ త్వరలో నస్తమింపనైయున్నాడు. ధన్వి యనగా మన్మథుడు బ్రహ్మసోదరుడు, విష్ణుపుత్రుడు నైన సంగతి ఈసందర్భమున మఱువకూడదు.

దక్షిణాకాశము

దక్షిణమునందు నాళీకజంఘుబకము ప్రావారకర్ణఘూకము, యుగంధరకమఠము, వీటితోకూడినఇంద్రద్యుమ్నుడే ముఖ్యముగా కనబడును. ఆగ్నేయమున యమునానది పలువంపులు తిరిగితిరిగి శంతనుని చేరుచున్నది.

తూర్పున

ఒరయన్ యోధుడు ఉదయించుచున్నాడు. వాని పటకా-అనగా మనవారు గొల్లకావిడిచుక్కలని చెప్పు మూడుచుక్కలును ఉదయించినవి. ఒరయన్ చతురస్రములోని నాలుగు మంచుపుకోళ్లలో మూడుమాత్రము కనబడుచున్నవి. ఆగ్నేయభాగముననున్న రిగెల్ (Rigel) చుక్క సమీపమునందే యమున పుట్టుచున్నది.

ఈశాన్యము

ఊర్వశీపురూరవసులకు ఒక ప్రక్కను అప్సరసలు ఆకాశ మధ్యభాగమును చేరుకొనుచున్నారు. సారథిమండలము బాగుగా ఉదయించినది. అజశాబకములతో బ్రహ్మహృదయము మిక్కిలి కాంతితో మెఱయుచున్నది. వాయవ్య దిగ్భాగమున బ్రహ్మయు, ఈశాన్యమున బ్రహ్మహృదయమును ఒకదానితో నొకటి తులతూగుచు తెల్లని తేజముతో ప్రకాశించుచున్నారు. సారథికి దిగువ భృగు పరశుమండలమును ఆ దిగువను గ్రుడ్లు మిటకరించుకొనుచు పులోముడును కనబడుచున్నారు.

మధ్యనక్షత్రములలో

శ్రవణమునకు తూర్పుగా అష్టవసుదేవతాకమైన ధనిష్ఠయు, ధనిష్ఠకు తూర్పున పెగసస్ (Pegasus) చతురస్రములోని పూర్వాభాద్ర, ఉత్తరాభాద్రలును మెఱయుచున్నవి ధనిష్ఠదిగువను శతభిషమును కుంభరాశియు మెఱయుచున్నవి. కుంభరాశికి తూర్పున, యుగంధరకమఠముపైనశింశుమారముకలదు. ఉత్తరాభాద్రకు తూర్పున శింశుమారముపైన రేవతి యున్నది. రేవతికిమీదుగా ఇంద్రమదయు, ప్రక్కగా అశ్వినులున్నారు. చ్యవను డశ్వినుల ప్రక్కనే కలడు. అశ్వినులకీవల భరణికృత్తికలు మెఱయుచున్నవి. మృగశిరార్ధమువఱకు గల వృషభమును, రేవతిదిగువ శింశుమారమును రథమునకు పూన్చుకొని వెడలు అశ్వినీదేవతల దివ్యరూపము ఇపు డాకాశమున స్వచ్ఛముగా తెలియనగుచున్నది.

విశేషవిషయములు

ఇంద్రద్యుమ్నునినుండి మనకు వెలుతురు చేరుసరికి ౨౫ సంవత్సరములు పట్టును. అనగా ౧౯౦౮-వ సంవత్సరమునాటి ఇంద్రద్యుమ్నుడు నేడు మన కగపడుచున్నాడు. ఇట్లే శంతనునినుండి మనకు వెలుగు చేరుసరికి ముప్పదిసంవత్సరములు పట్టుచున్నది.

క్షీరోదధ్రువములు

క్షీరోదదక్షిణధ్రువము యుగంధరకమఠమున నున్నది. ఉత్తరధ్రువము నరకుని సమీపమున నున్నది. నరకుడు అదృశ్యుడు కానున్నాడు.

రాసులు

పశ్చిమసమీపముననున్న నైరృతి దిగ్భాగమునుండి, తూర్పుసమీపమున నున్న ఈశాన్యమునకు వరుసగా ధనుస్సు, మకరము, కుంభము, మీనము, మేషము, వృషభము - ఇవి కనపడుచున్నవి. మన్మథుడు - ధన్వి అస్తమింపగానే మిథునము బాగుగా వెడలును.


ఉల్కాపాతములు

౧. సింహరాశిలో ఈ నవంబరునెల ౧౪ మొదలు ౧౬-వ తేదీ వఱకు ముఖ్యమైన ఉల్కాపాతము కనబడును. ౧౫-వ తేదీని చాల ఎక్కువగా కనబడును. ఉల్కలు విశేషముగా జారుప్రదేశము మనవారు పల్లకీబొంగు అనుచోటనుండి. దానినే పాశ్చాత్యులు కొడవలివంపు అని చెప్పుదురు. ఈయుల్కలు చూచి యానందింపదగియుండును. బహువేగముగల మెఱుపులట్లు ఇవి వేవేగ జారి పడుచుండును.

౨. తరువాత పేర్కొనదగిన ఉల్కాపాతము ఇంద్రమదప్రాంతములందు కనబడును. ఇవి యీనవంబరు ౧౭ మొదలు ౨౩ వఱకు ఉజ్జ్వలముగా కనబడును. ఇవి మెల్లగా పడుచుండును. వీటి కంత తొందర లేదు.

చిన్న ఉల్కలు

౬-వ తేదీని భృగుపరశుమండలములో చిన్న ఉల్కాపాతము. ౧౫-౨౬ తేదీలను వృషభరాశిలో చిన్న ఉల్కాపాతములు. ఈ యుల్కలు పూర్వపు తోకచుక్కల తునకలు.



కేదారగౌరీవ్రతము

—యస్. దుర్గారావు.



షష్టిపూర్తి

శతావధాని చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారికి అరవై యేండ్లు నిండినవట. ఇది అరువదినాల్గవసంవత్సరమని శాస్త్రిగారే చెప్పినారు.

కాని వారిమూర్తిని జూచిన " ఇది నిజమా ? " అనిపించును. వారియుత్సాహమును జూచిన "పొరపాటేమో" అనిపించును. వారియుద్రేకమును జూచిన "లెక్క తప్పినది" అని దృఢనిశ్చయము కలుగును.

అరవై యేండ్లనిన ఈకాలమున మధ్యవయస్సయిన గాదు; కాని త్రికరణయా కవిత నుపాసించువారి కుండెడి నిత్యయౌవనము శాస్త్రిగారికి ముమ్మరముగనే యున్నది.

అవధానము లనిన ఇప్పుడు జనసామాన్యమునకు మోజు చాలవరకు తగ్గిపోయినది; గాని చూడువా రుండిన శాస్త్రిగారికిమాత్రము వెనుకంజ లేదు.

రసికులకుగూడ కవితావినోదములయెడల ఉత్సాహ చాలనిరోజు లివి. అయినా సమయము చిక్కిన శాస్త్రిగారు వేదికమీద సింగపుగొదమవలె అకాండ తాండవము సేయుదురు.

శాస్త్రిగారికి ఏప్రభువును తనపేరోలగమున నిత్యకవితావినోదానందము చేకూర్ప లేకపోయినాడు; కాని శాస్త్రిగారే ప్రజలలో సొంతముగా నిండు కొలువు కల్పించుకొనినారు.

శాస్త్రిగారు మాట్లాడెదరనిన పండితులు కూడు దురు; రసికులు మూగుదురు; యువకులు విద్యార్థులు విరుచుకొనిపడుదురు. ఏల ?

శాస్త్రిగారు సాహిత్యాచార్యులు; ప్రబంధ పరమేశ్వరులు; నాటకప్రణేతలు; వాదప్రవీణులు; విమర్శకప్రముఖులు; సువక్తలు; హృదయము నుబ్బించు పాఠకులు.

ఇట్లు శాస్త్రిగారి తేజస్సు అపారమైనదే; కాని దానికి అట్టిదే క్రీనీడగూడ ఉన్నది.

శాస్త్రిగారు కలహప్రియులు; పరుషభాషులు; శీఘ్రకోపులు; ధౌర్త్యమునకు వెనుదీయరు. చిత్తు అగుదురు; కాని బుకాయింతురు.

అయితే, యిది శాస్త్రిగారియందే గలలోపమా? ప్రాయికముగా ఆంధ్రకవీశ్వరులకు ఉండు ప్రత్యేక లక్షణమా ?

ఇది చాలజటిలమైనప్రశ్న; కాని దీనికి ఇది తగినస్థలము కాదు.

కవు లనేకులు పాఠశాలలయందు, కళాశాలల యందు నుపాధ్యాయులైనవా రున్నారు. రికామీగా ఉండియు అనేకులకు పాఠములు చెప్పెడివారున్నారు. తన్మూలమున వారికి శిష్యులును అసంఖ్యాకులే యున్నారు; కాని యీవిషయమున శాస్త్రిగారివిశిష్టత ఏమిటంటే? శాస్త్రిగారిశిష్యులలో అనేకులు కవులు.

ఇంకొకటి : ప్రత్యక్షసంబంధము లేకపోయినా నేడు పద్యము లల్లువారిలో అనేకులు శాస్త్రిగారు తమకు గురువులని చెప్పుకొనుచు మురిసిపోవుచున్నారు.

ఆంధ్రకవులచరిత్రమున ఇది ప్రత్యేకముగ గుర్తింపవలసినవిషయము. ఏకాలమునందును, ఏప్రాంతమునందును ఇందరు కవిశిష్యులుగలకవి మరియొకడు లేడు.

10. 11- 19౫౩

ఇట్లు శాస్త్రిగారిశిష్యులసంఖ్యాకులనిమాత్రమే చెప్పిన చాలదు. శాస్త్రిగారిశిష్యులలో శివరామశాస్త్రిగారివంటిపండితు లున్నారు; ప్రభాకరశాస్త్రిగారివంటి పరిశోధకు లున్నారు. సుబ్రహ్మణ్యశాస్త్రిగారివంటి బోధకు లున్నారు; పట్టాభిరామశాస్త్రిగారివంటిపత్రికా సంపాదకు లున్నారు; లక్ష్మీకాంతముగారివంటికవు లున్నారు.

ఇంకా అలాంటి—అలాంటివారు ఎందరో ఉన్నారు.

వాస్తవముగా ఆంధ్రకవులచరిత్ర కిది, ఏభాషా కవులచరిత్రకును లేదని చెప్పదగిన విశిష్టత.

నిజమే. ఈసంఘటన మపూర్వమే.

అయితే, గురుడు అధ్యక్షుడుగను, శిష్యులు పాఠ పదులుగనుఉండి ఒకపరిపద్రూపమునఅపూర్వవాఙ్మయ నిర్మాణము • చేయదగినగురుకుల మిది; కాని ఆంధ్ర వాఙ్మయచరిత్రకు అట్టిఅమూల్యాలంకార మేర్పడలేదు.

గురువుతెన్నున గురువు, శిష్యులతెన్నున శిష్యులు గ్రంథములు, పరిశోధనములు, చర్చలు, విమర్శనములు—ఇంక నిట్టివి చేసి తమసామర్థ్యమును, తమప్రతిభను ప్రకటించుచున్నారు.

వ్యక్త్యపేక్షతో యీవ్యవసాయము వారికిని ఘనతకూర్చుచున్నది; వాఙ్మయమునకును పుష్టికలిగించుచున్నది; కాని అందరును ఒకవర్గముగ, ఒక సంఘముగ కూడి పనిచేసిన ఆయందము వేరు; ఆప్రయోజనమున్ను వేరు.

ఏతావతా: శాస్త్రిగారు భాషకు పదుగురు పండితులు కలిగింపగల ఉన్నతికంటె ఎక్కువకలిగించినారు; వాఙ్మయమునకు నూర్గురుకవులు సమకూర్పగల వికాసముకంటె అధికముగ సమకూర్చినారు.

నవీనకవులలో శాస్త్రిగారికంటె ఎక్కువగా దేశములు తిరిగినవారు, శాస్త్రిగారికంటె ఎక్కువగా రాజులను మెప్పించినవారు, శాస్త్రిగారికంటె ఎక్కువగా పండితులతోడను, కవీంద్రులతోడను డీకొనినవారు, శాస్త్రిగారికంటె ఎక్కువగా అనుభవములు పొందినవారు మరియొకరు లేరు.

ఇట్లు "దేశాటనం పండితమిత్రతాచ" అన్న సూక్తి శాస్త్రిగారియెడల పూర్తిగా అన్వయించినది; సార్థకమున్ను అయినది.

వాస్తవమే; కాని యీసంఘటనములవలన కలిగిన ప్రజ్ఞాపరిణతిని, ఒదవినచాతుర్యమును శాస్త్రిగారు వాఙ్మయమున పూర్తిగా నిక్షిప్తము చేయలేదు.

నానారాజసందర్శనము శాస్త్రిగారు పడిన పాట్లను, కొట్టినదెబ్బలను ప్రకటించుచున్నదే; కాని తత్ఫలితమును గాదు. గీరతమున్ను శాస్త్రిగారి వీరవిహారమునకు సినీమాఫిలుము కావచ్చునే కాని మహోన్నతయశోబింబమునకు వాఙ్మయాదర్శము కాదు.

అయినా శాస్త్రిగారు ఇంతవరకును చూపిన పురుషకారము వారికి జీవితసాఫల్యమును ఒనగూర్చుచున్నది.

బందరుపౌరులు శాస్త్రిగారికి చేసినపూజ ఆంధ్రజాతికి నవశక్తిని సంఘటించుచున్నది.

ఇక నొక్కసంగతిమాత్ర మున్నది.

ఈషష్టిపూర్తిమహోత్సవము శాస్త్రిగారికి ఆటవిడుపు కాదు- చేయవలసిన దింకను కలదను శంఖారావము; విశ్రాంతికి అనుజ్ఞయు కాదు- మరల నడుము కట్టవలసిన దను సింహనాదము.

మహాకవి చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు ఈయింగితమును గుర్తించి, బహుముఖముల చెదరియున్న తమ శక్తి నేకముఖము గావించుకొని, క్రొత్తమార్గమున, నవీనశైలిలో మరికొన్ని ఉద్గ్రంథములను రచించి, మరల—షష్టిపూర్తికి,కాదు కనకాభిషేకమునకు ఆవశ్యకమును కలిగించుకొందురుగాక!

—శాస్త్రి.

ఆంధ్రవిశ్వకలాపరిషత్తువారి దేశభాషాపరీక్షలు

తెలుగునాడన్నా, తెలుగువాడన్నా, ఊరూ పేరూ లేకుండాపోయి చాలాకాల మయింది. అయినా కీడులో మేలు అన్నట్లుగా తెలుగుమంత్రి పానగల్లు రాజాగారిభాగ్యాన "ఆంధ్రవిశ్వకలాపరిషత్తు ఏర్పడింది. అదీ దెబ్బలు తినితిని అనంతపురంమూలనుంచి వాల్తేరు పరుగెత్తింది. పోనీ దానికే మనకుంటే పేరుమట్టుకే ఆంధ్రవిశ్వవిద్యాలయం కాని అందులో ఆంధ్రత్వంమట్టుకు శూన్యం అవుతోంది. అధికారవర్గానికి ఆంగ్లేయాభిమానం- ఆశ్రితవర్గానికి సంస్కృతాభిమానం. ఇక తెలుగుమాటేమిటి? "ఉద్ధతులమధ్య పేదలకుండదరమే" అనుకొంటూ పరుగెత్తవలసిందేనా?

అసలుకళలూ శాస్త్రములూ దేశభాషలో నేర్పవలెననే ఉద్యమం సాగినప్పుడు ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉంటే అది సాధ్యపడుతుంది అని వ్యాసాలు వ్రాస్తుండేవారు తెలుగువారు. విశ్వవిద్యాలయం వచ్చినతరువాత ఈకలియుగం వుండగా అట్టిశుభదినాలు రావడం దుర్ఘటమని తెలిసింది.

అన్నీ అలాగున్నా ప్రాచ్యభాషాపరీక్షల్లోనైనా ఆంధ్రం నిలుస్తుందని నేటివరకూ జనాభిప్రాయం. ఆ ఆశకూడా పడవద్దంటోంది విశ్వకలాపరిషత్తు నేడు.

బి. ఎ. క్లాసులో ప్రత్యేకపు తెలుగుభాగం ఏర్పాటుచేస్తూ ప్రాచ్యపరీక్షలకు ఎ, బి, సి- లనే గుర్తులతో అనగా ఎ. సంస్కృత ప్రాధాన్యం; బి. తెలుగుప్రాధాన్యం జేస్తూ తెలుగుకు అవసరమైన సంస్కృతంతో కలపడం; సి. తెలుగుమాత్రమే, గలిగిన పరీక్షలుకూడా నిర్మించి మొదట కొంత ఆంధ్రత్వం చూపింది ఈకళాపరిషత్తు.

ఈనాటికి విశ్వకలాపరిషత్తువారికి గల్గిన అనుభవాన్నిబట్టి మూడూ కోసివేసి వాటిస్థానే "ఆంధ్రవిద్యాప్రవీణ" పేరుపెట్టి సంస్కృతంవిధి చేసిన పరీక్ష ఏర్పాటు చేయదలంచుచున్నారని వినికిడి.

సంస్కృతంవస్తే తెలుగువచ్చినట్లే అని అభిప్రాయపడ్డారా? అందుకు "సంస్కృతారణ్యసంచారి విద్వన్మత్తేభశృంఖలమ్" అన్నసామెత సమాధానం.

సంస్కృతసాహిత్యసంబంధం లేకుండా తెనుగు ఆనర్సుపరీక్ష ఒకటి ఉండనేఉందిగనుక ఓరియంటల్ డిగ్రీ సంస్కృతప్రాధాన్యం చేస్తే మంచిదని అభిప్రాయపడ్డారా? వ్యక్తులు వేరయినప్పుడు వారి తెనుగూ, వీరిసంస్కృతమూ మేళగించడ మెట్లా సాధ్యపడుతుంది?

అదికాదు; తెలుగు చెప్పడానికి ఆనర్సువారూ, సంస్కృతం చెప్పడానికి ఆంధ్రభాషాప్రవీణులూ పనికివస్తారు దేనికి అంటారా? ఆడిగ్రీ 'గీర్వాణప్రవీణ' అంటే బాగుండదా?

ఇన్నిపల్టీ లెందుకు? ఉన్నది ఉన్నట్లుంటే ఏమినష్టం వచ్చింది అని ఈమార్పు తీసుకురావాలి? అది లోకానికి అర్థం కావడం లేదు.

ఆంధ్రమునకు సంస్కృతం అవసరమని అందరూ ఒప్పుకొంటారు గాని ఆంధ్రమును ప్రధానం చేయక పోవుట అసంగత మంటారు. ఇంతకంటె ఈపరీక్షలు అసలే తీసివేస్తే బాగావుంటుంది. దేశంలో ఆంధ్రభాషకు జీవం పోయుచున్న పండితులూ, కవులూ విశ్వవిద్యాలయంవారి డిగ్రీలు పుచ్చుకొన్నవారేకారు. పాండిత్యమూ, పేరూ సంపాదించి వాఙ్మయంలో స్థానం సంపాదించుకొన్నవారిని ఇదివరకు కలాశాలలూ పాఠశాలలూ పండితులుగా స్వీకరించడం జరుగుచున్నపనే. వీరు పెట్టినపరీక్షలవల్ల తెలుగుకు వచ్చేబలుపు ఏమి?

ఈచీదర మాని ఉన్నపరీక్ష లున్నట్లుంచి తెలుగుకు ప్రత్యేకగౌరవం తేవడానికి విశ్వవిద్యాలయం వారు ప్రయత్నిస్తే దేశసౌభాగ్యానికి తోడ్పడినవారవుతారు.

ఆంధ్రానకు ప్రత్యేకత్వం తేవడానకు సంకల్పించిన చాళుక్యరాజరాజునా డారంభించినవ్యాకరణ మీమాంస పూర్తిచేయించాలి. దేశ్యపదజాలము నేర్చి కూర్చిన తిక్కనగారిప్రయత్నంలో ఉన్నరహస్యం కనిపెట్టి ఆకవిబ్రహ్మ పోసుచేసినపదజాలం నికరం తేల్చ

కుని ఈకాలంలోని దేశ్యపదాలుకూడా సంగ్రహించి సంస్కరించాలి. అక్కడకు సంపూర్ణవ్యాకరణమూ, సంపూర్ణకోశమూ తయారయితే ఆంధ్రం మాటే ఏదో నిర్ణయమౌతుంది. అపుడు ఏపరీక్షలు ఎట్లా నిర్ణయించాలో ఆలోచిస్తే అందమూ చందమూను.

ఇందుకు కొన్నిలక్ష లవుతుంది, డబ్బేది అంటే, డబ్బు ఖర్చులేదుగనుక బాగా ఆలోచించి పరీక్షలు తలక్రిందులు చేయడ మెందుకు?

ప్రకృతిశాస్త్రాలకు జయపురప్రభు విచ్చినట్లు భాషలకుమాత్రం ఏధర్మాత్ముడైనా దానం చేయకో పోతాడా ప్రయత్నిస్తే.

రాజరాజు విద్యాపరిషత్తుదారితీస్తే మనుమసిద్ధిరాజధానిలో మహిమ గన్పించింది. విద్యానగరాల కళామయమైనదేకాని ప్రత్యేకాదర్శం త్రొక్కలేదు: రానురాను తెలుగుతల్లికి విద్యాకేంద్రమూ రాజకీయకేంద్రమూ లేకుండాపోవడంచేతనూ, చిన్నరాజ్యాలేర్పడడంచేతనూ భాషావిషయం వెనుక పట్టింది. ఆంధ్రవిశ్వవిద్యాలయమే ఆంధ్రవాణికి ముఖ్యకేంద్రం చేయాలంటే నన్నయ తిక్కనలు చూపించినదారిని స్వాతంత్రం సమకూర్చి ఆపిమ్మట తెలుగులో పరీక్షలు నిర్ణయించడానికీ, తెలుగులో శాస్త్రములూ, కళలూ నిర్మించి, కలాశాలలు నడపడానికీ సాధ్యపడుతుంది. ఆమహాప్రయత్నం సాగించడానికి తగ్గమనుష్యులను తయారుచేయడానికే ఈపరీక్ష లిట్లా మార్చుచున్నామంటారా? విద్యాసముద్రులూ దేశ, భాషా, సంప్రదాయజ్ఞానాలుకలపండితులూ నేడుండనే ఉన్నాకు పనిచేయిస్తే; ఇపుడు నిర్ణయించబోయేనూత్నవిధానంప్రకారం పరీక్షలలో ఉత్తీర్ణులయినంతమాత్రంచేత ఆంధ్రానికి స్వతంత్రవ్యక్తిత్వం ఇచ్చేటంతపూర్ణులు కాలేరు. అందుకు అనుభవంకావాలి.

ఆంధ్రభాషనూ ఆంధ్రవిజ్ఞానాన్నీ వృద్ధిలోనికి తెచ్చేతలంపుతోటే ప్రత్యేకవిశ్వకలాపరిషత్తుకోసం అష్టకష్టాలూ పడింది ఆంధ్రదేశం.

అన్నీ ఆంగ్లంలోనూ, గీర్వాణంలోనూ చెలాయిస్తూ "ఆంధ్రవిశ్వవిద్యాలయం" అనేపేరుమాత్రం స్మారకచిహ్నంగా ధరించడానికి కాదుగదా?

"స్వదత్తా ద్ద్విగుణం పుణ్యం పరదత్తానుపాలనం" అన్నారు. ఒకపుష్కరం ఆంధ్రదేశం ఆందోళనచేసి సంపాదించుకొన్న విశ్వకలాపరిషత్తులో తెలుగుతేజాన్ని చంపవద్దనియే ప్రార్థన.

౧. భాషాపదకోశము, పారిభాషికపదకోశము. రి
౨. సమగ్రవ్యాకరణము.
3. భాషానిర్మాణచరిత్రము.
౪. వాఙ్మయపరిణామచరిత్రము.

మొదలగునవి తయారుచేయించి తెలుగు స్వతంత్రభాష కాగలదో లేదో ఆలోచించడం న్యాయం.

గీర్వాణభాష అభ్యసింపదగినదే భారతీయునకు. దేశభాషకుమాత్రం విజయం రావాలి. అదే ఆంధ్రలోకంయొక్క ఆదర్శం అని విశ్వవిద్యాలయపాలకవర్గానికి జోహారు జేసి విన్నవించుచున్నాను.

—తు. వెంకటరామయ్య.

నాగార్జునకొండ - బౌద్ధస్తూపము

కపిల కాశీపతిరావు

నాగార్జునుడు మహాత్ముడు; బౌద్ధసన్న్యాసి. ఇతని పేరుతో నాగార్జునశకము ఉన్నదని వాడుక. నాగార్జునకొండ ఈ యోగినివాసము. శాతవాహనుడనే రాజు నాగార్జునిడి సమకాలికుడని హ్యూయన్సియాంగు వ్రాసియున్నాడు. హ్యూయన్సియాంగు తీర్థవాసి, చీనాదేశస్థుడు. భారతదేశానికి యాత్రార్థమై వచ్చినఅన్యదేశీయులలో ఇతడు ముఖ్యుడు. ఆసేతుహిమాచల పర్యంతమూ సంచరించి, తన అనుభవాలు, అప్పటి హిందూదేశపు పరిస్థితులు ఒకగ్రంథముగా వ్రాసినాడు. బౌద్ధమహాయుగపు చరిత్రసమకూర్చుటలో ఈగ్రంథము చాలాసహాయపడినది.

శాతవాహనుడు నాగార్జునిడి మిత్రుడు, పోషకుడు అని, ఈయోగి నివసించడానికి పర్వతప్రాంతములో గుహాలయము నిర్మించినాడని హ్యూయన్సియాంగు వ్రాసినాడు. నాగార్జునుడు రాళ్లను బంగారుగా మార్చి, మిత్రుడు, శిష్యుడుఅగు శాతవాహనుని కిచ్చినాడట. ఇతని పేరుతో నాగార్జునకొండ అనే పెద్ద పట్టణం ఉండేది. రాజు తనప్రజలతో నివసించడానికి ఒకదుర్గం, బౌద్ధభిక్షులు నివసించడానికి ఒకచక్కనివిహారం ఉండేవి. ఈనగరవాసులు బహు నాగరికులు.

శకాద్దివిషయములు తప్ప ఈనాగార్జునుణ్ణి గురించిగాని, ఆనగరాన్ని గురించిగాని ఎవరికీ తెలియదు. ఈపట్టణం ఎక్కడో, ఏమూలో, వెదుకవలెనని మహాపండితులు ప్రయత్నించారు. ఆచోకీ చిక్కలేదు.

ప్రాచీనభారతీయులు చరిత్రకారకులేగాని రచయితలుగారు. తత్కారణంగా మనదేశచరిత్ర అన్యదేశాలనుండి గ్రహించవలసివచ్చినది. అన్యదేశీయులే ఈవిషయంలో మనకంటె ఎక్కువకృషి చేసినారు. హ్యూయన్సియాంగు పొరబాటున ఈసంగతి వ్రాయకపోతే బౌద్ధమహాయుగంలో ఒకశకం, హిందూదేశచరిత్రలో ఒకఅధ్యాయం శాశ్వతంగా అంతరించిఉండేవి. అటువంటినాగార్జునకొండ ఎక్కడో ఈనాటికికూడా చాలామందికి తెలియదు.


నాగార్జునుడు ఆంధ్రుడు, నాగార్జునకొండ ఒకానొకప్పుడు ఆంధ్రనగరం. అవి ఆంధ్రజ్యోతి తక్కిన దేశాలకు వెలుగిచ్చిన సుదినాలు.

పల్నాటిసీమలో, కృష్ణాతీరాన్న, కొండలలో, కీకారణ్యమధ్యంలో, నాగజెముడుకంపలలో, ఎండకు ఎండి, వానకు తడిసి, రెండువేలసంవత్సరాలుగా కాలదేవతను ధిక్కరించి పౌరుషంతో నిలువబడ్డ రెండుమూడుశిలాస్తంభాలు తప్పవేరేబాహ్యచిహ్నం లేకుండా నాగార్జునకొండ అనేమహానగరం అంతస్థమై ఉన్నదని ఈవరకు “నరమానవులకి” తెలియదు.

బౌద్ధమతం కృష్ణాతీరాన్న ఆశ్రయించినది. ఉద్రేకపూరితులైన ఆంధ్రులు పూర్వంనుంచీ నూతనత్వంకోసం తహతహలాడేవారే. నూతనమైన బౌద్ధమతాన్ని ఆరోజులలో వీరు స్వీకరించినారు; బౌద్ధమతంతో ఆంధ్రత్వము మేళవించినారు. శూన్యమైన సన్న్యాసమతం నవకళలతో రాజిల్లి చక్కనివాఙ్మయం, చక్కనిలలితకళలు ఉద్భవించినవి. అజంతా, అమరావతి దేశదేశాల పేరు గాంచినవి. జగ్గయ్యపేట, బెజవాడ, ఉండవల్లి, ఘంటసాల, గుడివాడ, భట్టిప్రోలు, ఈప్రదేశాలన్నిటిలోగూడా స్తూపములు, బౌద్ధమతచిహ్నములు దొరికినవి. ఈక్షేత్రాలన్నిటికీ మకుటం నాగార్జునకొండ, అన్నిటికిపైగా “ఉత్తమం పర్వతాగ్రేషు” అన్నట్టు కొండమీద కృష్ణాతీరాన ఉన్నది. గుంటూరుజిల్లా; పల్నాడుతాలూకా మాచెర్లగ్రామానికి పదహారు మైళ్లదూరంలో నాగరికులకు చాలాదూరంగా ఉంటుంది. నాలుగైదుసంవత్సరాలక్రితంవరకు నవనాగరికతాచిహ్నములైన మోటారుబూరాలు, రైలుబండికూతలు, ఈ

ప్రాంతములలో వినబడలేదు. గుడ్డిమూలలలో గుడ్లగూబలు, రాచనగళ్లలో వన్యమృగములు నివసిస్తున్నవి. ఇప్పటికికూడా రెండెడ్లబండిమీద రెండామడప్రయాణం చేస్తేనేగాని మానవత్వంలో పడడం కష్టం. దుర్భేద్యమైన ఆప్రదేశాన్ని త్రవ్వి పైకితీసినవాడు ఒకతెల్లదొర, దక్షిణహిందూదేశపు ఆర్క్యాలాజికలు డిపార్టుమెంటు అసిస్టెంటుసూపర్నెంటు, ఎ. హెచ్. లాంగుహర్స్టుగారు.

విలువ ఇంతని నిర్ణయించరాని బౌద్ధస్తూపములు, చైత్యములు, విహారములు, శాసనములు, శిల్పకళ ఈ ప్రదేశంలో దొరికినవి. గ్రీసు, చీనా, కాశ్మీరము, తిబెత్తు, గాంధారము, తూసలి, అపరాంత, వంగ, వనవాసి, తామ్రపర్ణి, సిలోను మొదలుగాగల సమస్తదేశములలోను ప్రఖ్యాతిగాంచిన ఈ మహాపట్టణం, సర్వవిధాలంకృతమై కొన్నివేలసంవత్సరాలక్రిందరాలిన్నది. సర్వదేశాలనుంచీ యాత్రికులు, పండితులు,



[1] నాగార్జునకొండ బౌద్ధస్తూపము నమునా. × గుర్తుగలచోట బుద్ధునిశల్యములున్న బరణి దొరకినది.

శిల్పోపాసకులు, మతాచార్యులు, ప్రస్తుతం నిర్జనారణ్యంక్రిందవున్న ఈనగరానికి తండోపతండాలుగా వచ్చినట్టు తార్కాణ దొరికినది. ఇప్పటివలెనే పూర్వం కూడా ఈప్రదేశానికి భూమిమీద ప్రయాణం చెయ్యడానికి వీలున్నట్లు లేదు. నేలమార్గం ఏమీ కనబడదు. సముద్రంమీదుగా వచ్చి కృష్ణాముఖద్వారంలో నుంచి నావ ప్రయాణం చేసి ఈపట్నం చేరివుంటారు. లాంగుహర్ట్సుగారు నగరంలోనుంచి నదిలోకి ఉన్న ఒక కాలువజాడ తీసినారు. అవి ఆంధ్రనావికులు సముద్రాలు ఏలినరోజులు కావచ్చును. ఇప్పుడు లంకలు గట్టి మేటవేసినదుందుడుకు కృష్ణవేణమ్మ ఆరోజులలో వీరినావలకు ఆశ్రయం ఇచ్చిందన్నమాట. బోడిరాళ్లలో బొర్లపడుతూ చిందులుతొక్కే కృష్ణవేణిపార్శ్వంలో, వృక్షజాతి వంతులువేసుకుని ఆకాశాన్ని అంటుకుంటూన్న వనమధ్యంలో, అరుల కభేద్యమైన పర్వతాగ్రములలో, యోగిపుంగవులకు, భిక్షువులకు హృదయశాంతి, రాజాధిరాజులకు, వారిప్రజలకు వైరిపోరు లేకుండా సర్వశాంతి కూర్చినది ఈనాగార్జునకొండ. శిథిల విహారములతోపాటు ఒకశిథిలదుర్గంకూడా ఇక్కడ చూడనగును.

మతస్థాపకుడు, అవతారపురుషుడు, గౌతమబుద్ధుని స్మారకంగా లోకందాచుకున్న కొద్దిశిల్పములలో ఒకటి ఈనగరంలో ఉన్నస్తూపములో రహస్యముగా దాచబడినది.

హిమాచలప్రాంతములనుండి వెతుక్కుంటూ దక్షిణాపథంజేరి, ఇక్కడ ఆశ్రయం ఏర్పరుచుకుని, ఒకకొంతకాలము పూజింపబడి, కానిరోజులకష్టములు భరించి తిరిగి రెండువేలసంవత్సరాలకు మళ్లీ ఉత్తరదేశం చేరుకున్న దీఅమూల్యశిల్పము. వెనకటి కెప్పుడో ఉత్తరహిందూస్థానంలో వున్న ఈస్మారకచిహ్నములకు వైరిమతస్థులవల్ల అపాయం వచ్చిందనీ, ఒకరాజు ఆచిహ్నములు తనకొమార్తె కిచ్చి నావ యెక్కించినాడనీ, ఆమె కృష్ణాతీరాన అమరావతి చేరి అక్కడ రాజుల సహాయమువల్ల స్థాపించి స్తూపములు నిర్మించినదనీ, కథ ఎక్కడో విన్నట్టు జ్ఞాపకము. అందులో ఈ నాగార్జునకొండలో ఉన్నచిహ్నం ఒకటి కావచ్చు. అంత అమూల్యంగా దాచబడి దేశదేశాలు ప్రయాణం చేసిన ఈ చిహ్నం మళ్లీ ఈనాటికి ప్రయాణం సాగించింది. మహాబోధిసత్వసంఘంవారు అనాగరికధమ్మపాలు డనే సుప్రసిద్ధబౌద్ధాచార్యుని ఆధిపత్యంకింద, వారణాసికి సమీపంలో, సిద్ధార్థుడు ప్రథమోపన్యాసం చేసినచోట, సారనాథులో మూలగంధకుటీ విహారమను పేరిట దివ్యమైనబౌద్ధాలయం నిర్మించినారు. క్రీ. శ. ౧౯౩౨ డిశంబరు ౨౬-వ తారీకున ఈ ఆలయానికి శంకుస్థాపన మహోత్సవము జరిగినది. ఆశుభసమయంలో నాగార్జునకొండవద్ద దొరికినబౌద్ధచిహ్నము ఇండియా ప్రభుత్వముతరపున రాయబహదూర్ లాలదయారామ సాహినీ గారు (డైరెక్టరు జనరలు ఆఫ్ ఆర్కియాలజీ) బోధిసత్వ సంఘానికి కానుకగా సమర్పించినారు.

వేనవేలు జనం బౌద్ధులు, తదితరమతస్థులు బుద్ధదేవుని పాంచభౌతికదేహములో భాగమైన ఈ అమూల్యశల్యాన్ని దర్శించుకోడానికి అక్కడ మూగినారు. టిబెత్తు జపానులనుండి యాత్రికులు వచ్చినారు. ఆనాడు మొదలు ఈదివ్యచిహ్నము తిరిగి పూజింపబడుచున్నది. బౌద్ధమతానికి జన్మస్థలంలో పునర్జీవనం కలుగజేయడానికి ఇన్నాళ్లుగా ఈఅమూల్యం నాగార్జునకొండలో తలదాచుకున్నది.

నాగార్జునకొండ త్రవ్వినప్పుడు స్తూపంలో మారుమూల రహస్యంగా భద్రపరిచిన ఒకచిన్నబరిణ దొరికినది. స్తూపాకారంగా చెక్కబడిన ఈబరిణ రెండున్నర అంగుళముల ఎత్తుగలిగి అనేకామూల్యవస్తులతో నిండిఉన్నది. సువర్ణపుష్పములు, ముత్యములు, అనేకములయిన ఇతరమణులు, రాళ్లు, ముఖ్యముగ బౌద్ధశల్యము ఇందులో దొరికినవి. బటాణీగింజకంటె చిన్నదిగా ఉన్న ఈశల్యము ఎంతఆప్యాయంగా వారు దాచుకొన్నారో ఊహ్యము.

ఈప్రదేశంలో త్రవ్వబడిన ఆలయములలో మహాచైత్యము ముఖ్యమైనది. సిలోనులో అనూరాధపురంతో తప్ప ఇంత మహోన్నతమైన బౌద్ధాలయం మరెక్కడా కానరాలేదన్నారు. భిక్షులు నివసించే విహారమంతో పైకి తీయబడినది. పురానికి సంబంధంలేకుండా విహారము కొండమీద నిర్మించబడినది. ఈప్రదేశంలో నేచూడడానికి వచ్చినవారు విశ్రాంతి తీసుకునేటందుకు ప్రస్తుతం సర్కారువారు ఒకచిన్న మందిరం నిర్మించినారు. విహారముపునాదులవరకు త్రవ్వగా చిన్నచిన్న గుహలవలె ఉన్న నిర్మాణములు బహిర్గతమైనవి. బహుశః అవి భిక్షుల నివాసము లైయుండవచ్చును. ఆవరణంలో మధ్య నలుచదరంగా కట్టిన ఉన్నతప్రదేశం ఉన్నది. ఇది ప్రార్థనామంటపము. సింహళద్వీపవాసులైన భిక్షులకు ప్రత్యేకనివాసము లున్నట్లు కనబడును. విహారానికి తూర్పుగా పర్వతంమీద మహాచైత్యాలయం ఉన్నది. దీని మొదట్లో అనేకశిల్పములు దొరికినవి. చైత్యము చుట్టూ చలువరాతి పలకలమీద చెక్కినశిల్పముల అలంకారములున్నవి. ఈపలకలమీదస్తూపపునమూనాలు చిన్నవిగా చెక్కబడినవి. స్తూపపు అసలుఆకారం భావించుకోవడానికి ఈనమూనాలు సహాయపడును. ఇవి సూక్ష్మంగా ఉన్నప్పటికీ అసామాన్యమైన శిల్పకళ ప్రదర్శిస్తున్నవి. హిందూదేశం అంతలోనూ ఇటువంటి అమూల్యమైనశిల్పకళ దొరకలే దన్నారు, లాంగుహర్స్టుగారు. ఇవి ప్రత్యేకతరగతికి సంబంధించినవట. దంతపుపనికీ సరిపోల్చదగిన ఈ శిల్పకళలో, స్త్రీ పురుషుల శరీర సౌష్ఠవమే కాకుండా, వివిధరీతులైన మనోవైచిత్ర్యములుకూడా అద్భుతంగా నిరూపించబడినవి.

గౌతమబుద్ధుని జీవితకథలే వీరిశిల్పకళకు ప్రధాన విషయము. కాని, ముఖ్యశిల్పానికి ఇరుపక్కలాకూడా ఆంధ్రుడు శృంగారం వొలకపోసినాడు. హిందువుల గుడిమీదిబొమ్మలే ఈబౌద్ధస్తూపాన్నికూడా అలంకరించినవి. ఇది బౌద్ధమతానికి కొత్తదైనా ఒకప్రాచీనఆంధ్ర సంప్రదాయమై ఉండవచ్చు. ఇదేకాక బుద్ధదేవుని జీవితకథలలో కూడా కొన్నిమార్పులు, నూతనవిషయములు కనబడును. కథలనుకూడా దేశకాలపాత్రలను అనుసరించి మార్పులు కలుగుతూఉంటవి. అందువల్ల ఈనూతనవిషయాలు స్థానికసంప్రదాయములను అనుసరించివచ్చినవని తోస్తుంది. ఈకొత్తసంగతులవల్ల చిత్రించినశిల్పాలలో కథను గుర్తించి నిరూపించడం కొంచెంకష్టంగాఉన్నది.

వీటిలో ఇంద్రుడు బుద్ధుడిమీద వజ్రాయుధం ప్రయోగించడం, ఒకరాజపురుషునిఒడిలో ముడుచుకునికూర్చున్న గొర్రెపిల్ల, హనుమంతుడు ముగ్గురు వ్యక్తుల్ని మోసుకుపోవడం ముఖ్యమైనవి. అకస్మాత్తుగా చూస్తే ఈకళలలో, హిందూ, బౌద్ధ, క్రైస్తవ సంప్రదాయములు ఉన్నవనిపిస్తున్నది కాని కాలనిర్ణయాన్ని బట్టి చూస్తే క్రైస్తవ సంప్రదాయాలు రావడానికి వీలు కనబడదు.

ఇక్కడిముఖ్యశిల్పముల కథలలో ఛద్దంతజాతకము, శశజాతకము, వెస్సంతరజాతకము, కపిజాతకము, నందకుమారుని మతస్వీకారము, దేవదత్తుడు నలగిరి అనే ఏనుగును బుద్ధునిమీదికి తరుముట, మారుడు అనే నీచదేవతతో బుద్ధుడు పడ్డ అవస్థలు కొన్ని. ఒకశిల్పాకారము రోము దేశపుయోధునివలె ఉన్నది. ఈదృశ్యమే చాల ఆశ్చర్యంగా ఉన్నది. దీనికితోడు కొన్నిరోమీయనాణెములుకూడా ఇక్కడ దొరికినవి. ఆనాడు ఆంధ్రులకు రోముతో రాకపోక లుండిఉండవచ్చు. గ్రీసుదేశపు సంప్రదాయములుకూడా ఉన్నవని శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు. పాశ్చాత్యపండితులవాదన ప్రకారం మనకళలలో గ్రీకు రోమనుచిహ్నము లున్నవని కొందరివిశ్వాసం. కాని సాంచీస్తూపములమీద తమఅభిప్రాయం తెలియజేస్తూ మహాపండితులు, మొహెంజొదారో పైకి తీసినవారు అగు సర్ 'జాన్ మార్షలుదొరవారు. ఈపాశ్చాత్యవాదన అత్యంత దూరం తీసుకువెళ్లడం పొరబాటని చెప్పినారు. రోమనుపద్ధతిని వస్త్రముధరించిన బౌద్ధవిగ్రహము ఈ విపరీతవాదుల ప్రధానాంశము. కాని ఈనాటికీ ఉత్తరహిందూస్థానంలో వస్త్రం ఆవిధంగా ధరించడం ఉన్నది. ఈ

ఆచారము రోమునుండి ఇండియాకు వచ్చి ఇక్కడ నిల్చిపోయినదనేకంటే ఇక్కడకూడా ఉండే దనడం ఎక్కువసమంజసంగా ఉంటుంది. నాగార్జునకొండలో అనేకమృగముల శల్యములుకూడా కుండలలో దాచబడి ఉన్నవి. ముఖ్యంగా కుందేలు, ఎద్దు ఎముక లున్నవట. బుద్ధదేవుని శల్యము లేకాక ఆయనపూర్వావతారములోని మృగములశల్యములుకూడా భక్తులైనభిక్షులు దాచుకుని పూజించి ఉంటారు.

ఇక్కడ బహిర్గతమైన శాసనములు అలంకారయుతమైన బ్రాహ్మీలిపిలో ఉన్నవి. వీటిలో ఆప్రాంతాల రాజ్యమేలిన రాజకుటుంబముల కథలు కొన్ని ఉన్నవి. వీనిలో ఛాంతిశ్రీ అనేరాచకుమారి నామము చాలసార్లు వచ్చినది. ఈమె ప్రోత్సాహమువల్లనే మహాచైత్యాలయము నిర్మించినట్లు తెలుస్తుంది. నూతనమైన బౌద్ధమతము, నాగార్జునముఖంగా, అంతఃపురస్త్రీలు ఎక్కువ ఉత్సాహంతో స్వీకరించారని పండితాభిప్రాయము. ఛాంతిశ్రీ వీరపురుషుడనే రాజేంద్రుడిఒంఘువట. ఈకుటుంబంలో చివరివాడు బాహుబలుడనేరాజని కూడా తెలుస్తుంది.

అన్నాళ్లు ఆంధ్రదేశాన్ని ఆశ్రయించినబౌద్ధమతం శంకరాచార్యుడు విసరిన హిందూప్రచారం అనే తుపానుతో ధ్వంసమయిపోయినదీ. శంకరస్వామి రాకతో ఆంధ్రబుద్ధు డంతరించినాడు. బౌద్ధతీర్థములన్నీ హిందూక్షేత్రములుగా మారిపోయినవి. అమరావతిలో అమరేశ్వరస్వామి వెలసినాడు. ఉండవల్లి గుహాలయంలో విశ్రాంతి తీసుకున్నబుద్ధుడు అనంతపద్మనాభస్వామిగా మారిపోయినాడు. వాటితోనేపోయినది ఆంధ్రులశిల్పకళ. అజంతా, అమరావతి, నాగార్జునకొండ నిర్మించిన ఆంధ్రుల శిల్పచాతుర్యం, భాగవతం ఆంధ్రీకరించిన పోతరాజుకవిత్వమాధుర్యం. రామాయణం కృతులుగా పాడినత్యాగరాజుసంగీత నైపుణ్యం తెనుగువారి కిప్పుడు కథలు. అవి వెనుకటి రోజులు.

* * * *

[భారతపురాతన వస్తుపరిశోధనశాఖవారు ప్రకటించిన వార్షికనివేదిక (౧౯౨౭-౨౮) నుండి మరి కొన్నివిషయములు ఇట్లు తెలియవచ్చుచున్నవి:

—సం. భా.]

ఇటుకసున్నములతో నిర్మింపబడి యండాకారమునఉన్న యీమహాచైత్యము అయిదడుగుల యెత్తును, నూటరెండడుగుల వ్యాసమును గల యొకపీఠముపై నానియున్నది. కలశపు పైభాగమంతయు శిథిలమయినది. దీనిచుట్టును ప్రదక్షిణపథమును చుట్టి యొక యిటుక గోడ గలదు. ఈ ప్రదక్షిణపథము పదుమూడడుగుల విశాలము (చిత్రము ౧). నాలుగుప్రక్కల నాలుగు ద్వారములు. చైత్యమువలెనే గోడయు, ద్వారములును కూడ ఇటుకసున్నములవే. చైత్యముక్రింది పీఠమునకు ఏడడుగుల వెడలుపుగల తలము గలదు. నాలుగు ప్రక్కల ద్వారములకెదురుగ నీపీఠము విషమచతురస్రముగ ముందుకుబికినది. ఈ నాలుగు వేదికలందును ఒక్కొక్కటికి అయిదుచొప్పున ఇరువది పెద్ద గచ్చు స్తంభములు గలవు. ఈ స్తంభముల ప్రకాండపుటడుగు భాగములందే ౧౯౨౭ లో కొన్ని ఇక్ష్వాకువంశశాసనములు ముఖ్యమైనవి దొరకినవి.

చైత్యము బౌద్ధుల చిహ్నమగు ధర్మ చక్రమునాకారమున నిర్మింప బడినది. దానిలోని ఇటుక గోడలన్నియు ఆ చక్రముయొక్క ఆకులు. గోడల నడిమిభాగమంతయు మట్టి నింపబడినది. ఇట్టి చక్రాకారపు స్తూపములు ఒక్క దక్షిణదేశముననే కానవచ్చుచున్నవి. ఉత్తరదేశమున, స్తూపములన్నియు రాతితోనో, ఇటుకతోనో, పూర్ణగర్భముగ నిర్మించుట అలవాటు. గోడలనడిమిప్రదేశములనున్న మట్టినంతయు ప్రయాసపడి బయటికి తోడివేయగా ఒక మట్టికుండయందు కొన్ని అవశేషములు దొరకినవి. కుండనిండ ఎఱ్ఱమట్టియు, అంచుకు చేరువగ కొన్ని తెల్లపూసలు నుండినవి. (చిత్రము౧౦) ఈఅవశేషములన్నియుబుద్ధునివిగానే పరిశోధకు లూహించిరి. ౹౹ అంగుళము వ్యాసము గల యొక బంగారు బరిణలో బరాణిగింజపరిమాణముతో

నొక అస్థిక అగుపించినది. ఈ బరిణయు, మరికొన్ని బంగారుపూలు, ముత్యములునుచేర్చి యొక వెండి డబ్బిలో పెట్టబడినవి (చిత్రము ౧౩).

చైత్యములోని శాసనములు సుమారు క్రీ. శ. మూడవశతకము నాటివి. శాసనముల లిపి బ్రాహ్మి.

ఇవి, మరికొన్ని ఆధారములవలన దీనిలోనివి బుద్ధుని ధాతుశేషములనియు, దీనిని క్రీ. శ. రెండు మూడు శతకములలో ఆంధ్రదేశమునేలిన ఇక్ష్వాకు వంశమునకుచేరిన శాంతిశ్రీయనునామె స్థాపించెననియు ఊహించిరి. ఇటువంటివే బుద్ధధాతుశేషములు కొన్ని భట్టిప్రోలు స్తూపములోగూడ చిక్కినవి.

ఇదితుదిగ జరిగిన పరిశోధనలవలన మూడు సంఘారామములు, ఆరు దేవాలయములు, పెక్కుస్తూపములు బయలుపడినవి. ఈస్తూపములలో చాలవాటియందు ఆయకస్తంభములని కొన్ని స్తంభములు గలవు. ఈ మహాచైత్యమునకు దక్షిణపశ్చిమమున, అనతిదూరమున గల యొక చిన్నస్తూపమున ౨-వ చిత్రములో చూపిన స్తంభమువంటివి, నాలుగు దొరికినవి. అందులో నొకదాన బుద్ధుని నిర్వాణము స్తూపరూపమున చిత్రింపబడినది. స్తంభశిరమున బుద్ధుని ప్రథమప్రవచనము చిత్రింపబడినది.

ఆ మూడు సంఘారామములలోను మొదటి రెండును నాహారల్లబోడు అను కొండపై గలవు; మూడవది యాకొండకు పడమటనున్న యొక గుట్టపై గలదు. మొదటి సంఘారామమున ౬౪ అడుగుల చదరపుబయలు గలదు. దానిచుట్టును ౨౪ గుహలు బౌద్ధబిక్షువుల నివాసములు గలవు. గుహలన్నియు ౭ అడుగుల చదరముగలిగి యిటుకలతో నిర్మింపబడినవి.

రెండవ సంఘారామముగూడ పైదానినే పోలియున్నది. కాని చాలా యిమిడికయైనది. మధ్య ఆవరణములో నలువదియడుగుల చదరపు ఒక మహలు. దానికి మూడుప్రక్కల పదునొకండు గుహలు: నాలుగవవైపు రెండు చైత్యములు, ఒకటికొకటి ఎదురెదురుగ

నున్నవి. పడమరగనుండుదానిలో బుద్ధుని శిలావిగ్రహమొకటి విరిగినది కలదు. దీనితోపాటు మరిరెండు బుద్ధప్రతిమలును, మూడవశతకము నాటివి, ఆంధ్రరాజుల సీసపు నాణెములు పెక్కులు దొరికినవి. దీనికి చేరువనే మరియొక చిన్నస్తూపమున కొన్ని అవశేషములును, ఒక డజను మట్టిపాత్రలును దొరికినవి.

మూడవ సంఘారామము కొట్టంపలుగుబోడు అను గుట్టపై గలదు. నివేశనమంతయు ౧౨౪ అడుగుల చదరము. మామూలుగ దీనియందు నొకచవికెయు, చుట్టు ౨౦ గదులును ఉన్నవి. చవికె చదరము ౬౧ అడుగులు. ఈ చవికెకు ౩౬ గచ్చుకంబములును, పైన కట్టెకప్పును గలవు. సున్నము దుబ్బుట కుపయోగించుచుండిన యొక రాతితిరుగలితప్ప ఈ నివేశనమున మరేమియు చిక్కలేదు.

గుట్టచివర, సంఘారామమున కెగువ శిథిలములయిన రెండుస్తూపములు గలవు. అందు చిన్నదానియందు రాతి యవశేషపేటిక యొకటి దొరికినది. అది స్తూపాకారమున ౧౪ అడుగుల ఎత్తుగలిగినది. దానిలో ఆట్టిదే ౬ అంగుళముల యెత్తుది మరియొక పెట్టె. దీనిలో మరియొకటి రాగిది ౪ అంగుళముల యెత్తుది. దానిలో ౨ అంగుళముల యెత్తులో నొక వెండి డబ్బి. దానిలో మరల నొక్క బంగారు బరిణ. దానియెత్తు ౧౪ అంగుళము. అందులో నొక అస్థికయు, మూ గూలు ఆభరణములును ఉండినవి. నాగార్జునకొండలో దొరికినవానిలోకెల్ల ఈస్తూపమున దొరికిన యీ పేటికలే చక్కనివి.

ఈసంచికయందు ప్రకటితములయిన చిత్రములలో కొన్నింటికి వివరణము:

౩. స్తూపప్రతికృతి: ఇందు బుద్ధుడు ముచులింద నాగముపడగల నీడను కూర్చునియున్నాడు. ఎగువ మూడు సూక్ష్మశిల్పచిత్రరంగము లున్నవి.

౪. స్తూపప్రతికృతి: ఇందు బుద్ధు డభయముద్రాధారియై పద్మముపయి నిలుచుకొనియున్నాడు. ఎగువ బుద్ధునిజీవితవిశేషములను దెలుపు సూక్ష్మశిల్ప చిత్రఫలకములు మూడున్నవి.

౫. బుద్ధజననము: ఎడమవైపున మాయాదేవి లుంబినీవనమున వంగిన చెట్టుకొమ్మను పట్టుకొని నిలిచి యున్నది. బుద్ధుని ప్రతికృతి యిందు లేదు. ఆయన యునికిని ఛత్రమును, రెండుచామరములును సూచించును. లోకపాలురు నలువురు పట్టుకొనియున్న వస్త్రముపయి ఏడు అడుగులముద్ర లున్నవి. అవి బుద్ధుని సప్తపదములను సూచించును.

౬. జాతకలేఖనము: శుద్ధోదనుడు సింహాసనాసీను డయియున్నాడు. అతనికుడివైపున నొకింత క్రింది భాగమున నలంకృతమగు గద్దియపై నాతనిసతి కూర్చుని యున్నది. జ్యోతిషికులు ఎదుట వేదికపయి నున్నారు. వారియెదుర వేత్రపీఠములపయి రాజదత్తములగు పారితోషికము లున్నవి.

౭. ప్రలోభనము: ఎడమవైపున మారుడు గజము నెక్కి పుత్రికలతో, సేనలతో వచ్చుచున్నాడు. అభయముద్రాధారియయి బుద్ధుడు బోధివృక్షముక్రింద నున్నాడు. ప్రలోభకబృందము నమ్రభావముతో వెను కడుగిడినట్టు లున్నారు. గాంధారశిల్పమున అభయముద్రకు మారుగ భూమిస్పర్శముద్ర యుండుట విశేషము.


౮. శిశుసమర్పణము: కుడిప్రక్క సింహాసనమున శుద్ధోదనుడు జటాధారియగు అసితుని ఒడిలో అడుగుల ముద్రలు రెండుగల వస్త్ర మున్నది. ఆముద్రలు బుద్ధ సాన్నిధ్యసూచకములు. ఎడమవైపున బోధిసత్త్వుని దేవకులయాత్ర కలదు. లలితవిస్తరమున (అధ్యా. ౮) వర్ణితమయిన రీతిని దేవునెదురనున్న వస్త్రమునం దంకితములగు పాదచిహ్నములచేత బోధిసత్త్వుని సాన్నిధ్య మూహ్యము. దేవుడు బోధిసత్త్వునియెడ భక్తితో ప్రత్యుత్థాన మొనర్చుచున్నట్లున్నది.

౯. బుద్ధుని ప్రథమప్రవచనము: సింహాసనముపయి నున్న ధర్మచక్రమును పూజించుటయే ప్రథమప్రవచన మనబడును.

౧౧. మహాభినిష్క్రమణము: బోధిసత్త్వుడు కంటకనామకాశ్వము నధిరోహించి పోవుచున్నాడు. చండకుడు బోధిసత్త్వునికి గొడుగును పట్టుకొని అనుగమించుచున్నాడు. లోకపాలకు లశ్వపాదములను బట్టుకొనియున్నారు.

౧౨. ప్రలోభనము: ఎడమప్రక్క మారుడును, తత్పుత్రికలును బుద్ధుని ప్రలోభింపజేయుచున్నారు. ఓటమిని గాంచిన మారుడు, వింటిని, పూవుటమ్ములను బట్టి పుత్త్రికాసమేతుడయి కుడిప్రక్క నున్నాడు.

౧౪. మహాపరినిర్వాణము: కుడివైపున చైత్య పూజ మహాపరినిర్వాణసూచకము. ఎడమవైపున నాగ దంపతులు గలరు.



ఆశ్వయుజమాస భారతి సంచిక (౭౭౮ పు.) యందు ప్రకటిత మయిన
వర్ణచిత్రమునందలి వర్ణములు

వర్ణచిత్రరచయిత : అయ్యాగారి వెంకటగోపాలకృష్ణరావు, నూజవీడు.

ఆంధ్రాభ్యుదయము

శ్రీయుత చంద్రుపల్లి రామరావుగారు

[గ. మేడపాడు, తూర్పుగోదావరిజిల్లా]

ఆంధ్రమాత ప్రసవించిన శిల్పకుమారులలో శ్రీ చంద్రుపట్ల బాపిరాజు రామరావు సోదరులు కవల బిడ్డలు. సుప్రసిద్ధవంగీయచిత్రకారులగు శ్రీ ప్రమోద



శ్రీయుత చంద్రుపట్ల రామరావుగారు

కుమార చట్టోపాధ్యాయులకడ కళాశిక్షణము వడసి సుమారు పదిరెండువత్సరములనుండి వీరు కళోపాసన గావించుచున్నారు. ఏలూరులో వీరిచే సంస్థాపితమైన ఆంధ్రచిత్రకళాపరిషత్తు మహోత్తునియాశీస్సులను గడించినది. వీరిచిత్రశాలను మహాత్ముడు స్వయముగా తిలకించి " I wish every success to this effort. All of the Paintings are really good " అనియోగ్యతాపత్రిక నొసంగిరి.

శ్రీ బాపిరాజు రామరాయ సోదరులు అసహాయోద్యమసందర్భమున కారాగారమున కేగుటచే వీరి కళోద్ధరణోద్యమము ఆర్థిక, రాజకీయసంక్షోభములకు గురియై కుంటువడినది. కాని అచిరకాలములో శ్రీ ఆంధ్ర చిత్రకళాపరిషత్తును పునరుద్ధారణగావించి భారతీయ చిత్రకళను ప్రచారము కావింపగలరు.

వీరిచిత్తరువులు వివిధప్రదర్శనములలో ఆదరింపబడి మైసూరు, పాటియాలా, తిరువాంకూరు, చల్లపల్లి మున్నగుసంస్థానాధీశులకు విక్రీతము లైనవి.

మహాత్మగాంధీ, డాక్టరుమూంజీ, అనిబిసెంటు, సర్. సి. పి. రామస్వామయ్యరు మున్నగుభారతీయ నాయకులయొక్కయు, దేశోద్ధారకునివంటి ఆంధ్ర నాయకశిఖామణులయొక్కయు ప్రశంసలకు వీరిచిత్తరువులు పాత్రములైనవి. హిందు, స్వరాజ్య, ఆంధ్ర, భారతి మున్నగుపత్రికలు వీరిరచనలగూర్చి వేనోళ్ల కొనియాడినవి.

ప్రత్యేకముగా శ్రీరామరావుగారిచిత్తరువులలో సతీశివ, బుద్ధ, ఝూన్సీరాణి, అభిసారిక, ముకుళితనళిని, చంద్రబింబమున రెండుపిట్టలు (Birds in the moon), హంతకుడు, పుట్టింటికి, ఉషస్సు, అశ్వత్థామ, బొబ్బిలి బెబ్బులి, అనార్కలినృత్యము, దూడూవెంకన్న మున్నగునవి ప్రత్యేకప్రశంసకు పాత్రములైనవి. ఇందు బుద్ధుని చిత్తరువు మహాత్మునికి సమర్పింపబడినది. "సతీశివ" చిత్తరువునకు శ్రీచల్లపల్లి రాజావారు నూటపదారులు పారితోషిక మొసగియున్నారు. ఝూన్సీరాణి, పుట్టింటికి, అశ్వత్థామ భారతిలో ప్రకటింపబడినవి. బొబ్బిలి బెబ్బులి ఆంగీరసఆంధ్రపత్రికఉగాదిసంచికలో ముద్రితమైనది. ఇట్టి అమూల్యములగు చిత్తరువులను ప్రకటించుచు ఆంధ్రుల చిత్రకళోద్యమమునకు తోడుపడుచున్న భారతిపత్రికాధిపతులు వందనార్హులు.

యువకులగు శ్రీరామరావుగారు ఇట్టిఅమూల్య చిత్రకళోపాసనకు తమజీవితమును ధారపోయుచున్నందులకు ఆంధ్రులు గర్వించుచున్నారు. వీరికి పరమేశ్వరుడు ఆయురారోగ్యైశ్వర్యముల నొసగుగాత!

—మారెళ్లపూడి పుత్రసత్యశర్మ



యం. రామచంద్రరావుగారు

చెన్నపురి ఆంధ్రమహాసభకు కార్యదర్శిగ నాలుగవమారు ఎన్నికొనబడిరి.



శ్రీ బుంగా అప్పారావు దేవుగారు

రాజమండ్రిపురవాస్తవ్యులు, ఆదిక్షత్రియకుల నాయకులు నగు వెంకటప్పయ్య దేవుగారి కుమారులు; ఇరువదేండ్ల ప్రాయము. నాలుగేండ్లనుండి పరుగుపందెములందు పాల్గొని, గెలుపొంది ముప్పదియారు రజతపాత్రలును, అనేకయోగ్యతాపత్రికలను బడసిరి.




నీలంరాజు వెంకటశేషయ్యగారు

చెన్నపురి ఆంధ్రమహాసభా నాటకశాఖకు కార్యదర్శిగ మూడవమారు ఎన్నుకొనబడిరి.



ప్రొఫెసరు అల్లూరి నరసింహరాజుగారు

వీరిది రాజమహేంద్రవరము కాపురము., ఇంద్రజాల ప్రదర్శనములందు సిద్ధహస్తులు. పలువురు! ప్రముఖులు వీరి నైపుణిని మెచ్చి సత్కరించినారు. భారతీ తీర్థమువారు వీరికి 'ఐంద్రజాలికభూషణ' యను బిరుదము నొసగినారు. ఇటీవల చెన్నపురియందును కొన్ని ప్రదర్శనములను జరపి, నేర్పువిూర అపూర్వ, అద్భుత కల్పనలు వెలయించి ప్రముఖుల ప్రశంసకు పాత్రులయిరి.



శ్రీ మోచర్ల శ్రీహరి రావుగారు

ఏలూరునందలి వేంకటనారాయణ మెమోరియలు వ్యాయామపు పోటీలయందు మల్లయుద్ధమునందు విజయమునంది వెండిగదను బహుమతిగ పొందిరి.



శ్రీ వై. ఎ. శ్రీరాములుగారి భావచిత్రములు (పైనుండి ప్రదక్షిణముగా)
౧. భక్తి, ౨. ఆలోచన, 3. క్రుద్ధప్రతిజ్ఞ, ౪. ఉన్మాదము, ౫. స్వసంతుష్టి,
౬. భయము, ౭. విచారము, ౮. కపటాలోచన.

గ్రంథ స్వీకారము

సంగీత నాపసాని

గ్రంథకర్త: వున్నవ లక్ష్మీనారాయణగారు, గుంటూరు.

'కవితిక్కనయొక్క కూతురు గాయత్రీదేవి. ఈమెకు నాగసానియని ముద్దుపేరు. ఈమెకుగల యద్భుతసంగీతజ్ఞానముచే సంగీతనాపసానియని మారు పేరు వచ్చినది. ఈమెకు బంగారువంటి దేహచ్ఛాయ గలదు గనుక కడాని అనికూడ పేరుగలదు. ఈమెతల్లి పేరు సీతమ్మ. ఈమెబాల్యచరితములు కొన్ని యిందు వర్ణింపబడినవి. ఇది తిక్కనయను నవలనుండి క్షిప్తీకరింపబడినది.' క్రౌను సైజున ౧౯ పుటలు. వెల రు. ౦-౨-౦.

ముగ్ధప్రణయము (ఒథెల్లో)

గ్రంథకర్త: కర్లపాలెము లక్ష్మీనరసింహారావు గారు, శ్రీముఖాశ్రయము, పూర్ణానందంపేట, బెజవాడ. క్రౌనుసైజున ౧౫౬ పుటలు. వెల రు. ౦-౧౨-౦.

విశ్వామిత్ర మహర్షి

గ్రంథకర్త్రి: కనుపర్తి వరలక్ష్మమ్మగారు, బాపట్ల. క్రౌను ౧౨౧ పుటలు. వెల రు. ౦-౮-౦

శ్రీ లక్ష్మీనారసింహప్రభు శతకము

గ్రంథకర్త: పాలపర్తి సూర్యనారాయణగారు, చాగలమఱ్ఱి. (కర్నూలు) క్రౌను ౧౮ పుటలు.

వెల రు. ౦-౨-౦.

శ్రీ భక్తరత్నమణి శతకము

గ్రంథకర్త: సోంపల్లె కృష్ణమూర్తిగారు, అనంతపురము. క్రౌను ౨౨ పుటలు. వెల రు. ౦-౨-౦.

బాలకృష్ణ శతకము

గ్రంథకర్త: భ. పట్టాభిరామయ్యగారు, యం ఏ., యల్. టి., రాజమహేంద్రవరము. క్రౌను ౩౬ పుటలు. వెల రు. ౦-౪-౦.

సిద్ధివినాయక చరిత్ర (హరికథ)

గ్రంథకర్త: భ. పట్టాభిరామయ్యగారు, యం. ఏ., యల్. టి., రాజమహేంద్రవరము. క్రౌను ౪౬ పుటలు. వెల రు. ౦-౪-౦.

మనవిమాటలు

ఆంధ్రకవుల ఛాయాచిత్రప్రదర్శనము :

కవులు సృష్టికర్తలు : వారి సృష్టి బ్రహ్మ సృష్టిని మించినది. తమ యిచ్చవచ్చినట్లు సృష్టినిచేయగల, మార్పగల నేర్పు వారికి గలదు. వారు నిరంకుశులు. లోకహితము వారి పరమార్థము. వారిరచనలు నానారమార్థ మునే లోగొనియుండును. అవియే కావ్యములు. వారు వానిలో నెన్నియోయర్థములను మనకు దాచినారు. వారు మనకు త్రికరణముల, త్రికాలముల పూజింపదగినవారు.

కాని మనకవుల రూపచిత్రములు ఇదివరకు లేవు. కావ్యములందు ఛాయామాత్రముగ ప్రతిబింబితములయిన వారి విశిష్ట గుణాదులను భావించుకొనవలసినదే. భావనకన్న రూపణ పటిష్ఠము గతకాలమువారి రూపణకు రూపచిత్రము లవసరము. కనుకనే విగ్రహములని యేర్పడినవి. విగ్రహములుగూడ రూపచిత్రములే. అవి శిల్పరూపములు. మహనీయుల రూపచిత్రములు సహృదయుల కుత్సాహావేశములను గలిగించును. వాటి కాశక్తి గలదు. అందువలననే మహనీయుల రూపచిత్రములను మన మాదరించుచున్నాము.

ఈ రూపచిత్రరచన ప్రాచీనకాలము నుండియు నున్నది. కాని అప్పటిది శిల్పరూపము : ఛాయారూపము కాదు. ఆ చిత్రములుగూడ దేవతలకు, మతప్రవక్తలకు, దేవాలయాదినిర్మాతలకుమాత్రమే వెలసినవి. కవుల కానాడు రూపచిత్రములు లేవు. వారు వాఙ్మయప్రతిబింబములే చాలుననుకొన్నారు. వారి కీయావేదనయే లేదు. ఆరోజులు వేరు. ఈరోజులు వేరు.

నాడు మతమున కెక్కుడు ప్రచారముండినది. నేడు సాహిత్యమునకు ప్రచారమెక్కువయినది. దానికొలది కవుల రూపచిత్రముల యావశ్యకత గోచరించినది. సహృదయుల కావేదనపుట్టినది. కడచిన దానికిని వారుమాత్ర మేమిచేయగలరు? లేని కవుల చిత్రములు లేకనేపోయినవి. ఉన్నకవులవైనను సేకరించి పదిలపరచి యుగాంతరము వారికిని తోడుపడవచ్చునని కవితాసమితివారీ ప్రయత్నమునకు పూనినారు. చాలా సేకరించి ప్రదర్శించినారు. సాహిత్యవికాసమున కిది యొక మెట్టు.

కవితాసమితియుద్యమము క్రొత్తది, మెచ్చదగినది.

ఖితలభాయిపటేలు నిర్యాణము :

గోరుచుట్టుపై రోకటిపోటు! ఒకవంక జతీంద్రమోహనుని గోల్పోయిన యావేదన, మరియొకవంక ఆనీబెసంటుమరణముననయిన సంతాపము ఇంకను ఆరీ ఆరకముందే యీ చావుకబురు చల్లగ వినవచ్చి భారతజాతి హృదయముల నారాటపెట్టినది. కాలవైపరీత్యము! తరుణమున, వెంటవెంటనే, యిట్టి వారి మరణములవలన హృదయములు తరుగుకొనిపోయి, ఊరటకేనియు వీలుచిక్కకున్నది.

పటేలు అత్యంతప్రతిభాశాలి. ఈడు లేని రాజ్యతంత్రజ్ఞుడు. ధైర్యసాహసములకు

నిధి. పరాజయమును, పారతంత్ర్యమును సహించని యభిమాని. బారిష్టరువృత్తియందుండి లక్షలార్జింపజాలియు, దేశమునకై దానిని తృణప్రాయముగ నెంచిన త్యాగి. ఆపదలకు జంకడు. స్వార్థ మాయనకు గిట్టదు. మాతృదేశదాస్యవిముక్తియే యాయనపరమ లక్ష్యము. దానికయి, తన భోగభాగ్యములు వదలుకొని, అహోరాత్రములు పాటుపడినాడు. అవసానసమయమునగూడ సత్వర స్వారాజ్యసిద్ధి నాకాంక్షించుచు ప్రాణములను విడచినాడు. స్వతంత్రభారతదేశమును కన్నులార చూడనయితినేయను కొరతతోనే తనువు చాలించినాడు. తనకళేబరము మాతృభూమినే చేర్చగోరినాడు. ఆయనదేశాభిమానమట్టిది.

తనకు న్యాయమని, యుక్తమని తోచిననేకాని యేకార్యమునకు బూనడు. పూనిన పనిని సాధించిగాని నిద్రింపడు. భారతశాసన సభకు తొలుదొల్తగ నధ్యక్షుడై అప్రతిమధీ సంపత్తితో, అచంచలమగు పట్టుదలతో కార్యములునిర్వహించి,జాతీయుల విజాతీయుల మన్ననలుపడసి యాపదవికి, భారత జాతికిని గౌరవప్రతిష్ఠలు గడించిరి. ఆపదవియందుండి యాయనచేసినపని తరువాతివారికి మార్గదర్శకమయినది. ఆపదవిలో నున్నంతకాలము ఈయనయనిన ప్రభుత్వమునకు నయితము గుండెబెదరే. కొంతకాలము బొంబాయి కార్పొరేషను అధ్యక్షులుగ నుండి యా పట్టణమును చాలా అభివృద్ధిపరచిరి. గొప్ప గొప్పపదవులయందుండియు వ్యామోహమను నది యాయన నంటలేదు. భారతశాసనసభ కధ్యక్షుడుగ నుండినప్పుడు తన కిచ్చుచుండిన నాలుగువేలజీతములో ఒకవేయి తన కుంచుకొని తక్కినమూడువేలను ఖద్దరుఉద్యమమునకై మహాత్మునకు పంపుచుండిరి. ప్రజాహితకార్యములనిన యాయన కుత్సాహ మతిశయము.

ఇట్లు మాతృదేశమును గాఢముగ ప్రేమించి, దేశమునకై తనసర్వస్వమును ధార పోసిన పటేలు మాతృదేశమున మరణించుటకు నోచుకొనలేదు. సత్యాగ్రహోద్యమమున నిర్బంధింపబడి చెరసాలలో ఆరోగ్యమును కోలుపోయిరి అదికారణముగ ప్రభుత్వమువారు వీరిని విడిచిపెట్టిరి. వెంటనే వీరు ఆరోగ్య సంపాదనకై విదేశముల కేగిరి. అక్కడను వీరికి దేశస్వాతంత్ర్య విచారమే. ఆరోగ్యము నానాటికి క్షీణింప జొచ్చెను. సమదుఃఖుడగు సుభాషుబాబు వీరిపరిచర్యకు బూనెను. ఎందరో, ఎన్నివిధములనో చికిత్స చేసిరి. కాని దైవ మన్యథా తలచినది, పరిణామ మిట్లయినది.

వగచిలాభములేదు. ఏలక్ష్యమును సాధించునిమిత్తము వీరు ఎడతెగనికృషి సలిపిరో, ఏయుత్కృష్టాశయములతో వీరు ప్రాణములను వదలిరో ఆలక్ష్యమును, ఆయాశయములను సత్వరముగ సాధించి వారియాత్మకు శాంతిగూర్చుట మనవిధి. అప్పుడే వారి యాత్మకు సంతృప్తి గలుగును.



సాభిప్రాయ విశేషములు

ప్రపంచపరిణామమునందు కర్మపరిణామము పరమగుహ్యము. గీతాశాస్త్రమునందు గహనమైన కర్మయోగమతభావగతిరూపములను శ్రీకృష్ణుడు మహాయోగరూపమునను పలువిధభావరూపములను ౧౮ అధ్యాయములందు బోధించినను ఎప్పటికప్పుడు కర్మతత్త్వమును,సిద్ధియును,జ్ఞానమును తెలిసీ తెలియనివిషయములు. కర్మయోగము వేదాంతమువలెను వినుటకుబాగుండినను చేయుట కడుగడుగునకును సంశయములు, మాటమాటకు ప్రజ్ఞావాదములు గలుగుచుండును. పరిపూర్ణమైన బ్రహ్మజ్ఞానమునకు బ్రహ్మత్వమువలెను, కర్మయోగమునకును కర్మత్వమె సాధనము. సాధకసాధనసాధ్యము లేకములైనపుడు సాంఖ్యయోగములు భిన్నాంతములుగాక ఏకాంతము లగుచున్నవి. కర్మ బ్రహ్మోద్భవము. సర్వగతమైన బ్రహ్మ నిత్యయజ్ఞపురుషుడు. ఏకాంతములైన నిత్యకర్మానుష్ఠానము యజ్ఞపురుషుడు భిన్నాంతములై పరమార్థమునకుబదులు పరమానర్థములను గలుగజేయుచున్నవి. సాధకుడు సాధనకును, సాధన సాధ్యమునకు వలెను, కర్మ ధర్మమునకును, ధర్మము బ్రహ్మమునకును పరమార్థములు. ఏతత్పరమార్థము గీతాశాస్త్రమునందు తెలిపినటు లజ్ఞాతముగ నున్నది.

ఆశ్చర్యవ త్పశ్యతి కశ్చి దేన
మాశ్చర్యవ ద్వదతి తథైవ చాన్యః,
ఆశ్చర్యవ చ్చైన మన్యః శృణోతి
శ్రుత్వాఽప్యేనం వేద న చైవ కశ్చిత్.
గీ. అ. ౨. శ్లో. ౨౯.

చూచువానికిని, చెప్పువానికిని, వినువానికిని నాశ్చర్యమును గలుగజేయుచు తెలియకున్నది. చేయువానికిమాత్రము తెలియుచున్నది. కర్మయోగము స్వల్పమైనను భయమునుండి కాపాడును. కర్మయోగమున కనురూపమైన ఫలము గలుగుచున్నది; వ్యర్థముకాదు. వర్తమానకాలమునందు కర్మయోగపరిజ్ఞానములేని జగచ్చక్రభ్రమణము నిశ్చేష్టతకును, విపరీతచేష్టతకును సాధనముగ నున్నది. ప్రాచ్యుల నిశ్చేష్టతయును, పాశ్చాత్యుల విపరీతచేష్టతయును అజ్ఞానసమ్మోహసంజాతములు. సందేహసమ్మోహములను విడిచి కర్మయోగాభ్యాసము చేయుట వ్యక్తులకు, సంఘములకు, జాతులకు శ్రేయోదాయకము.

* * * *

విపరీతచేష్టత

పాశ్చాత్యదేశములకున్మాదమునుగలుగ జేయుచున్న విపరీతచేష్టత భయంకరముగ

నున్నది. జర్మనియందు హిట్లరుగారు నాజీ ధ్వజారోహణమును జేసి మహాసంక్షోభమును గలుగజేయుచున్నారు. ప్రజలు నాజీజ్వరావేశమును బొంది ప్రళయతాండవమును జేయుచున్నారు.ఈమాసమునందు జరుగనున్న యెన్నికలఫలము భావిప్రపంచస్థితియందు భయంకరపర్వముగను పరిణమించ గలదు. యూదుల పీడనము, కార్మికులదండనము, సాంఘికుల నిర్బంధము, జాతీయదురభిమానము పరమానర్థములకు సాధన మగుచున్నది. జర్మని ఆయుధవిసర్జనమహాసభను విసర్జించినది ; నానాజాతిసమితిని నిరాకరించినది ; ఆర్థిక మహాసభను పరిహరించినది; ప్రపంచధిక్కారమును పూనినది. నాజీల కోపావేశములు ప్రపంచమునం దంతటను, ముఖ్యముగను ఫ్రాన్సునందు భయభ్రాంతులను గలుగజేయుచున్నవి. ఫ్రాన్సునకు నాజీచర్యలు సహజముగను సంగ్రామభయోత్పాతమును గలుగజేయుచున్నవి. ఫ్రాన్సునందు క్రొత్తప్రభుత్వమేర్పడినది. సర్రాటుగారు మంత్రియై కర్తవ్యాకర్తవ్యములను నిర్ణయించు చున్నారు. అపారమైన ధనసంచయము, సంగ్రామసన్నాహములు ఫ్రాన్సున కపూర్వమైన ఆత్మవిశ్వాసమును గలుగజేయుచున్నవి. ఇటలీయందు ఫాసెటువిధానము వివాహసంతర్పణలను జేయుచున్నది. ఏకకాలప్రదేశమునందు ౨౦౦౦ వివాహములు జరిగిన యుదంతము ప్రపంచేతిహాసములం దపూర్వము ఇటలీయందు వివాహసంతర్పణలకును సంగ్రామ ఘన్నిపాతము మూలముగ నున్నది.

అమెరికాసంయుక్తరాష్ట్రములందు ధనపిశాచము బీభత్సతాండవము చేయుచున్నది. దేశవ్యాపారక్షైణ్యము స్వదేశపరిశ్రమ సంపదలను క్షీణింప జేసినది. దేశమునందు నిర్వ్యాపారము, నిరాశ వ్యాప్తమై మహోద్వేగము వ్యాప్తమైనది. జాతీయ పునరుద్ధరణోద్యమము నిరంకుశరాజ్యమును చేయుచున్నది. స్థిరమైన ఆర్థికవ్యవస్థ లస్థిరము లగుచున్నవి. పంటలు, పరిశ్రమలు, ధరలు, వ్యాపారము, ధనాగారములు నిర్బంధనియమితము లగుచున్నవి.రూజువెల్టుగారు, వారిమంత్రులు నిర్ణయించిన జోస్యము సఫలముగాకున్నది. ధరప్రతులు హెచ్చినను తరణోపాయ మగోచరముగ నున్నది. డోలరుబంగారుప్రమాణము పెరిగినను డోలరు మారకపు ధర పడిపోవుచున్నది. డోలరు మారకపుధరను నిలువబెట్టుటకు అమెరికా స్వదేశవిదేశములందు బంగారమును కొనుట నిర్ణయించినది. ప్రపంచమునం దంతటను బంగారుధర పెరుగుచున్నది.దారిద్ర్యగ్రస్తమైన హిందూస్థానమునుండి బంగారమంతయు ఎగుమతియగుచున్నది. ఇంతవరకును ౧౭౦ కోట్లరూప్యములబంగార మెగుమతియైనది.నిరుపేదలు పుస్తెపుడక నమ్మి పన్నులను చెల్లించుచున్నారు. కోట్లబంగారము ధనాగారములం దగ్నిమాంద్యమువలన నిరర్థకముగ నున్నను అమెరికాధనజలోదరమునకు సంతృప్తి గలుగలేదు. అమెరికావ్యాపారమునకు చీనాప్రాంతములందును, జర్మనిగ్రేట్బ్రిటనులందును ప్రతిరోధము గలిగినది. జపాను సామ్రాజ్యధ్వజ

మును, వ్యాపారధ్వజమును ప్రాచ్యఖండము నుండి క్రమముగను పాశ్చాత్యఖండమునకు వ్యాప్తమగుచున్నది. జపాను మంచూరియా యందు స్థిరాసనము నేర్పరచుకొనినది. ఇరువదేండ్లకు పూర్వమారంభమైన ఆసియా ప్రబోధ విజయములను జపాను క్రమముగను సార్థకము చేయుచున్నది. రుష్యావిజయధ్వజ మాసియానుండి యూరపునకు మరలినది. శ్వేతజాతుల పరాక్రమప్రతిష్ఠ, వ్యాపారపరిశ్రమ ప్రతిష్ఠ, మంత్రాంగకౌశలము పటాపంచలైనవి. చీనా మెల్లమెల్లగ తనశక్తిని బడయుచున్నది. శ్వేతజాతులకును, పాశ్చాత్యరాజ్యములకును ప్రపంచమునందంతటను ప్రతిష్టంభనము గలిగినది. పరస్పరభేదములు, స్వార్థారాధనము వినాశకారణములుగను బరిణమించినవి. పదేండ్లక్రితము బహిష్కరింపబడిన రుష్యామీదను తిరిగి ఫ్రాన్సు అమెరికా రాజ్యములు తమ చూపులను ప్రసరింపజేసినవి. మానవస్వాతంత్ర్యధ్వజమును స్థాపింప సమకట్టిన రుష్యా రాజ్యము ధనస్వాములకు తిరిగి శరణ్యమగుచున్నది. ధర్మమే జయించుననుటకు సోవియటు రుష్యాయుదంతము పరమప్రమాణముగ నున్నది. పదేండ్లక్రింకట సోవియటుప్రభుత్వమును బహిష్కరించిన ప్రభుత్వములు వర్తమానకాలమునందు రుష్యామిత్రత్వము నభిలషించుచున్నవి. ఫ్రెంచిప్రభుత్వ మమెరికా ప్రభుత్వమును రుష్యాతో సంధిని జేసికొనుచున్నవి. ప్రపంచమునందు ధర్మపరివర్తన మొకవైపునను, సంగ్రామప్రయత్నము లొకవైపునను జరుగుచున్నవి. సందిగ్ధసమయమునందు మహాసామ్రాజ్యాధిపత్యమును వహించుచున్న బ్రిటిషుసామ్రాజ్యస్థితి విషాదకరముగ నున్నది.

గ్రేటుబిటను సహజమైన సాహసధైర్యములను విడిచి సంశయాత్మత్వమును బూనుట విచారకరము. ఆర్థికపారిశ్రామికరాజకీయ రంగములందు గ్రేటుబ్రిటనుకు ప్రతికూల వాతావరణ మేర్పడుచున్నది. ప్రపంచము నందంతటను బయలుదేరిన ప్రతికూలవాతావరణమునకు తోడుగ ప్రాచ్యసాహచర్యము బ్రిటిషువీర్యమును నిర్వీర్యము చేయుచున్నది. బ్రిటిషుప్రభుత్వము నిర్వహింపదలచిన ఆయుధ విసర్జనసభ, ఆర్థికమహాసభ మొదలగుసభలు నిరర్థకములైనవి. సకలజాతులును ఆత్మసంరక్షణముకొరకు రాజకీయార్థిక జాతీయావరణములను కల్పించి పరాధీన జాతులను, దుర్బలజాతులను నిర్బంధములపాలు చేయుచున్నారు. అయినను మహాప్రభుత్వముల స్థితియును దుఃఖకరముగ నున్నది. బ్రిటిషు ప్రభుత్వపరిస్థితు లిటులుండగను పరాధీనస్థితియందున్న హిందూస్థానాది దేశముల స్థితిగతులు దుర్భరముగ నున్నవి.

* * * *

హిందూస్థానము

ప్రకృతియందు మృగశిరకార్తికి రోహిణికార్తియును, వర్షపాతమునకు కారుమబ్బులు, మెరుపులు, ఉరుములును నవసరమైనట్టులు శాంతియుగమునకును మహాసంగ్రామములు,

దుర్భిక్షములు, దుఃఖానుభవమును సహజములు. ప్రపంచావృత్తమైన విషాదపరిస్థితులందు నిస్సహాయస్థితియందున్న దేశములస్థితి ముఖ్యముగను హిందూస్థానస్థితి దుఃఖమయముగ నున్నది. అంతర్భేదములు, స్వార్థపరత్వము, పారతంత్ర్యము దేశమును కీలాభీలము చేయుచున్నవి ఆశాపిశాచము, శక్తిలేకపోయినను, ప్రపంచమునం దంతటను వలెను హిందూస్థానమునందును ప్రళయతాండవమును జేయుచున్నది. ప్రజలన్నాతురులై పరితపించుచున్నారు. వ్యాపారము క్షీణించుచున్నది. ధరలు పడిపోయినవి. మిల్లుల యజమానులు నాయకత్వమునుబూని దుర్భిక్షము నభివృద్ధిచేయుచున్నారు. లంకాషైరు జపాను వర్తకులకును బొంబాయిమిల్లు యజమానులకును కుదిరిన వర్తకసంధి ప్రజాక్షేమమునకు ప్రతికూలముగ నున్నది. మిల్లుల యధికారులవలెను ఇతరాధికారులును స్వార్థపరాయణులై మహాసంక్షోభమును గలుగ జేయుచున్నారు. దేశావృతమైన యసంతృప్తి సర్వత్ర ప్రత్యక్షమగుచున్నది. అసంతృప్తి బలావేశమునకు బదులు దుర్బలవిషాదమునకును,నిరాశకును గారణంబగుచున్నది. దేశమునందు శల్యగతమైన నిరాశ అవ్యవసాయమునకును, ప్రజ్ఞావాదమునకును మూలమై క్లైబ్యమును, నిశ్చేష్టతను గలుగజేయుచున్నది. నిశ్చేష్టత సమ్మోహమును గలుగ జేయుచు నాత్మశక్తిని స్తంభింపజేయుచున్నది. ఈమహోపద్రవమునుండి దేశమును రక్షించునది గీతోపదేశమునకు హృదయమైన "స్వల్పమప్యస్యధర్మస్యత్రాయతేమహతోభయాత్" పరమార్థము. ధర్మమునకు గొప్ప చిన్న భేదములు లేవు. భక్తిపూర్వకముగ స్వల్పధర్మమును సేవించినను మహత్తరమైన ఫలము గలుగుచున్నది. ధర్మసందేహములను గలిగి కర్మవిమూఢత్వమును పోగొట్టుటకు కర్మయోగము సాధనముగాని వ్యాఖ్యానములు సాధనములుగావు. కురుక్షేత్రమునందు విజయుడువలెను సకలజనులును కర్మయోగులు కాగలరు.

నష్టో మోహః స్మృతిర్లబ్ధా
త్వత్ప్రసాదా న్మయాఽచ్యుత,
స్థితోఽస్మి గతసందేహః
కరిష్యే వచనం తవ.

గీ. అ. ౧౮ శ్లో. ౭౩.

సకలజనులును మోహమును విడిచి జ్ఞానమునుపొంది కర్మనిరతులయి కామితార్థములను బడయుదురు. స్వకర్మనిరతులు ధర్మనిరతులై పురుషార్థమును సాధించవలసిన యవసరము దేశావృతమైన నిరాశ విశదము చేయుచున్నది. గాంధిమహాత్ముని కర్మయోగాచరణము ధీమంతులకు ధర్మయోగానుష్ఠాన విధానమును విశదముచేయుచున్నది.

* * * *

పూర్ణయోగము

పూర్ణయోగము సకలజనులకును సాధ్యముగాకపోయినను కర్మయోగముసాధ్యము. కర్మమయమైన విశ్వమునందు సకలజనులకును

కర్మాచరణమున కవకాశములు గలవు. కర్మ ప్రాశ స్త్యమునకు మమకారాహంకారములు కారణములుగాని కర్మ కారణముగాదు. గాంధి మహాత్ముడు శాసనోల్లంఘనము నవలంబించినను, హారిజన సేవను బూనినను, ఉపవాస దీక్షను వహించినను ధర్మపరమై పూర్ణయోగ రూపమును దాల్చుచున్నది. పూర్ణయోగము త్యాగాధీనము, ఫలరహితము. సామాన్యులకు ఫలరహితమైన పూర్ణయోగ మసాధ్యమైనను ఫలసహితమైన కర్మయోగము సాధ్యము. వర్తమానసందిగ్ధావస్థయందు ప్రజానాయకులు గాంధిమహాత్మునివలెను లాభనష్టములను, జయాపజయములను, రాగద్వేషములను విడిచి నియతకర్మలనుజేసి కృతార్థులగుట ధర్మము, క్షేమకరము.

Printed and Published by C. Seshagiri Rao, B. A., at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St., Madras
Editor. G. Subbaramayya.

విషయసూచిక

చిత్రములు

భారతి — దశమ సంపుటము — భా. ౨.

వ్యాసముల అకారాది సూచి

భారతి – దశమ సంపుటము – భా. శ్రీ.

త్రివర్ణచిత్రముల అకారాదిసూచి



'వ డి సె ల'

—శ్రీ సుసర్ల వేంకట్రామయ్య.



రాణా ప్రతాపసింహ

—గుండిమెడ వెంకటసుబ్బారావు.